

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 204

శనివారం 15-10-2022

SIMULTANEOUSLY PRINTED AT SRIKAKULAM | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



18 ఏళ్లకే ప్రపంచ చాంపియన్

10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో విశ్వవిజేతగా రుద్రాంక్ష్ పాటిల్ -IVలో



దుమ్మురేపిన బుల్

సెన్సెక్స్ 685 పాయింట్లు ప్లస్.. నిఫ్టీ లాభం 171 పాయింట్లు -IVలో



హిమాచల్ ఎన్నికలకు నగారా

హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను సీఈసీ విడుదల చేసింది. ఒకే విడతలో నవంబర్ 12న ఎన్నికలు జరగనున్నాయి.

వివరాలు 6లో



ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి

ఢిల్లీ వర్సిటీ మాజీ ప్రొఫెసర్ సాయిబాబా నిర్దోషి అని ఆయనను వెంటనే విడుదల చేయాలని బాంబే హైకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో



అమెరికాలో కాల్పుల కలకలం

నార్త్ కరోలినా రాజధాని రేలీలో నడిచి వెళుతున్న వారిపై బాలుడు కాల్పులు జరపగా ఐదుగురు మృతి చెందారు.

వివరాలు 6లో



ఖేర్సన్‌పై ఉక్రెయిన్ పట్టు

రష్యా ఆక్రమిత ఖేర్సన్ ప్రాంతంపై ఉక్రెయిన్ పట్టు బిగిస్తోంది. ఖేర్సన్‌ను ఉక్రెయిన్ మిలటరీ పాక్షికంగా ఆధీనంలోకి తెచ్చుకుంది.

వివరాలు 6లో

విశాఖకు జై!



దిక్కులు పిక్కటిల్లేలా నేడు 'విశాఖ గర్జన'

- వికేంద్రీకరణే లక్ష్యంగా ఉదయం 9 గంటలకు శాంతియుత ర్యాలీ ప్రారంభం
- అంబేడ్కర్ విగ్రహం నుంచి బీచ్ రోడ్డులో వైఎస్సార్ విగ్రహం వరకు పాదయాత్ర
- రాజకీయాలకు అతీతంగా భారీ ప్రదర్శన.. అన్నివర్గాల వారి మద్దతు
- 'పరిపాలన రాజధానిగా విశాఖ'కు భారీగా ప్రజలు తరలివచ్చే ఛాన్స్
- ఉత్తరాంధ్ర వెనకబాటుతనాన్ని వివరిస్తూ సాంస్కృతిక ప్రదర్శనలు

సాక్షి, విశాఖపట్నం: తరతరాల వెనుకబాటు తనంపై తమ గొంతు వినిపించేందుకు ఉత్తరాంధ్ర ప్రజలు సిద్ధమయ్యారు. తమ ఆకాంక్షలను బలంగా చాటేందుకు దిక్కులు పిక్కటిల్లేలా గర్జించడానికి వేచి చూస్తున్నారు. అభివృద్ధి వికేంద్రీకరణకు మద్దతుగా శనివారం నిర్వహించనున్న విశాఖ గర్జనలో పాల్గొనడానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. 1956లోనే రాజధానిగా విశాఖ ఏర్పాటు కావాల్సి ఉన్నప్పటికీ వీలు కాలేదని, ఇన్ని దశాబ్దాల తర్వాత ఇప్పుడు తమ చిరకాల కోరిక నెరవేరబోతున్న సమయంలో అడ్డుకునే వారికి బుద్ధి చెప్పేలా శాంతియుతంగా గర్జనను నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడంటూ నినదిస్తున్నారు. నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న విశాఖ గర్జనకు మేధావులు, ప్రజా సంఘాలు, విద్యార్థి లోకం పూర్తి మద్దతు తెలిపింది. విశాఖ గర్జన విజయవంతానికి వైఎస్సార్‌సీపీ నేతలు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. టీడీపీ, జనసేన, కమ్యూనిస్టు, భారతీయ జనతా పార్టీలు మాత్రం గర్జనకు దూరంగా ఉంటున్నాయి. గత ఎన్నికల్లో గాజువాకలో ఘోరంగా ఓడించారన్న అక్కసుతో ఉత్తరాంధ్రకు వ్యతిరేకంగా తన వాణిని కాస్త జనవాణిగా వినిపించేందుకు జనసేన నేత పవన్ కల్యాణ్ విశాఖకు శనివారమే వస్తుండడం గమనార్హం. టీడీపీ నేతలు కూడా ఇప్పటికే ఉత్తరాంధ్ర ప్రాంతంపై విషం చిమ్ముతున్నారు. తమ హయాంలో జరిగిన భూకబ్జాలను కప్పిపుచ్చుకుంటూ.. దొంగే దొంగ.. దొంగ అని అరిచినట్టుగా.. భూకబ్జాలకు పాల్పడిన టీడీపీ నేతలే వాటి గురించి మాట్లాడుతుండటంపై

మిగతా 2వ పేజీలో ▶

విశాఖ రాజధాని కాకపోతే..

25 ఏళ్లలో మరో విభజన యుద్ధం

- వెనుకబాటుతనం నుంచి బయటపడాలంటే విశాఖ పరిపాలన రాజధాని కావాలి
- విశాఖ గర్జన జెండా ఆవిష్కరణలో జేఏసీ ప్రతినిధులు

10 లో

అందరి మాటా అదే..

- ఉత్తరాంధ్ర అభివృద్ధికి వికేంద్రీకరణే మార్గం
- 'అమరావతి యాత్ర'పై పెల్లుబుకుతున్న ఆగ్రహం

2 లో

30 మంది దిగ్గజాలకు ప్రభుత్వ పురస్కారాలు

నవంబర్ 1న సీఎం జగన్ చేతుల మీదుగా ప్రదానం



- 20 మందికి వైఎస్సార్ లైఫ్‌టైం అచీవ్‌మెంట్, 10 మందికి వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డులు
- కళారంగంలో కళాతపస్వి విశ్వనాథ్, ఆర్.నారాయణమూర్తి ఎంపిక
- దిశ పోలీసింగ్, రక్షణ సేవల్లో ఐదుగురు పోలీసులకు ఉమ్మడి అవార్డు

సాక్షి, అమరావతి: వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన ప్రముఖులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, డాక్టర్ వైఎస్సార్ అచీవ్‌మెంట్-2022 పురస్కారాలకు ఎంపికైన దిగ్గజాల జాబితా విడుదలైంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలుగు జాతి గౌరవాన్ని నిలబెట్టిన విశిష్ట వ్యక్తులు, సామాజిక సేవ రంగంలోని వివిధ సంస్థలకు కలిపి 30 అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేయనుంది. సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు (కమ్యూనికేషన్స్), అవార్డుల

మిగతా 13వ పేజీలో ▶

టీడీపీ హయాంలోనే కబ్జా కోరలు

విశాఖలో భూ రాబందులు.. పచ్చ నేతలే

- ఆలయ భూమిని ఆక్రమించేందుకు పల్లా సోదరుడి యత్నం
- విశాఖలో గత మూడేళ్లలో 430.81 ఎకరాల ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం
- రిజిస్ట్రేషన్ విలువ రూ.2,638 కోట్లు.. మార్కెట్ రేటు రూ.5 వేల కోట్లకుపైనే



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: చెప్పులు తినే కుక్క నోటికి చెరకు రుచిస్తుందా? ప్రభుత్వ భూములు కనిపిస్తే కాజేయడమే ఆనవాయితీగా మార్చుకున్న టీడీపీ నేతల తీరు అలాగే ఉంది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక విశాఖ జిల్లాలో దాదాపు 430 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములను కబ్జాకోరుల చెర నుంచి విడిపించింది. వీటిలో అగ్రభాగం టీడీపీ నేతలే కబ్జా చేయడం గమనార్హం. ఇన్నాళ్లూ విశాఖలో భూకబ్జాలతో వందల ఎకరాలను ఆక్రమించిన టీడీపీ నేతల దందాకు తెరపడటంతో ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తున్నారు.

గీత దాటి కబ్జాలు

టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ ఎంవీవీఎస్ మూర్తి రుషికొండ ప్రాంతంలో 42.51 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు. గీతం యూనివర్సిటీకి సమీపంలో ఉన్న ఈ స్థలాన్ని ఆక్రమించుకొని రెండెకరాల్లో కళాశాల భవన నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన స్థలానికి కాంపౌండ్ వాల్ నిర్మించారు. సుమారు రూ.500 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని దశాబ్దాల పాటు కబ్జా చేసినా టీడీపీ సర్కారు పట్టించుకోలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక గీతం వర్సిటీ కాంపౌండ్ వాల్‌ను తొలగించి కబ్జాలో ఉన్న 40.51 ఎకరాలను స్వాధీనం చేసుకుంది. విశాఖలో ఇలా మూడేళ్లలో మార్కెట్ ధర ప్రకారం రూ.5,000 కోట్ల

మిగతా 10వ పేజీలో ▶



పాదయాత్రికులకు నిరసనల సెగ

10 లో

- అమరావతి రైతుల పాదయాత్రకు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో నిరసన సెగ తగిలింది. స్థానిక ప్రజలు ఓవర్ బ్రిడ్జి సెంటర్ వద్ద ప్లకార్డులు, నల్ల బెలూన్లు, నల్ల చొక్కాలు, మహిళలు నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్

ఏపీ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తాం

విద్య, వైద్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వ విధానాలు అద్భుతం

- సీఎం జగన్‌తో భేటీ అనంతరం బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్
- యూకే తరహాలో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌పై ప్రశంసలు
- ఐటీ, పరిశోధన రంగాలపై బ్రిటిష్ బృందం ఆసక్తి

సాక్షి, అమరావతి: విద్య, వైద్య రంగాలలో ఏపీ ప్రభుత్వం చేస్తున్న కృషి, అనుసరిస్తున్న విధానాలు అద్భుతంగా ఉన్నాయని, ఈ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ ప్రకటించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన ఇతర సభ్యులతో కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల

మిగతా 2వ పేజీలో ▶

మోసకారి లోన్‌యాప్ కంపెనీలపై కఠిన చర్యలు

నకిలీ యాప్‌లకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినా కేసులు

- యాప్‌ల డెవలపర్లు, సర్వీస్ ప్రొవైడర్లు, బ్యాంకుల పైనా చర్యలు.. ఈ సంస్థల బ్యాంకు ఖాతాలను జప్తు చేయాలని బ్యాంకులకు చెప్పాం
- లోన్‌యాప్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తాం
- డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి



లోన్ యాప్‌లపై అవగాహన కల్పించే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: మోసాలు, వేధింపులకు పాల్పడే లోన్‌యాప్ కంపెనీలు, వాటికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రత్యేకంగా విధి విధానాలను రూపొందించినట్లు డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి చెప్పారు. రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేని లోన్‌యాప్‌ల డెవలపర్లు, వాటితో ఒప్పందం చేసుకునే గూగుల్ ప్లే స్టోర్స్, యాప్ స్టోర్స్ వంటి కంపెనీలు, సర్వీస్ ప్రొవైడర్లుగా ఉండే టెలికాం కంపెనీలు, యాప్‌ల ఖాతాలను నిర్వహించే బ్యాంకులపైన కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. డీజీపీ శుక్రవారం మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇప్పటికే పోలీసు శాఖ రాష్ట్ర, జిల్లా స్థాయిలో బ్యాంకు అధికారులతో సమావేశమై కొత్త విధి విధానాలను వివరించిందని తెలిపారు. విదేశాల్లో, ఇతర ప్రాంతాల్లో ఉన్న నకిలీ లోన్ యాప్ ముఠాలు ఇక్కడ ఏజెంట్లను నియమించుకుని మోసాలకు పాల్పడుతున్నాయన్నారు. అందు కోసం ఎక్కడో ఉన్నవారి పేరున మన రాష్ట్రంలో బ్యాంకు ఖాతాలు తెరుస్తున్నట్లు తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. అటువంటి ఖాతాలను నిశితంగా పరిశీలించాలని, ఒక్కసారిగా భారీగా నగదు జమ అయ్యే ఖాతాలను వెంటనే జప్తు చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే

మిగతా 13వ పేజీలో ▶



భవిష్యత్ ఆశాకిరణం ఎర్రజెండాయే

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా

- ఘనంగా ప్రారంభమైన సీపీఐ జాతీయ మహాసభలు
- హాజరైన 16 దేశాల కమ్యూనిస్టు ప్రతినిధులు.. భారీ ర్యాలీతో కదం తొక్కిన కామ్రేడ్లు

9 లో



ఏపీలోకి రాహుల్ పాదయాత్ర

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తలపెట్టిన పాదయాత్ర అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గం లింగమ్మనహళ్లి వద్ద ఏపీలోకి ప్రవేశించింది. జాజరకల్లు మీదుగా మదేనహళ్లి వరకు 5 కి.మీ సాగింది. అక్కడి నుంచి డీ.హీరేహాళ్, ఓబుళాపురం, అంతరాష్ట్ర సరిహద్దు వరకు 12 కిలోమీటర్లు నడిచి కర్ణాటకలోకి పాదయాత్ర ప్రవేశించింది.

13 లో

పిల్లలు మెచ్చే పాఠ్యాంశాలు



- సమగ్ర శిక్షా పథకాన్ని రీడిజైన్ చేసిన కేంద్రం
- జాతీయ విద్యా విధానం–2020 సిఫార్సులకు అనుగుణంగా మార్పులు
- ప్రోగ్రామాటిక్, ఫైనాన్షియల్ మార్గదర్శకాలతో కొత్త ఫ్రేమ్‌వర్క్

5 లో

ఇదండీ సంగతి



కానీ.. చచ్చినా మునుగోడు ప్రచారానికి రారట!!

మహిళలకు బ్యాంకులు రెట్టింపు రుణాలు

- గత ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఇచ్చిన రుణాలు రూ.51,127 కోట్లు
- ఈ ఏడాది అదే సమయానికి ఏకంగా రూ.1,05,399 కోట్లు
- రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక వెల్లడి
- రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న చేయూత, ఆసరా, ఇళ్ల తదితర పథకాలే ఈ ఘనతకు కారణం
- దీంతో బ్యాంకులు కూడా మహిళలకు అధిక ప్రాధాన్యత



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళలకు బ్యాంకులు పెద్దపీట వేశాయి. ఒక్క ఏడాదిలోనే రెట్టింపు రుణాలను మంజూరు చేశాయి. గత ఏడాది మార్చి నెలాఖరు నాటికి బ్యాంకులు రూ.51,127 కోట్ల మేర రుణాలు మంజూరు చేయగా అదే ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి ఏకంగా రూ.1,05,399 కోట్లు ఇచ్చాయి. అంటే ఏడాదిలోనే బ్యాంకులు మహిళలకు రెట్టింపుకు పైగా రూ.54,272 కోట్లు (106 శాతం) మేర రుణాలను మంజూరు చేశాయి. నిజానికి.. ఆర్‌బీఐ నిబంధనల మేరకు మొత్తం రుణాల మంజూరులో ఐదు శాతం మేర రుణాలను మహిళలకు ఇవ్వాలని ఉంది. కానీ, రాష్ట్రంలో మహిళలకు ఆర్‌బీఐ నిబంధనలకు మించి 20.95 శాతం మేర రుణాలను మంజూరు చేశాయని ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ నివేదిక వెల్లడించింది. ఇందుకు ప్రధాన కారణం మహిళల జీవనోపాధి మెరుగుదల.. మహిళా సాధికారత సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం వారికి అమలుచేస్తున్న పథకాలేనని స్పష్టమవుతోంది. ఇందులో భాగంగానే.. ఎన్నికల్లో హామీఇచ్చిన మేరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఎన్నికల నాటికి ఉన్న రుణాలను నాలుగు విడతల్లో తిరిగి ఇచ్చేందుకు వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలుచేస్తున్న విషయం తెలిసిందే. అంతేకాక.. సకాలంలో రుణాలు చెల్లించే స్వయం సహాయక సంఘాల మహిళలకు సున్నా వడ్డీని ప్రభుత్వం క్రమం తప్పకుండా అమలు చేస్తోంది. దీంతో పొదుపు సంఘాల మహిళల్లో క్రమశిక్షణ పెరిగింది. ఈ నేపథ్యంలో.. చేయూత, ఆసరా పథకాల మహిళలకు బ్యాంకులు గత మూడేళ్ల నుంచి లక్ష్యానికి మించి రుణాలు మంజూరు చేశాయి.

ఇంటి నిర్మాణానికీ పావలా వడ్డీకే రుణం

అలాగే, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన 30 లక్షలకు పైగా ఇళ్ల స్థలాలను మహిళల పేరిటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో పేదల ఇళ్ల నిర్మాణాల నిమిత్తం బ్యాంకులు ఒక్కో ఇంటి లబ్ధిదారునికి రూ.35 వేల చొప్పున పావలా వడ్డీకే రుణాలిస్తున్నాయి. ఇలా గత నెలాఖరు నాటికి 5.21 లక్షల మంది ఇళ్ల లబ్ధిదారులైన మహిళలకు బ్యాంకులు రూ.1,836 కోట్లు మంజూరు చేశాయి. ఇలా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా అమలుచేస్తున్న వివిధ పథకాల కారణంగానే మహిళలకు బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు మంజూరు చేస్తున్నాయన్నది సుస్పష్టం.

క్లుప్తంగా

ఉపాధి పని దినాలు పెంపు

- పని దినాలను 19 కోట్లకు పెంచిన కేంద్రం
- అదనపు కేటాయింపులకు హామీ

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్ కేటాయింపులను కేంద్ర ప్రభుత్వం పెంచింది. ఈ ఆర్థిక సంవత్సరంలో మొదటగా 14 కోట్ల పని దినాల కల్పనకు ఆమోదం తెలిపిన కేంద్రం.. ప్రస్తుతం ఆ కేటాయింపులను 19 కోట్ల పని దినాలకు పెంచింది. ఈ పథకం ద్వారా ప్రస్తుత ఆర్థిక ఏడాదికి రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంత పేదలకు వనుల కల్పనలో అదనపు పని దినాల కేటాయింపుపై గురువారం ఢిల్లీలో కేంద్ర, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారుల ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఒక్కో పని దినానికి రూ.428 చొప్పున కేటాయింపు

ఒక్కొక్క పని దినానికి గరిష్టంగా రూ.428 చొప్పున గ్రామీణాభివృద్ధి శాఖకు అందుతాయి. పేదలకు వారు చేసే రోజు వారీ పని ఆధారంగా కూలీ రూపంలో గరిష్టంగా రూ.257 చొప్పున అందజేస్తారు. కూలీల వేతనాల ఆధారంగా మిగిలిన రూ.171 మెటీరియల్ కేటగిరీ నిధులుగా పేర్కొంటారు. మెటీరియల్ కేటగిరీ నిధులను 75–25 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. అయితే, రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆర్థిక ఏడాదికి సంబంధించి ఇప్పటికే 17.30 కోట్ల పని దినాల పాటు పేదలకు వనులు కల్పన పూర్తయిందని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కేంద్రం దృష్టికి తీసుకెళ్లగా.. 19 కోట్ల పని దినాలను కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ కేటాయించింది. వీటిని పూర్తి చేసిన వెంటనే అదనపు పని దినాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నుంచి లేఖ రాయగా.. అదనపు కేటాయింపులు కూడా చేస్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు హామీ ఇచ్చారు.

అమరావతి రైతులు రోడ్డెక్కడానికి టీడీపీ కూడా కారణం

సోము వీర్రాజు

సాక్షి, అమరావతి/మంగళగిరి: అమరావతి ప్రాంత రైతులకు రోడ్డెక్కాల్సిన దుస్థితి రావడానికి టీడీపీ కూడా కారణమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు విమర్శించారు. అమరావతి ప్రాంత గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈప్రాంత రైతుల ఉద్యమానికి బీజేపీ అండగా ఉంటుందని.. టీడీపీ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాల వల్లే అమరావతి రైతులు ఇబ్బందిపడుతున్నట్టు చెప్పారు. ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. అనంతరం ఆయన ఎస్ఆర్ఎం, విట్, అమృత వర్సిటీలకు వెళ్లే రోడ్లను పరిశీలించారు. గత టీడీపీ ప్రభుత్వం యూనివర్సిటీలకు వెళ్లేందుకు సరైన రహదారులు కూడా నిర్మించలేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరించి పట్టించుకోలేదన్నారు. 11 కిలోమీటర్లున్న రోడ్డును డబుల్‌లైన్‌గా అభివృద్ధి చేయా లని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై సీఎం జగన్‌కు దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలన్నారు.

నేడు, రేపు పదాధికారుల సమావేశాలు

బీజేపీ రాష్ట్ర పదాధికారుల సమావేశాలు శని, ఆదివారాల్లో విజయవాడలో నిర్వహించనున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

విశాఖకు జై!

▶ మొదటి పేజీ తరువాయి

ఆగ్రహం వ్యక్తమవుతోంది. పైగా ఇదే రోజు ఉత్తరాంధ్ర నేతలందరూ ఆ పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యేందుకు సిద్ధమవ్వడంపై మరింత ఆగ్రహం వ్యక్తమవుతోంది.

శుక్రవారం ఉత్తరాంధ్ర నాన్‌పొలిటికల్ జేఏసీ చైర్మన్ లజపతిరాయ్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పాటు పలువురు జేఏసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, మేధావులు ర్యాలీ జరిగే రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. అనంతరం జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో 'విశాఖ గర్జన' జెండాను, పాటను ఆవిష్కరించారు. నియోజకవర్గాల వారీ రూట్‌మ్యాప్‌ను పోలీసులకు అందజేశారు. ఉత్తరాంధ్ర, ఉమ్మడి విశాఖ జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలిరానున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాల వారీగా వెళ్లేలా వలంటీర్లను కూడా ఏర్పాటు చేశారు. యాత్రలో పాల్గొనే వారందరికీ ఎటువంటి ఇబ్బందులు రాకుండా వలంటీర్లు సహాయ పడతారు. సాగర తీరాన మూడున్నర కిలోమీటర్ల మేర సుమారుగా లక్ష మందితో గర్జన జరగనుంది.

ర్యాలీ సాగేదిలా..

ఉత్తరాంధ్ర నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న 'విశాఖ గర్జన' ర్యాలీ శనివారం ఉదయం 9 గంటలకు ఎల్ఐసీ బిల్డింగ్.. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ప్రారంభం కానుంది. జైలు రోడ్డు జంక్షన్, సెవెన్ హిల్స్ హాస్పిటల్ జంక్షన్, వాల్తేర్ క్లబ్, సిరిపురం జంక్షన్, చిన వాల్తేర్ జంక్షన్ మీదుగా ఆర్కే బీచ్ రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు సుమారు మూడున్నర కిలోమీటర్ల మేర కొనసాగనుంది. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఉత్తరాంధ్ర జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ సభ్యులు, ఉత్తరాంధ్ర ప్రజాప్రతినిధులు, మేధావులు నివాళులర్పించి.. ర్యాలీ ప్రారంభిస్తారు. ర్యాలీ సందర్భంగా ఉత్తరాంధ్ర వెనుకబాటు తనం, ఇక్కడ ప్రజలు పొట్టకూటి కోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్తుండటం, ఇతరత్రా సమస్యలు ఎదుర్కొంటుండటంపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. విశాఖ గర్జన నేపథ్యంలో నగర పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

అందరి మాటా అదే..

పరిపాలన రాజధానిగా విశాఖ అత్యంత అనుకూలం

సాక్షి, విశాఖపట్నం: 'పరిపాలన రాజధానిగా విశాఖకే జై కొడతాం.. అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం వికేంద్రీకరణకే సై అంటాం..' అంటూ విశాఖ సహా ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షించే మేధావి, వ్యాపార, పారిశ్రామిక, విద్యా, ఉద్యోగ, కార్మిక, కర్షక లోకం గొంతెత్తుతోంది. వికేంద్రీకరణ వద్దంటూ అమరావతి రైతుల పేరిట చేస్తున్న యాత్రపై భగ్గుమంటోంది. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాదని, కేవలం అమరావతి ప్రాంత అభివృద్ధి కోసం తెలుగుదేశం పార్టీ నేతలు నడిపిస్తున్న ఈ యాత్రను ఉత్తరాంధ్రలోకి చొరబడనీయమని స్పష్టం చేస్తోంది. వడ్డించిన విస్తరిలాంటి విశాఖలో తక్కువ పెట్టుబడితోనే పాలన రాజధానికి అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పించవచ్చని వివరిస్తోంది. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయానికి ముక్త కంఠంతో మద్దతు పలుకుతోంది. విశాఖను పాలన రాజధాని చేయడం చారిత్రక అవసరమని నినదిస్తోంది. ఒకే ప్రాంతంలో రాజధాని ఉంటే రాష్ట్ర విభజన తర్వాత హైదరాబాద్‌ను కోల్పోయిన వైనాన్ని గుర్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో వికేంద్రీకరణకు మద్దతుగా శనివారం విశాఖ నగరంలో భారీగా నిర్వహించ తలపెట్టిన 'విశాఖ గర్జన'ను విజయవంతం చేస్తామని ప్రతి గొంతూ గర్జిస్తోంది. అదే సమయంలో అమరావతి యాత్రను తక్షణమే విరమించుకోవాలని అభ్యర్థిస్తోంది. లేదంటే విశాఖ పరిపాలన రాజధాని అయ్యే వరకు మున్ముందు ఎలాంటి ఉద్యమాలకైనా, త్యాగాలకైనా సిద్ధమని, వెనకడుగు వేయబోమని ప్రతిన బూనుతోంది. వికేంద్రీకరణ, విశాఖ పాలన రాజధాని ఆవశ్యకతపై వివిధ రంగాల ప్రముఖుల అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.

చారిత్రక అవసరం..



విశాఖను పరిపాలన రాజధానిగా చేయడం చారిత్రక అవసరం. అప్పుడే ఈ ప్రాంతం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. యువతకు ఉపాధి అవకాశాలు పెరిగి, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం పోతుంది. వలసల నిర్మూలనకు వీలవుతుంది. రాజధానికి అవసరమైన అన్ని హంగులూ విశాఖలోనే ఉన్నాయి. ఇన్నాళ్లూ గత పాలకులు ఈ ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదు. ఇప్పుడు వికేంద్రీకరణలో భాగంగా విశాఖను పరిపాలన రాజధాని చేయాలన్న సీఎం వైఎస్ జగన్ నిర్ణయం హర్షణీయం.

– కృష్ణమోహన్, జేఏసీ సభ్యుడు, న్యాయవాది, ఏపీ బార్ కౌన్సిల్

విశాఖ అంటే వడ్డించిన విస్తరి



రాజధానిగా విశాఖ ఎంతో అనుకూలం. విశాఖ అంటే వడ్డించిన విస్తరి. రాజధానికి అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. రైలు, వాయు, రోడ్డు, సముద్ర మార్గాలున్న ఏకైక నగరమిది. పరిశ్రమలతోపాటు అన్ని రంగాలు అభివృద్ధి చెందడానికి ఎన్నో అవకాశాలున్నాయి. రాష్ట్రంలో అత్యధిక రెవెన్యూ లభిస్తున్న నగరం విశాఖపట్నం. రాష్ట్రంలో వచ్చే ప్రతి వంద రూపాయల్లో 75 రూపాయలు ఇక్కడ్నుంచే వస్తున్నాయనడం అతిశయోక్తి కాదు.

– సత్యనారాయణరెడ్డి (రఘు), చైర్మన్, ఐలా, గాజువాక

వైద్యులందరి మాటా అదే..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ముందుచూపుతో మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారు. వికేంద్రీకరణతో విశాఖ సహా అన్ని ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయి. సీఎం నిర్ణయానికి మా వైద్యుల సంఘం సంపూర్ణంగా మద్దతు తెలుపుతోంది. విశాఖ గర్జనను అన్ని వర్గాలూ విజయవంతం చేసి విశాఖ రాజధాని ఆవశ్యకతను చాటాలి.

– డా.సుందరరాజు, అధ్యక్షుడు, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం కేజీహెచ్ యూనిట్

మూడు రాజధానులతో మేలు

వికేంద్రీకరణతో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఇక్కడ పెట్టుబడులు పెరుగుతాయి. ఫలితంగా ఉపాధి, ఉద్యోగావకాశాలతో పాటు మౌలిక వసతులు వృద్ధి చెందుతాయి. ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల నిర్ణయంతో వెనుకబడిన ఈ ప్రాంతంలో ఆర్థిక అసమానతలు రూపుమాపడానికి దోహద పడుతుంది. ప్రభుత్వ విధానాన్ని మా చాంబర్ ఆఫ్ కామర్స్ పూర్తిగా స్వాగతిస్తోంది. – సతీష్, అధ్యక్షుడు, ది వైజాగ్ చాంబర్ ఆఫ్ కామర్స్

హైదరాబాద్ గుణపాఠం కావాలి



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ ఒక్కటే రాజధానిగా ఉండటంతో అభివృద్ధి అంతా హైదరాబాద్‌కు పరిమితమైంది. దీంతో రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయింది. ఇప్పుడు అమరావతి ఒక్కటే రాజధాని అయితే మళ్లీ అదే ప్రమాదం పొంచి ఉంది. భవిష్యత్తులో మళ్లీ రాష్ట్ర విభజన సమస్యలు తలెత్తితే మిగిలిన ప్రాంతాలు తీవ్రంగా నష్టపోతాయి. గతాన్ని చూసైనా వికేంద్రీకరణకు అందరూ మద్దతివ్వాలి.

– డి.వి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి, డీవీఆర్ స్టీల్ ఎంప్లాయిస్ యూనియన్

పారిశ్రామికంగా మరింత అభివృద్ధి



రాష్ట్రంలో మూడు రాజధానుల ఆవశ్యకత ఎంతో ఉంది. విశాఖ పరిపాలన రాజధాని అయితే పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుంది. ఇప్పటికే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లో కొన్ని పరిశ్రమలు వచ్చాయి. విశాఖ పరిసరాల్లో అనేక పరిశ్రమలు రావడానికి ఆసక్తి చూపుతున్నాయి. రాజధాని అయితే మరిన్ని పరిశ్రమలు రావడంతో పాటు ఉత్తరాంధ్రలో అనేక మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. విశాఖ పరిపాలనా రాజధాని అయ్యే వరకు ఉద్యమానికి వెనకాడం. – మంత్రి రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శి, ఐఎన్‌టీయూసీ

ఉత్తరాంధ్రులు ఉద్యమించాల్సిన తరుణమిదే



ఉత్తరాంధ్ర ఎప్పట్నుంచో వెనుకబాటుతో ఉంది. ఈ ప్రాంతీయుల్లో అధికులు పేదలు. విశాఖ పాలన రాజధాని అయితే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. రాజధానిగా వచ్చిన అవకాశాన్ని వదులుకోకూడదు. విశాఖ పాలన రాజధాని, వికేంద్రీకరణ కోసం పార్టీలకు అతీతంగా ఉద్యమించాల్సిన తరుణమిదే. ఇది ఉత్తరాంధ్రలో ప్రతి ఒక్కరి బాధ్యత. శనివారం నాటి విశాఖ గర్జనలో వికేంద్రీకరణ కోసం అంతా నినదించాలి.

– పైడిరాజు, రాష్ట్ర కార్యదర్శి, ఎస్‌టీయూ

అన్ని విధాలా ఉత్తరాంధ్ర అభివృద్ధి



విశాఖ కార్యనిర్వాహక రాజధాని అయితే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుంది. విశాఖలో వ్యాపారాలు మరింతగా విస్తరించి మరెందరికో ఉపాధి లభిస్తుంది. ప్రస్తుతం ఇక్కడ హోల్‌సేల్ మార్కెట్లు లేవు. విజయవాడ, హైదరాబాద్‌లలో మాత్రమే ఉన్నాయి. ఇక్కడ రాజధాని ఏర్పాటు చేస్తే అవి కూడా వస్తాయి. హైదరాబాద్‌ను మించి ఇక్కడ వ్యాపారాలు జరుగుతాయి. హెల్త్ సిటీగా విశాఖ మరింత ప్రాచుర్యం పొందుతుంది.

– రాపర్తి సుబ్బారావు, వస్త్ర వ్యాపారి, గాజువాక.

విశాఖ గర్జనలో పాల్గొంటున్నాం



మాది గుంటూరు జిల్లా. విశాఖ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య అభ్యసిస్తున్నాను. అన్ని ప్రాంతాలూ అభివృద్ధి చెందితేనే అందరికీ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. వికేంద్రీకరణతోనే అది సాధ్యం. గతంలో ఒక్క హైదరాబాద్‌నే అభివృద్ధి చేయడం వల్ల విభజనతో అన్నింటినీ వదిలేసి రావాల్సి వచ్చింది. ఆ తప్పు పునరావృతం కాకూడదు. అందువల్లే మేమంతా వికేంద్రీకరణకు మద్దతు తెలుపుతూ శనివారం జరిగే విశాఖ గర్జనలో పాల్గొంటున్నాం.

– కర్నేటి సాయికృష్ణ, న్యాయ విద్యార్థి, ఏయూ, విశాఖపట్నం

వికేంద్రీకరణతో ఏపీ అభివృద్ధి



రాజధానికి కావాల్సిన అన్ని అర్హతలున్న నగరం విశాఖ. ఓ వైపు అంతర్జాతీయ విమానాశ్రయంతో పాటు ఆరు వరుసల జాతీయ రహదారి, రైలు, జల రవాణా ఉన్న ఏకైక సిటీ. పర్యాటకంగా ఎంతో అభివృద్ధి సాధించింది. విద్య, వైద్య రంగాలకు పెట్టింది పేరు. అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల వారిని అక్కున చేర్చుకుంటున్న వైజాగ్.. పరిపాలన రాజధానిగా మారితే ఉత్తరాంధ్రతో పాటు రాష్ట్రం కూడా అభివృద్ధి చెందుతుంది. దేశంలోనే అత్యధిక జీడీపీ కలిగిన పది నగరాల్లో మన విశాఖ ఒకటి. విశాఖ రాజధాని కావాలి. ఇందుకు అందరూ మద్దతు పలకాలి.

– మేడపాటి రమేష్ రెడ్డి, ఎండీ, స్వాతి ప్రమోటర్స్

ఏపీ ప్రభుత్వంతో కలిసి పని చేస్తాం

▶ మొదటి పేజీ తరువాయి

ఉన్నతాధికారులతో సమావేశమైన ఆయన.. వారితో వివిధ అంశాలపై క్షుణ్ణంగా చర్చించిన అంశాల గురించి ముఖ్యమంత్రి జగన్‌తో పంచుకున్నారు. యూకేలో అమలవుతున్న ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ఇక్కడ కూడా అమలు చేయాలన్న ప్రణాళిక చాలా బావుందని ప్రశంసించారు. ఇందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్.. వైద్య, ఆరోగ్య రంగం బలోపేతానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. యూకే – భారత్ విద్యార్థుల పరస్పర మార్పిడి విధానం, ఏపీ నుంచి ఎక్కువ మంది విద్యార్థులకు బ్రిటన్ వీసాలు ఇప్పించే విషయంపై కూడా ఈ సమావేశంలో చర్చించారు. దీనిపై విన్ ఓవెన్ సానుకూలంగా స్పందించారు.

ఐటీ, పరిశోధన రంగాల్లో కలిసి పని చేస్తాం

ఐటీ, పరిశోధన రంగాలపై బ్రిటిష్ బృందం ఆసక్తి వ్యక్తం చేసింది. ఈ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాగస్వామ్యంతో ముందుకు వెళ్లేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని సీఎంకు హామీ ఇచ్చింది. ఏపీలో పెట్టుబడులు, అవకాశాలపై బ్రిటిష్ బృందానికి వివరించిన ముఖ్యమంత్రి.. రాష్ట్రంలో అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కుల పురోగతి గురించి కూడా వారితో చర్చించారు. వ్యవసాయ రంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుసరిస్తున్న వినూత్న విధానాలను ఆసక్తిగా తెలుసుకున్న విన్ ఓవెన్.. ఉపాధ్యాయుల శిక్షణకు సంబంధించి కూడా చర్చించారు. విద్యా రంగానికి సంబంధించి పూర్తి సహాయ సహకారాలు అందివ్వనున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బ్రిటీష్ కమిషన్ ట్రేడ్, ఇన్వెస్ట్‌మెంట్ హెడ్ వరుణ్ మాలి, పొలిటికల్ ఎకానమీ అడ్వైజర్ నళిని రఘురామన్, సీఎం స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ కేఎస్.జవహర్‌రెడ్డి పాల్గొన్నారు.

నృసింహుని సన్నిధిలో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్



మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చిన బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ శుక్రవారం గుంటూరు జిల్లా మంగళగిరిలోని పానకాల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత ఆలయానికి చేరుకున్న ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. దర్శనం అనంతరం గారెత్ విన్ ఓవెన్ మాట్లాడుతూ.. ఆలయ నిర్మాణం అద్భుతం అని కొనియాడారు. స్వామి వారిని దర్శించుకోవడం సంతోషకరం అన్నారు.

పది తలల రావణుడు బాబే

- సీఎం జగన్‌కు నాటకాలు తెలియవు: మాజీ మంత్రి కన్నబాబు
- తప్పుడు రాతలతో విశ్వసనీయత కోల్పోవద్దు

కాకినాడ రూరల్: పది తలల రావణాసురుడి లాంటి చంద్రబాబును ఈనాడు దినపత్రిక భుజాని కెత్తుకుని నిత్యం అసత్యాలను ప్రచురిస్తోందని మాజీ మంత్రి కురసాల కన్నబాబు మండిపడ్డారు. జగన్నాటకం పేరుతో తప్పుడు కథనాన్ని ప్రచురించారని, అవి రాతలా.. రోతలా? అని నిలదీశారు. అమరావతి మాత్రమే ఉండాలా? మిగతా వారంతా నాశనమై పోవాలని ఉద్యమం చేస్తున్నారా? అని ప్రశ్నించారు. బురద జల్లడమే మీ అజెండా అయితే ప్రజల్లో విశ్వసనీయత కోల్పోతారని హెచ్చరించారు. ఉద్దానం ప్రాంతంలో మంచినీటి కోసం రూ.700 కోట్లను ముఖ్యమంత్రి జగన్ ఇచ్చారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మీ కళ్లకు కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. శుక్రవారం కాకినాడ వైద్యనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కన్నబాబు విలేకరులతో మాట్లాడారు.

➡ పది తలల రావణాసురుడి లాంటి చంద్రబాబుకు ఉన్న రెండో తల ఈనాడు అధినేత రామోజీరావు. మూడో తల రాజ్యాంగ పదవుల్లో ఉంటూ దొంగచాటుగా సాయం చేసే పెద్దలది. నాలుగో తల బీజేపీలో ఉన్న ఆయన కోవర్టులు సీఎం రమేష్, సుజనా చౌదరి లాంటివారు. ఆయన ఐదో తల కాంగ్రెస్‌లో ఉన్న ఒక బ్యాచ్, తెలంగాణాలో రేవంత్‌రెడ్డి లాంటి వారు. ఎప్పుడంటే అప్పుడు అనుకూలంగా మాట్లాడి మద్దతిచ్చే పవన్‌కల్యాణ్, నాదెండ్ల మనోహర్ ఆయన ఆరో తలకాయ. 7వ తల కమ్యూనిస్ట్ పార్టీ నేత నారాయణ. టీవీ 5, ఇతర ఎల్లో మీడియా ఆయన 8వ తలకాయ. 9వ తల ఏబీఎన్ రాధాకృష్ణ. మేధావుల ముసుగులో డిబేట్లకు హాజరై చంద్రబాబును భుజాన వేసుకుని మాట్లాడే వారంతా ఆయన పదో తలకాయ. ఇంత మంది క్రేన్లతో పైకి ఎత్తితే చంద్రబాబు మహానాయకుడిలా బిల్డప్ ఇస్తున్నారు.

➡ అమరావతి ఒక బ్రహ్మ పదార్థం. అందులో విజయవాడా లేదు, గుంటూరూ లేదు. శాసన రాజధానిగా అమరావతి ఉంటుందని అసెంబ్లీలో ముఖ్యమంత్రి జగన్ చెప్పారు. అమరావతి పాదయాత్రను టీడీపీ సానుభూతి పరులున్న గ్రామాలను ఎంచుకుని కొనసాగిస్తున్నారు. మేం స్టేట్ గురించి మాట్లాడుతుంటే మీరు రియల్ ఎస్టేట్ గురించి మాట్లాడుతున్నారు.

➡ సీఎం వైఎస్ జగన్‌కి నాటకాలు ఆడటం రాదు. ఉన్నది ఉన్నట్లు, కుండబద్దలు కొట్టినట్లు చెప్పటమే ఆయనకు తెలుసు. అమరావతిని కట్టాలంటే రూ.5 లక్షలకోట్లు కావాలని చంద్రబాబు ప్రభుత్వమే అంచనా వేసింది. ఒక్క ప్రాంతం కోసమే అంత ఖర్చుపెడితే మిగతా ప్రాంతాలు ఏం కావాలి? రాష్ట్ర సమగ్రాభివృద్ధి, అన్ని ప్రాంతాలు బాగుండాలనే ఉద్దేశంతోనే సీఎం మూడు రాజధానులను ప్రకటించారు. వికేంద్రీకరణను మాటల్లో కాకుండా చేతల్లో చూపారు.



ఈనాడు పత్రికలో సీఎంపై రాసిన రాతలను మీడియా సమావేశంలో చూపుతున్న కన్నబాబు

ఆర్బీకేలు చూసేందుకు మళ్లీ వస్తాం

- బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్
- వ్యవసాయ, ఉద్యాన సాంకేతిక పరిజ్ఞానం చాలా బాగున్నాయి
- అవి అందరికీ ఆదర్శమని ప్రశంస

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన సాంకేతిక పరిజ్ఞానం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులు ఆమోఘమని, అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్ ఓవెన్ చెప్పారు. రాష్ట్రంలో పర్యటిస్తున్న గారెత్ బృందం శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో భేటీ అయింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఆర్బీకేలతో రైతులకు ఉపయోగాలు, ఈ–క్రాప్ బుకింగ్, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ విధానాలు, వీటి అమలుకు తీసుకొచ్చిన అప్లికేషన్స్ పనితీరును గారెత్ సమగ్రంగా తెలుసుకున్నారు. ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలు, వ్యవసాయ, అనుబంధ రంగాలలో పురోగతిని చూసేందుకు త్వరలోనే మరోసారి రాష్ట్రంలో పర్యటిస్తానని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడున్నరేళ్ల పాలనలో వ్యవసాయాన్ని పండుగగా మార్చారని మంత్రి కాకాణి చెప్పారు. ఆర్బీకేల ద్వారా విత్తు నుండి విక్రయం వరకు అన్ని రకాల సేవలను రైతుల ముంగిళ్లలోనే అందజేస్తున్నామని తెలిపారు. వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వ చర్యలతో పలు వ్యవసాయ ఉత్పత్తులకు దేశంలో ఆంధ్రప్రదేశ్ కేంద్రంగా మారిందన్నారు.



మంత్రి కాకాణితో గారెత్ విన్ ఓవెన్ తదితరులు

వ్యవసాయ సంస్కరణలకు ఆస్ట్రేలియా ప్రశంసలు: మంత్రి కాకాణి

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలకు ఆస్ట్రేలియా ప్రభుత్వం ప్రశంసలు కురిపించిందని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. 10 రోజుల ఆస్ట్రేలియా పర్యటన విశేషాలను మంత్రి శుక్రవారం మీడియా సమావేశంలో వివరించారు. ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజ్ (ఐసీఐడీ) సంస్థ రాష్ట్రంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజికి హెరిటేజ్ అవార్డును అందించిందని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో తీసుకువచ్చిన సంస్కరణలను వివరించగా ప్రతి ఒక్కరూ ఆశ్చర్య పోయారన్నారు. ఇంత సమర్థంగా, దూరదృష్టితో పనిచేస్తున్న ప్రభుత్వం మరొకటి లేదని ఆస్ట్రేలియా వ్యవసాయ మంత్రి అలన్నా మాక్ టెర్నర్ వ్యాఖ్యానించారని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలకు అంతర్జాతీయంగా లభిస్తున్న గుర్తింపునకు ఇదే ఉదాహరణ అని అన్నారు. ఆర్బీకే తరహా సేవలను దేశంలోని ఇతర రాష్ట్రాలతోపాటు వీదేశాల్లో కూడా ప్రవేశపెడుతున్నారని, ఇందుకు మార్గదర్శకులు సీఎం వైఎస్ జగన్ అని చెప్పారు. ఉచిత పంటల బీమాకు ప్రీమియంను రైతులు కట్టారా అని ఆస్ట్రేలియా మంత్రి అడిగారని, ఒక్క పైసా కూడా వసూలు చేయకుండా ప్రభుత్వమే కడుతోందని చెప్పడంతో ఆశ్చర్య పోయారన్నారు.

తల్లీ, బిడ్డ ఆరోగ్య సంరక్షణలోనూ

మనమే టాప్



పిల్లలకు టీకాల్లో ఏపీ నంబర్‌వన్

- ప్రజారోగ్య సంరక్షణలో ఉత్తమ పనితీరు
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నివేదికలో వెల్లడి

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య సంరక్షణలో ఆంధ్రప్రదేశ్ ఉత్తమ పనితీరు కనబరుస్తోంది. గర్భిణులకు చెకప్‌లు, 9–11 నెలల పిల్లలకు టీకాలు వేయడం వంటి అంశాల్లో దేశంలోనే తొలి స్థానంలో ఏపీ నిలిచింది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన హెచ్ఎంఐఎస్ 2021–22 అనాలసిస్ రిపోర్ట్‌లో వెల్లడైంది. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు, గర్భిణులకు ఆరోగ్య సంరక్షణ, ఇమ్యునైజేషన్ సహా 13 అంశాలపై పెద్ద, చిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల వారీగా (మూడు విభాగాలుగా) పనితీరు ఆధారంగా ర్యాంక్‌లు కేటాయించింది. ఈ ర్యాంకులు ఇవ్వడానికి హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ పోర్టల్ ద్వారా తొలిసారిగా దేశంలోని 735 జిల్లాల్లోని 1,64,440 సబ్ సెంటర్లు, 32,912 పీహెచ్‌సీలు, 15,919 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 2,970 సబ్ జిల్లా ఆస్పత్రులు, 1,264 జిల్లా ఆస్పత్రులు, మెడికల్ కాలేజీల్లోని 2.17 లక్షల ఆరోగ్య సేవలను మ్యాపింగ్ చేసినట్లు హెచ్ఎంఐఎస్ ఈ–బుక్ బులెటిన్‌లో పేర్కొంది. కొత్త పోర్టల్‌లో వ్యక్తి నిర్దిష్ట వినియోగదారు ఆధారాలు, రియల్ టైమ్ డేటా ఎంట్రీ, రియల్ టైమ్ మానిటరింగ్, నేషనల్ ఐడెంటిఫికేషన్ నంబర్, స్థానిక ప్రభుత్వ డైరెక్టరీ (అప్లికేషన్ ప్రోగ్రామ్ ఇంటర్‌ఫేస్) ఉన్నట్లు తెలిపింది. ఈ నివేదిక ప్రకారం 9 నుంచి 11 నెలల పిల్లలకు టీకాలు ఇవ్వడం (ఇమ్యునైజేషన్)లో దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఏపీకి నంబర్–1 ర్యాంక్ రాగా.. తెలంగాణకు 5, తమిళనాడుకు 11 ర్యాంక్‌లు లభించాయి. ఇదే సందర్భంలో గర్భిణులకు ప్రసవానికి ముందు నాలుగు ఏఎన్‌సీ చెకప్‌లు నిర్వహించడంలోనూ దేశంలోనే నంబర్–1 ర్యాంక్‌ను ఆంధ్రప్రదేశ్ దక్కించుకుంది. ఆ తరువాత స్థానాల్లో వరుసగా కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక ఉండగా.. పొరుగున ఉన్న తెలంగాణ 13వ ర్యాంక్‌కు పరిమితమైంది. ఆరోగ్య సేవలకు సంబంధించిన అన్ని అంశాల పనితీరులోనూ దేశంలోని పెద్ద రాష్ట్రాల్లో ఏపీకి రెండో ర్యాంక్ దక్కింది.

బెడ్ ఆక్యుపెన్సీలోనూ..

ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అంతకన్నా పెద్ద ఆస్పత్రుల్లో బెడ్ ఆక్యుపెన్సీ విషయంలో ఏపీ 57.8 శాతంతో దేశంలోనే రెండోర్యాంకులో నిలిచింది. జాతీయస్థాయిలో బెడ్స్ ఆక్యుపెన్సీ 27.9 శాతమే ఉంది. ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా సురక్షితంగా ఉండేందుకు గర్భిణులకు టెటానస్ టాక్సాయిడ్ ఇంజెక్షన్లు వేయడంలో ఆంధ్రప్రదేశ్ 103.9 శాతంతో రెండవ ర్యాంకులో ఉంది. జాతీయ స్థాయిలో ఈ ఇంజెక్షన్లను 73.9 శాతమే వేశారు. ఇంటి దగ్గర డెలివరీల్లో 69.0 శాతం మేర స్కిల్ బర్త్ అటెండెంట్స్ హాజరవుతున్నారు. ఇందులో ఆంధ్రప్రదేశ్ మూడో ర్యాంకులో నిలిచింది. జాతీయ స్థాయిలో 17.5 శాతం మాత్రమే హాజరు ఉంది. ఇనిస్టిట్యూషన్ డెలివరీల్లో ఆంధ్రప్రదేశ్ 70.7 శాతంతో 6వ ర్యాంకు పొందింది. జాతీయ స్థాయిలో 53.4 శాతమే ఇనిస్టిట్యూషన్ డెలివరీలున్నాయి.

విజయవాడ శ్రీచైతన్య కాలేజీ గుర్తింపు రద్దు

- విద్యార్థిపై దాడి ఘటనపై ప్రభుత్వం సీరియస్
- ఇప్పటికే అధ్యాపకుడిపై క్రిమినల్ కేసు నమోదు

మచిలీపట్నం: ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బెంజి సర్కిల్ సమీపంలోగల శ్రీచైతన్య (భాస్కర్‌భవన్ క్యాంపస్) జూనియర్ కాలేజీ గుర్తింపును రద్దు చేస్తూ ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ విషయాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి రవికుమార్ ధ్రువీకరించారు. శ్రీచైతన్య జూనియర్ కాలేజీ గుర్తింపు రద్దు చేసిన నేపథ్యంలో అక్కడ అడ్మిషన్లు పొందిన విద్యార్థులను ప్రత్యామ్నాయంగా ఇతర కాలేజీలకు సర్దుబాటు చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల అభీష్టం మేరకు వారికి నచ్చిన కాలేజీలో అడ్మిషన్ తీసుకునేలా వెసులుబాటు కల్పించారు. శ్రీచైతన్య కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్న విద్యార్థిపై కాలేజీ అధ్యాపకుడు పరుష పదజాలంతో విరుచుకుపడటమే కాకుండా చేయిచేసుకోవడం తెలిసిందే. ఆ ఘటనపై చిత్రీకరించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. దీనిపై తీవ్రంగా స్పందించిన ప్రభుత్వం ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. కేంద్ర విద్యాశాఖ సైతం దీనిపై జోక్యం చేసుకుని కలెక్టర్‌ను నివేదిక కోరింది. ఈ మొత్తం పరిణామాల నేపథ్యంలో ఘటనకు పాల్పడిన అధ్యాపకుడిపై ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదుచేశారు. తాజాగా, కాలేజీ యాజమాన్యంపై చర్యలకు ఉపక్రమించడంతోపాటు కాలేజీ గుర్తింపు రద్దు చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు కాలేజీకి మూతవేస్తామని, విద్యార్థులకు ఎక్కడా నష్టం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తామని ఆర్ఐవో పి.రవికుమార్ తెలిపారు. విద్యార్థులకు ర్యాంకుల బూచి చూపించి హద్దు మీరి ప్రవర్తిస్తే ఎంతటి వారిపై అయినా కఠిన చర్యలు ఉంటాయన్నారు.



Reliance
Growth is Life
Reliance digital
PERSONALISING TECHNOLOGY
మై కెండ్ ఆఫ్ ఫెస్టివ్ ఆఫర్స్
ఫెస్టివల్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్
TELEVISIONS
2 Year WARRANTY
108 cm (43) ANDROID TV
BPL
ONEPLUS
₹14 990*
*Price after cashback
₹19 990*
*Price after cashback
3 Year WARRANTY
LG
NanoCell
139 CM (55) 55NAN083
₹64 990
BENEFITS
LG Tone Free Wireless Earbuds FN5 worth ₹19 990/-
MAX CASHBACK UPTO 10% MAX VALUE ₹7 500/-*
SAMSUNG
5 Year WARRANTY
Neo QLED
139 CM (55) & ABOVE
EMIs of
₹1990*
BENEFITS
Samsung A32 mobile worth ₹21490 absolutely free*
MAX 20% CASHBACK UPTO ₹20 000/-*
SONY
3 Year WARRANTY
BRAVIA XR OLED A80K SERIES
EMI STARTS AT
₹5 500*
INSTANT CASHBACK UPTO ₹25 000/-*
10% ఇన్‌స్టెంట్ డిస్కౌంట్*
SBI card
In-stores
AXIS BANK
kotak
reliancedigital.in
క్రెడిట్ కార్డు పై ఫ్లాట్ ₹5000* డిస్కౌంట్
Windows 11
LAPTOPS
GAMING
Reliance digital SELECT
ASUS
TUF HN356W
• 10th Gen Core i5
• 16GB RAM
• 512GB SSD
Starting from
₹54 999*
4GB GTX 1650 GRAPHICS
EMIs of ₹6111/-
BENEFITS
Get Upto 2 Years Warranty at ₹999/-*
HP
VICTUS
• 512GB SSD
• Upto 144Hz Refresh
Starting from
₹59 999*
4GB GTX 1650 GRAPHICS
MS OFFICE 21
EMIs of ₹6444/-
(Net Effective)
THIN & LIGHT
Reliance digital SELECT
HP SMART SIM LAPTOP
CORE i3
₹43 999*
CORE i5
₹56 999*
4G LTE
MS OFFICE 21
BENEFITS
Get Jio Data Benefit worth ₹1500
SAMSUNG
GALAXY BOOK 2
• 12th Gen Core i5
• 16GB RAM
• 512 GB SSD
₹88 990
₹57 999*
MS OFFICE 21
EMIs of ₹4833/-
(Effective after bank cashback)
LARGE APPLIANCES
SAMSUNG
Up to 20% cashback*
Free* Galaxy devices
on select models (1 unit)
SIDE BY SIDE
KELVINATOR 584L
₹57 990*
SAMSUNG 700L
₹96 990*
LG 694L
₹1 04 990*
FRONT LOAD
SAMSUNG 7kg
₹34 990*
IFB 8kg
₹39 990*
LG 8kg
₹42 490*
BENEFITS
Get Freebies worth upto ₹72990
BENEFITS
EMI STARTS AT 999 AND ATTRACTIVE CASH BACK UPTO 20%
WEARABLES
BEST DEALS
SMART WATCHES
WATCH
Starting from
₹999*
Starting from
₹14 990*
SMARTPHONES
LIMITED PERIOD OFFER
Upgrader Fest
HDFC BANK
Up to ₹5000* Cashback on HDFC Bank Cards and EasyEMI*
+
Exchange bonus up to ₹10000*
	iPhone 12 (64 GB)	iPhone 14 (128 GB)	iPhone 14 Plus (128 GB)
MRP	₹59 900	₹79 900	₹89 900
Exchange Value Including Cashback*	₹33 000	₹35 000	₹35 000
Effective Price	₹26 900*	₹44 900*	₹54 900*
*Includes HDFC bank cashback, and Exchange value of old Smartphone up to ₹20 000/-
SAMSUNG | 5G DEALS
M13 5G 6/128
₹15 999
₹13 999*
M53 5G 6/128
₹26 999
Starting from
₹19 999*
S22
Starting from
₹49 999*
S22+
Starting from
₹55 799*
S22 ULTRA
Starting from
₹86 499*
1000 ఇన్‌స్టెంట్ డిస్కౌంట్
mastercard
SBI
Reliance resQ
వర్శంటీ గెడెన్స్ | సర్వీస్ | మెయింటెనెన్స్
1800 889 1044
Download the resQ app on
reliancedigital.in
SHOP ANY ELECTRONICS AT MY JIO STORE
Jio DIGITAL LIFE
VISIT US AT: • ANANTHAPUR: SUBHASH ROAD, NEAR CLOCK TOWER, PH: 8591402848/49 • GUNTAKAL: BUS STAND ROAD, OPPOSITE BHARAT PETROL PUMP. PH: 7977582680/753 • NELLORE: LECTURERS COLONY, MINI BYPASS ROAD PH: 8591404512/13 • NELLORE: OPPOSITE KASTURIBA KALAKSHETRAM, BESIDE POLICE GROUNDS, DURGAMITTA PH: 8594102738/55 • CHIRALA: MUNTAVARI CENTER CHIRALA TOWN, PH: 08594 - 232211 • ONGOLE: 1ST FLOOR, PMK NAIDU PROPERTY, BESIDE NAVABARATH THEATRE, GUNTUR ROAD PH: 08592-283601/ 283603 • VIZIANAGARAM: KASPA WEST WARD, KODUGATIVARI STREET PH: 8591402699/96 • ALSO AT: VIJAYAWADA | VIZAG | TIRUPATI | NELLORE | RAJAHMUNDRY | KAKINADA | GUNTUR | ADONI | MADANAPALLI | CHITTOOR | KADAPA | PRODDATUR | ANANTHAUR | GUNTAKAL | KURNOOL | PIDUGURALLA | ONGOLE | CHIRALA | ELURU | VIZIANAGARAM | TADEPALLIGUDEM | BHEEMAVARAM | ANAKAPALLI | AMALAPURAM | NARSARAOPETA | TO LOCATE YOUR NEAREST MYJIO STORE SMS LOCATE <PINCODE> TO 56161

సాక్షి

శనివారం, అక్టోబర్, 15

జిన్‌పింగ్ పట్టాభిషేకం

తలపెట్టినవేవీ కొనసాగక విఫలుడై సెలవంటూ వెళ్లిపోవాల్సిన చైనా అధినేత షీ జిన్‌పింగ్ సంప్రదాయానికి భిన్నంగా వరసగా మూడోసారి చైనా కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి కాబోతున్నారు. వారంపాటు జరిగే పార్టీ కాంగ్రెస్ సమావేశాలు ఆదివారం ప్రారంభమవుతాయి. వచ్చే మార్చిలో నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్(ఎన్‌పీసీ) సమావేశాలు దేశానికి కొత్త ప్రధానిని ఎన్నుకున్నా, దేశాధ్యక్షుడిగా మాత్రం జిన్‌పింగే కొనసాగుతారు. అయిదేళ్లకోసారి నిర్వహించే పార్టీ మహాసభలో జరిగే సిద్ధాంత చర్చలూ, తీసుకునే నిర్ణయాలూ లాంఛనప్రాయమైనవే. అన్నీ ముందే ఖరారవుతాయి. పార్టీ కాంగ్రెస్ చేయాల్సిందల్లా వాటికి ఆమోదముద్రేయడమే. మావో తిరుగులేని అధినేతగా, యావజ్జీవ అధ్యక్షుడిగా దీర్ఘకాలం కొనసాగడం వల్ల దేశం నష్టపోయిందని భావించిన డెంగ్ ఆ ఒరవడికి స్వస్తి పలికారు. ఎవరైనా రెండు దఫాలు మాత్రమే పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉండేలా నియమావళి మారింది. జిన్‌పింగ్ 2018లో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ సమావేశాల్లో దీన్ని తిరగదోడగలిగారు. సమష్టి నాయకత్వాన్ని ప్రవచించే కమ్యూనిస్టు పార్టీల్లో క్రమేపీ ఏకవ్యక్తి ప్రాబల్యం పెరగడం అసాధారణమేమీ కాదు. అందుకు చైనా భిన్నంగా ఉండకపోవటంలో ఆశ్చర్యం లేదు.

పార్టీ ప్రధాన కార్యదర్శిగా 2012లో పగ్గాలు చేపట్టినప్పుడు సామాజిక, ఆర్థిక రంగాల్లో 60 సంస్కరణలు తీసుకొస్తున్నట్టు జిన్‌పింగ్ ప్రకటించారు. వాటి వర్తమాన స్థితిగతులెలా ఉన్నాయో గమనిస్తే మూడోసారి ఆయన్ను నెత్తిన పెట్టుకోవాల్సినంత అగత్యం కనబడదు. ఎందుకంటే ఎగుమతి ఆధారిత ఆర్థిక వ్యవస్థను దేశీయ వినియోగ ఆధారితం చేస్తానన్నది జిన్‌పింగ్ ప్రధాన వాగ్దానం. అదికాస్తా ఎటోపోయింది. ఆర్థిక రంగంలో ఇకపై 'మార్కెట్ శక్తులకు' మరింత ప్రాధాన్యతనిస్తామనీ, వనరుల పంపిణీలోనూ వాటికే అగ్రతాంబూలమిస్తామనీ చెప్పినా జరిగింది అందుకు విరుద్ధం. వాస్తవానికి ప్రైవేటు రంగాన్ని మరింత బిగించారు. చైనా బహుళజాతి ఈ-కామర్స్ సంస్థ అలీబాబా గ్రూప్ అధినేత జాక్ మా యున్ ఇందుకు తిరుగులేని ఉదాహరణ. అలీబాబా ఒక దశలో అమెజాన్‌కు దీటుగా కనబడింది. అంతర్జాతీయ వ్యాపార యవనికపై జాక్ తళుకులీనారు. కానీ రుణాలివ్వడంలో చైనా బ్యాంకులనుసరించే ఛాందస ధోరణులను 2020లో నిశితంగా విమర్శించిన కొన్నాళ్లకే ఆయన కథ ముగిసిపోయింది. జాక్ మా ఆ సంస్థ చైర్మన్‌గా తప్పుకొని ప్రస్తుతం సామాజిక సేవలో నిమగ్నమయ్యారు.

డెంగ్ ఆర్థిక సంస్కరణల పుణ్యమా అని జిన్‌పింగ్ తొలిసారి అధినేత అయ్యేనాటికి చైనా ఆర్థికంగా మెరుగ్గానే ఉంది. కానీ అది ముందుకు కదలడం లేదు. 7.5 శాతం వృద్ధిరేటు సాధించాలన్న తపన తీరని కలగా మిగిలిపోయింది. ఆర్థిక రంగానికి పెను ఊతం ఇస్తేనే అది పట్టాలెక్కుతుందన్న అభిప్రాయం సర్వత్రా ఏర్పడింది. అందుకే అప్పట్లో సంస్కరణలపై జిన్‌పింగ్ ఊరించారు. కానీ ఆ పనిచేస్తే చివరకు ఎటు దారితీస్తుందోనన్న భయాందోళనలు నాయకత్వాన్ని వదలడం లేదని వర్తమాన చైనా తీరుతెన్నులు చూస్తే అర్థమవుతుంది. ధనిక, బీద తారతమ్యాలు సరేగానీ... ఆదాయం తగినంతగా ఉన్నవారు కూడా పొదుపు వైపే మొగ్గుతున్నారు. వేరే సంపన్న దేశాల్లో పౌరుల పొదుపు మొత్తం జీడీపీలో గరిష్ఠంగా 33 శాతం ఉండగా, చైనాలో అది 45 శాతం దాటింది. ప్రభుత్వపరంగా సామాజిక భద్రత పథకాలు లేకపోవడం... అనుకోని విపత్తు వస్తే, అవసరాలు ఏర్పడితే ఆసరా దొరకదన్న ఆందోళన అందుకు కారణం. తగినంత వినియోగం లేకపోతే సరుకంతా ఏం కావాలి? వాటిని ఉత్పత్తి చేసిన ఫ్యాక్టరీలు ఏం కావాలి? అనుత్పాదక రుణాలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఈమధ్యకాలంలో అవినీతి కూడా మితిమీరిందని తరచు వెలువడే కథనాలు వెల్లడిస్తున్నాయి. అధికారానికి వచ్చినప్పుడు అవినీతిని చీల్చిచెండాడతానని జిన్‌పింగ్ హామీ ఇచ్చారు. ఆ పేరుమీద తన వ్యతిరేకులను అదుపు చేయటం మినహా ఆయన పెద్దగా సాధించిందేమీ కనబడదు. ఇక కోవిడ్ నియంత్రణకు వ్యాక్సిన్‌ల వినియోగంకన్నా లాక్‌డౌన్‌లపైనే ఎక్కువగా ఆధారపడుతున్న దేశం చైనా. భారీ వ్యయాన్ని తప్పించుకోవడానికి లాక్‌డౌన్‌లు అమలు చేస్తున్నా ఇది ఉత్పాదకతను తీవ్రంగా దెబ్బతీసింది. ఒకపక్క బీజింగ్‌లో పార్టీ కాంగ్రెస్ మొదలు కాబోతుండగా పారిశ్రామిక నగరం షాంఘైలో కోవిడ్ కేసుల సంఖ్య పెరుగుతోంది. ఆంక్షలూ మొదలవుతున్నాయి. ఇది చివరకు లాక్‌డౌన్‌కు దారితీస్తుందేమోనన్న భయం పౌరుల్లో పెరిగింది.

తాను విధించుకున్న పరిమితుల్లోనే 140 కోట్ల జనాభాగల చైనాలో సామాజిక సంక్లిష్టతలను అధిగమించడం ఎలా అన్న సంశయం జిన్‌పింగ్‌కు ఉన్నట్టే, దూకుడు ప్రదర్శిస్తున్న చైనాను నియంత్రించడమెలా అన్న చింత పాశ్చాత్య దేశాలకు పట్టుకుంది. ఇండో-పసిఫిక్ కూటమితో దాన్ని దారికి తీసుకురావటంతోపాటు కీలకమైన చిప్ తయారీ సాఫ్ట్‌వేర్ దానికి దక్కకుండా అమెరికా ప్రయత్నిస్తోంది. ఇది మరో కొత్త పోటీకి దారితీయబోతోంది. గడిచిన సంవత్సరాల్లో చైనా వైఫల్యాలకు, అది ఆశించినంతగా ఎదగకపోవడానికి కారణాలేమిటో జిన్‌పింగ్ తన నివేదికలో వెల్లడిస్తారు. అయితే పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ ఏకవ్యక్తిస్వామ్యమే ఇందుకు కారణమని చెప్పేటంత ప్రజాస్వామిక వాతావరణం పార్టీ కాంగ్రెస్‌లో లేదు. వరస వైఫల్యాలను కూడా బేఖాతరు చేసి అదే నేతను పదేపదే అందలం ఎక్కిస్తే జరిగేదేమిటో పొరుగునున్న రష్యాను చూసైనా నేర్చుకోనట్టయితే చైనాకు భవిష్యత్తు ఉండదు.

గ్రహం అనుగ్రహం


శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ. షష్ఠి తె.5.43 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి సప్తమి, **నక్షత్రం:** మృగశిర రా.11.23 వరకు, తదుపరి ఆరుద్ర, **వర్జ్యం:** లేదు
దుర్ముహూర్తం: ఉ.5.55 నుండి 7.28 వరకు
అమృతఘడియలు: ప.1.47 నుండి 3.32 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.37
రాహుకాలం : ఉ.9.00 నుంచి 10.30 వరకు
యమగండం : ప.1.30 నుంచి 3.00 వరకు

ఏ 'వెలుగులకు' ఈ కొత్త చట్టం?

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత విద్యుత్ చట్టంలో మార్పులు చేసేందుకు కేంద్రం ముందుకొచ్చింది. 2014 నుంచీ జరుగుతున్న ప్రయత్నాలకు ఎప్పటికప్పుడు బ్రేకులు పడుతున్నప్పటికీ ఈ దఫా మాత్రం 2003 నాటి విద్యుత్ చట్టంలో మార్పులు చేయాలనే పట్టుదలను కేంద్రం కనబరుస్తోంది. ప్రధానంగా విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు తీవ్ర ఆర్థిక నష్టాల్లో ఉన్నాయనీ, దాని నుంచి బయటపడవేసేందుకే ఈ కొత్త చట్టమనే అభిప్రాయాన్ని కేంద్ర విద్యుత్‌శాఖ పెద్దలు చెబుతున్నారు. ఇది అంతిమంగా డిస్కంలను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేసేందుకేనని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు, విద్యుత్ ఉద్యోగ సంఘాలు భావిస్తున్నాయి. రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యుత్ అంశంపై కేంద్రం ప్రతిపాదిస్తున్న విద్యుత్ బిల్లు-2022పై మరింత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

విద్యుత్ చట్టం-2003లో మార్పులు చేస్తూ కొత్త చట్టాన్ని తెచ్చేందుకు 2014 నుంచీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిపై గతంలోనే కేంద్రం ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను కోరింది. రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో వెనక్కి తగ్గారు. 2019లో కూడా మరోసారి ప్రయత్నం జరిగింది. మెజార్టీ రాష్ట్రాలు, విద్యుత్ ఉద్యోగులు, రైతు సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తం కావడంతో మరోసారి కేంద్రం వెనక్కి తగ్గింది. ఇప్పుడు మాత్రం వ్యతిరేకతను లెక్క చేయకుండా చట్టం చేసేందుకు కేంద్రం ప్రయత్నించింది. మరోసారి అదే వ్యతిరేకత వచ్చిన ఫలితంగా పార్లమెంటులో ప్రవేశపెట్టిన ముసాయిదా విద్యుత్ (సవరణ) బిల్లు -2022 కాస్తా పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చెంతకు చేరింది. అయినప్పటికీ గెజిట్ల జారీ ద్వారా తాను చేయాలనుకున్న మార్పులను చేస్తూ కేంద్రం ముందుకే అడుగులు వేస్తోంది.



దేశంలోని డిస్కంల ఆర్థిక పరిస్థితి, విద్యుత్ ఉత్పత్తి సంస్థ (జెన్‌కో)లకు చెల్లించాల్సిన బకాయిల వ్యవహారం కేంద్రానికి కొత్త మార్పులకు ఊతమిస్తోందని చెప్పకతప్పదు. 1998-99 నుంచి విద్యుత్ రంగంలో తెచ్చిన కాలానుగుణ సంస్కరణలు డిస్కంలు, జెన్‌కోలను కాపాడలేకపోయావనేది కేంద్ర ప్రభుత్వ ఉద్దేశ్యం. దేశవ్యాప్తంగా 57 డిస్కంలు ఏకంగా 1.40 లక్షల కోట్ల మేర అప్పుల్లో ఉన్నాయి. ఇందులో ఆయా ప్రభుత్వాలు ఇవ్వాల్సిన సబ్సిడీ మొత్తం రూ.76 వేల కోట్లు ఉండగా... మిగిలిన 64 వేల కోట్ల మేర ఆయా ప్రభుత్వశాఖలు చెల్లించాల్సిన విద్యుత్ బిల్లుల బకాయిలు. అయితే, విద్యుత్‌ను తీసుకున్నందుకుగానూ విద్యుత్ ఉత్పత్తి సంస్థ(జెన్‌కో)లకు డిస్కంలు రూ.1.10 లక్ష కోట్ల మేర చెల్లించాల్సి ఉంది. అటు డిస్కంలు, ఇటు జెన్‌కోలను కాపాడే ఉద్దేశ్యంతోనే ఈ కొత్త చట్టం తెస్తున్నామనేది కేంద్ర పెద్దల ఉవాచ. విద్యుత్ పంపిణీ రంగంలో కేవలం ఒకరే కాకుండా ఎక్కువ మంది ఉండాలనీ, తద్వారా డిస్కంలలో పోటీతత్వంతో పాటు వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందుతాయనీ కేంద్రం చెబుతోంది. అందుకే డిస్కంలల్లో ప్రైవేటీకరణకు తాజా చట్టం తెరలేపింది.

ఇప్పటికే ఢిల్లీ, ముంబైల్లో ప్రైవేటు డిస్కంలు సేవలందిస్తున్నాయి. ఇక ఒడిశాలో ఏకంగా 4 ప్రైవేటు డిస్కంలు విద్యుత్ పంపిణీ రంగంలో పనిచేస్తున్నాయి. అయితే, మరింత విస్తృతంగా కొత్త నెట్‌వర్క్ అవసరం లేకుండానే ప్రస్తుతం ఉన్న నెట్‌వర్క్‌లోనే ప్రైవేటు డిస్కంలకు తలుపులు తెరిచేందుకే కొత్త చట్టం వస్తోందని తెలుస్తోంది. దీనితో పాటు కొత్త చట్టంలో మరికొన్ని సమస్యలు కూడా ఉన్నాయని విద్యుత్‌రంగ నిపుణులు చెబుతున్నారు. అవి:

1. విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్‌సీ) చైర్మన్, సభ్యుల నియామకానికి త్రిసభ్య కమిటీ స్థానంలో నలుగురు సభ్యుల కమిటీని ముసాయిదా బిల్లు ప్రతిపాదించింది. కొత్తగా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి ఇందులో భాగస్వామ్యం కానున్నారు. తద్వారా రాష్ట్రాల హక్కుల్లో కేంద్రం తలదూర్చనుందన్న విమర్శలు వస్తున్నాయి. 2.ఒక రాష్ట్రం కాకుండా 2,3 రాష్ట్రాల డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్‌ను రాష్ట్రాల ఈఆర్‌సీలు కాకుండా కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి (సీఈఆర్‌సీ) ఇవ్వనుంది. తద్వారా రాష్ట్రాల ఈఆర్‌సీల పాత్ర నామమాత్రంగా మారనుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 3.విద్యుత్ కొనుగోళ్లకు అయ్యే వ్యయం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత సమయంలోగా చెల్లించకపోతే నేరుగా విద్యుత్ సరఫరాను నిలిపివేసే అధికారం జాతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎన్ఎల్‌డీసీ)ల చేతుల్లోకి వెళ్లనుంది. తద్వారా రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ల (ఎస్ఎల్‌డీసీ) అధికారం కుంచించుకుపోనుందన్న ఆందోళన నెలకొంది. 4. ప్రస్తుతం ఉన్న చట్టంలో యూనివర్సల్ సప్లై ఆబ్లిగేషన్ అనే నిబంధన ఉంది. ఒక రైతు కోసం కూడా కొత్తగా లైన్ల అవసరం ఏర్పడితే డిస్కంలు వేయాల్సిందే. తాజా చట్టంలో ఈ ఆబ్లిగేషన్‌ను తొలగించారు. తద్వారా సామాన్య వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్న అభిప్రాయం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ చట్టంపై మరింత లోతైన చర్చ జరగాల్సిందేనన్న వైఎస్సార్‌సీపీ అభిప్రాయానికి సానుకూల స్పందన వస్తోంది.

అనుమానాలు నిజమేనా?

ప్రస్తుతం అమలులో ఉన్న విద్యుత్ చట్టం-2003లో రూపొందించారు. కాలక్రమంలో ఈ చట్టంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ పూర్తిస్థాయిలో సవరణలు చేసి కొత్త బిల్లును తెరమీదకు తెచ్చింది ఇప్పుడే. అంటే దాదాపు రెండు దశాబ్దాల తర్వాత విద్యుత్‌రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త బిల్లు ముందుకు వచ్చిందనే భావన వ్యక్తమవుతోంది. అయినప్పటికీ బిల్లులోని కొన్ని అంశాలు కేంద్ర వైఖరిపై అనుమానం వ్యక్తం చేసే విధంగానే ఉన్నాయి. విద్యుత్ చట్టం 2003 ప్రకారం సెక్షన్ 14, 42లల్లో ఏమని పేర్కొన్నారంటే... "విద్యుత్ సరఫరా, పంపిణీ, ట్రేడింగ్ కోసం ఏ సంస్థకైనా, ఏ వ్యక్తికైనా సంబంధిత కమిషన్ లైసెన్స్‌ను జారీచేస్తుంది. డిస్ట్రిబ్యూషన్ లైసెన్స్ పొందిన సంస్థ లేదా వ్యక్తులు తమ పరిధిలోని వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్ (విద్యుత్ లైన్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) వగైరా)ను సొంతంగా అభివృద్ధి చేసుకోవాల్సి ఉంటుంది." అయితే, కొత్త బిల్లులో ఈ రెండు క్లాజ్‌లలో మార్పులు చేస్తున్నారు. ఎటువంటి లైసెన్సు ప్రత్యేకంగా తీసుకోవాల్సిన అవసరం లేకపోవడంతో పాటు, ఇప్పటికే ప్రభుత్వరంగ డిస్కంల పరిధిలో ఉన్న విద్యుత్ పంపిణీ నెట్‌వర్క్‌ను ఉపయోగించే వెసులుబాటును కల్పించారు. ఈ రెండు క్లాజులలో చేయనున్న మార్పులను గమనిస్తే ప్రైవేటు సంస్థలకు విద్యుత్ పంపిణీ రంగంలోకి బార్లా తలుపులు తెరుస్తున్నారన్న విమర్శ వినిపిస్తోంది. ప్రస్తుతం మునిసిపాలిటీ/ జిల్లా పరిధిలో మాత్రమే ప్రైవేటు డిస్ట్రిబ్యూషన్ లైసెన్సులకు అవకాశం ఉండేది. తాజాగా సెప్టెంబరు 8వ తేదీ కేంద్రం విడుదల చేసిన గెజిట్‌లో మాత్రం మునిసిపాలిటీ/ మూడు జిల్లాలతోపాటు ఏదైనా పేర్కొన్న చిన్న ప్రాంతంలో కూడా విద్యుత్ పంపిణీ లైసెన్సును పొందే అవకాశం ఉందని పేర్కొంది. ((తద్వారా కేంద్రం తాజా అడుగులు మరింత ఆందోళనను పెంచే విధంగానే ఉన్నాయని చెప్పకతప్పదు.))

విస్తృత చర్చ జరగాల్సిందే!

ఏడవ షెడ్యూల్‌లో పేర్కొన్న విధంగా 52 అంశాలు ఉమ్మడి జాబితాలో ఉన్నాయి. ఈ జాబితాలోని అంశాలపై అటు కేంద్రంతో పాటు ఇటు రాష్ట్రాలకూ అధికారం ఉంటుందని భారత రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. ఈ జాబితాలో విద్య, ధరల నియంత్రణ, ఫ్యాక్టరీలు, బాయిలర్స్ వంటి అంశాలతో పాటు విద్యుత్ కూడా ఒక అంశం. ఈ ఉమ్మడి జాబితాలోని అంశాలపై ఏవైనా మార్పు చేర్పులతో పాటు కొత్త చట్టాలు చేసే సమయంలో రాష్ట్రాల అభిప్రాయం కూడా కేంద్రం తీసుకోవడం పరిపాటి. ముసాయిదా విద్యుత్ (సవరణ) నిబంధనలు-2022 విషయంలో కేంద్రం వ్యవహరించిన తీరుపై అనేక పార్టీలు గుర్రుమంటున్నాయి. ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యుత్ అంశంపై కొత్త చట్టం తెస్తున్న నేపథ్యంలో దీనిపై విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని వైఎస్సార్‌సీపీ తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. ప్రతిపాదించిన బిల్లులో ఉన్న లోపాలు, చేయాల్సిన మార్పులపై కూడా తన అభిప్రాయాన్ని పార్లమెంటు సాక్షిగా వెల్లడించింది. భిన్న అభిప్రాయాలు, అనుమానాల నేపథ్యంలోనే పార్లమెంటులో ఆగస్టు 8న కేంద్రం ఈ ముసాయిదాను ప్రవేశపెట్టింది. ప్రతిపక్ష పార్టీల నుంచి వచ్చిన ఒత్తిళ్లతో చివరకు విద్యుత్‌పై పార్లమెంటు స్టాండింగ్ కమిటీ ముందు ఉంచనున్నట్టు కేంద్ర విద్యుత్‌శాఖ మంత్రి ఆర్‌కే సింగ్ వెల్లడించారు. దీంతో వివాదం కాస్తా తాత్కాలికంగా సద్దుమణిగింది. విశాల ప్రజానీకంలో నెలకొన్న సందేహాల నివృత్తి తర్వాతే కేంద్రం ముందుకు వెళితే ఆమోదయోగ్యంగా ఉంటుంది.

– కె.జి. రాఘవేంద్రారెడ్డి
సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పరాటా పన్ను



ఉత్తర భారతీయుల అల్పాహారాన్ని దక్షిణ భారతదేశపు నిర్మలా సీతారామన్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారు! 'దహీ' మీద జీఎస్టీ వేశాక, ఇప్పుడు పరాటాల మీద 18 శాతం జీఎస్టీ వేశారు.
– నిమో తాయి, సెటైరిస్ట్

తిరోగమనం



ఎవరు వెనక్కు వెళుతున్నట్లు? చదువు కోసం తమ కుమార్తెను హిజాబ్‌తో స్కూలుకు పంపుతున్నవారా, అసలు స్కూలుకే పంపనివారా? యూనిఫామ్ తప్పనిసరి చేస్తున్నవారా, పోరాటాల కంటే ముందు చదువుకు ప్రాధాన్యం ఇస్తున్నవారా?
– సయీమా, రేడియో జాకీ

కౌంటింగ్‌కి నెల రోజులా!



హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. పోలింగ్ ఒకే విడతలో నవంబర్ 12న జరుగుతుంది. ఫలితాల వెల్లడి మాత్రం డిసెంబర్ 8న. నాకొక సందేహం. ఈవీఎంల యుగంలో ఒకే రోజులో పోలైన ఓట్లను లెక్కించేందుకు దాదాపు నెల రోజులు పడుతుందా?
– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

సత్యమే గెలిచింది



మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న కేసులో ప్రొఫెసర్ జి.ఎన్. సాయిబాబాను బాంబే హైకోర్టు నిర్దోషిగా ప్రకటించి, ఆయన విడుదలకు ఆదేశించింది. హింస, బెదరింపులు, అబద్ధాలపై చివరికి సత్యమే విజయం సాధించింది. మానవ హక్కుల కోసం, క్రూరమైన చట్టాల రద్దు కోసం, రాజకీయ ఖైదీల విడుదల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.
– డి. రాజా, సీపీఐ ప్రధాన కార్యదర్శి

అశాస్త్రీయ పరీక్ష



వారణాసిలోని జ్ఞానవాపి ప్రాంగణంలో దొరికిన శివలింగంపై 'కార్బన్ డేట్' పరీక్ష జరపాలని హిందూ ఆరాధకులు చేసిన విజ్ఞప్తిని కోర్టు నిరాకరించడాన్ని తప్పు పట్టలేం. ఈరోజైనా సరే, మీరు మీ ఇంటి పాలరాయిని కార్బన్ డేట్‌కు పంపిస్తే అది లక్షల ఏళ్ల నాటి శిలగా తేలినా ఆశ్చర్యం లేదు. అశాస్త్రీయమైన విన్నపానికి తగిన తీర్పే.
– ఆసిఫ్ ముజ్‌తబా, రీసెర్చ్ స్కాలర్

మగ గైనిక్ డాక్టర్



చూస్తుంటే ఈ సినిమా (డాక్టర్ జి) బాక్సాఫీస్‌ను బద్దలు కొట్టేలా ఉంది. ఎ ట్రిమెండస్ స్మాష్! మంచి స్క్రిప్టు, డైలాగులు, దర్శకత్వం తగినపాళ్లలో కుదిరాయి. గైనకాలజిస్టు డాక్టర్ ఉదయ్ గుప్తా (గుడ్డూ) గా ఆయుష్మాన్ ఖురాన్ అత్యద్భుత నటన సినిమా హాళ్లను ప్రేక్షకుల వరదతో ముంచెత్తకపోతే అడగండి.
– అర్మాన్, సినీ ప్రేమికుడు

ఎంపిక మనదే



జీవితం మనకు నవాజ్‌ను ప్రసాదించినప్పుడు మనం అతన్ని ముహమ్మద్ నవాజ్‌గా మార్చుకోవాలి తప్ప, నవాజ్ షరీఫ్‌గా మార్చుకోకూడదు. టీ20 ట్రై సీరీస్ ఫైనల్స్‌లో పాకిస్తాన్ 5 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌ను ఓడించింది. ఆ ఘన విజయానికి కారణం పాక్ స్టార్ బ్యాట్స్‌మన్ ముహమ్మద్ నవాజ్.
– కాసీం ఖాన్, ఇమ్రాన్ ఖాన్ కుమారుడు

కూచిపూడి విదుషీ ధీమణి

శాస్త్రీయ నృత్య రూపకాల్లో విశేషమైన ఆదరణ కలిగిన వాటిలో కూచిపూడి ఒకటి. ఇది తెలుగు నేల నుంచి ప్రస్థానం ప్రారంభించి యావత్ ప్రపంచాన్ని చుట్టేసింది. ఆంధ్ర రాష్ట్ర అధికారిక నృత్యం కూచిపూడి. అందులో అత్యద్భుతమైన నాట్యాచార్యులు 'పద్మభూషణ్' వెంపటి చిన సత్యం. 1929 అక్టోబర్ 15న కృష్ణా జిల్లా కూచిపూడిలో వెంపటి జన్మించారు. తమిళనాడులో భరతనాట్యం విరాజిల్లుతున్న తరుణంలో కూచిపూడి నృత్య సంప్రదాయాన్ని అక్కడి కళాభిమానులకు పరిచయం చేసి, దీటైన స్థానాన్ని సంపాదించి పెట్టారు.

కూచిపూడి నాట్యంలో సరికొత్త ప్రయోగాలు చేయడానికి తన జీవితమంతా అంకితం చేసిన విదుషీ ధీమణి వెంపటి. రకరకాల జతులనీ, నాట్య ప్రక్రియలనీ విస్పష్టంగా వర్గీకరించి, సనాతన నాట్యశాస్త్ర సమగ్ర విధివిధానాలతో మేళవించి, ఎన్నెన్నో జతి స్వరాలూ, తిల్లానాలూ, వర్ణాలూ సృజించిన నాట్య పరమేష్ఠి ఆయన. కూచిపూడి నృత్య నాటికలను ఎన్నింటినో రూపొందించి వాటికి పేరు ప్రఖ్యాతులు వచ్చేలా చేశారు. శ్రీకృష్ణ పారిజాతం, చండాలిక, మేనకా విశ్వామిత్ర, రుక్మిణీ కల్యాణం, కిరాతార్జునీయం, క్షీరసాగర మథనం, పద్మావతీ శ్రీనివాసం, హరవిలాసం లాంటివి పేరెన్నిక గన్నవి.



వెంపటి చిన సత్యం

1947లో మద్రాసుకు చేరుకున్న చిన సత్యం తన సోదరుడు వెంపటి పెద సత్యం వద్ద సినిమాలకు నృత్య నిర్దేశకత్వంలో సహాయకుడిగా పనిచేశారు. 1984లో అమెరికా పిట్స్‌బర్గ్‌లోని వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆస్థాన నాట్యాచార్యునిగా పనిచేశారు. 2011లో హైదరాబాదులో 2,800 మంది కళాకారులతో ఏకకాలంలో నిర్వహించిన కూచిపూడి నృత్యానికి గిన్నిస్ రికార్డు వచ్చింది. 1963లో చెన్నైలో కూచిపూడి ఆర్ట్ అకాడెమీని స్థాపించారు. దీని ద్వారా వైజయంతిమాల, ప్రభ, పద్మామీనన్, వాణిశ్రీ, శోభానాయుడు లాంటివారికి కూచిపూడి నేర్పించారు. హేమమాలిని, మంజుభార్గవి, చంద్రకళ, రత్నపాప వంటి వారంతా ఆయన శిష్యులే.

2012 జూలై 29న మరణించిన వెంపటి జన్మదినమైన అక్టోబర్ 15న ప్రపంచ కూచిపూడి దినోత్సవంగా వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తోంది. ఆయన పేరిట 5 లక్షల రూపాయల స్మారక పురస్కారాన్ని 'యక్షగాన సార్వభౌమ' చింత సీతారామాంజనేయులుకు ప్రకటించింది. పర్యాటక, సాంస్కృతిక శాఖామాత్యులు ఆర్కే రోజా దీన్ని ప్రదానం చేస్తారు.

– రేగుళ్ళ మల్లికార్జునరావు, సంచాలకులు, భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ
(నేడు వెంపటి చిన సత్యం జయంతి)

రాజధాని అను ఒక 'రియల్' ఎజెండా

అభిప్రాయం



పొనకా జనార్దన రెడ్డి

పునర్వ్యవస్థీకరణ అనంతరం, కొత్తగా ఏర్పడబోయే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానికి వివిధ ప్రత్యామ్నాయాలను అధ్యయనం చేయడానికి భారత ప్రభుత్వం శివరామకృష్ణన్ చైర్మన్‌గా ఒక కమిటీని నియమించింది. శివరామకృష్ణన్ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు మాజీ కార్యదర్శి. కమిటీ సభ్యులలో అందరూ సంబంధిత రంగంలో నిపుణులే. కమిటీ నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలివి : విజీటీఎం (విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి) పరిధిలో ఇప్పటికే భూముల ధరలు పెరిగిపోయాయి కనుక నీటి వనరులు, రవాణా, రక్షణ, చారిత్రక అంశాల ఆధారంగా రాజధాని నిర్మాణ ప్రదేశం ఎంపిక చేయాలి. విశాఖపట్నంలో ప్రభుత్వ డైరెక్టరేట్లు ఏర్పాటు చేయవచ్చు. నూజివీడు, ముసునూరు, గన్నవరం ప్రాంతాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవచ్చు. ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్నచోటే హైకోర్టు ఉండవలసిన అవసరం లేదు. విశాఖపట్నంలో హైకోర్టు, రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయవచ్చు. విశాఖపట్నం, శ్రీకాకుళం ప్రాంతాలను ప్రత్యేక కారిడార్లుగా గుర్తించాలి. విశాఖపట్నంలో పరిశ్రమలకు, అనంతపురంలో విద్యకు ప్రాధాన్యత ఇవ్వవచ్చు. అభివృద్ధి వికేంద్రీకరణ అవసరం. అసెంబ్లీ, రాజధాని నిర్మాణానికి అయిదు సంవత్సరాల కాలం పట్టవచ్చు.

ఇంత స్పష్టంగా శివరామకృష్ణన్ కమిటీ తన నివేదికను అందించినప్పటికీ నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ నివేదికను బుట్టదాఖలు చేసి, తన 'రాజకీయ గురువు' సూచించిన 'అమరావతి' పేరుతో రాజధాని నిర్మాణానికి పూనుకున్నారు. అందులో భాగంగా 2014 జూలై 14న 'నారాయణ కమిటీ'ని నియమించారు. ఆ కమిటీలో సభ్యులను చంద్రబాబు ప్రభుత్వమే నియమించింది. సుజనా చౌదరి, గల్లా జయదేవ్ చౌదరి, మండవ ప్రభాకర్ చౌదరి, మరో ఐదుగురు సభ్యులతో ఆ కమిటీ ఏర్పడింది. అనంతరం రాజధాని ఏర్పాటుపై లీకులు మొదలయ్యాయి. నారాయణ కమిటీ రిపోర్టు పేరుతో దొనకొండ, నూజివీడు, విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ప్రాంతం ఉండవచ్చని ప్రచారాలు మొదలుపెట్టారు. అది నమ్మి కొందరు దొనకొండ, నూజివీడుల్లో వేల ఎకరాల భూములు కొని మోసపోయారు. కానీ అనూహ్యంగా చంద్రబాబు, ఆయన సామాజిక వర్గ నేతలు మాత్రం సీఆర్డీఏ (క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రాంతంలో భూములు కొన్నారు. మొదట నాగార్జున యూనివర్సిటీ దగ్గర, విజయవాడ-గుంటూరు పరిసర ప్రాంతాల్లో రాజధాని రావచ్చని చంద్రబాబు తనకు చెప్పారని నక్కా ఆనంద్‌బాబు ఏబీఎన్ ఇంటర్వ్యూలో బహిర్గతం చేశారు. తర్వాత స్వయంగా చంద్రబాబే నర్మగర్భంగా గుంటూరు-విజయవాడ మధ్య రాజధాని వస్తుందని 2014 సెప్టెంబర్ 4న శాసనసభలో ప్రకటించారు.



2014 డిసెంబర్ 30న ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీసీఆర్డీఏ) చట్టం అధికారికంగా అమల్లోకి వచ్చింది. కానీ 2014 సెప్టెంబర్‌లోనే కొంతమంది చంద్రబాబు అనుయాయులు 29 గ్రామాల పరిసరాల్లోని భూములు కొని అగ్రిమెంట్లు, రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు! ఇదంతా కూడా ల్యాండ్ పూలింగ్ ప్రాసెస్‌కు ముందే జరిగిపోయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అమరావతి నిర్మాణం పేరుతో 34,000 ఎకరాల భూ సేకరణకు పూనుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధాని శాసన సభ, శాసన మండలి, హైకోర్టు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను 200 ఎకరాల్లోనే ఉంచడం గమనించాల్సిన విషయం.

ఏపీసీఆర్డీఏ యాక్ట్ ఫామ్ 9.14 బీ ప్రకారం ల్యాండ్ పూలింగ్‌లో ఒక్కో ఎకరానికి 250 సెంట్లు అభివృద్ధి చేసిన ప్లాటు ఇచ్చే విధంగా రైతులతో సీఆర్డీఏ ఒప్పందం కుదుర్చుకుంది. రాజధాని ప్రకటనకు ముందు సీఆర్డీఏ ప్రాంతంలో ఎకరం రూ.15 లక్షలు ఉండేది. అయితే 'హ్యాపీనెస్ట్' పేరుతో జరిగిన విక్రయాల్లో ఎకరానికి రూ.10 కోట్ల రేటుకు సీఆర్డీఏ అమ్మింది. అంటే ల్యాండ్ పూలింగ్‌లో భూమి ఇచ్చిన ప్రతి రైతు ఎకరానికి రూ.2.5 కోట్లు లబ్ధి పొందినట్లేగా! ఇందులో త్యాగం ఎక్కడుంది?

2015 అక్టోబర్ 22న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్దండరాయని పాలెంలో రాజధానికి శంకుస్థాపన చేశారు. ఆ శంకుస్థాపనకు హాజరు కాలేకపోవటానికి కారణాలు చూపుతూ అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్టోబర్ 15నే చంద్రబాబుకు 3 పేజీల బహిరంగ లేఖ రాశారు. రైతుల నుంచి అసైన్డ్ భూములు లాక్కున్న విధానం, కమీషన్ల కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయటం, సింగపూర్ కంపెనీకి 58 శాతం వాటా ఇస్తూ సీఆర్డీఏ 42 శాతం తీసుకోవటంలో ఉన్న స్కామ్‌ను తెలియజేస్తూ... చంద్రబాబు తన వర్గాన్ని బినామీలుగా పెట్టుకుంటూ భూదోపిడీకి పాల్పడుతున్నందున శంకుస్థాపనకు తనను ఆహ్వానించవద్దని నిర్మొహమాటంగా తెలియజేశారు. గుంటూరు-విజయవాడ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.1,500 కోట్లు ఇచ్చింది. నవ నగరాల నిర్మాణానికి రూ.1,09,000 కోట్లు ఖర్చు అవుతుందని చంద్రబాబు అసెంబ్లీలో ప్రకటించారు. అయితే అమరావతిలో చంద్రబాబు 5 ఏళ్లలో కేవలం రూ.5,674 కోట్లు మాత్రమే ఖర్చు పెట్టారు (ఇందులో సుమారు రూ.2,500 కోట్లు బకాయిలు పెట్టి చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయింది). అంటే ప్రతి సంవత్సరం పెరిగే ధరలను దృష్టిలో పెట్టుకుంటే రాజధాని నిర్మాణానికి మరో 100 ఏళ్లు పడుతుంది. అయితే రాజధానిని ఆర్నెల్లలో పూర్తి చేయాలని 2022 మార్చి 3న ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం తీర్పు చెప్పింది. అమరావతి రాజధాని ప్రాంతంలోని భూ యజమానులకు చెందిన పునర్నిర్మిత ప్లాట్‌లను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేయాలనీ; అమరావతి రాజధాని నగరంలో నివాసానికి అనువుగా ఉండేలా అప్రోచ్ రోడ్లు, తాగునీరు, ప్రతి ప్లాట్‌కు విద్యుత్ కనెక్షన్, డ్రైనేజీ మొదలైనవి ఏర్పాటు చేయాలనీ ఆదేశించింది!

వ్యాసకర్త మహా ప్రశాసకులు, ఏపీ ప్రభుత్వం
మొబైల్: 83094 09689

పిల్లలు మెచ్చే పాఠ్యాంశాలు..

సమగ్ర శిక్షా పథకాన్ని రీడిజైన్ చేసిన కేంద్ర ప్రభుత్వం

- జాతీయ విద్యా విధానం – 2020 సిఫార్సులకు అనుగుణంగా మార్పులు
- ప్రోగ్రామాటిక్, ఫైనాన్షియల్ మార్గదర్శకాలతో కొత్త ఫ్రేమ్‌వర్క్
- ప్రీ ప్రైమరీ నుండి సీనియర్ సెకండరీ స్థాయి వరకు నాణ్యమైన విద్య
- పిల్లలందరికీ ఆహ్లాదకర వాతావరణంలో బోధన
- అభ్యసన ప్రక్రియలో చురుగ్గా పాల్గొనేలా చేయడమే లక్ష్యం
- పథకంలో 11.6 లక్షల స్కూళ్లు, 15.6 కోట్ల మంది విద్యార్థులు



సాక్షి, అమరావతి: జాతీయ నూతన విద్యా విధానం – 2020 సిఫార్సుల ప్రకారం సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రీడిజైన్ చేసింది. పిల్లలు మెచ్చేలా, వారు అభ్యసన ప్రక్రియలో చురుగ్గా పాల్గొనేలా ప్రీ ప్రైమరీ నుండి సీనియర్ సెకండరీ స్థాయి వరకు నూతన విధానాన్ని (ఫ్రేమ్‌వర్క్) రూపొందించింది. ఆహ్లాదకరమైన తరగతి గదిలో, ఉన్నత ప్రమాణాలు సాధించేలా నాణ్యమైన విద్యను అందించేలా కార్యక్రమాలు రూపొందించింది. విద్యార్థుల విభిన్న సామాజిక పరిస్థితులు, సామర్థ్యాలు, బహు భాషా అవసరాలను పరిగణనలోకి తీసుకొంది. ఈ పథకంలో 11.6 లక్షల పాఠశాలలు, 15.6 కోట్ల మంది విద్యార్థులు, 57 లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ కార్యక్రమాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలకు సహకారం అందిస్తుంది. ఈ విధానంలో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు, వివిధ శిక్షణ సంస్థలకు సహకారం అందుతుంది. విద్యా కార్యక్రమాల అమలుకు జిల్లాకు రూ.10 నుంచి 20 లక్షల వరకు ఖర్చు చేస్తారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, డ్రాపవుట్స్ నివారణ, పునాది అక్షరాస్యత సంఖ్యాశాస్త్రం (ఎఫ్ఎల్ఎన్) అభివృద్ధి, లింగ సమానత్వం, నాణ్యత, వినూత్న ఆవిష్కరణలు, ఉపాధ్యాయుల వేతనాలకు ఆర్థిక సహకారం, డిజిటల్ కార్యక్రమాలు, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు మొదలైన వాటికి సహకారం అందిస్తారు. ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్ (ఈసీసీఈ)కి వీలుగా కొత్త కార్యక్రమాలకు అవకాశం కల్పిస్తారు. వృత్తి విద్య, క్రీడలు, వ్యాయామ విద్య, ఉపాధ్యాయ శిక్షణను బలోపేతం చేస్తారు. హోలిస్టిక్, 360 డిగ్రీ, మల్టీ డైమెన్షనల్ మోడ్‌లో విద్యార్థులను తీర్చి దిద్దాలన్నది ఈ విధానం ఉద్దేశం. ఇందుకోసం జాతీయ మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. బ్యాగ్ లెస్ డేస్, స్కూల్ కాంప్లెక్స్‌లు, స్థానిక కళాకారులతో ఇంటర్న్‌షిప్‌లు, బోధన సంస్కరణలు ఇందులో కీలకమైనవి. ఖేలో ఇండియాలో భాగంగా జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో పతకాలు గెలిచిన పాఠశాలకు రూ. 25 వేలు ఇస్తారు. అచీవ్‌మెంట్ సర్వేల కోసం టెస్ట్ మెటీరియల్, ఐటెమ్ బ్యాంక్‌ల అభివృద్ధికి, శిక్షణ, పరీక్ష నిర్వహణ, డేటా సేకరణ, విశ్లేషణ, నివేదికలు రూపొందించడానికి ఎస్సీఈఆర్టీలలో అసెస్‌మెంట్ సెల్‌లు ఏర్పాటు చేస్తారు. ఈ కార్యక్రమాల ప్రగతిని మదింపు చేసేందుకు పలు పనితీరు సూచికలనూ ఏర్పాటు చేశారు. స్మార్ట్ క్లాస్ రూమ్‌లో భాగంగా ఐసీటీ ల్యాబ్‌లు, డిజిటల్ బోర్డులు, వర్చువల్ క్లాస్ రూమ్‌లు, డీటీహెచ్ ఛానల్‌ల ఏర్పాటుకు సహకారం అందిస్తారు.

12వ తరగతి వరకు కేజీబీవీల అప్‌గ్రేడ్

అన్ని కేజీబీవీలను 12వ తరగతికి అప్‌గ్రేడ్ చేస్తారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు కేజీబీవీ విద్యార్థినుల కోసం ప్రత్యేక హాస్టళ్లు ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం ప్రస్తుతం ఇస్తున్న రూ.25 లక్షల సాయాన్ని 40 లక్షలకు పెంచుతున్నారు. బాలికల హాస్టళ్లలో ఇన్సినరేటర్, శానిటరీ ప్యాడ్ వెండింగ్ మెషీన్లను ఏర్పాటు చేస్తారు. ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించడం కోసం 'రాణి లక్ష్మీబాయి ఆత్మ రక్షా శిక్షణ' పేరిట శిక్షణ ఇస్తారు. దీనికోసం రూ. 5 వేల చొప్పున కేటాయిస్తారు.

అమలు ఇలా..

- ప్రీ ప్రైమరీలో అంగన్‌వాడీ కార్యకర్తల శిక్షణ కోసం మాస్టర్ ట్రైనర్‌లకు శిక్షణ ఇస్తారు. ఈసీసీఈ టీచర్లకు ఇన్ సర్వీస్ శిక్షణ ఇస్తారు.
- ప్రభుత్వ పాఠశాలల ప్రీ ప్రైమరీ విభాగాలకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్, స్వదేశీ బొమ్మలను అందిస్తారు.
- మాన్యువల్ కోసం టీచర్‌కు రూ.150 చొప్పున ఇస్తారు.
- ఆటల కోసం ఒక్కో చిన్నారికి సంవత్సరానికి రూ.500, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ కోసం రూ. 500 వరకు ఇస్తారు.
- సీనియర్ సెకండరీ విద్యార్థుల రవాణా సదుపాయానికి ఏడాదికి రూ.6 వేల చొప్పున ఇస్తారు.
- 16 నుండి 19 సంవత్సరాల లోపు బడి బయట ఉన్న పిల్లలకు ఓపెన్ స్కూల్ విధానం ద్వారా సెకండరీ, సీనియర్ సెకండరీ స్థాయిలను పూర్తి చేయడానికి సహకారం అందిస్తారు.
- ఎస్సీ, ఎస్టీ, వికలాంగ పిల్లలకు ఒక్కో గ్రేడ్‌కి ఒక్కో విద్యార్థికి రూ. 2వేల వరకు ప్రత్యేకంగా అందిస్తారు.
- బాలల హక్కులు, భద్రతకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌కు ఆర్థిక సహాయం అందిస్తారు.

విద్యార్థుల భవిష్యత్‌కు దిక్సూచిగా యూడైఎస్ ప్లస్

- పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్
- విజయవాడ వేదికగా యూడైస్ ప్లస్ 47వ ప్రాంతీయ వర్కుషాప్

సాక్షి, అమరావతి: యూడైఎస్–ప్లస్ (విద్యారంగానికి సంబంధించి ఏకీకృత జిల్లా సమాచార వ్యవస్థ)లో కేవలం సమాచారం నిమిత్తం గణాంకాలను నమోదు చేయడానికే పరిమితం కావొద్దని పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ కోరారు. అన్నివర్గాల విద్యార్థుల అభివృద్ధితో పాటు వారి భవిష్యత్ నిర్ణయించే విధంగా చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడేలా ఉండాలని స్పష్టం చేశారు. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన 47వ యూడైస్ ప్లస్ ప్రాంతీయ వర్క్‌షాప్ ప్రారంభ సభలో మాట్లాడుతూ.. యూడైస్ ప్లస్ అనేది మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) నుంచి డెసిషన్ సపోర్ట్ సిస్టంకు మారాలన్నారు. మూడేళ్లగా కోవిడ్ కారణంగా ఆగిన ఈ ప్రాంతీయ స్థాయి కార్యశాలకు ఈసారి ఆంధ్రప్రదేశ్ వేదికైందని తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ మాట్లాడుతూ మన రాష్ట్రంలో విద్యార్థి ఆధారితంగా యూడైస్ ప్లస్ నమోదు జరుగుతుందన్నారు.

ఏపీ పనితీరు భేష్

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ గణాంక ప్రచురణల విభాగం (డీవోఎస్ఈ–ఎల్) డిప్యూటీ డైరెక్టర్ జనరల్ వెంకటరమణ హెగ్డే మాట్లాడుతూ యూడైస్ డీసీఎఫ్ (డాటా క్యాప్చర్ ఫార్మాట్)లో వివిధ అంశాలను తప్పులు లేకుండా పూర్తి చేసే విధానాన్ని, తప్పులు దొర్లటం వల్ల వివిధ జాతీయ స్థాయి డాష్ బోర్డుల్లో రాష్ట్రాల ప్రగతిపై చూపే ప్రభావాన్ని వివరించారు. యూడైస్ డేటా ఎంట్రీ విషయంలో ఆంధ్రప్రదేశ్ చాలా ముందుచూపుతో, ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని కొనియాడారు. 2021–22కు సంబంధించిన యూడైస్ డేటాను సమర్పించిన తొలి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అభినందించారు. కార్యక్రమంలో ఏపీతో పాటు తెలంగాణ, తమిళనాడు, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి, కేరళ నుంచి రాష్ట్ర, జిల్లా ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

లంపీస్కిన్‌పై అప్రమత్తం

- వ్యాధిబారిన 300 పశువులు.. కోలుకున్న 210 పశువులు
- రాష్ట్రంలో అదుపులోనే లంపీస్కిన్ వ్యాధి
- లంపీస్కిన్ సోకిన పశువుల పాలను నిరభ్యంతరంగా తాగొచ్చు

రాష్ట్రంలో 21.74 లక్షల పశువులకు సామూహిక వ్యాక్సినేషన్



లంపి స్కిన్ వ్యాధి కట్టడి కోసం వ్యాక్సినేషన్ వేస్తున్న సిబ్బంది

సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వేగంగా విస్తరిస్తున్న 'లంపీస్కిన్' వ్యాధి (పశువులకు సోకే ముద్ద చర్మవ్యాధి) ప్రభుత్వ చర్యల ఫలితంగా రాష్ట్రంలో పూర్తిగా అదుపులోనే ఉంది. వ్యాధి ఉధృతి మొదలైన వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. ప్రత్యేక వైద్య బృందాలను రంగంలోకి దించడంతోపాటు వ్యాధి లక్షణాలున్న పశువులను గ్రామస్థాయిలో ఆర్బీకేల ద్వారా గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టింది. ఫలితంగా వ్యాధి బారిన పడిన పశువులు పూర్తి ఆరోగ్యంతో కోలుకుంటున్నాయి. కాగా, వ్యాధి సోకిన పశువుల నుంచి సేకరించే పాలను వినియోగించడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవని పశువైద్య నిపుణులు చెబుతున్నారు. ఆ పాలను కాచి చల్లార్చిన తరువాత నిరభ్యంతరంగా వాడుకోవచ్చని స్పష్టం చేస్తున్నారు.

ఆర్బీకే స్థాయిలో నివారణ చర్యలు

లంపీస్కిన్ వైరస్ డిసీజ్ (ఎల్ఎస్‌డీవీ) ఓ అంటువ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువుల చర్మంపై కణితులు, బొడిపెలు, దద్దుర్లు ఏర్పడి పుండ్లుగా మారి ఇన్‌ఫెక్షన్‌కు గురవుతాయి. అలాంటి పశువులు తీవ్ర జ్వరం బారినపడి వ్యాధి నిరోధక శక్తిని కోల్పోతాయి. ఫలితంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఈ వ్యాధి దేశవ్యాప్తంగా 20.50 లక్షల పశువులకు సోకగా.. లక్షకు పైగా మృత్యువాత పడ్డాయి. అయితే రాష్ట్రంలో మాత్రం ఇప్పటివరకు శ్రీకాకుళం జిల్లాలో ఒకే ఒక్క పశువు మృతిచెందింది. లంపీస్కిన్ వ్యాధి ఉధృతి వల్ల రాష్ట్రంలో ఏ ఒక్క పశు పోషకుడు ఇబ్బంది పడకూడదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం ఆర్బీకే స్థాయిలో నివారణ చర్యలు చేపట్టింది. ఓ వైపు సామూహిక వ్యాక్సినేషన్ చేస్తూనే.. మరోవైపు పెద్ద ఎత్తున మందులను అందుబాటులో ఉంచింది. ప్రత్యేక వైద్య బృందాలను నియమించి ఆర్బీకే స్థాయిలో గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ వ్యాధికి గురైన పశువులను గుర్తించడం, వాటి నమూనాలను సేకరించి ల్యాబ్‌లకు పంపించడం, చుట్టుపక్కల పశువులకు రింగ్ వ్యాక్సినేషన్ వేయించడం, వ్యాధికి గురైన జీవాలు కోలుకునే వరకు వైద్య సేవలందించడం వంటి చర్యలు చేపట్టారు. అంతేగాక స్థానిక సంతల్లో పశువుల క్రయవిక్రయాలను తాత్కాలికంగా నిలిపేశారు. అంతర్రాష్ట్ర పశువుల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చెక్‌పోస్టుల్లో ముమ్మర తనిఖీలు చేస్తున్నారు.

21.75 లక్షల పశువులకు వ్యాక్సినేషన్

23.50 లక్షల పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకకుండా 'గోట్ ఫాక్స్' వ్యాక్సిన్ డోసులను జిల్లాలకు సరఫరా చేయగా.. ఇప్పటివరకు 21,74,626 పశువులకు టీకాలు వేశారు. కాగా, మరో 35 లక్షల డోసులను ఈ నెల 20 లోగా అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, వ్యాధి లక్షణాలను గుర్తించిన ప్రాంతాలకు చుట్టూ 5 కి.మీ. పరిధిలోని పశువులకు రింగ్ వ్యాక్సిన్ వేస్తున్నారు. ఇప్పటి వరకు 15,136 పశువులకు రింగ్ వ్యాక్సిన్ వేశారు. తొలుత ఆరేడు జిల్లాల్లో వ్యాధి లక్షణాలు కనిపించినప్పటికీ నమూనాలు పరీక్షించగా, శ్రీకాకుళం, విజయనగరం, పల్నాడు జిల్లాల్లోని 12 గ్రామాల పరిధిలో 300 పశువుల్లో మాత్రమే వ్యాధి నిర్ధారణ అయ్యింది. ప్రభుత్వ చర్యల ఫలితంగా వ్యాధి సోకిన వాటిలో 210 పశువులు పూర్తి ఆరోగ్యంతో కోలుకున్నాయి.



లంపీస్కిన్ అదుపులోనే ఉంది



లంపీస్కిన్ రాష్ట్రంలో పూర్తిగా అదుపులో ఉంది. పాడి రైతులెవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఆర్బీకే స్థాయిలో ప్రభుత్వం తీసుకుంటున్న నివారణ చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. 21.75 లక్షల పశువులకు వ్యాక్సినేషన్ వేశాం. ప్రస్తుతం మూడు జిల్లాల పరిధిలో 12 గ్రామాలకే ఈ వ్యాధి పరిమితమైంది. సంతల్లో పశు విక్రయాలను నిలిపివేశాం. అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో పశువుల రవాణాపై తనిఖీలు చేపట్టాం.

– ఆర్.అమరేంద్రకుమార్, డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ

ఆ పాలు తాగొచ్చు



లంపీస్కిన్ వ్యాధి పశువుల నుంచి పశువులకు సోకుతుందే తప్ప మరే జీవికి సోకదు. వ్యాధి సోకిన పశువుల నుంచి తీసిన పాలను నిరభ్యంతరంగా పిల్లలతో సహా అందరూ వాడుకోవచ్చు. ఎలాంటి ఆరోగ్యపరమైన సమస్యలు రావు. కనీసం 3 పొంగులు వచ్చేంత వరకు పాలను వేడి చేసి.. చల్లార్చిన తరువాత తాగడం మంచిది.

– డాక్టర్ జి.వెంకటనాయుడు, విస్తరణ సంచాలకులు, శ్రీవెంకటేశ్వ పశువైద్య విశ్వవిద్యాలయం

క్లుప్తంగా...

ఆస్ట్రేలియాలో భారత విద్యార్థికి కత్తిపోట్లు

సిడ్నీ: డబ్బులు ఇవ్వకపోవడంతో దుండగులు భారత విద్యార్థిపై కత్తితో దాడిచేశారు. ఆస్ట్రేలియాలో ఈ నెల 6న రాత్రి 10.30 గంటలకు ఈ సంఘటన జరిగింది. శుభం గార్గ్(28) విద్యాభ్యాసం కోసం ఆస్ట్రేలియాకు వెళ్లాడు. రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా, దుండగులు అటకాయించారు. డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చేందుకు నిరాకరించడంతో ఆగ్రహానికి గురై శుభం గార్గ్‌పై కత్తితో దాడికి దిగారు. అనంతరం అక్కడి నుంచి పారిపోయారు. బాధితుడి తల, ఛాతీ, పొట్ట భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన డేనియల్‌తోపాటు 27 ఏళ్ల మరో యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. చికిత్స పొందుతున్న గార్గ్ ఆరోగ్యం నిలకడగా ఉంది.

ఖేర్సన్‌పై పట్టు బిగిస్తున్న ఉక్రెయిన్

కీవ్: రష్యా ఆక్రమిత ఖేర్సన్ ప్రాంతంపై ఉక్రెయిన్ తిరిగి పట్టు బిగిస్తోంది. ఖేర్సన్‌ను ఉక్రెయిన్ మిలటరీ పాక్షికంగా తమ ఆధీనంలోకి తెచ్చుకుంది. నిరంతరాయంగా ఆ ప్రాంతంపై బాంబుల వర్షం కురిపిస్తోంది. ఈ పరిణామాలతో ఖేర్సన్ ప్రాంతానికి చీఫ్‌గా నియమితుడైన వ్లాదిమర్ సాల్డో ఆ ప్రాంతం నుంచి రష్యాకు ఎవరైనా వెళ్లిపోతామంటే వారికి ఉచితంగా వసతి సదుపాయం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల రష్యా అధ్యక్షుడు పుతిన్ చట్టవిరుద్ధంగా ఖేర్సన్‌సహా నాలుగు ప్రాంతాలను తమ భూభాగంలో కలిపేసుకున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. ఖేర్సన్ ప్రాంతంలోని ప్రజల ప్రాణాలను రక్షించడానికి రష్యన్ ప్రాంతాలైన రోస్తోవ్, క్రానోడర్, స్తావ్రోపోల్, క్రిమియాకు తరలిస్తామని చెప్పారు. యుద్ధ సమయంలో అనాథమైన వేలాది మంది పిల్లల్ని రష్యాకు బలవంతంగా తరలిస్తోందని, ఇలా చేయడం యుద్ధ నేరాల కిందకే వస్తుందని పలు స్వచ్ఛంద సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

దక్షిణాదిలోనూ వందే భారత్ ఎక్స్‌ప్రెస్

న్యూఢిల్లీ: వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు దక్షిణ భారతంలో అందుబాటులోకి రానున్నాయి. నవంబర్ 10వ తేదీన 483 కిలోమీటర్ల పొడవైన చెన్నై–బెంగళూరు, మైసూరు మార్గంలో ఈ రైలు ప్రారంభం అవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. అత్యాధునిక వసతులు, భద్రతా ఏర్పాట్లుండే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేగం ఎక్కువ. వచ్చే ఏడాదిలో కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఐదో వందేభారత్ రైలును ప్రారంభించేందుకు రైల్వే శాఖ ఏర్పాట్లు చేస్తోంది.

ఖర్గేతోనే కాంగ్రెస్‌కు సుస్థిరత

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ పార్టీలో అంతర్గతంగా మల్లికార్జున ఖర్గేకు మద్దతు పెరుగుతోంది. పార్టీ హైకమాండ్ మీద ధిక్కార స్వరం వినిపించి పార్టీని ప్రక్షాళన చేయాలని గత కొంత కాలంగా డిమాండ్ చేస్తున్న జీ23 నేతలు ఖర్గేకే తమ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ సుస్థిరంగా మనుగడ సాగించాలంటే ఖర్గే పగ్గాలు అందుకోవాలని సీనియర్ నేత మనీశ్ తివారీ స్పష్టం చేశారు. జీ–23 కూటమిలో శశిథరూర్ ఉన్నప్పటికీ వారు ఖర్గేకే జై కొట్టడం విశేషం. కింద స్థాయి నుంచి వచ్చిన ఖర్గేలాంటి నాయకుల వల్లే కాంగ్రెస్ సుస్థిరంగా ఉంటుందని ఆయన స్వయంకృషితో ఎదిగిన నాయకుడని తివారీ ప్రశంసించారు. వివిధ రాష్ట్రాల పర్యటనకు ఆయన వెళుతున్నప్పుడు పీసీసీ నాయకులు, ఇతరులు తనని పెద్దగా పట్టించుకోవడంపై థరూర్ అసహనం వ్యక్తం చేశారు. తాను కాంగ్రెస్‌లో బ్లాక్ స్థాయి అధ్యక్షుడి నుంచి ఎదిగి వచ్చానని, అప్పట్లో శశిథరూర్ అసలు పార్టీలో లేరని ఖర్గే అన్నారు.

ఐఐటీలకు విదేశాల నుంచి విజ్ఞప్తులు


న్యూఢిల్లీ: ఐఐటీ క్యాంపస్‌లను నెలకొల్పాలంటూ పలు అభివృద్ధి చెందుతున్న, అభివృద్ధి చెందిన దేశాలు భారత ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాయని ఆయన అన్నారు. ఇవి కేవలం ఐఐటీలుగానే కాదు, పరివర్తన సాధనాలుగా కూడా మారాయన్నారు. ఐఐటీ–ఢిల్లీలో శుక్రవారం ఆయన రెండు రోజుల ఇన్వెంటివ్ ఫెయిర్‌ను ప్రారంభించి ప్రసంగించారు. ప్రతిభ, మార్కెట్ పరిమాణం, కొనుగోలు శక్తి వంటివి దేశాభివృద్ధిని మరింత వేగవంతం చేస్తున్నాయని, మన ఐఐటీలు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు.

ఇక జీవితంలో బీజేపీతో కలిసే ప్రసక్తే లేదు: నితీశ్

సమస్తీపూర్: తాను జీవించి ఉన్నంతకాలం బీజేపీతో మళ్లీ కలిసే ప్రసక్తే లేదని బిహార్ ముఖ్యమంత్రి,, జేడీ(యూ) నేత నితీశ్ కుమార్ స్పష్టం చేశారు. రాజకీయ ప్రత్యర్థులను వేధించడానికి దర్యాప్తు సంస్థలను వాడుకుంటోందని బీజేపీపై మండిపడ్డారు. ఆయన శుక్రవారం సమస్తీపూర్‌లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడారు. ప్రస్తుత బీజేపీ నాయకత్వం అరాచకంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ, మురళీ మనోహర్‌జోషీ హయాం నాటి బీజేపీ ఇప్పుడే లేదన్నారు. జేడీ(యూ), కాంగ్రెస్, ఆర్జేడీ, వామపక్షాలకు కూడిన 'మహాఘట్‌బంధన్' ఎప్పటికీ కలిసే ఉంటుందని తేల్చిచెప్పారు. దేశ ప్రగతి కోసం తామంతా కలిసి పని చేస్తామని అన్నారు.

జిన్‌పింగ్‌కు మూడోసారి పట్టం!

- రేపు చైనా కమ్యూనిస్ట్ పార్టీ జాతీయ సదస్సు
- హాజరు కానున్న 2,296 మంది ప్రతినిధులు



జన చైనా అధినేతగా షీ జిన్‌పింగ్(69)ను వరుసగా మూడోసారి ఎన్నుకొనేందుకు రంగం సిద్ధమయ్యింది. మరో ఐదేళ్లపాటు ఆయన పదవిలో కొనసాగడం ఖాయమే. అన్నీ అనుకున్నట్లు జరిగితే జీవితకాలం పదవిలో ఉండేలా అధికార చైనా కమ్యూనిస్ట్ పార్టీ(సీపీసీ) తీర్మానాన్ని ఆమోదించినా ఆశ్చర్యం లేదు. పార్టీ దివంగత నేత మావో జెడాంగ్ తర్వాత మూడుసార్లు చైనా అధ్యక్షుడిగా గద్దెనెక్కిన నాయకుడిగా జిన్‌పింగ్ రికార్డు సృష్టించబోతున్నారు. కమ్యూనిస్టు పార్టీ 20వ జాతీయ సదస్సు ఈ నెల 16న జరుగనుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిన్‌పింగ్ జాగ్రత్తగా 'ఎన్నిక చేసిన' 2,296 మంది ప్రతినిధులు పాల్గొంటారు. వీరంతా జిన్‌పింగ్‌కు మరోసారి పట్టంకడతారు. ప్రపంచ శక్తిగా ఎదగాలని తహతహలాడుతున్న డ్రాగన్ దేశంపై అమెరికాతోపాటు పశ్చిమ దేశాలు గుర్రుగా ఉన్నాయి. చైనా దూకుడును అడ్డుకొనేందుకు గట్టిగా ప్రయత్నిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో జిన్‌పింగ్ వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎన్నికవుతుండడం ఆసక్తికరంగా మారింది.

'పదేళ్ల పదవీ కాలం' విధానానికి మంగళం

చైనాలో 'పదేళ్ల పదవీ కాలం' అనే నిబంధనకు కాలం చెల్లబోతోంది. ఇన్నాళ్లూ 'రెండు పర్యాయాలు.. ఒక్కోటి ఐదేళ్లు' అనే విధానం కఠినంగా అమలయ్యింది. అంటే ఒక అధ్యక్షుడు పదేళ్లకు మించి అధికారంలో కొనసాగడానికి వీల్లేదు. ఏకైక రాజకీయ పార్టీ ఉన్న చైనాలో ఏక వ్యక్తి ఆధిపత్యం అరాచకానికి దారితీస్తుందన్న అంచనాతో ఈ విధానం ప్రవేశపెట్టారు. మావో జెడాంగ్ మినహా జిన్‌పింగ్ కంటే ముందు అధికారంలో ఉన్న అధ్యక్షులంతా దీనికి కట్టుబడి ఉన్నారు. మావో జెడాంగ్ 1976 దాకా అధికారంలో కొనసాగారు. పాలనలో తన బ్రాండ్ అయిన 'జెడాంగ్ ఆలోచన'ను అమలు చేశారు. పెట్టుబడిదారులపై కఠిన ఆంక్షలు విధించారు. సాంస్కృతిక విప్లవం వంటి ప్రయోగాలు చేశారు. జెడాంగ్ పాలనలో చైనా దాదాపు దివాలా దశకు చేరుకుంది. అనంతరం సర్వోన్నత నాయకుడిగా పేరుగాంచిన డెంగ్ జియావోపింగ్ అధికారంలోకి వచ్చారు. మావో విధానాలకు మంగళం పాడుతూ తనదైన ఆర్థిక విధానాలకు తెరతీశారు. ఆర్థికాభివృద్ధికి బాటలు వేశారు. ఒకే వ్యక్తి సుదీర్ఘ కాలంలో అధికారంలో ఉంటే దేశానికి ముప్పేనన్న అంచనాతో 'పదేళ్ల పదవీ కాలాన్ని, 68 ఏళ్ల వయోపరిమితిని' ప్రవేశపెట్టారు. 1982లో జరిగిన సీపీసీ 12వ జాతీయ సదస్సులో వీటికి ఆమోదం లభించింది. ఆ తర్వాత జియాంగ్ జెమిన్, హూ జింటావో అధికారంలోకి వచ్చారు. వారి హయాంలోనే చైనా ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది.

'నూతన మావో' జిన్‌పింగ్

1953 జూన్ 15న జన్మించిన షీ జిన్‌పింగ్ 2008 నుంచి 2013 వరకూ హూ జింటావో హయాంలో చైనా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 2012లో చైనా కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అటు పిమ్మట సెంట్రల్ మిలటరీ కమిషన్(సీఎంసీ) చైర్మన్‌గా మారారు. 2013 మార్చి 14న 'పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' 7వ అధినేతగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి నిరాటంకంగా కుర్చీని అధిరోహిస్తున్నారు. సైన్యం, న్యాయ వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ పూర్తిగా జిన్‌పింగ్ నియంత్రణలోకి వచ్చాయి. మూడున్నర దశాబ్దాల తర్వాత 'వన్ లీడర్' పాలన మొదలయ్యింది. పదేళ్ల పదవీ కాలం నిబంధన ప్రకారం 2023లో ఆయన పాలన ముగిసిపోవాలి. కానీ, 'నూతన మావో' కావాలన్నది జిన్‌పింగ్ లక్ష్యం. ఈ లక్ష్యాన్ని ఆయన సాధించినట్లేనని చెప్పుకోవచ్చు.

- జిన్‌పింగ్ మరింత శక్తివంతమైన నాయకుడిగా అవతరించబోతున్నారని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. పదేళ్లలో అధికారాన్ని జిన్‌పింగ్ కేంద్రీకృతం చేశారు. పార్టీపై, ప్రభుత్వంపై పట్టు సాధించారు. మాజీ అధినేతలతో పోలిస్తే ఎక్కువ అధికారాలను అనుభవిస్తున్నారు.
- జిన్‌పింగ్‌కు 15 ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఆయన తండ్రి జోంగ్‌షున్ జైలుపాలయ్యారు. నగరాలు, పట్టణాల్లో ఉన్న యువత గ్రామాల్లో రైతులతో కలిసి జీవించాలని మావో ఆదేశించడంతో 1969లో జిన్‌పింగ్ షాన్‌షీ ప్రావిన్స్‌లోని ఓ మారుమూల పల్లెకు చేరుకున్నారు. అక్కడ ఓ గుడిసెలోనే ఆరేళ్లపాటు జీవనం సాగింది.
- పల్లె జీవితం తర్వాత జిన్‌పింగ్ బీజింగ్‌లోని తిసింగ్‌హువా యూనివర్సిటీలో చేరారు. స్కాలర్‌షిప్‌తో చదువుకున్నారు. తర్వాత చైనా రక్షణ శాఖలో మూడేళ్లపాటు పనిచేశారు. 1985లో ఫుజియాన్ ప్రావిన్స్‌లోని షియామెన్ నగర ఉపమేయర్‌గా ఎన్నికయ్యారు. 2000 సంవత్సరం నాటికి అదే పావిన్స్ గవర్నర్‌గా ఎదిగారు. ఆ తర్వాత సౌత్ ఆఫ్ బీజింగ్ కౌంటీ కమ్యూనిస్ట్ పార్టీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు.
- 2002లో జెజీయాంగ్ ప్రావిన్స్‌లో పార్టీ చీఫ్‌గా, 2007లో షాంఘైలో పార్టీ కార్యదర్శిగా వ్యవహరించారు. పార్టీ పొలిట్‌బ్యూరోలో శక్తివంతమైన స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా చేరారు.
- చైనా అధ్యక్షుడిగా జిన్‌పింగ్ పేరును ప్రతిపాదిస్తూ 2012లో జరిగిన పార్టీ జాతీయ సదస్సులో తీర్మానాన్ని ఆమోదించారు.
- తైవాన్ విషయంలో అంతర్జాతీయంగా విమర్శలను ఎదుర్కొంటున్నారు. తైవాన్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ చైనాలో కలిపేసుకుంటామని జిన్‌పింగ్ చెబుతున్నారు.
- చైనాలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం, మీడియాపై ఆంక్షలు సర్వసాధారణంగా మారాయి.
- హాంకాంగ్‌లో శాంతియుత నిరసనలను కఠినంగా అణచివేశారు.
- జిన్‌పింగ్ అమల్లోకి తీసుకొచ్చిన 'జీరో–కోవిడ్' పాలసీపై ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. లాక్‌డౌన్లు కాదు, స్వేచ్ఛ కావాలంటూ జనం నినదిస్తున్నారు.

– నేషనల్ డెస్క్, సాక్షి

కాల నిర్ధారణ పరీక్ష కుదరదు

జ్ఞానవాపి కేసులో లింగాకృతి శిలకు కార్బన్ డేటింగ్ పిటిషన్‌ను కొట్టేసిన వారణాసి కోర్టు

వారణాసి: వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయం పక్కనే ఉన్న జ్ఞానవాపి మసీదు 'వజూఖానా'లో కనిపించిన లింగాకృతి శిల వయసును నిర్ధారించేందుకు అనుమతి కోరిన నలుగురు హిందూ పిటిషనర్లకు శుక్రవారం న్యాయస్థానంలో చుక్కెదురైంది. ఆ శిలకు కార్బన్ డేటింగ్ పద్ధతిలో వయసు కనుగొనేందుకు అనుమతించాలంటూ గతంలో హిందూ పిటిషనర్లు వేసిన పిటిషన్‌ను కొట్టేస్తూ జిల్లా జడ్జి ఏకే విశ్వేష తీర్పు చెప్పినట్లు ప్రభుత్వ న్యాయవాది రాణా సంజీవ్ సింగ్ చెప్పారు. ఈ కేసులో హిందూ, ముస్లింల ఇరువైపుల వాదనలు అక్టోబర్ 11వ తేదీన విన్న కోర్టు అక్టోబర్ 14వ తేదీకి తీర్పును రిజర్వ్‌చేస్తూ నిర్ణయంతీసుకున్న విషయం తెల్సిందే. '' జ్ఞానవాపి మసీదులో ప్రభుత్వ అధికారుల ఆధ్వర్యంలో గతంలో వీడియోగ్రఫీ సర్వే చేసిన సందర్భంగా కనిపించిన వస్తువులను జాగ్రత్తగా పరిరక్షించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. ఆ వస్తువులపై శాస్త్రీయ పద్ధతి, కార్బన్ డేటింగ్ వంటి ప్రక్రియ వేళ సాక్ష్యాలు ట్యాంపరింగ్ అయ్యే ప్రమాదముంది. వజూఖానాలోని లింగాకృతి వయసు నిర్ధారణ కోసం భూమి పొరలను తొలుస్తూ రాడార్ వెళ్తే ఆ శిల ధ్వంసమై ప్రజల మత నమ్మకాలను బాధపెట్టినట్లు అవుతుంది. అలా చేయడం కోర్టు నిబంధనల ఉల్లంఘనే అవుతుంది. అవన్నీ దృష్టిలో ఉంచుకునే జిల్లా కోర్టు కార్బన్ డేటింగ్‌కు అనుమతి ఇవ్వలేదు' అని హిందూ పిటిషనర్ల తరఫు లాయర్ శివం గౌర్ అన్నారు. అయితే, ఎలాగైనా సరే కార్బన్ డేటింగ్ కోసం పట్టుబడుతూ సుప్రీంకోర్టును త్వరలో ఆశ్రయిస్తామని హిందూ పిటిషనర్ల మరో లాయర్ విష్ణు శంకర్ జైన్ అన్నారు. ఆ శిల శివలింగం కాదని, నమాజ్‌కు ముందు కాళ్లు, చేతులు శుభ్రంచేసుకునే నీటి ఫౌంటేన్‌లో భాగమని మసీదు మేనేజ్‌మెంట్ కమిటీ తరఫు లాయర్ ముంతాజ్ అహ్మద్ చెప్పారు. కాగా, జ్ఞానవాపి మసీదు వెనుక ప్రధాన గోడ బయటి వైపు ఉన్న హిందూ విగ్రహాల ఆరాధనకు అనుమతించాలంటూ దాఖలైన జ్ఞానవాపి మసీదు–శ్రింగార్ గౌరి కేసు విచారణను కోర్టు 17వ తేదీకి వాయిదావేసింది.



శుక్రవారం జ్ఞానవాపి మసీదులో ప్రార్థనలు చేసి వస్తున్న ముస్లింలు

మోగిన హిమాచల్ ఎన్నికల నగారా

- నవంబర్ 12న ఒకే విడతలో 68 స్థానాల్లో పోలింగ్
- డిసెంబర్ 8న ఫలితాలు
- షెడ్యూల్ వెల్లడించిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ : హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నగారా మోగించింది. హిమాచల్‌లోని 68 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో నవంబర్ 12న ఓటింగ్ నిర్వహించి, ఓట్ల లెక్కింపు ప్రక్రియ డిసెంబర్ 8న చేపట్టనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) రాజీవ్ కుమార్ మాట్లాడారు. నామినేషన్ల దాఖలు అక్టోబర్ 17న ప్రారంభమై అక్టోబర్ 25 దాకా కొనసాగుతుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను అక్టోబర్ 29 వరకు ఉపసంహరించుకోవచ్చు. ఈ ఎన్నికల కోసం 7,881 పోలింగ్ స్టేషన్లు సిద్ధం చేయగా .. ఇందులో 142 పూర్తిగా మహిళలు, 37 దివ్యాంగులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 68 అసెంబ్లీ స్థానాల్లో 55 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. 2017లో భారతీయ జనతా పార్టీ 44 సీట్లు గెలుచుకోగా, కాంగ్రెస్ 21 సీట్లు సాధించింది. కాగా వచ్చే ఏడాది ఫిబ్రవరి 18న గుజరాత్ అసెంబ్లీ కాలపరిమితి ముగుస్తున్నప్పటికీ తదుపరి ఎన్నికల తేదీలను ఈసీ ప్రకటించలేదు.

సమయానికే 'గుజరాత్' ప్రకటన: సీఈసీ

'వాతావరణ పరిస్థితుల వల్లే హిమాచల్‌లో ముందుగా షెడ్యూల్ ప్రకటించాం. గుజరాత్ షెడ్యూల్‌ను తగు 'సమయానికి' ప్రకటిస్తాం' అని సీఈసీ రాజీవ్ వ్యాఖ్యానించారు. ఈయన వ్యాఖ్యలపై విపక్షాలు స్పందించాయి. ' గుజరాత్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన కావాలనే ఆలస్యం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేలోపు గుజరాత్ కోసం భారీ ప్రాజెక్టులు, పెద్ద హామీలు ప్రధాని మోదీ ప్రకటిస్తారు. ఇంకొన్ని ప్రారంభోత్సవాలు చేసి ఓటర్లను తమవైపు తిప్పుకుంటారు' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఆరోపించారు.

అమెరికాలో కాల్పులు..పోలీస్ సహా ఐదుగురు మృతి

రేలీ: అమెరికాలోని నార్త్ కరోలినా రాజధాని రేలీలో గురువారం సాయంత్రం చోటు చేసుకున్న కాల్పుల ఘటనలో ఒక పోలీసు అధికారి సహా ఐదుగురు చనిపోగా ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. న్యూస్ రివర్ గ్రీన్‌వేలో నివాస ప్రాంతంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న వారిపై ఒక బాలుడు(15) తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపి, పరారయ్యాడు. భారీగా రంగంలోకి దిగిన పోలీసులు అతడిని పట్టుకునేందుకు మూడు కిలోమీటర్ల ప్రాంతాన్ని దిగ్బంధించి సోదాలు చేపట్టారు. రాత్రి 9.30 గంటల సమయంలో ఓ ఇంట్లో దాక్కున్న బాలుడిని అరెస్ట్ చేశారు.

రాజకీయ విరాళాల స్వీకరణకు సరైన విధానమే

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల విధానం లోపభూయిష్టంగా ఉందంటూ, వాటి కొనుగోళ్లను ఆపాలంటూ గతంలో సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై శుక్రవారం కేంద్రప్రభుత్వం స్పందించింది. ' రాజకీయ పార్టీలు విరాళాలు స్వీకరించేందుకు వినియోగిస్తున్న ఈ బాండ్ల వ్యవస్థ అత్యంత పారదర్శకమైంది. లెక్కల్లో లేని, నల్లధనం ఎంత మాత్రం ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రాజకీయ పార్టీలకు చేరబోదు' అని కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా.. సుప్రీంకోర్టులో స్పష్టంచేశారు. ' ప్రతిసారి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ముందు బాండ్ల తంతు మొదలవుతోంది. తమకు వచ్చిన విరాళాల ఖాతాల ప్రతీ లావాదేవీ సమగ్ర సమాచారాన్ని రాజకీయ పార్టీలు స్పష్టంగా వెల్లడించట్లేవు. బాండ్ల విక్రయం ఆపండి' అని పిటిషన్ వేసిన అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ ఎన్‌జీవో తరఫున హాజరైన లాయర్ ప్రశాంత్ భూషణ్ వాదించారు. విస్తృత ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలిస్తే బాగుంటుందని మరో పిటిషనర్ తరఫున వాదిస్తున్న లాయర్ కపిల్ సిబల్ అభిప్రాయపడ్డారు. దీంతో బాండ్ల ద్వారా పార్టీలు విరాళాలు పొందేందుకు అనుమతిస్తున్న చట్టాలను సవాల్ చేస్తున్న అంశాన్ని విస్తృత ధర్మాసనానికి సిఫార్సు చేయాలా వద్దా అనేది డిసెంబర్ ఆరో తేదీన ఖరారుచేస్తామని సుప్రీం బెంచ్ పేర్కొంది. దాతల పేర్ల విషయంలో గోప్యత పాటించాలని కేంద్ర ప్రభుత్వం, పేర్లు బహిర్గతం చేయాల్సిందేనని కేంద్ర ఎన్నికల సంఘం.. సుప్రీంకోర్టులో గతంలో భిన్న వాదనలు లేవనెత్తాయి.

మాజీ ప్రొఫెసర్ సాయిబాబాకు విముక్తి

- దిగువ కోర్టు విధించిన జీవిత ఖైదు శిక్ష కొట్టివేత
- మావోయిస్టులతో లింకు కేసులో బాంబే హైకోర్టు ఆదేశాలు
- తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ/ముంబై: మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న కేసులో 8 ఏళ్లుగా నిర్బంధంలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా(52)కు బాంబే హైకోర్టు విముక్తి కల్పించింది. సాయిబాబా తదితరులకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ గడ్చిరోలి సెషన్స్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను శుక్రవారం కొట్టి వేసింది. 'ఉగ్రవాదంపై పోరాటం చాలా ముఖ్యమైంది. అదే సమయంలో, జాతి భద్రతకు ప్రమాదమంటూ పౌరులకుండే విధానపరమైన రక్షణలను నిర్లక్ష్యం చేయజాలము'అని కోర్టు పేర్కొంది. మావోయిస్టులతో లింకులు, దేశ ద్రోహం కేసులో సాయిబాబాతోపాటు ఒక జర్నలిస్ట్, ఒక జేఎన్‌యూ విద్యార్థి తదితర ఐదుగురు నిందితులుగా ఉన్నారు. 2014లో సాయిబాబా తదితరులపై చార్జిషీట్‌ను స్వీకరించిన మహారాష్ట్రలోని గడ్చిరోలి కోర్టు యూఏపీఏ కింద సాయిబాబాను విచారించేందుకు అనుమతివ్వలేదని బాంబే హైకోర్టు పేర్కొంది. సరైన అనుమతులు లేకుండా యూఏపీఏ కింద కోర్టు చేపట్టిన ప్రొసీడింగ్స్ చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. ఆయన్ను దోషిగా తేలుస్తూ గడ్చిరోలి సెషన్స్ కోర్టు 2017లో ఇచ్చిన తీర్పును కొట్టివేస్తున్నట్లు తెలిపింది. దాదాపు 90% శాతం కదల్లేని స్థితిలో వీల్‌చైర్‌లో గడుపుతున్న సాయిబాబా కస్టడీ కోరేందుకు తగిన ఇతర కేసులు లేనట్లయితే విడుదల చేయవచ్చని పేర్కొంది. ఆయనతోపాటు అరెస్టయిన మిగతా వారిని విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. 2014 మేలో అరెస్టయినప్పటి నుంచి నాగ్‌పూర్ సెంట్రల్ జైలులో ఉన్న సాయిబాబా 15వ తేదీన విడుదలవుతారని ఆయన తరఫు లాయర్లు తెలిపారు.



సాయిబాబా, భార్య వసంతకుమారి (ఫైల్)

సుప్రీంకోర్టులో నేడు విచారణ

సాయిబాబాను విడుదల చేస్తూ బాంబే హైకోర్టు ఆదేశాలపై స్టే ఇవ్వాలంటూ మహారాష్ట్ర పోలీసులు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు పూర్వాపరాలు, హైకోర్టు తీర్పు వివరాలు తెలుసుకోకుండా వెంటనే స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. అత్యవసర విచారణ కేసుల జాబితాలో చేర్చాలంటూ సుప్రీంకోర్టు రిజిస్ట్రీని కోరేందుకు అనుమతినిచ్చింది. ఇలా ఉండగా, ఈ కేసుపై శనివారం ఉదయం 11 గంటలకు విచారణ జరుగుతుందని శుక్రవారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్ తెలిపింది.

బ్రిటన్ ఆర్థికమంత్రి క్వాసిపై వేటు

- మినీ బడ్జెట్ వివాదాస్పదం కావడంతో ప్రధాని లిజ్ ట్రస్ నిర్ణయం
- కొత్త ఆర్థిక మంత్రిగా జెరెమీ హంట్ నియామకం

లండన్ : బ్రిటన్ ఆర్థిక మంత్రి క్వాసీ క్వార్టెంగ్‌పై ప్రభుత్వం వేటు వేసింది. క్వాసీని పదవి నుంచి ప్రధానమంత్రి లిజ్ ట్రస్ తొలగించారు. గత నెలలో క్వాసీ ప్రవేశపెట్టిన మినీ బడ్జెట్‌తో దేశంలో ఆర్థిక వ్యవస్థ కుదేలై గందరగోళానికి దారి తీసింది. ఈ బడ్జెట్‌తో దేశంలో ఆర్థిక మాంద్యం తలెత్తుతుందన్న ఆందోళనలు అధికమయ్యాయి. దీంతో క్వాసీని ఆర్థిక మంత్రిగా తప్పించి ఆయన స్థానంలో జెరెమీ హంట్‌ను కొత్త ఆర్థిక మంత్రిగా నియమించారు. కరోనా, రష్యా–ఉక్రెయిన్ యుద్ధ ప్రభావంతో క్షీణించిపోయిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి పన్నుల్లో భారీగా కోత విధిస్తూ క్వాసీ రూపొందించిన మినీ బడ్జెట్ బెడిసికొట్టింది. దేశ ఖజానాకు ఇతర ఆదాయ మార్గాలను చూపించకుండా దాదాపుగా 4,500 కోట్ల పౌండ్ల పన్ను మినహాయింపులనిస్తూ బడ్జెట్‌ను రూపొందించడంతో స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ప్రధానికి క్వాసీ సన్నిహితుడు కావడంతో గత కొద్ది రోజులుగా లిజ్ మినీ బడ్జెట్‌ను సమర్థిస్తూ వచ్చారు. అన్ని వైపుల నుంచి వచ్చిన విమర్శలతో క్వాసీని తప్పించాల్సి వచ్చింది. క్వాసీని తప్పించినందుకు లిజ్ ట్రస్ ఆయనకు రాసిన లేఖలో సారీ చెప్పడమే కాకుండా దీర్ఘకాలంలో ఈ బడ్జెట్ దేశానికి మంచి చేస్తుందని విశ్వసిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయన స్థానంలో ఆర్థిక మంత్రిగా నియమితులైన జెరెమీ హంట్ ప్రధాని పదవికి గతంలో పోటీ పడ్డారు. ఇలాంటి సమయంలో ఆర్థికమంత్రి పదవిని చేపట్టడం హంట్‌కు పెద్ద సవాల్‌గా మారింది.



హంట్

ఆపదలో అదృష్టం పలకరించిన వేళ

- ఇల్లు జప్తు చేస్తామంటూ నోటీస్ వచ్చిన కొద్దిగంటలకే జాక్‌పాట్
- కేరళలో చేపలమ్మే చిరువ్యాపారిని వరించిన రూ.70 లక్షల లాటరీ

కొల్లాం(కేరళ): కష్టాల కడలిని ఈదుతున్న వ్యక్తికి లాటరీ రూపంలో అదృష్టం ఎదురొచ్చి సాయపడింది. దాదాపు 9,00,000 రుణం చెల్లించలేక చేతులెత్తేసిన కేరళ మత్స్య వ్యాపారికి రూ. 70 లక్షల జాక్‌పాక్ తగిలింది. రుణం చెల్లించకపోతే ఇల్లు స్వాధీనం చేసుకుంటామని బ్యాంక్ నుంచి నోటీసు వచ్చిన కొద్దిసేపటికే అక్షయ లాటరీ అదృష్టదేవత ఇంటి తలుపుతట్టింది. కేరళలో రాష్ట్ర ప్రభుత్వ లాటరీ విజేత పుకుంజ్ ఆనందగాథ ఇది. రోజూలాగే చేపలు అమ్మేందుకు బయటికెళ్లిన పుకుంజ్ ఇంటికి బ్యాంక్ నుంచి ఇల్లు అటాచ్‌మెంట్ నోటీసొచ్చింది. బాధతో భార్య ఈ విషయం భర్తకు ఫోన్‌లో చెప్పింది. ఆ తర్వాత కొద్దిసేపటికే లాటరీ తగిలిన విషయం తెల్సి భర్తకు కబురుపెట్టింది. సంభ్రమాశ్చర్యానికి గురైన పుకుంజ్ కొద్దిసేపు ఆ విషయం అస్సలు నమ్మలేకపోయాడు. గెలుపు టికెట్ నంబర్ ఒకటికి రెండు సార్లు చెక్‌చేసుకుని ఆనంద లోకాల్లో విహరించాడు. 'ఇంటి మీద రూ.9 లక్షల అప్పు ఉంది. ఇదిగాక చాలా సంవత్సరాలుగా లాటరీ టికెట్లు కొంటూ మా నాన్న రూ.5 లక్షల అప్పు చేశాడు. స్కూల్‌కెళ్లే కొడుకు, కూతురు చదువులు, రుణాల సమస్యలతో ఊపిరాడని మాకు లాటరీ ఊహించని ఊరట కల్గించింది. ఇన్నాళ్లూ మా నాన్న కొన్న లాటరీలతో ఆయన అదృష్టం నన్ను వరించిందేమో. ఇకమీదట నేనూ టికెట్లు కొంటా' అని పుకుంజ్ ఆనందం వ్యక్తంచేశారు. 'వాస్తవానికి ఒక్క రోజు ముందే రూ.5,000 బహుమతి ఉన్న టికెట్ రెండు అంకెల తేడాతో తప్పిపోయింది. వెంటనే రేపు ఇంకో టికెట్ కొను. కచ్చితంగా మనమే జాక్‌పాట్ కొడతాం' అని భర్తతో చెప్పానని, అనుకున్నట్లే జరిగిందని పుకుంజ్ భార్య చెప్పింది. ' టికెట్లమ్మే వాళ్లకు సాయంగా ఉంటుందని నేనొకసారి కొన్నా' అని పుకుంజ్ కొడుకు అన్నాడు.



భార్య, పిల్లలతో పుకుంజ్

ఐదేళ్ల కనిష్టానికి ఆహార ధాన్యాల నిల్వలు

- ఎఫ్‌సీఐ వద్ద భారీగా తగ్గిన బియ్యం, గోధుమల స్టాక్
- గత ఏడాది నిల్వలు 8.16 కోట్ల టన్నులు.. ప్రస్తుతం 5.11 కోట్ల టన్నులే
- ఉచిత బియ్యం పంపిణీతో తగ్గిన బియ్యం నిల్వలు
- దేశీయ డిమాండ్, తగ్గిన దిగుబడితో గోధుమ నిల్వలపై ప్రభావం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో ఆహార ధాన్యం నిల్వలు ఏడాదిలో భారీగా తగ్గాయి. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సెంట్రల్ పూల్ కింద సేకరించి పెట్టిన గోధుమ, బియ్యం నిల్వలు ఐదేళ్ల కనిష్టానికి పడిపోయినట్లు అక్టోబర్ గణాంకాలు చెబుతున్నాయి. ఐదేళ్ల క్రితం 2017లో బియ్యం, గోధుమల మొత్తం నిల్వలు 4.33 కోట్ల మెట్రిక్ టన్నుల కనిష్టానికి పడిపోగా, ప్రస్తుతం అదేరీతిన నిల్వలు 5.11 కోట్ల మెట్రిక్ టన్నులకు పడిపోయింది. గత ఏడాది నిల్వలు 8.16 కోట్లతో పోల్చినా 37 శాతం నిల్వలు తగ్గడం, ఇందులో ముఖ్యంగా గోధుమల నిల్వలు ఏకంగా 14 ఏళ్ల కనిష్టానికి పడిపోవడం కేంద్రానికి ఆందోళన కలిగిస్తోంది.

ఉచితంతో బియ్యం.. దిగుబడి తగ్గి గోధుమలకు దెబ్బ..

దేశంలో కరోనా నేపథ్యంలో కేంద్రం 2020 ఏప్రిల్ నుంచి ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద 81 కోట్ల జనాభాకు ఉచిత బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ఇప్పటికే ఆరు విడతలుగా అమలు చేసిన బియ్యం పథకం కింద 11.21 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పంపిణీ చేసింది. ప్రస్తుత అక్టోబర్ నుంచి మరో మూడు నెలలు ఉచిత బియ్యం పథకాన్ని కొనసాగిస్తూ కేంద్రం నిర్ణయం చేసింది. ఈ మూడు నెలల కాలానికి మరో 1.22 కోట్ల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరాలు ఉంటాయని అంచనా వేసింది. ఉచిత బియ్యం పథకం నేపథ్యంలో ఎన్నడూ లేనంతగా బియ్యం నిల్వలు కేంద్రం వద్ద తగ్గాయి. గత ఏడాది కేంద్రం వద్ద అక్టోబర్‌లో 3.47 కోట్ల బియ్యం నిల్వలు ఉండగా, అది ఈ ఏడాది 2.83 కోట్లకు పడిపోయింది. అయితే బియ్యం నిల్వలు తగ్గినంత మాత్రాన ఇప్పటికిప్పుడు వచ్చే ప్రమాదం ఏం లేదని, కేంద్ర పథకాల కొనసాగింపునకు ఇదేమీ అడ్డుకాదని కేంద్రం చెబుతోంది. ఇప్పటికే ఖరీఫ్ పంటల కోతలు ఆరంభం అయినందున వీటితో మళ్లీ నిల్వలు పెంచుకునే అవకాశం ఉందని అంటోంది. అయితే గోధుమల పరిస్థితి మాత్రం కొంత భిన్నంగా ఉంది. గోధుమల నిల్వలు గతంతో పోలిస్తే తీవ్రంగా తగ్గాయి. 2017లో గోధుమల నిల్వలు 2.58 కోట్ల టన్నులు, 2018లో 3.56 కోట్లు, 2019లో 3.93 కోట్లు, 2020లో 4.37 కోట్లు, 2021లో 4.68 కోట్ల టన్నుల మేర నిల్వలు ఉండగా, అవి ఈ ఏడాది ఏకంగా 2.27 కోట్ల టన్నులకు తగ్గాయి. కరోనా పరిస్థితులు, ప్రపంచ వ్యాప్తంగా కరువు పరిస్థితులు, ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఇతర దేశాలకు భారత్ నుంచి ఎగుమతులు పెరిగాయి. ఎగుమతులు పెరగ్గా, దేశంలో అతివృష్టి కారణంగా పంటలు దారుణంగా దెబ్బ తినడంతో దిగుబడులు తగ్గాయి. దీంతో కేంద్రం వద్ద నిల్వలు తగ్గాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొనే ఈ ఏడాది మే నెలలో గోధుమల ఎగుమతులపై కేంద్రం నిషేధం విధించింది. అయినప్పటికీ మే నుంచి అధిక ఉష్ణోగ్రతల కారణంగా గోధుమ పంట దిగుమతులు తగ్గాయి. దీంతో అనుకున్న స్థాయిలో కేంద్రం నిల్వలు సేకరించలేకపోయింది. డిమాండ్‌ను గుర్తించి వ్యాపారులు ముందస్తు నిల్వలు చేశారు. ఈ ప్రభావం స్టాక్‌లపై పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే ధరలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారుల గోధుమ నిల్వలను బహిర్గతం చేయాలని ఆదేశాలివ్వడం, దేశీయ లభ్యతను పెంచడానికి స్టాక్ పరిమితులను విధించడం వంటి చర్యలను కేంద్రం పరిగణించే అవకాశాలున్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.


SMART BAZAAR
SMART SUPERSTORE
ఇండియా యొక్క అతి పెద్ద దీపావళి సేల్
JioMart
బెస్టివల్ సేల్
14th - 24th OCT
SMART BAZAAR
గుంటూరు : శివ సిటీ సెంటర్, 7 వ లేన్, రింగ్ రోడ్, చంద్రమౌళి నగర్, ● కర్నూలు: రిలయన్స్ పెట్రోల్ స్టేషన్ పక్కన, నంద్యాల రోడ్, ● నెల్లూరు: MGB ఫెలిసిటీ మాల్, GNT రోడ్, ● రాజమండ్రి: శ్యామలాంబ ఆలయ వీధి, ● తిరుపతి: BNR SV మాల్, STV నగర్, ఎయిర్ బై-పాస్ రోడ్.
ఇక్కడ షాపింగ్ చేయండి
JioMart.com
Now Order from JioMart on WhatsApp
Get ₹50* off
on orders above ₹100 via WhatsApp Pay
*T&C
Send 'Hi' to 79770 79770 On WhatsApp Or Scan QR Code to start Shopping
స్వీట్స్
BUY ANY1 GET ANY1 FREE
గులాబ్ జామున్/రస్‌గుల్లా 1 kg (సెలెక్ట్ వేరియంట్స్) (బికాజీ/స్నాక్‌టాక్/ దేశీ ఫుడీస్) ఎమ్ఆర్‌పి ₹289 మొదలుకుని
సోన్‌పాప్‌డీ / బేసన్ లడ్డు 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) (బికాజీ/స్నాక్‌టాక్/కరాచి) ఎమ్ఆర్‌పి ₹135 మొదలుకుని
మైసూర్ పాక్ / కాజు కత్రి 200 g (కరాచి) ఎమ్ఆర్‌పి ₹150 మొదలుకుని
డ్రై ఫ్రూట్
BUY1 GET1 FREE
దివాలి డ్రై ఫ్రూట్ గిఫ్ట్ ప్యాక్ 225 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్) (గుడ్ లైఫ్ / నట్రాజ్ / వండర్‌ల్యాండ్) ఎమ్ఆర్‌పి ₹499 మొదలుకుని
₹399
గుడ్ లైఫ్ పొట్లీ ప్యాక్ 400 g ఎమ్ఆర్‌పి ₹499 ఆదాచేసకోండి ₹100
గిఫ్టింగ్ రేంజ్
BUY1 GET2 FREE
హ్యాపీ లివింగ్ / డ్రీమ్‌లైన్ / రేమండ్స్ / హోమ్ వన్ / బయంకా బెడ్ షీట్ (ఎంపిక శ్రేణి) ఎమ్ఆర్‌పి ₹1199 మొదలుకుని
₹699
ఓవల్‌వేర్ డిన్నర్ 12 పీస్ సెట్ ఎమ్ఆర్‌పి ₹1445 ఆదాచేసకోండి ₹746
₹399
ఓవల్‌వేర్ కప్ అండ్ సాసర్ సెట్ ఎమ్ఆర్‌పి ₹575 మొదలుకుని ఆదాచేసకోండి ₹176 మొదలుకుని
క్యాడ్బరీ సెలబ్రేషన్స్ 130.9 g మొదలుకుని/లాటె/ఓరియన్ చాకో పై 336 g (సెలెక్ట్ వేరియంట్స్)
33% వరకు తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹135 మొదలుకుని
కోకో కోలా / స్ప్రైట్ / థమ్స్అప్ / మాజా 1.2 ℓ మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
30% తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹70 మొదలుకుని ఆదాచేసకోండి ₹49 మొదలుకుని
ఫార్చ్యూన్ ఎవ్రీడే బాస్మతి రైస్ 5 kg + ఫార్చ్యూన్ రిఫైన్డ్ రైస్ బ్రాన్ హెల్త్ ఆయిల్ 5 ℓ + ప్యారీస్ వైట్ లేబల్ షుగర్ 5 kg
మా ధర ₹1299
కంబైన్డ్ ఎమ్ఆర్‌పి ₹2060 ఆదాచేసకోండి ₹761
గుడ్ లైఫ్ బాదం / జీడిపప్పు (W320) 500 g
మా ధర ₹339/ ₹385
ఎమ్ఆర్‌పి ₹549 / ₹499 ఆదాచేసకోండి ₹210 / ₹114
డైలీ రైస్ 25 kg
Daily Rice
మా ధర ₹1059 (₹42.36 /kg)
ఎమ్ఆర్‌పి ₹1200 ఆదాచేసకోండి ₹141
వుమెన్స్ వేర్ ₹199 మొదలుకుని
హలో లైఫ్ రిఫైన్డ్ సన్ ఫ్లవర్ ఆయిల్ 1 ℓ
మా ధర ₹142
ఎమ్ఆర్‌పి ₹198 ఆదాచేసకోండి ₹56
మైదా / శనగపిండి / బొంబాయి రవ్వ / దలియా 500 g / 1 kg
BUY1 GET1 FREE
ఎమ్ఆర్‌పి ₹45 మొదలుకుని
హెరిటేజ్ అగ్‌మార్క్ ఘీ గ్రేడ్ స్పెషల్ 1 ℓ
మా ధర ₹525
ఎమ్ఆర్‌పి ₹630 ఆదాచేసకోండి ₹105
అమూల్ అవసర్ కాజు కత్రి 200 g / 500 g
మా ధర ₹175/ ₹399
ఎమ్ఆర్‌పి ₹190 / ₹435 ఆదాచేసకోండి ₹15 / ₹36
పూజ సామాగ్రి (అగర్బత్తి / కర్పూరం)
BUY ANY1 GET ANY1 FREE
ఎమ్ఆర్‌పి ₹65 మొదలుకుని
మెన్స్ వేర్ ₹199 మొదలుకుని
తాజ్ మహల్ లీఫ్ టీ 500 g
ఆదాచేసకోండి ₹75
ఎమ్ఆర్‌పి ₹410 మొదలుకుని మా ధర ₹335 మొదలుకుని
బిస్కెట్స్ పెద్ద ప్యాక్ 300 g మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
50% వరకు తగ్గింపు
ఎమ్ఆర్‌పి ₹130 మొదలుకుని
డవ్/ పేర్స్/ఫియామా 125 g x 4 + 1/ లక్స్/రెక్సోనా 150 g x 3/ గోద్రెజ్ నం.1 150 g x 4 / సింథోల్ 150 g x 5 సోప్ (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY2 GET ANY1 FREE
ప్రతి దానికి ఎమ్ఆర్‌పి ₹189 మొదలుకుని
మెన్స్ / వుమెన్స్ డియో 135 ml మొదలుకుని (సెలెక్ట్ వేరియంట్స్)
BUY ANY1 GET ANY1 FREE
ఎమ్ఆర్‌పి ₹225 మొదలుకుని
సర్ఫ్ ఎక్సెల్ ఈజీ వాష్ 5 kg / టైడ్ 6 kg పౌడర్ (సెలెక్ట్ వేరియంట్స్)
ఆదాచేసకోండి ₹150
ఎమ్ఆర్‌పి ₹685 మొదలుకుని మా ధర ₹535 మొదలుకుని
కిడ్స్ వేర్ ₹129 మొదలుకుని
వద్ద కూడా లభ్యం
SMART POINT
10% CASHBACK SBI card
#Min. Trxn.: ₹2,500; Max. Cashback: ₹500 per card account. Validity: 14 Oct - 18 Oct 2022. T&C Apply.
UPI UNIFIED PAYMENTS INTERFACE
*T&C Apply
Get 5X Loyalty Points On each UPI Transaction
Valid from 12th Oct to 25th Oct 2022
లో మాత్రమే ఆఫర్స్ చెల్లుతాయి:

'కోస్టల్ బెల్ట్' డబుల్ లైన్, విద్యుదీకరణ పనులు పూర్తి

- రూ.3వేల కోట్లతో నిర్మాణం
- వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల రవాణా సులభతరం


విజయవాడ-గుడివాడ-భీమవరం-నర్సాపూర్ సెక్షన్‌లలో పూర్తయిన డబ్లింగ్, విద్యుదీకరణ పనులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): దక్షిణ మధ్య రైల్వేలో నిత్యం రద్దీగా ఉండే విజయవాడ-విశాఖపట్నం కోస్టల్ రైలు కారిడార్‌కు ప్రత్యామ్నాయంగా 2011-12 ఆర్థిక సంవత్సరంలో రూ.3 వేల కోట్లతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్టల్ బెల్ట్‌లో కొత్త ప్రాజెక్టును అధికారులు ప్రారంభించారు. విజయవాడ-గుడివాడ-భీమవరం-నర్సాపూర్, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం-నిడదవోలు సెక్షన్లలో 221 కిలోమీటర్ల దూరం డబుల్ లైన్, విద్యుదీకరణ పనులు ఆర్‌వీఎన్‌ఎల్ (రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్) సంస్థ చేపట్టింది. ఐదు దశల్లో చేస్తున్న పనులు గురువారం పూర్తయ్యాయి. దీంతో కోస్టల్ ప్రాంతంలోని ప్రజల ఆకాంక్ష నెరవేరింది. వ్యవసాయ, ఆక్వా ఉత్పత్తుల రవాణా సులభతరం కానుంది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ విద్యుదీకరణ వల్ల ఇంధన ఆదాతో పాటు రైల్వేకు వ్యయం తగ్గిందన్నారు. ప్రాజెక్టు పూర్తి చేయడంలో కృషి చేసిన జోనల్ హెడ్ క్వార్టర్స్ బృందం, విజయవాడ డివిజన్ అధికారులు, ఆర్‌వీఎన్‌ఎల్ సంస్థను ప్రత్యేకంగా అభినందించారు.

మున్సిపల్ కమిషనర్ రామారావు ఇంట్లో ఏసీబీ సోదాలు

- ఇటీవల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం
- తాజాగా ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు


సారిపల్లిలోని రామారావు స్వగృహంలో సోదాలు చేస్తున్న ఏసీబీ అధికారులు

నెల్లిమర్ల రూరల్: పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ నగర పంచాయతీ కమిషనర్‌గా పనిచేసిన నడిపేన రామారావు ఇంట్లో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. ఇటీవల షాపు లీజు కోసం ఓ వ్యక్తి నుంచి లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలంలోని సారిపల్లి గ్రామంలోని ఆయన స్వగృహంతో పాటు బంధువుల ఇళ్లలోనూ ఏసీబీ అధికారులు తనిఖీలు చేశారు. సోదాల్లో అక్రమ ఆస్తులు బయటపడడంతో నిందితుడిపై తాజాగా ఆదాయానికి మించిన ఆస్తుల కేసును నమోదు చేశారు. శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి మీడియాతో మాట్లాడుతూ.. గత నెల 21న లంచం తీసుకుంటుండగా రామారావును అదుపులోకి తీసుకున్నామని, మరుసటి రోజు స్వగ్రామమైన సారిపల్లితో పాటు బంధువుల ఇళ్లలో సోదాలు నిర్వహించగా విలువైన పత్రాలు లభ్యమయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు నిందితుడి మొత్తం ఆస్తుల విలువ సుమారు రూ.86 లక్షలున్నట్లు గుర్తించామన్నారు. ఆదాయానికి మించి ఆస్తుల విలువ రూ.64 లక్షలున్నట్లు తేలిందని చెప్పారు. విజయనగరంలో ఇల్లు కొనుగోలు చేసినట్లు గుర్తించామని.. ఇంటి డాక్యుమెంట్ విలువ రూ.43 లక్షలున్నప్పటికీ.. ఎక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు విచారణలో తేలిందన్నారు. ఆస్తులన్నీ నిందితుడు రామారావు పేరు మీదనే ఉన్నాయని స్పష్టం చేశారు.

వారి భూముల ధరల పెంపు కోసమే విశాఖపై వ్యతిరేకత

747వ రోజు రిలే నిరాహార దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు

తాడికొండ: కేవలం తమ భూముల ధరలు పెంచుకునేందుకే అమరావతి కులవాదులు విశాఖను రాజధానిగా వద్దని వ్యతిరేకిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 747వ రోజుకు చేరుకున్నాయి. నాయకులు పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

ఫ్రీగా ప్రీ పెయిడ్ మీటర్లు



రాష్ట్రవ్యాప్తంగా 1.92 కోట్ల విద్యుత్ సర్వీసులు
- తొలివిడతలో 59.19 లక్షల స్మార్ట్ మీటర్లు
- తొలగనున్న ఆలస్య, అదనపు చార్జీల భారం
- సెల్‌ఫోన్‌తో నచ్చిన టారిఫ్ రీచార్జ్ చేసుకునే వెసులుబాటు
- నష్టాల నుంచి బయట పడనున్న పంపిణీ సంస్థలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అత్యధిక విద్యుత్ వినియోగం కలిగిన 59.19 లక్షల సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు దిశగా ఇంధన శాఖ కసరత్తు చేస్తోంది. 2023 డిసెంబర్ నాటికి 46.41 లక్షల మీటర్లు బిగించాలని లక్ష్యంగా నిర్ణయించగా 2025 మార్చి నాటికి మరో 12.77 లక్షల మీటర్లు అమర్చనున్నారు. మొదటి విడతలో అన్ని ప్రభుత్వ శాఖల సర్వీసులకు, నెలకు 500 యూనిట్లకు పైగా విద్యుత్ వాడే అన్ని కేటగిరీల సర్వీసులకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు అమర్చనున్నారు. ఇందుకు అయ్యే ఖర్చులో ఒక్క రూపాయి కూడా వినియోగదారుడిపై భారం పడకుండా మొత్తం ప్రభుత్వం, డిస్కంలే భరిస్తాయి. మీటర్లను అమర్చడం ద్వారా మొబైల్ రీచార్జ్ మాదిరిగా నచ్చిన టారిఫ్ ప్రకారం విద్యుత్ మీటర్‌ను రీచార్జ్ చేసుకోవచ్చు. దీంతో ట్రూఅప్ చార్జీల ప్రస్తావన రాదు. భవిష్యత్‌లో ఇంటింటికి వెళ్లి రీడింగ్ తీసి బిల్లు ఇచ్చే అవసరం కూడా డిస్కంలకు ఉండదు. బిల్లుల చెల్లింపులో జాప్యం జరిగినప్పుడు విధించే కస్టమర్ చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ, సర్ చార్జ్ లాంటి అదనపు చార్జీల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఎప్పటి ఖర్చు అప్పుడే వసూలు..

విద్యుత్ కొరత కారణంగా బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు కరెంట్ కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తున్న డిస్కంలు ఆ ఖర్చును రాబట్టుకునేందుకు ఏడాది చివరిలో ఇంధన సర్దుబాటు (ట్రూ అప్) చార్జీల వసూలు కోసం దరఖాస్తు చేసుకుంటున్నాయి. 2014-19 మధ్య దాదాపు రూ.20,572 కోట్ల ట్రూఅప్ చార్జీలు వసూలు కాలేదు. 2014-15 నుంచి 2018-19 మధ్య కాలానికి గతేడాది రూ.3,669 కోట్ల ఇంధన సర్దుబాటు చార్జీలను కొంత వరకూ వసూలు చేసి వినియోగదారులకే తిరిగిచ్చేయాల్సి వచ్చింది. అదే స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు అమరిస్తే ఎవరి మీటర్‌కు వారే మొబైల్ ద్వారా ముందుగా డబ్బులు చెల్లించి రీచార్జ్ చేసుకుంటారు. తద్వారా డిస్కంలు పెట్టిన ఖర్చు వెంటనే వెనక్కి వచ్చేసే అవకాశం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు తెలిపారు.

డిస్కంలపై తగ్గనున్న ఆర్థిక భారం..

రాష్ట్రంలోని డిస్కంల పరిధిలో అన్ని జిల్లాల్లో కలిపి దాదాపు 1.92 కోట్ల విద్యుత్ సర్వీసులున్నాయి. వాటిలో 20 నుంచి 30 శాతం వరకూ పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులుంటాయి. మిగతా సర్వీసులకు ప్రతినెలా విద్యుత్ బిల్లులను ప్రైవేట్ కాంట్రాక్ట్ రీడర్లు తీస్తున్నారు. దాదాపు పదివేల రీడర్లకు ముందుగా నిర్ణయించిన పీస్ రేటు ప్రకారం అర్బన్‌లో యూనిట్ కు రూ.3.29, రూరల్‌లో రూ.3.52 చొప్పున కమిషన్ చెల్లిస్తున్నారు. స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల వల్ల రీడింగ్ తీసే వారి ప్రమేయం క్రమంగా తగ్గి డిస్కంలపై ఆర్థిక భారం తప్పుతుందని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ జె.పద్మాజనార్దనరెడ్డి తెలిపారు.

ఇతర రాష్ట్రాల్లోనూ మొదలు..

దేశవ్యాప్తంగా ఇప్పటికే స్మార్ట్ మీటర్ల విధానం అమలు జరుగుతోంది. 4.4 మిలియన్ స్మార్ట్ మీటర్లను అమర్చారు. మీటర్ల ఏర్పాటులో ఉత్తరప్రదేశ్ (1.1 మిలియన్), బిహార్(0.8 మిలియన్), రాజస్థాన్ (0.5 మిలియన్), హరియాణా (0.4 మిలియన్), అస్సాం (0.2 మిలియన్) మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. హిమాచల్‌ప్రదేశ్, కేరళ, మేఘాలయ, ఉత్తరాఖండ్ లాంటి రాష్ట్రాలు కార్యాచరణ సిద్ధం చేశాయి. తాజాగా ఢిల్లీలో 4.5 మిలియన్ల విద్యుత్ గృహ విద్యుత్ వినియోగదారులకు స్మార్ట్ మీటర్లు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కేంద్రం నుంచి గ్రాంట్లు

రూ.3.03 లక్షల కోట్లతో కేంద్రం ప్రారంభించిన 'పునరుద్ధరించిన పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ఎస్)' అమలు వ్యయాన్ని 3 : 2 నిష్పత్తిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయి. మొత్తం ఖర్చులో సాధారణంగా 15 శాతం, గడువులోగా మీటర్లు పెడితే మరో 7.5 శాతం చొప్పున 22.5 శాతాన్ని గ్రాంటుగా అందిస్తుంది. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం, ట్రాన్స్‌మిషన్, పంపిణీ నష్టాలను తగ్గించడం, సోలార్ విద్యుత్ వినియోగానికి అనుగుణంగా వ్యవసాయ విద్యుత్ ఫీడర్‌లను వేరు చేయడంలో డిస్కంలకు సహాయపడుతున్న నేపథ్యంలో ఆర్‌డీఎస్ఎస్ ద్వారా రాష్ట్రానికి సాయం లభిస్తుంది.

జవాబుదారీతనం, నాణ్యమైన సేవలు



ఆంధ్రప్రదేశ్ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల పరిధిలో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నాం. స్మార్ట్ మీటర్ల వల్ల సరఫరాలో సాంకేతిక నష్టాలు, విద్యుత్ చౌర్యం, ఓవర్ లోడ్ లో ఓల్టేజీ లాంటి సమస్యలు చాలా వరకూ తగ్గుతాయి. డిస్కంలకు జవాబుదారీతనం పెరుగుతుంది. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందుతాయి.

–కె.విజయానంద్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

18న విజయవాడలో మెగా జాబ్ మేళా

3,000 మందికి ఉద్యోగ అవకాశం


జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పోలా భాస్కర్

మధురానగర్ (విజయవాడ సెంట్రల్): రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ఉన్నత విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జాబ్‌మేళా 18న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. 20 కంపెనీలు ఈ మేళాలో పాల్గొని 3,000 మందిని నియమించుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని మంత్రి బొత్స ప్రారంభిస్తారని, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు. మేళాలో ఏపీలోని 160 ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. అదే రోజు కళాశాల ప్రచురించిన పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం రామవరప్పాడులోని ఎం కన్వెన్షన్ హాలులో జరుగుతుందని వెల్లడించారు.

మెగా జాబ్ మేళాలో 1,156 మందికి ఉద్యోగాలు


నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో స్థానిక ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ఎత్తున మెగా జాబ్ మేళా జరిగింది. ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, ఉపాధి కల్పనపై అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. జాబ్ మేళాలో 100 ప్రైవేట్ సంస్థలు పాల్గొన్నాయి. సీఎం జగన్ స్ఫూర్తితో నిర్వహించిన మెగా జాబ్ మేళా విజయవంతమైందని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. జాబ్ మేళాలో మొత్తం 3,525 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మొదటి జాబితాలో 464 మంది, రెండవ జాబితాలో 692 మంది కలిపి మొత్తం 1,156 మందికి ఉద్యోగాలు వచ్చాయని ఎంపీ తెలిపారు. ప్రతి నెల రెండవ వారం తమ జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహిస్తామని తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొన్నా ఉద్యోగం రాని వారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తామన్నారు. డ్వాక్రా మహిళలకు ముద్ర లోన్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్‌లో సబ్సిడీ కూడా వస్తుందన్నారు. ఉద్యోగాలు పొందిన యువతకు ఎంపీ భరత్ రామ్, కలెక్టర్ మాధవీలత, వివిధ సంస్థల ప్రతినిధులు నియామక పత్రాలను అందజేశారు.

'వివేకా హత్యకేసు బదిలీ వినతి'పై కౌంటర్ వేయండి

సీబీఐ, ఏపీలకు సుప్రీంకోర్టు ఆదేశం

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసు విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలంటూ సునీతన్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌కు కౌంటరు దాఖలు చేయాలని సీబీఐ, ఏపీ ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. సునీత పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ ఎం.ఆర్.షా, సుధాంశు ధులియాలతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ఇద్దరు సాక్షులు ఇప్పటికే మరణించారని చెప్పారు. జిల్లా మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు 1+1 రక్షణ కల్పిస్తున్నామని, అవసరమైతే పెంచడానికి అభ్యంతరం లేదని ఏపీ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తెలిపారు. కేసులో ఇంటర్‌వీన్ కావడానికి వివేకా బంధువు ఒకరు అనుమతి కోరగా ధర్మాసనం నిరాకరించింది. శివశంకర్‌రెడ్డి బెయిలు అప్లికేషన్ విచారిస్తామని తెలిపింది. తదుపరి విచారణ అక్టోబరు 19కి వాయిదా వేసింది. ఈలోపు కౌంటరు దాఖలు చేయాలని సీబీఐ, ఏపీ ప్రభుత్వాలను ఆదేశించింది.

రూ.600 బాకీ అడిగాడని కొట్టి చంపాడు

కోవూరు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): బాకీ ఉన్న రూ.600 అడిగాడని ఓ వ్యక్తిని కొట్టి చంపిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు మండలం పడుగుపాడు గ్రామంలో శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... పడుగుపాడు పంచాయతీ పరిధిలోని ఎన్టీఎస్ గేటు సమీపంలో టింకరింగ్ మేస్త్రి పఠాన్ చాన్‌బాషా (64) టింకరింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అదే ప్రాంతంలో నివాసముంటున్న ఖాదర్‌బాషా అతని వద్ద ఆటోకు టింకరింగ్ పనులు చేయించుకున్నాడు. రూ.600 ఇవ్వాల్సి ఉండగా పలుమార్లు అడిగినా ఇవ్వలేదు. శుక్రవారం నమాజుకు వెళ్లే సమయంలో బాకీ విషయమై చాన్‌బాషా, ఖాదర్‌బాషా గొడవపడ్డారు. చాన్‌బాషాను ఛాతీపైన, ముఖంపైన ఖాదర్‌బాషా కొట్టడంతో చాన్‌బాషా అక్కడికక్కడే కుప్ప కూలి మృతి చెందాడు. అతనికి సాయం చేయడానికి వచ్చిన వారిని సైతం ఖాదర్‌బాషా బెదిరించాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ దాసరి వెంకటేశ్వరరావు సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

అత్యవసర మరమ్మతుల కోసమే..

రోడ్ కం రైల్వే బ్రిడ్జి తాత్కాలికంగా మూసివేతపై కలెక్టర్ స్పష్టీకరణ


మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత, చిత్రంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమహేంద్రవరం రూరల్: అత్యవసర మరమ్మతుల కోసమే తూర్పుగోదావరి జిల్లాలోని ప్రధాన రహదారి మార్గం గోదావరి రోడ్ కం రైల్వే బ్రిడ్జిని శుక్రవారం నుంచి వారం రోజుల పాటు తాత్కాలికంగా మూసివేస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ కే మాధవీలత స్పష్టం చేశారు. శుక్రవారం ఎంపీ భరత్‌రామ్ నిర్వహించిన మెగాజాబ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విలేకరులతో మాట్లాడారు. గోదావరి రోడ్ కం రైల్వే బ్రిడ్జి అత్యవసర మరమ్మతులపై గత నెలలో ప్రభుత్వానికి నివేదిక సమర్పించారన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్ కం రైల్వే వంతెనపై నీరు నిలిచిపోవడం, తదితర కారణాలవల్ల కొన్ని చోట్ల రెయిలింగ్స్ పడిపోయాయన్నారు. దీనికితోడు బ్రిడ్జిపై ప్రయాణికులు తరచుగా ఆగి సెల్ఫీలు తీసుకుంటున్నారని, ఈ నేపథ్యంలో వంతెనపై ఉన్న నడక మార్గం కూడా దెబ్బతిందని తెలిపారు. తాత్కాలికంగా రెయిలింగ్ మరమ్మతు పనులు చేపట్టేందుకు బ్రిడ్జిపై వాహన రాకపోకలు నిషేధించామన్నారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టేందుకు ఇప్పటికే రైల్వే శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని వివరించారు. ప్రజలంతా సహకరించి మరమ్మతులు పూర్తయ్యే వరకు.. పోలీసు అధికారులు సూచించే ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాలని కోరారు. ఎంపీ మార్గాని భరత్‌రామ్, నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.

దుర్గమ్మ దసరా హుండీ ఆదాయం రూ. 9.11 కోట్లు

గతేడాది కంటే రూ. 1.60 కోట్లు అధికం

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/శ్రీశైలంటెంపుల్: దసరా ఉత్సవాల్లో అమ్మవారికి కానుకలు, మొక్కుబడుల రూపంలో భక్తులు రూ.9.11 కోట్లను సమర్పించారు. విదేశీ భక్తులు 2,393 యూఎస్ డాలర్లను సమర్పించారు. అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల లెక్కింపు శుక్రవారంతో పూర్తయింది. నాలుగో రోజైన శుక్రవారం జరిగిన కానుకల లెక్కింపులో రూ.66,58,198 లభించింది. అలాగే 39 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి లభ్యమైనట్లు ఈవో భ్రమరాంబ చెప్పారు. ఉత్సవాల్లో మొత్తంగా రూ.9,11,33,985 నగదు, 1.416 కిలోల బంగారం, 29.475 కిలోల వెండి కానుకల రూపంలో వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ హుండీ ద్వారా రూ.77,382 ఆదాయం వచ్చిందన్నారు. దసరా ఉత్సవాల్లో గతేడాది కంటే ఈ ఏడాది రూ.1.60 కోట్లు అధికంగా కానుకలు, మొక్కుబడులను భక్తులు అమ్మవారికి సమర్పించారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు


కానుకలను లెక్కిస్తున్న శ్రీశైల దేవస్థాన అధికారులు, సిబ్బంది

శ్రీశైల మల్లన్న ఉభయ దేవాలయాల్లో హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా నగదు రూపేణా రూ.4,35,23,203 లభించినట్లు శ్రీశైల ఆలయ ఈవో ఎస్.లవన్న తెలిపారు. శుక్రవారం ఉభయ దేవాలయాల్లో భక్తులు గత 37 రోజుల్లో సమర్పించిన కానుకలను అలంకార మండపంలో లెక్కించారు. ఇందులో 373.5 గ్రాముల బంగారం, 4.4 కేజీల వెండి లభించాయి. యుఎస్ఏ డాలర్లు-703, ఆస్ట్రేలియా డాలర్లు-90, కెనడా డాలర్లు-25, సింగపూర్ డాలర్లు-15, మలేషియా రింగిట్స్-5, ఇంగ్లాండ్ పౌండ్స్-10, ఈరోస్-10, ఖతార్ రియాల్స్-1 లభించినట్లు వివరించారు.

షెడ్యూల్డ్ ప్రాంతాలను నోటిఫై చేయకపోవడంపై పిల్

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు
- విచారణ నవంబర్ 7కి వాయిదా



సాక్షి, అమరావతి: రాజ్యాంగ నిబంధనల ప్రకారం రాష్ట్రంలోని పలు మండలాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా నోటిఫై చేయకపోవడంపై హైకోర్టు శుక్రవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 7కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. పలు మండలాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా నోటిఫై చేయాల్సి ఉన్నప్పటికీ, ఆ పని చేయడంలేదని, దీనివల్ల గిరిజనులు తీవ్రంగా నష్టపోతున్నారంటూ విశాఖపట్నం జిల్లాకు చెందిన సీహెచ్ ధనుంజయ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ శేషసాయి ధర్మాసనం విచారించింది. పిటిషనర్ న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఏటా షెడ్యూల్డ్ ప్రాంతాలను నోటిఫై చేసి ఆ వివరాలను రాష్ట్రపతికి పంపాల్సిన బాధ్యత గవర్నర్‌పై ఉందన్నారు. కొద్ది సంవత్సరాలుగా ఈ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు. పలు మండలాలను షెడ్యూల్డ్ ప్రాంతాలుగా ప్రకటించాలని 2018లో ట్రైబల్ కమిషన్ సిఫారసు చేసినా ప్రయోజనం లేకపోయిందన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల పరిధిలో ఉండాల్సిన మండలాలు ఆ ప్రాంతాల పరిధిలో లేకపోవడంవల్ల గిరిజనేతరులు ఆ ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేస్తున్నారని, ఇది అక్కడి గిరిజనులకు తీవ్ర నష్టం కలిగించే చర్య అని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీచేసింది.

క్లుప్తంగా

వైఎస్సార్ ఏఎఫ్‌యూలో బీఆర్క్ ప్రవేశాలు


బీఆర్క్ ప్రవేశ పత్రాలను అందజేస్తున్న సురేంద్రనాథ్ రెడ్డి

ఏఎఫ్‌యూ: కడపలోని డాక్టర్ వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ వర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) కోర్సులో ప్రవేశాలు నిర్వహించారు. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఎంపిక చేసుకున్న కళాశాలల్లో శనివారం లోపు రిపోర్ట్ చేయాల్సి ఉండటంతో శుక్రవారం పలువురు విద్యార్థులు వర్సిటీకి వచ్చారు. వారి సర్టిఫికెట్లను అధ్యాపకులు పరిశీలించారు. అనంతరం వీరికి బీఆర్క్ ప్రవేశాల స్టేట్ కన్వీనర్, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సురేంద్రనాథ్ రెడ్డి ప్రవేశాల పత్రాలను అందజేశారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ చక్కటి అవకాశాలు కలిగిన ఈ కోర్సుకు మంచి డిమాండ్ ఉందన్నారు. శుక్రవారం 23 మంది రిపోర్ట్ చేసినట్లు చెప్పారు.

ఒంగోలు ట్రిపుల్ ఐటీలో ప్రారంభమైన అడ్మిషన్ల ప్రక్రియ


ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్ ప్రక్రియ

వేంపల్లె: ఇడుపులపాయ క్యాంపస్‌లోని సెంట్రల్ లైబ్రరీలో ఒంగోలు ట్రిపుల్ ఐటీ 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశానికి అడ్మిషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. 516 మంది విద్యార్థులను కౌన్సెలింగ్‌కు పిలవగా 439 మంది హాజరయ్యారు. ఒంగోలు, ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీల డైరెక్టర్లు బి.జయరామిరెడ్డి, కె.సంధ్యారాణిలు మాట్లాడుతూ..ప్రవేశాలు పొందిన విద్యార్థులకు పీయూసీ-1, పీయూసీ-2 తరగతులు ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోనే జరుగుతాయన్నారు. మిగిలిన నాలుగేళ్ల కోర్సు ఒంగోలు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పూర్తిచేస్తారని తెలిపారు.

'దేవదాసి'పై వైఖరి చెప్పండి

తెలంగాణ, కర్ణాటక, ఏపీ, మహారాష్ట్రలకు ఎన్‌హెచ్‌ఆర్‌సీ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: దేవదాసి వ్యవస్థ కొనసాగింపుపై వైఖరి చెప్పాలని తెలంగాణ, కర్ణాటక, ఏపీ, మహారాష్ట్రలకు జాతీయ మానవహక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) నోటీసులు జారీచేసింది. దేశంలోని వివిధ దేవాలయాల్లో, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో దేవదాసి వ్యవస్థ వల్ల ముప్పు వాటిల్లుతోందంటూ వచ్చిన మీడియా కథనాలను కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఆరువారాల్లోగా వైఖరి తెలపాలని నోటీసుల్లో పేర్కొంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ 1982, 1988ల్లో దేవదాసి సంప్రదాయం చట్టవిరుద్ధమని ప్రకటించాయని మీడియా నివేదిక తెలిపింది. అయితే.. అదే నివేదిక కర్ణాటకలో 70 వేలమంది, తెలుగు రాష్ట్రాల్లో 80 వేలమంది దేవదాసీలుగా జీవిస్తున్నారని జస్టిస్ రఘునాథరావు కమిషన్ పేర్కొందని తెలిపింది.

తమ భూముల ధరల పెంపు కోసమే విశాఖపై వ్యతిరేకత

747వ రోజు రిలే నిరాహార దీక్షలో మండిపడ్డ బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: కేవలం తమ భూముల ధరలు పెంచుకునేందుకే అమరావతి కులవాదులు విశాఖను రాజధానిగా వద్దని వ్యతిరేకిస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 747వ రోజుకు చేరుకున్నాయి. పలువురు మాట్లాడుతూ.. కేవలం ముందస్తు వ్యూహంతో చంద్రబాబు ఇన్‌సైడర్ ట్రేడింగ్ చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారంతో కోట్ల రూపాయలు దోపిడీ చేసేందుకు వేసిన ఎత్తుగడలే అమరావతి నగరమన్నారు. అద్భుతమైన పాలన అందించేందుకు అమరాతితో పాటు విశాఖ, కర్నూలును అభివృద్ధి చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మూడు రాజధానుల నిర్ణయం తీసుకున్నారని గుర్తుచేశారు. పేదల భూములను సైతం వదలకుండా తక్కువ ధరలకు లాక్కుని వాటిని తప్పుడు జీవో ద్వారా చట్టబద్ధం చేసుకుని కోట్ల రూపాయలు లబ్ధిపొందిన చంద్రబాబుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్టు చేసి జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. నాయకులు పెరికే వరప్రసాద్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య పలువురు దళిత నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



విజయవాడ కేదారేశ్వరపేటలో లబ్ధిదారుకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



కాకినాడ నగరంలో ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

ఆహ్వానిస్తూ.. అర్జీలిస్తూ

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అన్ని జిల్లాల్లోనూ విజయవంతంగా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు గ్రామగ్రామానికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుంటున్నారు. శుక్రవారం ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగింది. గ్రామానికి వచ్చిన నాయకులను ప్రజలు సాదరంగా ఆహ్వానిస్తూ తమ సంక్షేమం కోసం పనిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి తామంతా అండగా నిలుస్తామని చెప్పారు.



నెల్లూరు ఆదిత్య నగర్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్



తిరుపతి జిల్లా తిరుచానూరులో లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

రాష్ట్రంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఐ బ్యాంక్

నేడు ఏలూరులో తొలి కార్నియా సేకరణ కేంద్రాన్ని ప్రారంభించనున్న గవర్నర్

సాక్షి, అమరావతి : బ్లడ్ బ్యాంకులను నిర్వహిస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఇకపై కార్నియా(నేత్రదానం) సేకరణ కేంద్రాలనూ ప్రారంభిస్తుందని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ చైర్మన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ప్రాజెక్ట్స్ కో ఆర్డినేటర్ బీవీఎస్ కుమార్‌లు వెల్లడించారు. తొలి కార్నియా సేకరణ కేంద్రాన్ని ఏలూరు కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షుడు, గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ శనివారం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కాలుష్యం, ఇతర కారణాలతో కార్నియా అంధత్వం ఉన్న వారి సంఖ్య ఏటా పెరుగుతోందని, ఇన్‌ఫెక్షన్‌లు, వ్యాధులు, కంటి గాయాలు కార్నియాను దెబ్బతీస్తాయని తెలిపారు. ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే దాదాపు ఏడు లక్షల మంది కార్నియా సంబంధిత వ్యాధులైన కెరటైటిస్, ఓక్యులర్ హెర్పెస్, హెర్పెస్ జోస్టర్‌తో బాధపడుతున్నారని ఓ అంచనాగా పేర్కొన్నారు. అలాంటి వారికి సకాలంలో కార్నియా మార్పిడి జరిగితే దృష్టిని పునరుద్ధరించవచ్చని తెలిపారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం


శ్రీశైలంలోకి 3.95 లక్షల క్యూసెక్కుల ప్రవాహం

- ఈ సీజన్‌లో ఇది రెండో గరిష్ట వరద
- శ్రీశైలం ప్రాజెక్టు పదిగేట్లు ఎత్తివేత
- సాగర్, పులిచింతలలోకి వచ్చిన వరద వచ్చినట్టుగా దిగువకు
- ప్రకాశం బ్యారేజ్ నుంచి 2.90 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి
- నేడు ప్రకాశం బ్యారేజ్‌లోకి 4 లక్షల నుంచి 4.30 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశం
- పెన్నాలో మరింత పెరిగిన వరద

సాక్షి, అమరావతి/శ్రీశైలంప్రాజెక్టు/మాచర్ల: పరివాహక ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా, ఉపనదుల్లో వరద ఉధృతి మరింత పెరిగింది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,95,652 క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండటంతో పదిగేట్లను 15 అడుగులు ఎత్తి 3,77,160 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమగట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 65,534 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడ్ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 10 వేల క్యూసెక్కులు, హంద్రీ–నీవా సుజల స్రవంతికి 141 క్యూసెక్కులు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి 800 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.5 అడుగుల్లో 212.91 టీఎంసీలు నిల్వచేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టు స్పిల్‌వే, విద్యుత్‌కేంద్రాల నుంచి దిగువకు వదిలేస్తున్న జలాల్లో నాగార్జునసాగర్‌లోకి 4,25,400 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో స్పిల్‌వే 20 గేట్లు, విద్యుత్‌కేంద్రాల ద్వారా దిగువకు వదిలేస్తున్నారు. సాగర్‌లో 589.7 అడుగుల్లో 311.15 టీఎంసీలను నిల్వచేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజ్‌లోకి పెరుగుతున్న వరద

పులిచింతల ప్రాజెక్టులోకి 3,90,904 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. ఎగువ నుంచి భారీ వరద వస్తుండటంతో వరద నియంత్రణలో భాగంగా పులిచింతల ప్రాజెక్టును కొంతభాగం ఖాళీ చేస్తూ స్పిల్‌వే గేట్లు, విద్యుత్‌కేంద్రం ద్వారా 4,34,066 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో ప్రకాశం బ్యారేజ్‌లోకి వచ్చే వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రకాశం బ్యారేజ్‌లోకి 2,96,561 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణాడెల్టాకు ఆరువేల క్యూసెక్కులు విడుదల చేస్తూ 2.90 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. పులిచింతల నుంచి భారీగా విడుదల చేసిన వరదలో 4 లక్షల నుంచి 4.30 లక్షల క్యూసెక్కులు శనివారం ప్రకాశం బ్యారేజ్‌కి చేరుకునే అవకాశం ఉండటంతో అధికారులు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పశ్చిమ కనుమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఆల్మట్టి, నారాయణపూర్‌లలోకి వచ్చిన వరదను వచ్చినట్లు 1.84 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. వాటికి తుంగభద్ర, వేదవతి, బీమా, హంద్రీ వరద తోడవనుండటంతో శనివారం కూడా ఇదేరీతిలో శ్రీశైలంలోకి వరద ఉధృతి కొనసాగనుంది.



శ్రీశైలం డ్యాం పదిగేట్ల ద్వారా దిగువకు నీటివిడుదల

అప్పర్ పెన్నార్ నుంచి నెల్లూరు బ్యారేజ్ దాకా..

కర్ణాటక, రాయలసీమ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పెన్నాలో వరద ఉధృతి మరింత పెరిగింది. దీంతో అప్పర్ పెన్నార్ నుంచి ప్రాజెక్టు నుంచి నెల్లూరు బ్యారేజ్ వరకు అన్నింటి గేట్లను ఎత్తేశారు. అనంతపురం జిల్లాలోని చాగల్లు రిజర్వాయర్ నుంచి 32 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తుండటంతో వైఎస్సార్ జిల్లాలోని గండికోట, మైలవరం జలాశయాల్లోకి వరద ఉధృతి పెరిగింది. గండికోట, మైలవరం నిండుకుండలను తలపిస్తున్నాయి. మైలవరం జలాశయం నుంచి 41,392 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో సోమశిలలోకి వరద ఉధృతి పెరిగింది. సోమశిలలోకి 31,260 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఇక్కడ 68.39 టీఎంసీలను నిల్వచేస్తూ.. స్పిల్‌వే, విద్యుత్‌కేంద్రం ద్వారా 27,998 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ఆ జలాలు సంగం బ్యారేజ్ మీదుగా నెల్లూరు బ్యారేజ్‌కు చేరుతున్నాయి. నెల్లూరు బ్యారేజ్‌లో మిగులుగా ఉన్న 16 వేల క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు.

20 తర్వాత వాయు'గండం'!

- రాష్ట్రంపై అధిక ప్రభావం
- భారీ నుంచి అతి భారీ వర్షాలకు ఆస్కారం
- ఐఎండీ ముందస్తు అంచనా

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రానికి వాయు'గండం' పొంచి ఉంది. దీపావళికి ముందు రాష్ట్రంపైకి దూసుకు రానుందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) అంచనా వేస్తోంది. ఈనెల 18న ఉత్తర అండమాన్ సముద్రం పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. ఇది 20వ తేదీకి మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారి, పశ్చిమ వాయవ్య దిశగా పయనిస్తూ పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. ఇది కోస్తాంధ్ర – ఒడిశాల మధ్య తీరం దాటే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే, ఇది తుపానుగా మారే అవకాశాలు తక్కువని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. కాగా ఈ వాయుగుండం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో కొనసాగనుండటం వల్ల దాని ప్రభావం ఆంధ్రప్రదేశ్‌పైనే ఎక్కువగా ఉంటుందని, ఈనెల 20 తర్వాత రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. తీరం వెంబడి బలమైన గాలులు వీస్తాయని తెలిపింది.

ఆవర్తనం ప్రభావంతో..

ప్రస్తుతం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో నైరుతి బంగాళాఖాతానికి ఆనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో ఇప్పటికే రాష్ట్రంలో మోస్తరుగా, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తున్నాయి. రానున్న రెండు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని ఐఎండీ శుక్రవారం రాత్రి తెలిపింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు నందలూరు (అన్నమయ్య జిల్లా)లో 5.3 సెంటీమీటర్లు, డోన్ (నంద్యాల)లో 4.6, జరుగుమిల్లి (ప్రకాశం)లో 4.4, వరదాయపాలెంలో (తిరుపతి) 3.9, పెంటపాడులో (పశ్చిమ గోదావరి) 3.9, రాజమండ్రి 3.8, మైలవరం (ఎన్టీఆర్), 3.6, విజయవాడలో 3.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

హయగ్రీవకు భూకేటాయింపు వివరాలివ్వండి

- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- విచారణ ఈ నెల 20కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖ జిల్లా యండాడ గ్రామ పరిధిలోని 12.50 ఎకరాల భూమిని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించడంపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ భూకేటాయింపులను రద్దుచేయాలని కలెక్టర్ సిఫారసు చేసిన తరువాత ఏం చర్యలు తీసుకున్నారో వివరించాలని స్పష్టం చేసింది. ఆ భూముల కేటాయింపు, అందులో నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధమని తేలితే ఆ నిర్మాణాలను ఆ భూమిలో ఏర్పాటు చేయాల్సిన అనాథ శరణాలయం, వృద్ధాశ్రమానికి కేటాయిస్తామని పేర్కొంది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. యండాడలోని సర్వే నంబరు 92/3లోని 12.5 ఎకరాల భూమిలో అనాథ శరణాలయం, వృద్ధాశ్రమం నిర్మించాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా ఆ భూమిని హయగ్రీవ ఫార్మ్స్ అండ్ డెవలపర్స్‌కు కేటాయించారని, ఈ కేటాయింపులను రద్దుచేసి భూమిని వెనక్కి తీసుకునేలా ఆదేశాలివ్వాలంటూ జనసేన కార్పొరేటర్ పి.ఎల్.వి.ఎన్.మూర్తియాదవ్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ శేషసాయి ధర్మాసనం విచారించింది.

ఊపిరిపీల్చుకున్న 'అనంత'

తగ్గుముఖం పట్టిన వరద

- బాధితులకు నిత్యావసరాలు, నగదు అందజేత

అనంతపురం క్రైం : వరద తగ్గుముఖం పట్టడంతో అనంతపురం ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. నగరంతో పాటు శివారులోని లోతట్టు ప్రాంతాలన్నీ ముంపు నుంచి దాదాపు బయటపడ్డాయి. దీంతో ప్రజలు తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. రోడ్లు, వీధులను శుభ్రంచేయడంలో మునిసిపల్ కార్పొరేషన్, పంచాయతీ కార్మికులతో పాటు అగ్నిమాపక సిబ్బంది నిమగ్నమయ్యారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వే చేపట్టారు. వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లోని 600 మందికి పైగా ప్రజలు ఇళ్లకు వెళ్లిపోయారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వరద బాధితులకు తక్షణ సాయం అందజేస్తున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.2 వేల నగదు, 25 కేజీల బియ్యం, లీటర్ పామాయిల్, కేజీ కందిపప్పు, కేజీ ఎర్రగడ్డలు, కేజీ బంగాళాదుంపలు ఇస్తున్నారు. మరోవైపు.. నగరంలోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్‌తో కలిసి శుక్రవారం వరద బాధితులకు నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతపురంలో 34 వేల కుటుంబాలు, రాయదుర్గంలో 300 కుటుంబాలు వరద ప్రభావానికి గురైనట్లు గుర్తించామని కలెక్టర్ వెల్లడించారు.



వరద ప్రభావిత ప్రాంతంలో శుభ్రంచేస్తున్న పారిశుధ్య కార్మికులు

భవిష్యత్ ఆశాకిరణం ఎర్రజెండాయే



వేదికపై అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు



జాతీయ మహాసభలకు హాజరైన నాయకులు , కార్యకర్తలు

- సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి రాజా
- ఘనంగా ప్రారంభమైన సీపీఐ జాతీయ మహాసభలు
- హాజరైన 16 దేశాల కమ్యూనిస్టు ప్రతినిధులు
- భారీ ర్యాలీతో కదం తొక్కిన కామ్రేడ్లు

సాక్షి, అమరావతి: దేశ భవిష్యత్‌కు ఆశాకిరణం ఎర్రజెండాయే అని సీపీఐ జాతీయ కార్యదర్శి డి.రాజా అన్నారు. రానున్న కాలంలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులంతా ఏకమై బీజేపీని నిలువరిస్తాయని చెప్పారు. సీపీఐ 24వ జాతీయ మహాసభలు శుక్రవారం విజయవాడలో ప్రారంభమయ్యాయి. తొలుత కేదారేశ్వరపేటలోని మీసాల రాజేశ్వరరావు బ్రిడ్జి నుంచి అజిత్‌సింగ్ నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియం వరకు నిర్వహించిన భారీ ర్యాలీలో దేశం నలుమూలల నుంచి వచ్చిన కార్యకర్తలు, నాయకులు కదం తొక్కారు. అనంతరం బహిరంగ సభలో రాజా మాట్లాడుతూ.. మోదీ పాలన కంటే వాజ్‌పేయి పాలన ఎంతో బాగుందన్నారు. ఆనాటి బీజేపీ వేరని, ఇప్పటి మోదీ ఉన్న బీజేపీ వేరని ఎద్దేవా చేశారు. మోదీ పాలనలో అదానీ వంటి పెద్ద స్మగ్లర్లు అత్యంత ధనవంతుల జాబితాలోకి చేరుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ అధికారం చేపట్టిన అనంతరం దేశంలో 29 మంది ఆర్థిక నేరగాళ్లు దేశం విడిచి పారిపోతే.. వారిలో 19మంది గుజరాత్ వాళ్లేనని విమర్శించారు. పార్టీ జాతీయ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కె.నారాయణ, ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మాట్లాడారు.

అర్ధంతరంగా ఆగిన బహిరంగ సభ

భారీ వర్షం కారణంగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో సభ అర్ధంతరంగా నిలిచిపోయింది. విద్యుత్ వైర్లు కాలిపోయి మైకులు సైతం పనిచేయలేదు. వర్షం పెరగడంతో వేదికపై ఉన్న నాయకులు, దిగువన ఉన్న కార్యకర్తలు వెళ్లిపోయారు. దీంతో రాజా ప్రసంగాన్ని మధ్యలోనే ఆపేసి సభను రద్దు చేశారు. కాగా చైనా, రష్యాతోపాటు 16 దేశాల నుంచి కమ్యూనిస్టు నేతలు సౌహార్ద్ర ప్రతినిధులుగా హాజరయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 10 ప్రత్యేక రైళ్లలో పార్టీ శ్రేణులు తరలివచ్చారు.

'ఈనాడు'పై విశాఖ ఎంపీ పరువు నష్టం దావా

- తప్పుడు కథనంతో నా పరువు, మర్యాదలకు భంగం
- పోలీసులకూ ఫిర్యాదు
- 2018లో నేను ఎంపీని కాదు కదా.. వైఎస్సార్‌సీపీలోనూ చేరలేదు
- అక్కడ 2019 మార్చిలోనే భవనానికి అనుమతులొచ్చాయి
- ఇదంతా అసలు పూర్తిగా ప్రైవేట్ వ్యవహారం
- ఈ వివరాలన్నీ ఆ పత్రిక ప్రస్తావించలేదు
- నాపై ఆ పత్రికలో వచ్చిన కథనం నిరాధారమైనది
- ఈనాడు ఖండన ప్రచురించాలి.. ఆన్‌లైన్‌లో ఆ కథనం లింక్‌లు తొలగించాలి
- విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : ఈనాడు పత్రికపై విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పరువు నష్టం దావా వేయడంతోపాటు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. ఈనెల 13న ఈనాడులో 'ఎంపీ గారి దందా' శీర్షికతో వచ్చిన కథనం పూర్తిగా నిరాధారమైనదని, తన పరువుమర్యాదలకు భంగం కలిగించేలా ఉందని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈనాడు కథనంలో చెప్పిన పది ఎకరాల 57 సెంట్ల భూమికి సంబంధించిన వాస్తవాలను ఆయన ఆ ప్రకటనలో వివరించారు.

ఆ వివరాలేవీ ఈనాడు ప్రస్తావించలేదు

ఈ భూమి వ్యాపార లావాదేవీలు 2012లో మొదలై



భూ యజమానులతో అగ్రిమెంటు 2018 జనవరి 8న జరిగిందని.. అప్పటికి తాను పార్లమెంటు సభ్యుడ్నిగానీ, కనీసం వైఎస్సార్‌సీపీ సభ్యుడ్ని కూడా కాదని ఎంపీ స్పష్టంచేశారు. తాను 2018 మేలో వైఎస్సార్‌సీపీలో చేరానన్నారు. ఒక వ్యాపారిగా ఈ భూమికి చెందిన ప్రైవేటు వ్యక్తులందరితోను ఒప్పందాలు చేసుకుని, వివాదాన్ని పరిష్కరించుకుని నిర్మాణం మొదలుపెట్టానని తెలిపారు. ఈ భవనానికి జీవీఎంసీ 2019 మార్చిలో అనుమతులు ఇచ్చిందని గుర్తుచేశారు. కానీ, ఈనాడు పత్రికలో ఈ విషయాలేవీ ప్రస్తావించకుండా తప్పుడు కథనం ప్రచురించిందని ఆరోపించారు.

ఇది పూర్తిగా ప్రైవేట్ వ్యవహారం..

నిజానికి.. కూర్మన్నపాలెంలో ఈ భూమిపై వివాదం 1982 నుంచి సుదీర్ఘకాలంగా నడుస్తోందన్నారు. గొట్టిపల్లి శోభారాణి కుటుంబీకులు, 160 మంది డాక్ లేబర్ బోర్డు (డీఎల్‌బీ) ఉద్యోగులతోపాటు కొప్పిసెట్టి శ్రీనివాస్‌ల మధ్య ఈ వివాదం ఉందని.. దీన్ని పరిష్కరించేలా చూడాలని బిల్డర్‌గా ఉన్న తనను 2012లో డీఎల్‌బీ ఉద్యోగులు ఆశ్రయించారని ఎంపీ సత్యనారాయణ తెలిపారు. ఆ 160 మంది ఉద్యోగులకు ఒక్కొక్కరికి ఒక్కో ఫ్లాట్ చొప్పున మొత్తం 160 ఫ్లాట్లను ఇస్తామని తాను చెప్పడంతో వారు తమ వాటాను తనకు 2012లోనే అగ్రిమెంటు చేశారని ఆయన పేర్కొన్నారు. ఇక ఆ తర్వాత కొప్పిసెట్టి శ్రీనివాస్‌తో తాను సంప్రదింపులు జరిపానని, 2012లో మొదలైన ఈ ప్రక్రియ చివరకు 2017లో ముగిసిందని, వారికి 30 వేల చదరపు అడుగులు ఇచ్చేలా 2017లో ఎంఓయూ కుదిరిందన్నారు. ఇక మిగిలిన గొట్టిపల్లి శోభారాణి, ఆమె కుటుంబీకులకు 14,400 చదరపు అడుగులు ఇచ్చే విధంగా 2018 జనవరిలో ఒప్పందం చేసుకున్నామని, ఇవన్నీ పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల మధ్య జరిగిన ఒప్పందాలు, వీటికి ప్రభుత్వంలో ఉన్న వారికి ఎటువంటి సంబంధంలేదని ఎంపీ స్పష్టంచేశారు. ఈ ఒప్పందాలతోపాటు వివిధ పక్షాలకు రూ.8 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు చెల్లింపులు కూడా చేశామన్నారు.

2019 మార్చిలోనే ప్లాన్‌కు జీవీఎంసీ ఆమోదం

ఇవన్నీ పూర్తయ్యాక 15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవంతులను నిర్మించుకునేందుకు 2019 మార్చి 11న జీవీఎంసీ ప్లాన్‌ను ఆమోదించిందని ఎంపీ తెలిపారు. అక్కడ ధర చదరపు అడుగు రూ.4 వేల మేర ఉన్నా ఇందులో కొన్న సుమారు 1,800 మందికి రూ.2,500కే ఇచ్చామని, గేటెడ్ కమ్యూనిటీ సదుపాయాలున్న ఈ ప్రాజెక్టులో ఒక్కో ఫ్లాటు రూ.30 లక్షలలోపు ధరకే అందించానని, ఇదంతా పూర్తిగా ప్రైవేటు వ్యవహారమని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ స్పష్టంచేశారు. ఈ నేపథ్యంలో.. ఈనాడు పత్రికలో ప్రచురితమైన కథనం అవాస్తవమని.. ఈనాడు యాజమాన్యం ఖండన ప్రచురించాలని, అలాగే.. ఈనాడు నెట్‌వర్క్‌లో ఈ కథనానికి సంబంధించి ఆన్‌లైన్ లింక్స్ తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈనాడు గ్రూప్ చైర్మన్ చెరుకూరి రామోజీరావుకు, అదే విధంగా ఎడిటర్ (ప్రింట్ మీడియా) పై చట్టబద్ధమైన సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, వారికి రిజిస్టర్డ్ పరువు నష్టం నోటీసును ఇస్తూ, పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎంవీవీ సత్యనారాయణ పేర్కొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్న పవన్

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు

సాక్షి, అమరావతి: పవన్ కల్యాణ్ ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, ఒక సామాజిక వర్గానికి న్యాయం చేసేలా వ్యవహరిస్తున్నారని ఏపీ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ధ్వజమెత్తారు. పవన్ ఉత్తరాంధ్ర ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా చంద్రబాబు ఏం చెప్తే అది చేస్తున్నారని ఒక ప్రకటనలో విమర్శించారు. ఉత్తరాంధ్ర ఉద్యమాన్ని నీరుగార్చే లక్ష్యంతో విశాఖ ప్రాంతంలో మూడు రోజులు పర్యటన పెట్టుకొన్నారని చెప్పారు. జనసేన ముసుగులో చంద్రబాబు కనుసైగలతో పవన్ పనిచేస్తున్నారని విమర్శించారు. విశాఖ గర్జన కార్యక్రమాన్ని ముందుగానే ప్రకటించినప్పటికీ, పవన్ హడావుడిగా అదే సమయంలో యాత్ర చేపట్టి ఏం సాధించదలుచుకున్నారని ప్రశ్నించారు.

ఓ వర్గం ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాల తాకట్టు తగదు

- 3 రాజధానులకు మద్దతుగా మాల మహానాడు ఆధ్వర్యంలో దీక్షలు



కొవ్వలిలో నిరాహార దీక్షలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు యోనారాజు

సాక్షి, అమరావతి/దెందులూరు: రాష్ట్రాభివృద్ధి కోసం మహోన్నత ఆశయంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన వికేంద్రీకరణకు మద్దతుగా, అలాగే కుట్రపూరిత అమరావతి పాదయాత్రకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా దీక్షలు ప్రారంభించినట్టు మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తా యోనారాజు తెలిపారు. పీవీ రావు మాల మహానాడు ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లోనూ ఒక రోజు దీక్షలు నిర్వహిస్తామన్నారు. ఏలూరు జిల్లా కొవ్వలిలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గొల్ల కిరణ్, జిల్లా యూత్ అధ్యక్షుడు సుధాకర్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా యోనారాజు మాట్లాడుతూ కేవలం 29 గ్రామాలున్న ప్రాంతాన్ని రాజధాని అనడం.. ఒక సామాజికవర్గ ప్రయోజనం కోసం గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుని రాష్ట్ర విస్తృత ప్రయోజనాలను బలిపెట్టిందని విమర్శించారు. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు 10 వేల ఎకరాలు ఇచ్చిన రాయలసీమ వాసులు, పోలవరం ప్రాజెక్టుకు గిరిజనులు చేసినదాన్ని త్యాగం అంటారని యోనారాజు గుర్తు చేశారు.

ప్రజల మద్దతు మూడు రాజధానులకే



డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): ప్రజలంతా మూడు రాజధానులకే మద్దతు తెలుపుతున్నారు. ప్రజల అభీష్టాన్ని గౌరవిస్తూ సీఎం జగన్ ఆ దిశగా వికేంద్రీకరణ నిర్ణయం తీసుకున్నారు. అమరావతి పేరుతో రైతులు చేస్తున్న పాదయాత్ర కేవలం టీడీపీ రాజకీయ ప్రయోజనాలను కాపాడేందుకే అన్నట్లుంది. విశాఖలో పాలనా రాజధాని వద్దని వారు పాదయాత్ర ద్వారా స్పష్టంగా చెబుతున్నారు. ఇది ఉత్తరాంధ్ర వాసులను రెచ్చగొట్టడమే. విశాఖ పాలనా రాజధాని అయితే టీడీపీ ఇక ఎన్నటికీ కోలుకోలేదని ఆయన ఆందోళన.

– విశాఖలో మంత్రి విడదల రజిని

విశాఖ రాజధాని కాకపోతే పాతికేళ్లలో..
మరో విభజన యుద్ధం

- వెనుకబాటుతనం నుంచి బయటపడాలంటే విశాఖ పరిపాలన రాజధాని కావాలి
- సీఎం వైఎస్ జగన్ తీసుకున్న నిర్ణయానికే మా మద్దతు
- ఇప్పటికైనా గర్జించకపోతే ఇంకా వెనుకబడిపోతాం
- రాజకీయాలకు అతీతంగా విశాఖ గర్జన విజయవంతం చేయాలి
- విశాఖ గర్జన జెండా ఆవిష్కరణలో జేఏసీ ప్రతినిధులు



సంఘీభావం తెలుపుతున్న జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్. చిత్రంలో మంత్రి అమర్‌నాథ్, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, అవంతి, నాగిరెడ్డి, జేఏసీ సభ్యులు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): 'స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయింది. ఇప్పటికీ ఉత్తరాంధ్ర జిల్లాలు అత్యంత వెనుకబడి ఉన్నాయి. రాష్ట్ర విభజన సమయంలో వచ్చిన అవకాశాన్ని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీరుగార్చారు. దేవుడిలా.. ముఖ్యమంత్రిగా వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల విశాఖ కేంద్రంగా (రాజధానిగా) ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి మళ్లీ అవకాశం వచ్చింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకపోతే మరో 25 ఏళ్లలో ఇంకో విభజన యుద్ధం తప్పదు..' అని నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ లజపతిరాయ్ పేర్కొన్నారు. విశాఖలో శనివారం నిర్వహించనున్న విశాఖ గర్జనకు సంబంధించిన జెండాను శుక్రవారం విశాఖపట్నంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జేఏసీ సభ్యుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కేంద్రీకరణ వల్ల ఇప్పటికే నష్టపోయాం. వికేంద్రీకరణకు పిలుపునిచ్చిన ముఖ్యమంత్రి నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ముఖ్యమంత్రి ఆకాంక్ష.. ఇటు ఉత్తరాంధ్ర, అటు రాయలసీమతో పాటు మధ్యాంధ్రప్రదేశ్ కూడా అభివృద్ధి చెందుతాయన్న ముఖ్యమంత్రి ఆలోచనలకు అన్నివర్గాల ప్రజలు సహకరిస్తున్నారు..' అని చెప్పారు. విశాఖ కేంద్రంగా రాజధాని కోసం శనివారం విశాఖలో నిర్వహించనున్న విశాఖ గర్జనకు రాష్ట్ర వ్యాప్తంగా అనూహ్య స్పందన వస్తోందని తెలిపారు. విశాఖ వాసులు.. ఉత్తరాంధ్ర వాసులు ఈ గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ 'విశాఖ గర్జన ఉత్తరాంధ్ర ప్రజలకే కాదు.. రాష్ట్ర శ్రేయస్సు కోసం జరుగుతున్న ఉద్యమం. ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ఎన్నో కమిటీలు చెప్పాయి. కేంద్రం కూడా గుర్తించింది. అటువంటి ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం విశాఖ పరిపాలన రాజధానిగా, రాయలసీమ వాసుల కోసం కర్నూలు న్యాయ రాజధానిగా, మధ్యాంధ్రప్రదేశ్‌లో అమరావతి శాసన రాజధానిగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం..' అని చెప్పారు. ఇది అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తీసుకున్న గొప్ప నిర్ణయమన్నారు. విశాఖపట్నం రాజధాని అయితే ఉత్తరాంధ్ర జిల్లాలు అభివృద్ధి బాటపడతాయని తెలిపారు.

1956 ఏప్రిల్ ఒకటినే..

జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ 1953లో ఆంధ్రరాష్ట్రం మద్రాస్ ప్రెసిడెన్సీలో ఉండేదని, ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశంపంతులు ఉన్నప్పుడు తొలి అసెంబ్లీ సమావేశం విశాఖ ఏయూ టీఎల్ఎన్ సభా హాల్లో జరిగిందని చెప్పారు. కర్నూలు రాజధానిగా అప్పుడే ఒక తీర్మానం చేశారని గుర్తుచేశారు. తర్వాత పరిణామాల్లో 1956 ఏప్రిల్ ఒకటిన విశాఖ రాజధానిగా శాసనసభ్యులందరూ అప్పుడే తీర్మానం చేసినప్పటికీ, ఇక్కడి రాజకీయ నాయకులు చొరవ చూపకపోవడంతో రాజధాని హైదరాబాద్‌కు వెళ్లిపోయిందని చెప్పారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత వచ్చిన ఈ మంచి అవకాశాన్ని మనం నిలబెట్టుకోకపోతే భావితరాలకు అన్యాయం చేసిన వాళ్లమవుతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాజకీయాలు, కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరు ముందుకొచ్చి విశాఖ రాజధానికి సహకరించాలని అభ్యర్థించారు.

గళం విప్పాల్సిన తరుణమిది

- ఇప్పుడు గర్జించకపోతే భావితరాలకు తీరని అన్యాయం
- రాజకీయాలకు అతీతంగా విశాఖ గర్జనలో భాగస్వాములు కండి
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పిలుపు



విశాఖ గర్జన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ప్రొ.లజపతిరాయ్ తదితరులు

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): నాన్ పొలిటికల్ జేఏసీ పిలుపు మేరకు విశాఖ గర్జనను విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో శుక్రవారం ఆయన విశాఖ గర్జనకు సంబంధించిన జెండా, పాట ఆవిష్కరణ కార్యక్రమంలో మాట్లాడారు. కార్మికులు, కర్షకులు, రైతులు, విద్యార్థులు, మహిళలు, మేధావులు, న్యాయవాదులు, వైద్యులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అభ్యర్థించారు. ఇప్పుడు గళమెత్తకపోతే.. భావితరాలకు మనం తీరని అన్యాయం చేసిన వారమవుతామన్నారు. శాంతియుతంగా మన ప్రాంత ఆకాంక్షను తెలుపుదామని కోరారు. కొన్ని పత్రికలు, చానళ్లు ఈ ప్రాంత ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తూ దుష్ప్రచారం చేస్తుండటం బాధాకరమన్నారు. అటువంటి మీడియా సంస్థలు విశాఖ గర్జనలో భాగస్వాములు కాకపోయినా ఫర్వాలేదు కానీ, హాని తలపెట్టవద్దని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ విశాఖ అధ్యక్షుడు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ప్రొఫెసర్ పాల్, జేఏసీ సభ్యులు గంట్ల శ్రీనుబాబు, ఎస్ఎస్ శివశంకర్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ప్రొఫెసర్ బాల మోహన్‌దాస్, ప్రొఫెసర్ కొల్లూరి సూర్యనారాయణ, జేఏసీ కో కన్వీనర్ దేముడు మాస్టార్, ప్రొఫెసర్ షరన్, ప్రొఫెసర్ పాల్, డాక్టర్ పి.రామారావు, పైలా కృష్ణమోహన్, మంత్రి రాజశేఖర్, శోభశ్రీ, కె.ఈశ్వరరావు, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ఒక్కటే మాకొద్దు..

మూడు రాజధానులే ముద్దు..

- పాదయాత్రికులకు నిరసనల సెగ
- నిడదవోలులో అడ్డుకున్న స్థానికులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- అమరావతి పాదయాత్రికుల రెచ్చగొట్టే ధోరణితో ఉద్రిక్తత



నిడదవోలులో పాదయాత్రకు ప్లకార్డులు, నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతున్న స్థానిక ప్రజలు

నిడదవోలు: అమరావతి రైతుల పాదయాత్రకు తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలో తీవ్ర నిరసన సెగ తగిలింది. మండలంలోని మునిపల్లి గ్రామం నుంచి శుక్రవారం ఉదయం మొదలైన పాదయాత్ర కలవచర్ల, డి.ముప్పవరం, సమిశ్రగూడెం గ్రామాల మీదుగా నిడదవోలు పట్టణానికి చేరుకుంది. నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస నాయుడి నేతృత్వంతో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో భారీగా ఆ పార్టీ శ్రేణులు, స్థానికులు ఉదయం ఎనిమిది గంటలకే పట్టణంలోని ఓవర్ బ్రిడ్జి సెంటర్‌కు చేరుకున్నారు. అమరావతి పాదయాత్రకు నిరసనగా నినాదాలు చేపట్టారు. పాదయాత్ర ఓవర్ బ్రిడ్జి సెంటర్‌కు చేరుకున్న సమయంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, స్థానికులు తీవ్ర నిరసన తెలిపారు. ప్లకార్డులు, నల్ల బెలూన్లు, నల్ల చొక్కాలు, మహిళలు నల్ల చీరలు ధరించి అమరావతి పాదయాత్రపై నిరసన వ్యక్తం చేశారు. 'అమరావతి ఒక్క రాజధాని మాకొద్దు.. మూడు రాజధానులే ముద్దు', 'వికేంద్రీకరణతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం' అంటూ నినాదాలు చేస్తూ నల్ల బెలూన్‌లను గాల్లోకి వదిలారు. దాంతో స్థానిక ఓవర్ బ్రిడ్జి సెంటర్ పూర్తిగా నిరసనకారులతో నిండిపోయింది. పాదయాత్ర వచ్చే సమయంలో నినాదాలు మిన్నంటాయి. ఈ సమయంలో పాదయాత్ర చేస్తున్న వారిలో కొందరు రెచ్చగొట్టే ధోరణిలో నినాదాలు చేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెండు వర్గాలు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నాయి. అప్పటికే భారీగా మోహరించిన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిలువరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు, పెరవలి, నిడదవోలు ఎంపీపీలు కార్చెర్ల ప్రసాద్, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, నిడదవోలు, ఉండ్రాజవరం జెడ్పీటీసీ సభ్యులు కొయ్యే సూర్యారావు, భాస్కరరామయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజధానిగా విశాఖకు అర్హత ఉంది

- ఉత్తరాంధ్ర అభివృద్ధిని న్యాయవాదులు దృష్టిలో పెట్టుకోవాలి
- ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించాలి: మంత్రి ధర్మాన



శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్రంలో ప్రాంతీయ అసమానతలు లేకుండా ఉండేందుకు విశాఖను ఒక రాజధానిగా చేయాలని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శుక్రవారం శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బార్ ప్రతినిధులు ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అమరావతిలో భూములు ఇచ్చిన రైతులను తాము గౌరవిస్తామని, కానీ రైతులను అడ్డం పెట్టుకున్న రియల్ ఎస్టేట్ మాఫియాను మాత్రం సహించబోమని చెప్పారు. ఉత్తరాంధ్రవాసులు ఎప్పుడూ రాజధానికి దూరంగానే ఉన్నారని, ఇన్నాళ్లకు దగ్గరగా రాజధాని ఏర్పాటుకు అవకాశం వచ్చిందని, దాన్ని జారవిడుచుకోవద్దని చెప్పారు. ఉత్తరాంధ్రలో రాజధాని ఉంటే భావితరాలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదిక ప్రకారం రాజధానిగా విశాఖకు అన్ని అర్హతలు ఉన్నాయని అన్నారు. అధికార వికేంద్రీకరణ అవసరాన్ని ఆ కమిటీ సూచించిందన్నారు. పెద్ద క్యాపిటల్ ఈ రాష్ట్రానికి పనికిరాదని చెప్పిందన్నారు. చంద్రబాబు అందుకు భిన్నంగా, రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పాత కమిటీ నివేదికల ప్రకారం మూడు రాజధానుల నిర్ణయం తీసుకుందని తెలిపారు. రాజధాని ఏర్పాటుకు ముందు చంద్రబాబు దొనకొండ, నూజివీడు అంటూ రోజుకో పేరు చెప్పి రియల్ ఎస్టేట్ వర్గాలకు అనుగుణంగా రాజధాని ప్రకటన చేశారని తెలిపారు. ఆ రోజు జీ టు జీ ఒప్పందం జరిగిందని చెప్పారని, కానీ సింగపూర్ మంత్రి ఈశ్వరన్ అది నిజం కాదని చెప్పారని అన్నారు. మన ప్రాంత ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని న్యాయవాదులు ఉద్యమాల్లో కీలక పాత్రను పోషించాలని కోరారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఫల్గుణరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు వాసుదేవరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా లీగల్ సెల్ నాయకులు ఎమ్మెస్ వినయ్ భూషణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

మూడు రాజధానులకు మద్దతుగా ప్రదర్శన



మూడు రాజధానులకు మద్దతుగా బాపట్ల జిల్లా చీరాల గడియార స్తంభం సెంటర్‌లో స్థానికులు ఫ్లెక్సీలు, ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. ఎమ్మెల్సీ పోతుల సునీత పాల్గొన్నారు. – చీరాల అర్బన్

ఉత్తరాంధ్ర అంతటా అదే నినాదం

- వికేంద్రీకరణతోనే అన్ని ప్రాంతాల అభివృద్ధి
- మానవ హారాలు, భారీ ర్యాలీలు, సమావేశాలు
- మేధావులు, వ్యాపారులు, విద్యార్థులు, అన్ని వర్గాల మద్దతు



అగనంపూడి జంక్షన్‌లో మానవహారం

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల్లో ప్రతి ఒక్కరి నోట వికేంద్రీకరణ నినాదం మారుమోగుతోంది. రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిపాదించిన వికేంద్రీకరణ నినాదం ఉత్తరాంధ్రలోని ప్రతి గ్రామంలోనూ ఉవ్వెత్తున ఎగసి పడుతోంది. మూడు రాజధానుల ఏర్పాటుతో వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని శ్రీకాకుళం నుంచి అనకాపల్లి జిల్లా వరకు ఊరూ వాడా ఏకమై మద్దతు పలుకుతోంది. శుక్రవారం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో మానవ హారాలు, భారీ ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. విశాఖ గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటే గర్జిస్తామంటూ మేధావులు, విద్యార్థులు, సామాన్య ప్రజలు, వర్తకులు, ఉద్యోగులు నినదించారు.

నేడు అన్ని దారులూ విశాఖ గర్జన వైపే

- విశాఖ ఉత్తర నియోజకవర్గం 25వ వార్డులో వికేంద్రీకరణకు మద్దతుగా సమావేశం జరిగింది. నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. 46, 50, 51వ వార్డుల్లోని డీఎల్‌బీ గ్రౌండ్, మురళీనగర్ పార్కు, ఈస్ట్ పార్కు వద్ద వాకర్స్‌తో సమావేశమై వికేంద్రీకరణ ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సతీష్, కార్పొరేటర్లు వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, కోఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు పాల్గొన్నారు.
- విశాఖ తూర్పు నియోజకవర్గంలోని పలు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు శుక్రవారం ప్రజలతో సమావేశాలు నిర్వహించారు. భీమిలి నియోజవర్గంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయంలో విశాఖ గర్జనకు సంబంధించి పోస్టర్ విడుదల చేశారు. పరిపాలనా వికేంద్రీరణకు మద్దతుగా తగరపువలస పీఏసీఎస్‌లో సొసైటీ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సమావేశం అయ్యారు. చిట్టివలస బంతాట మైదానం నుంచి ర్యాలీగా విశాఖ గర్జనకు వెళ్లాలని తీర్మానించారు.
- భీమిలి, తగరపువలసకు చెందిన వంద మంది ఆటో కార్మికులు భీమిలి నుంచి తగరపువలస వరకు మద్దతుగా ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. పీఎం పాలెం వైఎస్ రాజశేఖరరెడ్డి ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు జగుపిల్ల నరేష్ ఆధ్వర్యంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు.
- విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్ ఆధ్వర్యంలో ఎస్‌పీడీ యునైటెడ్ క్రైస్ట్ చర్చిలో, పలు విద్యా సంస్థల్లో, ఎస్‌పీడీ టౌన్‌సీ మసీదుల్లో సమావేశాలు నిర్వహించి వికేంద్రీకరణకు మద్దతు పలకాలని కోరారు.
- పెందుర్తి నియోజకవర్గంలో పెందుర్తి రాంపురంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మూడు మండలాల పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి విశాఖ గర్జనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.
- గాజువాక నియోజకవర్గంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆధ్వర్యంలో 65, 66, 67, 68, 75 వార్డుల్లో విద్యార్థులతో, అగనంపూడిలో మానవ హారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి, దేవాన్ రెడ్డి, పల్లా చినతల్లి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.
- అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలో అభివృద్ధి వికేంద్రీకరణకు మద్దతుగా శుక్రవారం నక్కపల్లిలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై కళాశాల విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఉపమాక రోడ్డు వరకు 'ఒక రాజధాని వద్దు.. మూడు రాజధానులు ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్‌లో విద్యార్థులతో కలసి మానవ హారం నిర్వహించారు.

టీడీపీ హయాంలోనే కబ్జా కోరలు

▶ మొదటి పేజీ తరువాయి

విలువైన 430.81 ఎకరాల భూమిని ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంది.

బినామీ పేర్లతో..

టీడీపీ అధికారంలో ఉండగా ఆ పార్టీ నేతలు బినామీ పేర్లతో విశాఖ భూములపై రాబందుల్లా వాలిపోయారు. ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న విశాఖ చుట్టుపక్కల ప్రాంతాల్లో రూ.వేల కోట్ల విలువైన భూముల్ని చెరపట్టారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే టీడీపీ పెంచి పోషించిన భూబకాసురులపై ఉక్కుపాదం మోపింది.

ప్రత్యేక దర్యాప్తు బృందాలతో..

విశాఖతో పాటు చుట్టుపక్కల మండలాల్లో ఆక్రమణలకు గురైన విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు రెవెన్యూ యంత్రాంగం మూడేళ్లుగా చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాల్ని నియమించి క్షేత్రస్థాయి పరిశీలనతో భూముల పరిరక్షణకు చర్యలు చేపట్టారు. మొత్తం 270 ప్రాంతాల్లో ఆక్రమణలకు గురైన 430.81 ఎకరాల ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ధరల ప్రకారం వీటి రిజిస్ట్రేషన్ విలువ రూ.2,638 కోట్లు కాగా మార్కెట్ విలువ రూ.5 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక విశాఖ జిల్లాలో కబ్జాకోరుల నుంచి తిరిగి స్వాధీనం చేసుకున్న భూములు ఎకరాల్లో


మండలం	ఎన్ని ప్రాంతాలు	ఆక్రమణల విస్తీర్ణం	రిజిస్ట్రేషన్ విలువ(రూ.లలో)
అనకాపల్లి	07	2.3850	50,34,500
ఆనందపురం	25	104.35	105,35,31,060
అచ్యుతాపురం	02	0.28	5,83,000
భీమునిపట్నం	47	58.73	137,13,99,300
గాజువాక	70	50.5661	274,05,35,800
గోపాలపట్నం	01	0.0150	43,56,000
కశింకోట	02	0.25	4,30,000
నర్సీపట్నం	01	1.56	32,76,000
పద్మనాభం	12	11.55	36,25,00,000
పరవాడ	16	32.30	48,38,16,080
పెదగంట్యాడ	17	0.402	2,50,80,880
పెందుర్తి	08	16.12	4,60,72,000
రాంబిల్లి	11	8.02	1,40,57,000
సబ్బవరం	22	28.86	7,80,20,000
సీతమ్మధార	01	0.0723	1,92,50,000
విశాఖ రూరల్	23	114.2765	2016,97,78,380
యలమంచిలి	05	1.08	27,00,000
మొత్తం	270	430.8169	2638,04,20,000

పల్లా సోదరుడి భూ ఫలహారం..

అధికారులు స్వాధీనం చేసుకున్న భూముల్లో సింహభాగం టీడీపీ నేతల కబంధ హస్తాల్లో ఉన్నవే కావడం గమనార్హం. గయాలు, పోరంబోకు, గోర్జి, కొండ పోరంబోకు, వాగులు, కాలువలు, గెడ్డలు, రాస్తాలు, గుట్టలు, ఇనాం, జిరాయితీ, గ్రామకంఠాలు, చెరువులు.. ఇలా కాదేదీ కబ్జాకు అనర్హం అన్నట్లుగా కాజేశారు. కొద్దిరోజుల క్రితం గాజువాక నియోజకవర్గం తుంగ్లాం గ్రామ సర్వే నంబరు 33–2లో గుడితో పాటు ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమించేందుకు టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సోదరుడు పల్లా శంకర్రావు ప్రయత్నించాడు. అడ్డువచ్చిన స్థానిక యువతపై దాడికి యత్నించాడు.

ఎంతో మందిని హింసించిన చరిత్ర మీది

- యనమలపై మంత్రి రాజా ధ్వజం
- మీ పాలనలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్



తుని: అధికారంలో ఉన్న సమయంలో ఎంతో మంది నాయకులు, మహిళలను హింసించారని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుపై రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ అధికారం చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు తాము ఎవ్వరినీ ఇబ్బంది పెట్టలేదని తెలిపారు. శుక్రవారం కాకినాడ జిల్లా తుని ఏరియా ఆసుపత్రిలో మంత్రి మీడియాతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో అదృష్టంగా వచ్చిన పదవిని ప్రజల కోసం కాకుండా వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకున్న నీచ చరిత్ర యనమలదని చెప్పారు. ఆయన, ఆయన తమ్ముడు ఆడపిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించేవారని అన్నారు. ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో డిస్కంలకు రూ.80 వేల కోట్లు బకాయిలు పెట్టిన ఘన చరిత్ర యనమలదని చెప్పారు. తుని నియోజకవర్గంలో అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని యనమలకు సవాల్ విసిరారు. యనమల సొంత గ్రామంలో పాఠశాల, రోడ్లు నిర్మించలేక పోయారని, ఆ అవకాశం తనకు దక్కిందని చెప్పారు. యనమల గ్రాఫ్ పడిపోతోందని, వచ్చే ఎన్నికల్లోనూ తాను 30 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధిస్తానని రాజా అన్నారు. టీడీపీ హయాంలో వైఎస్సార్‌సీపీకి చెందిన 2,800 మంది పింఛన్లు తొలగించగా, అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న తాను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించానన్నారు. ఇప్పుడు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని మంత్రి రాజా చెప్పారు. తుని నియోజకవర్గంలో 109 నీటి రిజర్వాయర్లు కట్టిస్తున్నామని, త్వరలో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామని అన్నారు. యనమల ఏరియా ఆసుపత్రిని ఆదాయ వనరుగా మార్చుకుని, రోజుకు లక్ష రూపాయలు దండుకున్నారని ఆయన వివరించారు.



బ్యూటిఫుల్ సక్సెస్ మంత్ర

సక్సెస్ ఎప్పుడూ అందంగానే ఉంటుంది.
ఎందుకంటే అది ఆనందాన్నిస్తుంది కాబట్టి.
ఆనందాలు మళ్లీ మళ్లీ కావాలి...
కొత్త కొత్త రూపాల్లో రావాలి...
ఇదీ సంగీతారాజేశ్ ఆకాంక్ష.
స్పెషల్ ఎడ్యుకేషన్‌లో నిస్వార్థసేవ.
ఫ్యాషన్ ఇండస్ట్రీకి కొత్త నడక.
బ్యూటీ ఇండస్ట్రీ అధ్యయనం.
మహిళలకు మార్కెట్ పాఠాల బోధన.
అన్నింటిలో రాణిస్తున్న...
ఆమె 'సక్సెస్ మంత్ర' ఏమై ఉంటుంది?

ఓ ముప్పై- నలభై ఏళ్ల కిందట... 'ఇది ఇంపోర్టెడ్ శారీ, మా అన్న సింగపూర్ నుంచి తెచ్చాడు' అని ఒకరు హోదా ఒలకబోసేవారు. 'నాది కూడా ఇంపోర్టెడే. ఫలానా నగరంలో స్మగుల్డ్ గూడ్స్ దొరుకుతాయి' అని మరొకరు... మీకు నేనేమీ తీసిపోను అన్నంత ధీమాగా. అప్పట్లో ఇలా నడిచేవి సగటు మహిళల కబుర్లు. వాళ్లలో ఎవరికీ స్మగుల్డ్ గూడ్స్ కొనడం చట్టరీత్యా నేరమనే విషయం తెలియదు కూడా. సింథటిక్ మోజుతో పాటు ఇలాంటి హోదాల ప్రదర్శనలో మన సంప్రదాయ వస్త్రాలు తెరమరుగయ్యాయి, క్రమంగా వస్త్రాల తయారీదారులు కనుమరుగవడం కూడా మొదలైంది. అలాంటి సమయంలో గ్లోబలైజేషన్ రూపంలో వచ్చింది ఓ పెనుమార్పు. మన చేనేతలకు విదేశాల్లో అందుతున్న గౌరవాలను స్వయంగా చూసిన మన మహిళలే మన సంప్రదాయ చేనేతలకు బ్రాండ్ అంబాసిడర్‌లయ్యారు. నిర్లిప్తంగా మిగిలిపోయిన చేనేత, హస్తకళాకారుల వైపు చూసింది భారతీయ ఫ్యాషన్ ఇండస్ట్రీ. అలాంటి సమయంలో పెన్ కలంకారీని పునరుద్ధరించడానికి స్వచ్ఛందంగా సేవ చేశారు సంగీతా రాజేశ్. అంతకంటే ముందు ఆమె పిల్లల చదువు వారి మానసిల్లోసానికి, మేధావికాసానికి దోహదం చేయాలి తప్ప బడి అంటే భయపడేలాగ ఉండకూడదని స్పెషల్ కిడ్స్ కోసం ప్రత్యేకమైన కరిక్యులమ్ తయారు చేశారు. పిల్లల్లో మేధావికాసానికి మన తాతమ్మల నుంచి ఇంట్లో ఆడుకున్న బోర్డ్‌గేమ్స్ దోహదం చేస్తాయని ఆచరణలో చూపించారామె. సోషల్ మీడియాలో లక్షలాది ఫాలోవర్లున్న ఇన్‌ఫ్లుయెన్సర్ కూడా. ఇప్పుడు తాజాగా 'మనిషిని సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందుకు నడిపించే సాధనం అందంగా కనిపించడం కూడా' అని మరో ప్రయోగానికి తెర తీశారు.

స్పెషల్ పాఠాలు

"నేను మధురైలో పుట్టాను, దిండిగల్‌లో పెరిగాను. హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబంలోని అబ్బాయితో పెళ్లయింది. అలా పాతికేళ్ల కిందట హైదరాబాద్‌కి వచ్చాను. నేను స్పెషల్ ఎడ్యుకేటర్‌ని, స్పెషల్ చిల్డ్రన్‌కి స్పీచ్ థెరపీ, వాళ్లకు కాన్సెప్ట్ అర్థమయ్యేటట్లు టీచింగ్ మెటీరియల్, ప్రత్యేకమైన టీచింగ్ మెథడాలజీతో క్లాసులు చెప్పి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ పరీక్షలు రాయించి మెయిన్ స్ట్రీమ్‌కి పంపించడం నా బ్రెయిన్ చైల్డ్ ప్రాజెక్ట్. అందులో బిజీగా ఉన్నప్పుడు కలంకారీ మీద ఆసక్తి కలిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాళహస్తిలో నిష్ణాతులు చేసే పెన్ కలంకారీ మీద అధ్యయనం చేశాను. వాళ్ల చేతిలో కళ ఉంది, నా దగ్గర సృజన ఉంది. ఆ రెండింటినీ కలుపుతూ కొత్త ప్యాటర్న్స్ తెచ్చాం. వాటి ఖరీదు ఎక్కువే. కానీ ఒక చీర అమ్మగలిగానంటే దానిని తయారు చేసిన కుటుంబం నెలంతా ఆకలి లేకుండా జీవించగలుగుతుంది. పెన్ కలంకారీని ఆధునిక ఫ్యాషన్ ప్రపంచంలోకి తీసుకురావడంలో సక్సెస్ అయ్యాను. వీవర్స్‌కి ప్రయోజనం కల్పించడంలో నా లక్ష్యం నెరవేరింది. ఆ తర్వాత చాలామంది ఇదే పంథాను అనుసరించారు.

స్పెషల్ చాలెంజ్

ఫ్యాషన్ ఇండస్ట్రీని బాగా అధ్యయనం చేశాను. కాబట్టే బ్యూటీకి ఉన్న ఆదరణ, మేకోవర్ అవసరాన్ని కూడా తెలుసుకోగలిగాను. ఫ్యాషన్, బ్యూటీ... ఈ రెండూ ఒకదానితో ఒకటి కలగలిసి ఉంటాయి. అందం అనేది మనిషిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచే సాధనం. మరి అలాంటప్పుడు అందాన్ని పెంచుకోవడానికి ఎన్నెన్నో అధునాతన సాధనాలు అందుబాటులోకి వచ్చిన నేటి తరుణంలో అందంగా కనిపించడం అనే ఆకాంక్షకు ఎవరైనా ఎందుకు దూరంగా ఉండాలి? నేను వయసులో ఉన్నప్పుడు ఫ్యాషన్ ఇండస్ట్రీతో పరుగులు పెట్టాను. రిటైర్‌మెంట్ లేకుండా ఒకచోట స్థిమితంగా ఉంటూ నిర్వహించుకోవడానికి ఇప్పుడు కొత్త కెరీర్‌లోకి అడుగుపెట్టాను. ఇందులో కూడా సక్సెస్ అయ్యి, మరో ఐదేళ్లలో కొత్త తరానికి పాఠాలు చెప్పే స్థాయికి చేరుతాను. నేను కెరీర్ రోల్స్ ఎన్ని మార్చినా స్పెషల్ ఎడ్యుకేటర్ రోల్‌లో కొనసాగుతూనే ఉంటాను.

– సంగీతారాజేశ్,
స్పెషల్ ఎడ్యుకేటర్



పెన్ కలంకారీ కళాకారుడికి సూచనలు ఇస్తూ...

పంచడానికే జ్ఞానం!

నేను ప్రధానంగా టీచర్‌ని కావడంతో నాకు తెలిసిన, నేను తెలుసుకున్న విషయాలను నాలో దాచుకోలేను. జ్ఞానం ఉన్నది పలువురికి పంచడానికే అన్నట్లు ఉంటాను. వినడానికి నా ఎదురుగా ఎవరూ లేకపోతే ఫేస్‌బుక్‌లో చెబుతాను. అలా తొమ్మిదేళ్ల కిందటే నేను ఎఫ్‌బీ వేదికగా కాస్ట్యూమ్ ప్రజెంటేషన్ ఇచ్చాను. కోవిడ్ వచ్చినప్పుడు ప్రపంచం మొత్తం ఆన్‌లైన్‌లోకి వచ్చేసింది. నాకు అప్పటికే ఎనిమిది లక్షల ఫాలోవర్లున్నారు. ఆ టైమ్‌లో నాకు అసలైన చాలెంజ్ నా వ్యాపారాన్ని కొనసాగించడం కాదు, నా ఉద్యోగులకు జీతాలివ్వడం. రెండు వారాలు మినహా మిగతా కోవిడ్ సమయమంతా పని చేశాను. అప్పుడు షోరూమ్‌లు, మాల్స్‌లో జనం కనిపించలేదు, కానీ ఆన్‌లైన్‌లో చాలా ఎక్కువగా కొనుగోళ్లు చేశారు.

అదే నా సక్సెస్ సూత్ర

నేను కోవిడ్ టైమ్‌లో సూరత్, జైపూర్‌కు వెళ్లి అక్కడి నుంచి లైవ్‌లో డిస్‌ప్లే చేశాను. గంటల్లోనే కొనుగోళ్లు జరిగాయి. స్టాక్ అక్కడి నుంచే నేరుగా డెలివరీ ఇచ్చేశాను. ఒక రవాణా ఖర్చు, ఒక స్టేట్ జీఎస్టీ తగ్గిపోతే ఎంత ఆదానో ఆలోచించండి. విదేశాలకు వెళ్లాల్సిన స్టాక్ ఆగింది, మార్కెట్ చేసి పెట్టమని అడిగిన వాళ్ల స్టాక్‌ను ఆన్‌లైన్‌లో అమ్మేశాను. దాంతో స్టాక్ కొనుగోలుకు డబ్బు పెట్టాల్సిన అవసరం రాలేదు. అటు ఉత్పత్తిదారులు, నేను- నా ఉద్యోగులు, వినియోగదారులు... అందరికీ ప్రయోజనమే. అందుకే విన్ విన్ డీల్ ఎప్పుడూ సక్సెస్ అవుతుందని నమ్ముతాను. గృహిణులు కొంత మంది ఇంట్లోనే చిన్న స్థాయిలో దుస్తులు, ఇతర ఇంటికి అవసరమైన వస్తువుల వ్యాపారం చేస్తున్నారు. కానీ అదంతా అవ్యవస్థీకృతంగా ఉంది. అలాంటి హోమ్ సెల్లర్స్‌ను ఒక వేదిక మీదకు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాను. ఔత్సాహిక మహిళలకు బోధన తరగతులలో పాఠాలు చెప్తున్నాను. వ్యాపారం కోసం ఓ సొంత ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంట్ నిర్వహణ, ఆన్‌లైన్ లావాదేవీలలో శిక్షణ, మార్కెట్ మెళకువలతోపాటు డెడ్‌స్టాక్‌ను ఎలా డీల్ చేసే సులువు కూడా నేర్పిస్తున్నాను. హోమ్ సెల్లర్స్ చేసే పెద్ద పొరపాటు ఏమిటంటే... స్నేహితులు, బంధువులలో కస్టమర్లను వెతుక్కోవడం. ఆ పొరపాటు వల్ల స్నేహితులు, బంధువులు దూరమవుతారు తప్ప, లాంగ్ టర్మ్ కస్టమర్‌లను ఏర్పరుచుకోవడం సాధ్యం కాదు. ప్రొఫెషన్‌నీ, కుటుంబ బంధాలను కలపకూడదు" అని తాను నేర్చుకున్న, అనుసరించిన సక్సెస్ సూత్రను వివరించారు సంగీతారాజేశ్.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: మోహనాచారి

జాయిసీ లింగ్డో



అమేజింగ్ డ్రైవర్

ప్రతి పనిలోనూ పురుషులతో పోటీ పడుతున్నారు నేటితరం మహిళలు. గరిటే కాదు స్టీరింగ్‌నూ తిప్పేస్తామని అనేక సందర్భాల్లో స్టీరింగ్‌ను చాకచక్యంగా తిప్పిచూపించిన వారెందరో. తాజాగా ఈ జాబితాలో చేరిన జాయిసీ లింగ్డో.. అతిపెద్ద సంస్థ అమెజాన్‌లో ట్రక్ స్టీరింగ్ తిప్పుతూ ఔరా అనిపిస్తోంది. ఒకచోటనుంచి మరోచోటుకు అమెజాన్ గూడ్స్‌ను రవాణా చేస్తూ అమెజాన్ ఇండియాలో తొలి మహిళా ట్రక్ డ్రైవర్‌గా నిలిచింది . తనలాంటి వారెందరికో డ్రైవింగ్ కూడా ఒక ఉపాధి మార్గమంటూ చెప్పకనే చెబుతోంది.

మేఘాలయలోని షిల్లాంగ్‌కు చెందిన 35 ఏళ్ల నిరుపేద మహిళే జాయిసీ లింగ్డో. ఇంట్లో కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా ఉండడం తో అమ్మ, ముగ్గురు చెల్లెళ్ల భారం జాయిసీ భుజాలపైన పడింది. దీంతో చదువుని త్వరగా ముగించేసి వివిధ రకాల ఉద్యోగాలు చేస్తూ కుటుంబాన్ని పోషించసాగింది. గువహటీలోని స్టీల్ కంపెనీతోపాటు ఇతర కంపెనీలు, స్థానిక షాపుల్లో స్టోర్ మేనేజర్‌గా పనిచేసేది.



మనసుంటే మార్గం ఉంటుంది

వివిధ ప్రాంతాలకు తిరుగుతూ కొత్త ప్రాంతాలు, కొత్త మనుషుల్ని కలవడం బాగా నచ్చింది. అందుకే డ్రైవింగ్ మీద ఉన్న ఆసక్తిని వృత్తిగా మార్చుకుని రాణించగలుగుతున్నాను. డ్రైవింగ్‌ను వృత్తిగా ఎంచుకోవాలనుకునేవారు ముందు మిమ్మల్ని మీరు నమ్మండి. కొత్త ఉపాధి అవకాశాలు సమృద్ధిగా ఉన్నాయి వాటిని అందిపుచ్చుకునేందుకు ఆరాటపడాలి. కొత్తదారిలో నడిచేటప్పుడు అనేక సవాళ్లు ఎదురవుతాయి. సాధించాలన్న మనస్సుంటే మార్గం తప్పకుండా దారి చూపుతుంది.

– జాయిసీ లింగ్డో

సరదాగా ప్రారంభించి...

ఒకపక్క ఉద్యోగం చేస్తూనే మరోపక్క తన స్నేహితుల సాయంతో సరదాగా డ్రైవింగ్ నేర్చుకుంది. స్టీరింగ్ తిప్పడం బాగా వచ్చాక ఓ స్కూల్ బస్‌కు డ్రైవర్‌గా చేరింది. కొంతకాలం పని చేశాక అమెజాన్‌లో ట్రక్‌డ్రైవర్స్‌ను తీసుకుంటున్నారని తెలిసి దరఖాస్తు చేసుకుంది. ఆరేళ్ల డ్రైవింగ్ అనుభవం ఉండడంతో అమెజాన్ కంపెనీ జాయిసీని తీసుకుంది. దీంతో అమెజాన్ ఇండియాలో తొలి మహిళా ట్రక్ డ్రైవర్ గా నిలిచింది. గువహటీ వ్యాప్తంగా అమెజాన్ గూడ్స్‌ను సమయానికి డెలివరీ చేస్తూ మంచి డ్రైవర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. మహిళా ట్రక్ డ్రైవర్‌గా పనిచేస్తూ, తన లాంటి మహిళలెందరికో కొత్త ఉపాధి మార్గాన్ని ఎంచుకునేందుకు స్ఫూర్తిగా నిలుస్తోన్న జాయిసీ అమేజింగ్ డ్రైవర్‌గా పేరు తెచ్చుకుంటోంది.

బ్యూటిప్స్

మెరిపించే క్రీమ్



అర కప్పు బియ్యంలో కాస్త రోజ్‌వాటర్ వేసి రాత్రంతా నానబెట్టుకోవాలి. ఉదయాన్నే రోజ్‌వాటర్‌తోపాటు బియ్యాన్ని మెత్తగా రుబ్బుకోవాలి. దీనిలో ఎనిమిది కుంకుమ పువ్వు రేకులు, రెండు టేబుల్ స్పూన్ల అలోవెరా జెల్, కొన్ని చుక్కల కొబ్బరి నూనె లేదా గ్లిజరిన్ వేసి చక్కగా కలుపుకోవాలి. మిశ్రమం క్రీమ్‌లా మారేంతవరకు కలుపుకుని గాజుసీసాలో వేసి రిఫ్రిజిరేటర్‌లో నిల్వ చేసుకోవాలి. రోజూ ఉదయం, రాత్రి పడుకునే ముందు ఈ క్రీమ్‌ను ముఖానికి రాసుకుని మర్దన చేయాలి. ఆరిన తర్వాత గోరువెచ్చటి నీటితో శుభ్రం చేసుకోవాలి. క్రమం తప్పకుండా వారం రోజుల పాటు క్రీమ్ రాసుకోవడం వల్ల నల్లమచ్చలు, ట్యాన్ తగ్గి, ముఖచర్మం కాంతిమంతంగా మారుతుంది.

కిచెన్‌టిప్స్





- గుడ్లు ఉడికించేటప్పుడు టీస్పూను నూనె వేయాలి. అలా నూనె వేయడం వల్ల గుడ్లు పగలకుండా చక్కగా ఉడుకుతాయి.
- మిగిలిపోయిన అన్నాన్ని మరుగుతున్న నీటిలో వేసి ఐదారు నిమిషాలు తిప్పుతూ ఉంచి, తరువాత నీటిని తీసి వేస్తే అప్పుడే వండిన అన్నంలా వస్తుంది.

సృజన

ఒక గెలుపు కథ

శాస్త్రరంగం నుంచి సైనికరంగం వరకు మనకు స్ఫూర్తిని ఇచ్చే మహిళలు ఎంతో మంది ఉన్నారు. వారి గురించి తెలుసుకుంటే ఆగిపోయిన అడుగులో కదలిక మొదలవుతుంది. 'అందదు' అనుకున్న కల చేరువవుతుంది. అలాంటి మహిళలను తన పుస్తకాలతో లోకానికి పరిచయం చేస్తోంది మిన్నీ వైద్. వాస్తవ జీవిత కథతో తాజాగా 'ఫతే' అనే పుస్తకాన్ని రాసింది...



తాప్సీ పన్నుతో రచయిత్రి మిన్నీ

జర్నలిస్ట్, రైటర్, డాక్యుమెంటరీ ఫిల్మ్‌మేకర్‌గా తనదైన గుర్తింపు తెచ్చుకుంది ముంబైకి చెందిన మిన్నీ వైద్. మూడు సంవత్సరాల క్రితం 'ఇస్రో' మహిళా శాస్త్రవేత్తలపై తాను రాసిన పుస్తకం గురించి హిమాచల్‌ప్రదేశ్‌లోని కసోలి కంటోన్మెంట్ టౌన్‌లో ప్రసంగించింది. ప్రసంగం పూర్తయిన తరువాత జనరల్ అనీల్ చౌదరి మిన్నీతో మాట్లాడారు.

'ఇస్రోలోనే కాదు, ఆర్మీలో కూడా ఎంతో మంది స్ఫూర్తిదాయకమైన మహిళలు ఉన్నారు. వారి గురించి కూడా తప్పనిసరిగా రాయాలి' అంటూ కొంతమంది గురించి చెప్పారు ఆయన.

అలా 'ఫతే' పుస్తకానికి బీజం పడింది. ఆ పుస్తకంలో...

హరియాణాలోని చిన్న పట్టణంలో పుట్టి పెరుగుతుంది అర్చన. తనది సంప్రదాయ కుటుంబం. 'ఎక్కడి వరకు చదవాలో అక్కడి వరకే చదవాలి. ఉన్నత చదువులు అవసరం లేదు' అనేది ఆ కుటుంబ భావన.

కాలేజీ రోజుల్లో ఎన్‌సీసీలో చేరుతుంది అర్చన. అప్పుడే... సైన్యంలో పనిచేయాలని గట్టిగా అనుకుంటుంది.

అయితే తాను ఒకటి తలిస్తే, కుటుంబం ఒకటి తలిచింది.


అర్చనకు ఆర్మీ ఆఫీసర్ లక్ష్మణ్ దెస్వాల్‌తో వివాహం జరిపిస్తారు. పెళ్లితో తన కల కలగానే మిగిలిపోయింది. నాన్-ఫ్యామిలీ ఫీల్డ్‌లో భర్త ఉద్యోగం. సెలవుల్లో అతడు ఇంటికి వచ్చినప్పుడు...ప్రతిరోజూ అపూర్వమైన రోజు. భర్త విధుల్లో చేరిన తరువాత ఉత్తర ప్రత్యుత్తరాలు, ఫోన్‌లో గంటల తరబడి కబుర్లు ఉండేవి!

ఈ సంతోషకాలంలో, తన కల పెద్దగా గుర్తుకు వచ్చేది కాదు.

ఒకరోజు..

లక్ష్మణ్‌కు ఫోన్ చేస్తే ఎత్తలేదు... ఆయన ఫైరింగ్ లో చనిపోయాడు!

భూమి నిలువునా చీలిపోయింది. తాను ఎక్కడో పాతాళలోకంలో పడిపోయింది. అప్పటికే తాను గర్భవతి. బిడ్డను చూసుకోకుండానే ఆయన చనిపోయాడు.



భర్త ఉన్నప్పుడు ఎలాంటి సమస్యా ఎదురు కాలేదుగానీ, అతడు చనిపోయిన తరువాత అత్త, ఆడబిడ్డల నుంచి మానసిక హింస మొదలైంది. ఒక మూలన ఒంటరిగా కూర్చొని ఏడుస్తుంటే బాధ పెరుగుతుంది తప్ప తరగదు అనే విషయం తనకు అర్థం కావడానికి ఎంతో సేపు పట్టలేదు.

తాను మళ్లీ బతకాలంటే, కొత్త జీవితం మొదలుపెట్టాలి!

ఆగిపోయిన చదువును మళ్లీ పట్టాలెక్కించింది. ఒక్కో అడుగు వేస్తూ...ఆర్మీలో చేరాలనే తన చిరకాల కోరికను నెరవేర్చుకుంది. ఆర్మీ ఆఫీసర్ స్థాయికి ఎదిగింది. అమ్మాయి ఆలనాపాలన చక్కగా చూసుకుంటుంది.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో ఆలివ్‌గ్రీన్ యూనిఫామ్‌లో గంభీరంగా కనిపించే మేజర్ అర్చన వెనుక ఇంత కన్నీటి కథ ఉందని తెలిసినవారు చాలా తక్కువ.

నిజజీవిత కథ ఆధారంగా మిన్నీ రాసిన ఈ కాల్పనిక పుస్తకం పేరు... ఫతే.

'ఫతే' అంటే విజయం. ఎన్ని కష్టాలు దాటితే ఒక విజయం సొంతం అవుతుందో కళ్లకు కట్టే పుస్తకం ఇది.

దీనిలో ఎలాంటి శైలి, విన్యాసాలు, నాటకీయతా లేవు. 126 పేజీలలో సాధారణ వాక్యాలు కనిపిస్తాయి. అయితే అవి ఒక అసాధారణమైన వ్యక్తి గురించి అద్భుతంగా చెబుతాయి.

మిన్నీ ఈ పుస్తకం దగ్గరే ఆగిపోవాలనుకోవడం లేదు. అనేక రంగాలలో మనకు స్ఫూర్తిని ఇచ్చే మహిళలు ఎంతోమంది ఉన్నారు. వారి గురించి కూడా భవిష్యత్‌లో మరిన్ని పుస్తకాలు రాయాలనుకుంటోంది.

ఫీల్... గుడ్ ఫుడ్



ఒక్కోసారి కారణమేమీ లేకుండానే దిగులుగా అనిపిస్తుంది. విలువైన వస్తువులేవో పోగొట్టుకున్నట్లు ఉంటుంది. చిన్న చిన్న విషయాలకు కూడా చికాకు వేస్తుంటుంది. ఆ తర్వాత కాసేపటికి ఇష్టమైన వారెవరో కనిపిస్తేనో, ఏదైనా మంచి వార్తలు వింటేనో, ఏమయినా మంచి ఆహారం తింటేనో మూడ్ సరి అయిపోతుంది. ఇది మనసు చేసే మాయాజాలం. ఇదంతా జరగడానికి మన శరీరంలో ఉండే డోపమైన్ అనే హార్మోన్ విడుదలలో తేడాలు రావడమే కారణమని నిపుణులు చెబుతున్నారు. అయితే అలా కారణం మాత్రమే చెప్పి ఊరుకోకుండా మంచి మూడ్‌లోకి తీసుకొచ్చే కొన్ని ఆహార పానీయాల గురించి కూడా చెప్పారు. వీటిని కేవలం మూడ్ బాగోలేనప్పుడే కాదు, రోజువారీ తీసుకుంటే ఎప్పుడూ ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉండ వచ్చు కదా.. ఇంతకూ అలాంటి ఆహార పానీయాలేమిటా అని ఆలోచిస్తున్నారా? అక్కడికే వెళ్దాం...

వీటితోబాటు ఆకుకూరలు, కాలీఫ్లవర్, బ్రోకలీ కూడా డోపమైన్ బూస్టర్‌గా పనిచేస్తాయని నిపుణులు చెబుతున్నారు కాబట్టి అప్పుడప్పుడు వీటిని కూడా ఆహారంలో చేర్చుకుంటే సరి.

కొబ్బరి
పచ్చి కొబ్బరిలో మీడియం లెవెల్‌లో ట్రై గ్లిజరైడ్లు ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని, మెదడుకు చైతన్యాన్ని ఇస్తాయి. కొబ్బరి పాలు, కొబ్బరితో చేసిన తీపి పదార్థాలు తీసుకోవడం వల్ల ఒత్తిడి మటుమాయం అవుతుంది. అందుకే కొబ్బరికి మూడ్ ఫుడ్ అనే పేరుంది.

కాఫీ
సాధారణంగా చాలామందికి మూడ్ బాగోలేనప్పుడు లేదా తలనొప్పిగా అనిపించినప్పుడు మంచి ఫిల్టర్ కాఫీ తాగుతుంటారు. దాంతో శాడ్ మూడ్ కాస్తా తిరిగి హ్యాపీ మూడ్‌గా మారిపోతుంటుంది. ఒక పరిశోధన ప్రకారం రోజూ సుమారు బిలియన్ మందికి పైగా కాఫీ తాగుతుంటారు. రోజూ కాఫీ తాగేవారికి డిప్రెషన్ కూడా కాస్త దూరంలోనే ఉంటుందని కొన్ని సర్వేలలో తేలింది కాబట్టి నిద్రలేచి బ్రష్ చేసిన వెంటనే కాఫీ తాగే అలవాటున్నవారు దానిని కొనసాగించడం మంచిది. ఈసారెప్పుడైనా మూడ్ బాగోలేప్పుడు ఒక కప్పు కాఫీ తాగి చూస్తే సరి.

బెర్రీలు...
సాధారణంగా పండ్లు, కూరగాయలు బాగా తీసుకునే వారి మానసిక ఆరోగ్యం బాగానే ఉంటుంది. వాటిలోనూ ప్రత్యేకించి బెర్రీలలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫ్లేవనాయిడ్లు పుష్కలంగా ఉండటం వల్ల బెర్రీలు తీసుకునే వారికి కుంగుబాటు, ఆందోళన ఆమడదూరంలో ఉంటాయి. బ్లూ బెర్రీలు అంటే నేరేడు పండ్ల వంటివి తీసుకోవడం వల్ల మూడ్ బాగుంటుంది.

డెయిరీ ఉత్పత్తులు
ఒత్తిడిలో ఉన్నప్పుడు డెయిరీ ఉత్పత్తులు తీసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. చీజ్, పాలు, పెరుగు తీసుకుంటే.. శరీరంలో హ్యాపీ లెవల్స్ పెరుగుతాయి. చీజ్‌లో టైరమైన్ ఉంటుంది, ఇది మానవ శరీరంలో డోపమైన్‌గా మారుతుంది. పెరుగులో ప్రోబయోటిక్స్ పుష్కలంగా ఉంటాయి. ఒత్తిడిలో ఉన్నప్పుడు పాలు, చీజ్, పెరుగు తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. అంతే కాదు, పుల్లట్లు తిన్నా, పులి బొంగరాలు తిన్నా మంచిదే. కాకపోతే అవి సిద్ధంగా ఉండవు కాబట్టి వీలయినప్పుడల్లా తింటూ ఉంటే మంచిది.

అవకాడో
ఒకప్పుడు ఇది కాస్తంత ఖరీదైన ఆహారాల జాబితాలో ఉండేది కానీ ఇప్పుడు మాత్రం అందరికీ అందుబాటులోకి వచ్చింది. ఈ పండులో ఉండే మెత్తటి గుజ్జు అనేక రకాల పోషకాలకు నిలయం. దీనిలోని కొలీన్‌కు నాడీ వ్యవస్థను నియంత్రించడంతోపాటు మూడ్‌ను సంతోషంగా మార్చే లక్షణాలు ఉన్నాయి. ఒక సర్వే మేరకు అవకాడో తినే మహిళలలో ఆందోళన ఉండదట. వీటిలో సమృద్ధిగా ఉండే విటమిన్ బి శరీరంలోని ఒత్తిడి స్థాయులను అదుపు చేస్తుంది. అందువల్ల వీలయినప్పుడలా అవకాడో తింటూ ఉండటం ఎంతో ప్రయోజనకరం.

నట్స్
నట్స్‌లో అమైనో యాసిడ్స్ సమృద్ధిగా ఉంటాయి. అమైనో యాసిడ్‌కు డోపమైన్ విడుదలను పెంచే సామర్థ్యం ఉంది. ఒక అధ్యయనం ప్రకారం... నట్స్‌లో టైరోసిన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఈ టైరోసిన్ విచ్ఛిన్నమైతే.. డోపమైన్‌గా తయారవుతుంది. వేరుశెనగలు, బాదం, గుమ్మడి గింజలు, నువ్వులలో టైరోసిన్ పుష్కలంగా ఉంటుంది. వీటిని స్నాక్స్‌గా తీసుకుంటే ఉల్లాసంగా, ఆనందంగా ఉంటారు.

డార్క్ చాక్లెట్స్
ఇవి తినడానికి రుచిగా ఉండటమే కాదు.. ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం చూపే వాటిలో డార్క్ చాక్లెట్స్ ఎప్పుడూ ముందుంటాయి. వీటిలో ఉండే ఉండే ఫినైల్‌థైలమైన్ అనే రసాయనం డోపమైన్‌ను కొద్ది కొద్దిగా విడుదల చేస్తుంటుంది. అంతే కాదు, డార్క్ చాక్లెట్స్‌లో ఉండే కొన్ని రకాల రసాయనాల వల్ల ఎండార్ఫిన్ హార్మోన్, సెరోటోనిన్ అనే మోనోఅమైన్ న్యూరోట్రాన్స్‌మీటర్ విడుదలవుతాయి. వీటివల్ల మానసిక ఉల్లాసం, సంతోషం కలుగుతాయి.

అరటిపండు
అరటిపండ్లలో విటమిన్ బి6 ఉంటుంది. ఇది శరీరంలో డోపమైన్, సెరోటోనిన్ న్యూరో్ట్రాన్స్‌మీటర్ల విడుదలకు ఉపకరిస్తుంది. మెదడు, శరీరం చురుగ్గా ఉండేలా చేయడానికి ఈ రసాయనాలు తోడ్పడడంతోపాటు మానసిక స్థితిని నియంత్రణలో ఉంచి.. కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి. అరటిపండ్లు రక్తంలోని షుగర్ నిల్వలను సైతం నియంత్రించగలవు. అలాగని షుగర్ ఉన్నవారు ఒకేసారి రెండు మూడు అరటిపళ్లు లాగించేయకూడదు. మూడ్ సరిగా లేదనిపిస్తే మాత్రం ఒక అరటిపండు తింటే సరి.

● హెల్త్ టిప్
జామ ఆకులు జుట్టుకి దివ్యౌషధంలా పని చేస్తాయి. జుట్టు రాలడాన్ని నివారించడంతో పాటు జుట్టు పెరగడానికి దోహదపడతాయి. సరిపడా జామ ఆకుల్ని శుభ్రం చేసుకుని తగినన్ని నీరు పోసి 15 నిముషాల సేపు మరిగించాలి. చల్లారాక ఆ నీటిని తలపై నెమ్మదిగా పట్టిస్తూ బాగా మర్దనా చేయాలి. గంట తరువాత తలస్నానం చేయాలి. తరచు ఇలా చేయడం వల్ల వెంట్రుకల కుదుళ్లు గట్టిపడి జుట్టు ఒత్తుగా పెరుగుతుంది.

కళ్లకింద నల్లటి వలయాలా?



ఇటీవలి కాలంలో మొబైల్ ఫోన్ ఎక్కువగా ఉపయోగించడం, కంప్యూటర్ స్క్రీన్ వైపు అధికంగా చూడటం వల్ల చాలామందికి కళ్లు ఎర్రబడటం, మంటలు, కళ్లకింద నల్లటి వలయాలు ఏర్పడటం వంటి ఇబ్బందులు చోటు చేసుకుంటున్నాయి. అలాంటి వాటికి ఇంటిలో సహజంగా దొరికే వాటితోనే చక్కటి పరిష్కారం లభిస్తుంది. ఓసారి ప్రయత్నించి చూడండి.

కళ్ల ఎర్రబడి, మంట పుడుతుంటే ఉదయం లేదా సాయంత్రం.. సుమారు పది నిమిషాలు ఐస్‌క్యూబ్స్‌తో కళ్లను మసాజ్ చేసుకోవచ్చు. డైరెక్ట్‌గా చర్మం మీద కాకుండా.. కాటన్ క్లాత్‌లో చుట్టి.. మెల్లిగా కళ్లను మసాజ్ చేయాలి. ఒకవేళ ఐ మాస్క్ ఉంటే.. దానిని కొంతసేపు ఫ్రిజ్‌లో ఉంచి కళ్లకు పెట్టుకోవచ్చు.

చల్లని టీ బ్యాగులు: కోల్డ్ కంప్రెస్ లేదా ఐ మాస్క్ లేకుంటే.. ఉపయోగించిన టీ బ్యాగ్‌లు మీకు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. గ్రీన్ టీ వంటి అనేక టీలు యాంటీ ఆక్సిడెంట్లతో కూడి ఉండటం వల్ల వీటిని ఫ్రిజ్‌లో పెట్టి కళ్ల మీద పెట్టుకుంటే చాలు... కళ్లకింద ఉండే క్యారీ బ్యాగ్స్‌ను, డార్క్ సర్కిళ్లను తగ్గిస్తాయి.

తాజా కీరదోసకాయను ఒక మాదిరి పరిమాణంలో గుండ్రటి ముక్కలుగా తరిగి.. వాటిని ఒక గిన్నెలో పెట్టి అరగంట పాటు ఫ్రిజ్‌లో ఉంచండి. తర్వాత వాటిని ఫ్రిజ్ నుంచి తీసి కళ్లపై ఉంచి.. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి.

బాదం నూనె: బాదం నూనె, విటమిన్ ఇ మిశ్రమాన్ని ఉపయోగిస్తే కళ్ల కింద ఉండే నల్లటి వలయాలు క్రమంగా మటుమాయం అవుతాయి. పడుకునే ముందు మీ డార్క్ సర్కిల్స్‌ను బాదం నూనె, విటమిన్ ఇ మిశ్రమంతో కలిపి మసాజ్ చేయాలి.. ఉదయం లేచిన తర్వాత.. ఆ ప్రాంతాన్ని చల్లటి నీటితో శుభ్రం చేసుకుంటే కళ్ల మంటలు తగ్గి హాయిగా ఉంటుంది.

చల్లని పాలు: పాల ఉత్పత్తులు విటమిన్-ఎ ను కలిగి ఉంటాయి. ఇందులో రెటినోయిడ్స్ ఉంటాయి. ఇవి చర్మాన్ని ప్రకాశవంతంగా, యవ్వనంగా ఉంచడంలో గొప్పగా పనిచేస్తాయి. చల్లని పాల గిన్నెలో కాటన్ మేకప్ రిమూవర్ ప్యాడ్‌ను నానబెట్టండి. అనంతరం 10 నిమిషాల పాటు కళ్లపై ఉంచండి. గోరు వెచ్చని నీటితో శుభ్రం చేస్తే.. డార్క్ సర్కిల్స్ సమస్య తగ్గుతుంది.

కంటి నిండా నిద్ర: నిర్ణీత సమయం పడుకోకపోవడం వల్ల కళ్ల కింద ద్రవం పేరుకుపోతుంది. కాబట్టి కంటినిండా హాయిగా నిద్రపోవాలి. క్రమగా వ్యాయామం చేయాలి. ఈ సహజ నివారణలతో కంటిచుట్టూ ఉండే నల్లటి వలయాలను సులువుగా ఛేదించవచ్చు.

● మీకు తెలుసా?
నీళ్లు తాగుతున్నారా? కాస్త ఆగండి!



కొందరు వైద్యులు మంచినీళ్లు బాగా తాగమని చెబుతుంటారు. ఇంకొందరు అంత ఎక్కువగా తాగవద్దని చెబుతారు. అయితే కొన్ని పదార్థాలు తిన్న తర్వాత లేదా తాగిన తర్వాత నీళ్లు తాగడం మంచిది కాదని పెద్దవాళ్లు చెబుతుంటారు. దీని వెనుక మనలో చాలా మందికి తెలియని కారణం ఉంది. ఇంతకీ మనం ఏయే పదార్థాలు తీసుకున్న తర్వాత నీరు తాగకుండా ఉండాలో తెలుసా మరి?

అరటిపండు.. ఆయుర్వేదం ప్రకారం, పండ్లను తీసుకున్న తర్వాత నీరు తాగకూడదు. ఎందుకంటే ఇది శరీర సమతుల్యతను దెబ్బతీస్తుంది. మరి అరటిపండు తిన్న తర్వాత కనీసం అరగంట పాటు నీళ్లు తాగకపోవడానికి ఇదే కారణం.

పుచ్చకాయ: నీటిశాతం అధికంగా ఉండే వాటిలో పుచ్చకాయదే ప్రముఖ స్థానం. పుచ్చకాయ తిన్న తర్వాత నీటిని తాగడం ద్వారా సహజంగా ఊరే జీర్ణరసాలు పలుచన అవుతాయి. దీనివల్ల పొట్ట ఉబ్బరంగా మారుతుంది. కడుపు నొప్పి లేదా అజీర్ణంతో బాధపడ వలసి వస్తుంది.

పాలు: పాలు తాగిన తర్వాత నీళ్లు తినకూడదు. ఇలా చేయడం వల్ల జీవక్రియలు మందగిస్తుంది. ఇది ఎసిడిటీ, అజీర్ణానికి కూడా దారి తీస్తుంది.

సిట్రస్ జాతి ఫలాలు తిన్న తర్వాత... నారింజ, ఉసిరి, సీజనల్ మొదలైన సిట్రస్ పండ్లను తిన్న తర్వాత మన జీర్ణవ్యవస్థ నుండి యాసిడ్ బయటకు వస్తుంది. ఈ పండ్లను తిన్న తర్వాత మనం నీరు తాగితే, పిహెచ్ బ్యాలెన్స్ చెదిరిపోతుంది. అందుకే సిట్రస్ పండ్లు తిన్న తర్వాత మనం నీరు తాగకూడదు.


సినిమా

యాక్షన్ షురూ


● నాగచైతన్య

అక్కినేని నాగచైతన్య హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్‌సీ 22' (వర్కింగ్ టైటిల్). వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. 'బంగార్రాజు' వంటి హిట్ తర్వాత నాగచైతన్య, కృతీ శెట్టి జంటగా నటిస్తున్న చిత్రమిది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్‌పై శ్రీనివాసా చిట్టూరి తెలుగు-తమిళ భాషల్లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో అరవింద్ స్వామి, శరత్ కుమార్, ప్రియమణి కీలక పాత్రల్లో నటించనున్నట్లు చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా వెంకట్ ప్రభు మాట్లాడుతూ– ''యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'ఎన్‌సీ 22'. నాగచైతన్య కెరీర్‌లో భారీ చిత్రంగా శ్రీనివాసా చిట్టూరిగారు నిర్మిస్తున్నారు. తండ్రీ కొడుకులైన ఇళయరాజా, యువన్ శంకర్ రాజా ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండటం విశేషం'' అన్నారు. ప్రేమ్‌జీ అమరన్, ప్రేమీ విశ్వనాథ్, సంపత్ రాజ్, 'వెన్నెల' కిషోర్ తదితరులు కీలక పాత్రలు చేస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ఎస్‌ఆర్ కదిర్.

పాన్ ఇండియా మైఖేల్


● సందీప్ కిషన్

సందీప్ కిషన్, విజయ్ సేతుపతి, గౌతమ్ మీనన్, దివ్యాంశా కౌశిక్, వరలక్ష్మీ శరత్‌కుమార్, వరుణ్ సందేశ్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మైఖేల్'. రంజిత్ జయకొడి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ, కరణ్ సి ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీపై భరత్ చౌదరి, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని ఈ నెల 20న రిలీజ్ చేయనున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ''భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'మైఖేల్'. సందీప్ కిషన్ చేస్తున్న తొలి పాన్ ఇండియా సినిమా ఇది. విజయ్ సేతుపతి యాక్షన్ రోల్ చేస్తున్నారు. డైరెక్టర్ గౌతమ్ మీనన్ విలన్‌గా చేస్తున్నారు'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: కిరణ్ కౌశిక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: శివచెర్రీ.

దీపావళికి టీజర్


● చిరంజీవి

చిరంజీవి హీరోగా బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హీరో రవితేజ కీలక పాత్ర చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ 'మెగా154' (వర్కింగ్ టైటిల్) చిత్రం 2023 సంక్రాంతికి విడుదల కానుంది. కాగా ఈ చిత్రం డబ్బింగ్ పనులు శుక్రవారం షురూ అయ్యాయి. ''అన్ని కమర్షియల్ హంగులతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం ఇది. హైదరాబాద్‌లో యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నాం. దీపావళి కానుకగా ఈ చిత్రం టైటిల్ టీజర్ విడుదల చేయనున్నాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ''బాబీకి అభినందనలు. మీ కల నిజం కాబోతోంది. దీపావళికి రానున్న బాస్ (చిరంజీవి) ఎగ్జయిటింగ్ టీజర్ కోసం నేను బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పూర్తి చేశాను. మీ అందరితో కలిసి మెగా మాస్ ఎంటర్‌టైనర్‌ను థియేటర్లలో చూడటానికి సంక్రాంతి వరకు ఆగలేకపోతున్నాను'' అంటూ చిత్ర సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ట్వీట్ చేశారు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్థర్ ఎ. విల్సన్, సహనిర్మాతలు: జీకే మోహన్, ప్రవీణ్ ఎం, సీఈవో: చెర్రీ, లైన్ ప్రొడ్యూసర్: బాలసుబ్రహ్మణ్యం కేవీవీ.

హసీనా కథ అర్థం కావాలంటే...


● ప్రియాంక డే

''హీరోయిన్ ఓరియంటెడ్‌గా రూపొందిన చిత్రం 'హసీనా'. ఈ చిత్రంలో 84 మంది కొత్తవారు నటించడం విశేషం. టీజర్ చాలా బాగుంది.. సినిమా ఘనవిజయం సాధించాలి'' అని హీరో అడివి శేష్ అన్నారు. ప్రియాంక డే టైటిల్ రోల్‌లో సాయి తేజ గంజి, తన్వీర్, శివ గంగా, ఆకాష్ లాల్, వశిష్ఠ నారాయణ, అభినవ్, శ్రేష్ఠ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హసీనా'. నవీన్ ఇరగాని దర్శకత్వం వహించారు. ఎస్. రాజశేఖర్ రెడ్డి, తన్వీర్ ఎండీ నిర్మించిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ చిత్రం టీజర్‌ని అడివి శేష్ విడుదల చేశారు. 'ఎవడైనా బాగుపడాలన్నా సంకనాకి పోవాలన్నా దానికి కారణం ఫ్రెండ్స్ అయి ఉంటారు' అనే డైలాగ్‌తో ఆరంభమై, 'నా పేరు హసీనా.. నా కథ మీకు అర్థం కావాలంటే మీరు మందైనా తాగి ఉండాలి.. లేక మేధావి అయినా అయ్యుండాలి' డైలాగ్‌తో ముగుస్తుంది. ''క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం ఇది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: రామ కందా, సంగీతం: షారుక్ షేక్, నేపథ్య సంగీతం: నవనీత్ చారి, లైన్ ప్రొడ్యూసర్: సాయితేజ గంజి.

మనిషి ఎలా బతకకూడదో...


● సాయికుమార్, అనసూయ, సుధాకర్, శ్రీకాంత్

అనసూయ భరద్వాజ్, సాయికుమార్, సుమన్, ఆమని ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉప శీర్షిక. 'పేపర్ బాయ్' సినిమా ఫేమ్ జయశంకర్ దర్శకత్వం వహించారు. ఆర్వీ రెడ్డి సమర్పణలో ఆర్వీ సినిమాస్ పతాకంపై శ్రీనివాస్ రామిరెడ్డి, శేషు మారంరెడ్డి నిర్మించారు. ఈ సినిమాలోని క్యారెక్టర్స్ ఫస్ట్ లుక్స్, వాటి పేర్లను రివీల్ చేస్తూ చిత్రయూనిట్ పోస్టర్ విడుదల చేసింది. ''ఒక మనిషి ఎలా బతకకూడదు? అనే విషయాన్ని మా సినిమా ద్వారా ఆసక్తికరంగా చూపించనున్నాం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్న మా చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తాం'' అని చిత్రబృందం తెలిపింది. 'శుభలేఖ' సుధాకర్, శ్రీకాంత్ అయ్యంగార్, వైవా హర్ష, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: శివశంకర వరప్రసాద్.

కళాశాల నేపథ్యంలో...


● పల్లవి, సాయిశరణ్

కాయగూరల సాయి శరణ్ హీరోగా, పల్లవి, ట్రాన్సీ హీరోయిన్లుగా శ్రీనివాస్ జీఎల్‌బీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఐక్యూ'. కాయగూరల లక్ష్మీపతి నిర్మించిన ఈ సినిమా నవంబర్‌లో విడుదలకానుంది. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''కళాశాల నేపథ్యంలో రూపొందిన చిత్రం 'ఐక్యూ'. మధ్యతరగతికి చెందిన ఓ అమ్మాయి తన తెలివితేటలతో ప్రపంచ స్థాయి గుర్తింపు ఎలా తెచ్చుకుంది? అనే కథాంశంతో ఈ సినిమా ఉంటుంది. హైదరాబాద్, అనంతపురంలో షూటింగ్ చేశాం. యువతకు స్ఫూర్తి కలిగించే అంశాలు చాలా ఉన్నాయి. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. పాటలను త్వరలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి కథ, మాటలు, సంగీతం: ఘటికాచలం, కెమెరా: టి. సురేంద్ర రెడ్డి.

నేనెవరు?


● శివ కార్తికేయన్

శివ కార్తికేయన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ప్రిన్స్'. అనుదీప్ కేవీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మారియా ర్యాబోషప్క హీరోయిన్. నారాయణ్ దాస్ నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, డి. సురేష్ బాబు, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'హూ యామ్ ఐ..' (నేనెవరు) అనే పాటని విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి రాసిన ఈ పాటని డింకర్ కల్వల పాడారు. ''కంప్లీట్ ఎంటర్‌టైనర్ చిత్రమిది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందింది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్, కెమెరా: మనోజ్ పరమహంస, సహనిర్మాత: అరుణ్ విశ్వ.

సూపర్ హీరో


● యానియా

''ఇంద్రాణి' టీజర్ చూస్తుంటే కొత్త తరం మూవీ అనిపిస్తోంది. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, వీఎఫ్ఎక్స్ వర్క్, యాక్షన్ ఎపిసోడ్స్ అద్భుతంగా ఉన్నాయి. ఓ మంచి సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న యూనిట్‌కు అభినందనలు'' అని హీరో విష్ణు మంచు అన్నారు. యానియా భరద్వాజ్, ఫ్రనయిత జిజిన, గరీమా కౌశల్, కబీర్ సింగ్, షతాఫ్ ఫిగర్, సప్తగిరి కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ఇది. స్టీఫెన్ పల్లం స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను విష్ణు మంచు విడుదల చేశారు. ఈ సందర్భంగా స్టీఫెన్ పల్లం మాట్లాడుతూ– ''టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో కూడిన సూపర్ హీరో చిత్రం 'ఇంద్రాణి'. ఇందులో ఫైట్స్ ప్రత్యేకంగా నిలుస్తాయి. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందిస్తున్నాం'' అన్నారు. ''ఇంద్రాణి' చిత్రం పిల్లలు, పెద్దలను తప్పక ఆకట్టుకుంటుంది'' అన్నారు నటుడు శివ బాలాజీ. ఈ చిత్రానికి సహనిర్మాతలు: సుధీర్ వేల్పుల, ఓఓ రెడ్డి, జైసన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: స్టాన్లీ పల్లం, కెమెరా: చరణ్ మాధవనేని.


క్లుప్తంగా

'దేశంలో తొలిసారిగా డిజిటల్ గ్రంథాలయాలు'

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ లైబ్రరీ వ్యవస్థ డిజిటల్ రూపాన్ని సంతరించుకుంటున్నదని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. తమిళనాడు పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం చెన్నైలోని కొన్నెమెర పౌర గ్రంథాలయాన్ని సందర్శించారు. తమిళనాడు పౌర గ్రంథాలయాల డైరెక్టర్ కె.ఇలంభాగవత్‌తో గ్రంథాలయాల అభివృద్ధిపై చర్చించారు. సీఎం జగన్ దేశంలోనే తొలిసారిగా ప్రతిష్టాత్మకంగా డిజిటల్ లైబ్రరీలను తీసుకొస్తున్నారని వివరించారు.

రుషికొండను బోడికొండ చేసేశారు

- 3 రాజధానులతో చిచ్చు
- టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు



సాక్షి, అమరావతి: విశాఖలో చారిత్రక గుర్తింపున్న రుషికొండను బోడి గుండుగా చేశారని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. దీనిపై విచారణ జరుగుతున్నా కొండను కొట్టేస్తున్నారన్నారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ లీగల్ సెల్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 72 శాతం పూర్తయిన పోలవరం ప్రాజెక్టును ముంచేశారన్నారు. పోలీసులు తప్పుచేస్తే ప్రశ్నించే అవగాహన ప్రజలకు వచ్చిందన్నారు. తప్పుచేస్తే న్యాయమూర్తులను కూడా వివరణ అడిగే పరిస్థితి వచ్చింది కాబట్టే మార్పు వచ్చిందని చెప్పారు. ఎయిర్‌పోర్ట్‌లో బంగారం పట్టివేత న్యూస్ ఫార్వర్డ్ చేస్తే రాజద్రోహమా అని ప్రశ్నించారు. ప్రతి నియోజకవర్గంలో అడ్వకేట్లు ఒక టీంగా ఏర్పడి అక్కడి కేసులపై సూచనలు చేయాలన్నారు. వివేకా హత్యకేసులో నిందితులు చనిపోతున్నారని, అప్రూవర్‌గా మారిన దస్తగిరి ఇప్పుడు ప్రాణభయంతో ఉన్నాడని పేర్కొన్నారు. ఒక ఎంపీ రాష్ట్రానికి రాలేని పరిస్థితిని కల్పించారని విమర్శించారు. ప్రతిపక్ష నేతగా జగన్ అమరావతికి అంగీకారం తెలిపారని చెప్పారు. ఇప్పుడు మూడు రాజధానులంటూ ప్రాంతీయ విద్వేషాలు తెస్తున్నారని ఆరోపించారు. రాజధాని నిర్ణయించే హక్కులేని ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. కొత్త సీఎం వచ్చిన ప్రతిసారి రాజధాని మారుస్తానంటే కుదురుతుందా అని ప్రశ్నించారు. రాజధానిని నిర్ణయించే అధికారం పార్లమెంట్‌కు మాత్రమే ఉందని, హైకోర్టు సైతం ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పిందని ఆయన పేర్కొన్నారు.

ఏ చట్టం కింద వారికి ఆ అధికారం ఇచ్చారు?

- పూర్తి వివరాలను కోర్టు ముందుంచండి
- ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారాన్ని ఏ చట్ట నిబంధనలను అనుసరించి కట్టబెట్టారో తెలపాలని హైకోర్టు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకున్న అర్హతలు ఏమిటి? సబ్ రిజిస్ట్రార్ల అధికారాలు, వారి సర్వీసు నిబంధనలు ఏమిటి? సబ్ రిజిస్ట్రార్లతోపాటు సచివాలయాల కార్యదర్శులకు సమాంతర అధికారం కల్పిస్తున్నారా? తదితర వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 19కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి, జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ ధర్మాసనం ఉత్తర్వులు జారీచేసింది. గ్రామ, వార్డు సచివాలయాల కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారాన్ని కట్టబెడుతూ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన కొత్తపల్లి సీతారామప్రసాద్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ శేషసాయి ధర్మాసనం విచారించింది. పిటిషనర్ న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ, సచివాలయాల కార్యదర్శులకు ఆస్తుల రిజిస్ట్రేషన్ అధికారాన్ని కట్టబెట్టడం చట్టవిరుద్ధమన్నారు. ప్రభుత్వ చర్య సబ్ రిజిస్ట్రార్ల అధికారాలను లాగేసుకోవడమేనని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

టీటీడీపై తప్పుడు పోస్టులు షేర్ చేయవద్దు

సాక్షి, అమరావతి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి కొన్ని వాట్సాప్ గ్రూపుల్లో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాష్ట్ర ప్రజలెవరూ నమ్మవద్దని, తమ ఫోన్లకు వచ్చే అలాంటి తప్పుడు ప్రచార పోస్టులను ఎవరూ ఇతరులకు పంపవద్దని తిరుమల తిరుపతి దేవస్థానముల (టీటీడీ) పాలకమండలి విజ్ఞప్తి చేసింది. వాట్సాప్‌లో ప్రచారంలో ఉన్న తప్పుడు సమాచారంతో కూడిన పోస్టుల వివరాలతో 'ఫ్యాక్ట్ చెక్' పేరిట ఓ ప్రకటన విడుదల చేసింది. టీటీడీ ఫిక్స్‌డ్ డిపాజిట్ నిధులను దారి మళ్లిస్తున్నారంటూ ఆ పోస్టుల ద్వారా జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, ఆ ప్రచారంలో ఏ ఒక్కటీ నిజం కాదని ఆ ఫ్యాక్ట్ చెక్‌లో టీటీడీ వివరించింది. కాల్ సెంటర్లకు మాత్రమే ఉండే 1800 అంకెలతో మొదలయ్యే ఫోన్ నంబర్ ఒక దానిని ప్రధాన మంత్రి ఫోన్ నంబర్‌గా పేర్కొంటూ తప్పుడు ప్రచారం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. 'సేవ్ తిరుమల తిరుపతి దేవస్థానం' అని ఆ నంబర్‌కు వాయిస్ మెసేజ్ పెట్టాలంటూ పోస్టులు పెట్టడాన్ని టీటీడీ తప్పుపట్టింది.

సైబర్ నేరాలతో.. 'బీ అలెర్ట్'



ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం విస్తరిస్తున్న కొద్దీ దేశంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. పొరుగునున్న తెలంగాణ సహా దేశవ్యాప్తంగా ఈ నేరాలు పెరుగుతున్నాయని ఎన్సీఆర్బీ నివేదిక వెల్లడించింది. కానీ, టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ ఆంధ్రప్రదేశ్ మాత్రం వీటికి అడ్డుకట్ట వేస్తోందని పేర్కొంది. నకిలీ లోన్ యాప్ కంపెనీల మోసాలు.. ఓటీపీ పేరుతో బురిడీలు.. వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి బ్యాంకు ఖాతాల్లో నగదు కొల్లగొట్టడం.. ఇలా దేశంలో సైబర్ నేరాలు హెచ్చుమీరుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ప్రజల అవగాహన, అప్రమత్తతోనే వీటికి అడ్డుకట్ట వేయగలమని.. ఈ నేరాల నుంచి రక్షణకు 'బీ అలెర్ట్' పేరుతో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల చేసిన సూచనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసు శాఖ చెబుతోంది.

సాక్షి, అమరావతి

దేశంలో పెరుగుతున్న ఈ తరహా నేరాలు

- మొత్తం సైబర్ నేరాల్లో 60శాతం ఆర్థిక మోసాలే
- ప్రజల అప్రమత్తతతోనే వాటికి అడ్డుకట్ట
- నేరాల నుంచి రక్షణకు తమ సూచనలు పాటించాలని ఆర్బీఐ సూచన
- సాంకేతిక సాయంతో ఏపీ ఈ నేరాలకు కళ్లెం వేస్తోందన్న ఎన్సీఆర్బీ నివేదిక

వివిధ రకాల మోసాల తీరు ఇలా..

60 శాతం ఆర్థిక మోసాలే

2021లో దేశవ్యాప్తంగా 52,974 సైబర్ నేరాలు నమోదయ్యాయని ఎన్సీఆర్బీ నివేదిక-2021 వెల్లడించింది. వీటిల్లో 60 శాతం ఆర్థిక మోసాలే. 10,303 కేసులతో తెలంగాణా మొదటి స్థానంలో.. 8,829 కేసులతో ఉత్తరప్రదేశ్, 8,136 కేసులతో కర్ణాటక, 5,562 కేసులతో మహారాష్ట్ర, 4,846 కేసులతో అస్సాం తరువాత స్థానాల్లో ఉన్నాయి. ఇక ఏపీ విషయానికొస్తే 2020లో 1,899 కేసులు నమోదుకాగా.. 2021లో 1,875కు తగ్గాయి.

1. విషింగ్ కాల్స్‌ను నమ్మొద్దు

మోసం : బ్యాంకు అధికారులు, సిబ్బంది అంటూ ఫోన్‌చేస్తారు. మొబైల్‌కు ఓటీపీ పంపించాం.. చెప్పమంటారు. చెప్పారో మీ బ్యాంకు ఖాతాల్లోని మొత్తాన్ని కొల్లగొడతారు.

అప్రమత్తత: బ్యాంకు అధికారులు వ్యక్తిగత వివరాలుగానీ ఓటీపీగానీ అడగరు. అలా ఎవరైనా ఫోన్‌చేస్తే సైబర్ నేరగాళ్ల పనే.

2. ఆన్‌లైన్‌లో కొంటామని కొల్లగొడతారు

మోసం: ఆన్‌లైన్‌లో వస్తువులు కొనుగోలు చేస్తామని వ్యాపారులను ఫోన్లో సంప్రదిస్తారు. డబ్బులు చెల్లించేందుకు 'రిక్వెస్ట్ మనీ' ఆప్షన్‌ను పంపుతారు. తమ మొబైల్ ఫోన్‌కు వచ్చిన లింక్‌లో క్లిక్‌చేసి ఓటీపీ నమోదు చేయమని వ్యాపారులను కోరతారు. అలా ఓటీపీ ఎంటర్ చేయగానే వ్యాపారుల ఖాతాల్లోని డబ్బును కొల్లగొడతారు.

అప్రమత్తత: ఆన్‌లైన్‌లో లావాదేవీలప్పుడు అప్రమత్తంగా ఉండాలి. యూపీఐ ద్వారా మీరు ఓటీపీ నమోదు చేస్తున్నారంటే మీరు డబ్బులు పంపుతున్నారని అర్థం.

3. నకిలీ యాప్‌లు స్క్రీన్ షేరింగ్ యాప్‌లు

మోసం : మోసగాళ్లు నకిలీ యాప్‌ల లింక్‌లు పంపి డౌన్‌లోడ్ చేసుకోమంటారు. స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోమని చెబుతారు. ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే మీ మొబైల్ ఫోన్‌లోని కాంటాక్ట్ నంబర్లతోపాటు ఎస్ఎంఎస్‌లు, వాట్సాప్ సందేశాలు, ఇ-మెయిళ్లు.. ఇలా అన్నీ నేరగాళ్లకు అందుబాటులోకి వస్తాయి. దాంతో ఓటీపీ తెలుసుకుని మిమ్మల్ని మోసం చేస్తారు.

అప్రమత్తత: నిర్ధారించుకోకుండా యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దు. డౌన్‌లోడ్ చేసుకునేందుకు మీ వ్యక్తిగత వివరాలు, కాంటాక్టుల సమాచారం, గ్యాలరీలో ఫొటోలు మొదలైన వాటికి యాక్సెస్ ఇవ్వొద్దు. స్క్రీన్ షేరింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయొద్దు.

4. మీ పేరుతో నకిలీ సిమ్‌కార్డ్

మోసం : మొబైల్ కంపెనీ ప్రతినిధుల పేరుతో నేరగాళ్లు ఫోన్‌చేసి మీ వ్యక్తిగత సమాచారం అడుగుతారు. మీరు ఇస్తే.. మీ నంబరుతోనే మరో సిమ్ తీసుకుంటారు. మీ నంబరుకు వచ్చే అన్ని మెసేజ్‌లు ఆ సిమ్ వేసిన మొబైల్‌కూ వస్తాయి. దాంతో మోసం చేస్తారు.

అప్రమత్తత : మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ చెప్పొద్దు. నెట్‌వర్క్ ఏరియాలో ఉన్నప్పటికీ చాలా సేపటి వరకు మీ మొబైల్ నెట్‌వర్క్ పనిచేయకపోతే అప్రమత్తమవ్వండి. మీరు సిమ్ కంపెనీ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి డూప్లికేట్ సిమ్‌కార్డు జారీచేశారేమో తెలుసుకోండి. జారీచేశారని తెలిస్తే వెంటనే మీ బ్యాంకు ఖాతాను బ్లాక్‌చేయండి.

5. క్యూఆర్ కోడ్ స్కానింగ్

మోసం : వివిధ కంపెనీల పేరుతో క్యూఆర్ కోడ్‌ను మీ ఫోన్‌కు పంపుతారు. ఆ కోడ్‌ను స్కాన్‌చేస్తే మీ బ్యాంకు ఖాతాలోని మొత్తాన్ని లాగేస్తారు.

అప్రమత్తత : మీకు పంపే క్యూఆర్ కోడ్‌లను ఎప్పుడూ స్కాన్ చేయొద్దు.

6. సోషల్ మీడియా స్నేహితుల పేరుతో..

మోసం: సైబర్ నేరగాళ్లు మీ సోషల్‌మీడియా స్నేహితుల పేరుతో నకిలీ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్ అకౌంట్లు సృష్టిస్తారు. అత్యవసరంగా డబ్బులు అవసరమని అప్పు అడుగుతారు. మీరు పంపారో మోసపోయినట్టే.

అప్రమత్తత : ఇలా ఎవరైనా అడిగితే వెంటనే మీ స్నేహితులకు ఫోన్‌చేసి నిర్ధారించుకోండి. అంతేగానీ.. చాటింగ్‌ను బట్టి డబ్బులు పంపొద్దు.

7. లాటరీ పేరుతో బురిడీ

మోసం : లాటరీలో భారీ మొత్తం గెలుచుకున్నారని మీకు ఫోన్‌చేస్తారు. గెలుచుకున్న మొత్తం చెల్లించాలంటే మీ వ్యక్తిగత వివరాలు, మొబైల్ ఫోన్‌కు వచ్చే ఓటీపీ వివరాలు చెప్పమంటారు. ఆ సమాచారం ఇచ్చారో మీ ఖాతాల్లోని నగదు గల్లంతే.

అప్రమత్తత : ఇలాంటి ఫోన్ కాల్స్‌ను నమొద్దు. మీ వివరాలు చెప్పొద్దు.

8. మనీమ్యుల్స్ అంటూ ముంచేస్తారు

మోసం : మోసగాళ్లు ఫోన్, ఈమెయిల్ ద్వారా మిమ్మల్ని సంప్రదించి మీ బ్యాంకు ఖాతాలో కొంత మొత్తం జమచేస్తా.. వాటిని మరో బ్యాంకు ఖాతాకు బదిలీ చేయమంటారు. అలాచేస్తే మీకు కమీషన్ ఇస్తామని చెబుతారు. ఒప్పుకున్నారో అంతే. వారు మీకు పంపిన మొత్తంతోపాటు మీ ఖాతాలో ఉన్న మొత్తాన్ని లాగేస్తారు.

అప్రమత్తత : కమీషన్లకు ఆశపడొద్దు. తెలియని ఖాతాల నుంచి మీ ఖాతాకు నగదు బదిలీకి ఒప్పుకోవద్దు. మీ ఖాతా నుంచి వారికి బదిలీ చేయొద్దు.

9. ప్రాసెసింగ్ చార్జీల పేరుతో మోసం

మోసం : వివిధ నాన్ బ్యాంకింగ్ సంస్థల పేరుతో తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామని ఇ-మెయిల్ సందేశాలు, సోషల్ మీడియా వేదికల ద్వారా సంప్రదిస్తారు. రుణాలు కావాలంటే ప్రాసెసింగ్ చార్జీలు, జీఎస్టీ, అడ్వాన్స్ ఈఎంఐ మొదలైనవి చెల్లించాలని చెబుతారు. వాటిని చెల్లించగానే ఇక పత్తా లేకుండాపోతారు.

అప్రమత్తత : గుర్తింపు పొందిన ఏ నాన్ బ్యాంకింగ్ కంపెనీ కూడా రుణాలిచ్చే ముందే ప్రాసెసింగ్ చార్జీలుగానీ ఇతర మొత్తాలు గానీ అడగదు. అలా ఎవరైనా అడిగితే వారు మోసగాళ్లని గుర్తించాలి.

10. ఈజీ రుణాలు అంటూ ముంచేస్తారు..

మోసం : ఎలాంటి డాక్యుమెంట్లుగానీ హామీలుగానీ లేకుండా రుణాలు ఇస్తామని కొన్ని లోన్ యాప్ సంస్థలు సంప్రదిస్తాయి. ఆర్బీఐ గుర్తింపు లేని ఈ లోన్ యాప్ సంస్థలు చైనా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తాయి. తమ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుంటే గంటలోనే రుణాలిస్తామంటాయి. డబ్బులు అవసరమైన వాళ్లు ఆ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటారు. మీ మొబైల్ ఫోన్‌లోని కాంటాక్టులు, ఫొటోలు, వీడియోలు, ఇతర సమాచారంతో యాక్సెస్ పొందుతారు. భారీ వడ్డీ రేట్లతో తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. తీసుకున్న మొత్తం కంటే నాలుగైదు రెట్లు చెల్లించినా సరే అప్పులు ఇంకా తీరవు. వాయిదాలు చెల్లించకపోతే ఫోన్‌చేసి తీవ్రంగా దూషించడంతోపాటు కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి కాంటాక్టు నంబర్లు, వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తారు.

అప్రమత్తత : ఆర్బీఐ గుర్తింపులేని లోన్‌యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోకూడదు. అప్పు తీసుకునే ముందు వడ్డీ రేట్లు, ఇతర నిబంధనలను సరిచూసుకోవాలి. మీ మొబైల్ ఫోన్‌లోని సమాచారాన్ని లోన్‌యాప్ సంస్థలకు యాక్సెస్ ఇవ్వొద్దు.

11. తెలియని లింక్‌లపై క్లిక్ చెయ్యొద్దు

మోసం : సైబర్ నేరగాళ్లు బ్యాంకులు, ఇ-కామర్స్ సంస్థలను వాటి లోగోలతో నకిలీ వెబ్‌సైట్ల లింక్‌లను ఎస్ఎంఎస్, ఈ-మెయిల్, ఇన్‌స్టా మెసెంజర్, సోషల్ మీడియా వేదికల ద్వారా పంపుతారు. వాటిపై క్లిక్ చేయమంటారు. పిన్ నంబర్‌గానీ ఓటీపీగానీ ఎంటర్‌చేయమంటారు. అలా చేసినవారి బ్యాంకు ఖాతాల్లోని నగదును కొల్లగొడతారు.

అప్రమత్తత : ఇలా తెలియని సంస్థల లింక్‌లపై ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చెయ్యొద్దు. ఏదైనా లింక్ వస్తే ముందుగా వాటి 'యూనిఫాం రిసోర్స్ లొకేటర్ (యూఆర్ఎల్)ను పరిశీలించి ఆ సంస్థ అసలైనదో కాదో నిర్ధారించుకోవాలి.

ఇద్దరు అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్ల అరెస్ట్

- నాఫ్టాల్‌లో బహుమతి వచ్చిందంటూ యువతికి ఎర
- రూ.27.10 లక్షలు నష్టపోయిన వైనం



నిందితులను అరెస్ట్ చూపుతున్న డీఎస్పీ, సీఐ

నగరి: కోట్ల రూపాయల ప్రైజ్‌మనీ వచ్చిందంటూ ఓ యువతిని మోసగించిన కేసులో ఇద్దరు అంతర్రాష్ట్ర సైబర్ నేరగాళ్లను నగరి పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గతేడాది నవంబర్‌లో చిత్తూరు జిల్లా, నగరి మండలంలోని ఓజీ కుప్పం గ్రామానికి చెందిన వెంకటరత్నం కుమార్తె రాధకు నాఫ్టాల్‌లో రూ. కోటి రూపాయల గిఫ్ట్ వచ్చిందని సైబర్ నేరగాళ్లయిన శంకర్ మండల్ (32), పింటూ సర్దార్ (36) ఫోన్ చేశారు. అయితే ఆ సొమ్ము జమచేయాలంటే దానికి మీరు కొంత సొమ్మును తిరిగి జమచేయాలంటూ రాధను నమ్మించారు. దీంతో రాధ గతేడాది 2021 నవంబరు నెల నుంచి 2022 జనవరి నెల వరకు విడతల వారీగా రూ.27,10,300ను వారి ఖాతాలకు జమచేసింది. ఆపై వారి నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించింది. దీంతో ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్పీ రిషాంత్ రెడ్డి దృష్టికి ఈ కేసు వివరాలు వెళ్లడంతో విచారణ వేగవంతంగా పూర్తిచేయాలని ఆదేశించారు. వివిధ కోణాల్లో సాంకేతిక పరంగా దర్యాప్తు చేసిన పోలీసులు వెస్ట్‌బెంగాల్ పుర్బా బర్ధమాన్ జిల్లా, కల్నాకి వెళ్లి శంకర్ మండల్‌ను అరెస్టు చేశారు. కల్నా కోర్టులో హాజరు పరచి ట్రాన్సిట్ వారంట్‌పై నగరి కోర్టులో రిమాండ్ చేశారు. అనంతరం విచారణలో చెన్నైలో ఉన్న అతని స్నేహితుడు పింటూ సర్దార్‌నూ అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.10.80 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. వీరి బ్యాంకు ఖాతాల్లో ఉన్న మరో రూ.6,29,434ను ఫ్రీజ్ చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న ఇతర నేరస్థులు పరిమళ్ మండల్, బోలేనాథ్‌మండల్, సుగుణమ్మ, నికిల్ రాజలక్ష్మి కోసం గాలింపు చేపట్టారు. శంకర్ మండల్, పింటూ సర్దార్‌ను శుక్రవారం రిమాండ్‌కు తరలించారు.

మోసకారి లోన్‌యాప్ కంపెనీలపై కఠిన చర్యలు

▶ మొదటి పేజీ తరువాయి

బ్యాంకులపైనా కేసులు నమోదు చేస్తామన్నారు. రాష్ట్రంలో మోసాలకు పాల్పడే లోన్ యాప్ కంపెనీలపై ఇప్పటికే 75 కేసులు నమోదు చేసి, 71 మందిని అరెస్టు చేశామని, బ్యాంకు ఖాతాల్లోని రూ.10.50 కోట్లు జప్తు చేశామని వెల్లడించారు. మోసాలకు పాల్పడుతున్నట్లుగా గుర్తించిన 230 కంపెనీల్లో 170 కంపెనీలను బ్లాక్ చేయించామని చెప్పారు. చైనా తదితర దేశాల్లో ఉంటూ మోసాలకు పాల్పడే వారిపై చర్యల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, ఇంటర్‌పోల్ వంటి సంస్థల సహకారం తీసుకుంటామన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

లోన్‌యాప్ మోసాలపై రాష్ట్రంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రిజర్వ్ బ్యాంకు అనుమతి లేని యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, ఎట్టి పరిస్థితుల్లో వ్యక్తిగత సమాచారాన్ని వెల్లడించవద్దని చెప్పారు. మోసాలు, వేధింపులు ఎదుర్కొనే వారు ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేస్తే పోలీసులు తక్షణం సహకరిస్తారని చెప్పారు. బెదిరింపులు, ఫొటో మార్ఫింగులకు భయపడి ఆత్మహత్య యత్నాలు వంటి నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

లంచగొండి సీఐ, ఎస్సై అరెస్ట్

హత్య కేసులో నిందితుల జాబితాలో పేర్లు చేర్చకుండా ఉండేందుకు లంచం తీసుకున్నట్టు రుజువు కావడంతో కృష్ణా జిల్లా పమిడిముక్కల సీఐగా చేసిన ఎం.ముక్తేశ్వరరావు, తోట్లవల్లూరు ఎస్సైగా చేసిన వై.అర్జున్‌లను శుక్రవారం అరెస్టు చేసినట్లు డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. వారిని విజయవాడలోని ఏసీబీ న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించామన్నారు.

డీజీపీ తెలిపిన ప్రకారం ఈ కేసు వివరాలు

తోట్లవల్లూరుకు చెందిన గడికొయ్య శ్రీనివాసరెడ్డి హత్య కేసులో అదే గ్రామానికి చెందిన ఆళ్ల శ్రీకాంత్ రెడ్డి, మిథునలను పోలీసులు ఈ ఏడాది జులై 26న అరెస్టు చేశారు. ఈ కేసులో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబ సభ్యుల పేర్లు చేర్చకుండా ఉండేందుకు సీఐ ముక్తేశ్వరరావు రూ.15 లక్షలు, ఎస్సై అర్జున్ రూ. 2 లక్షలు డిమాండ్ చేశారు. శ్రీకాంత్ రెడ్డి బంధువు జొన్నల నరేంద్రరెడ్డి ద్వారా వ్యవహారం నడిపారు. శ్రీకాంత్ రెడ్డి తల్లిదండ్రులు నరేంద్రరెడ్డికి రూ.19.36 లక్షలు ఇచ్చారు. ఇందులో నుంచి నరేంద్రరెడ్డి సీఐ ముక్తేశ్వరరావుకు రూ.12.50 లక్షలు, ఎస్సై అర్జున్‌కు రూ.1.50 లక్షలు ఇచ్చారు. ఈ విషయం శ్రీకాంత్‌రెడ్డి బంధువు పుచ్చకాయల శ్రీనివాస రెడ్డికి తెలిసింది. పోలీసుల పేరు చెప్పి నరేంద్రరెడ్డి ఎక్కువ తీసుకున్నారని ఆయన శ్రీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు చెప్పారు. దాంతో నరేంద్రరెడ్డి ఆగ్రహించి శ్రీనివాసరెడ్డిని హత్య చేశాడు. ఈ కేసులో ఆత్కూరు పోలీసులు నరేంద్రరెడ్డిని విచారించడంతో సీఐ, ఎస్సైల అవినీతి కూడా బయటపడింది. దాంతో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సీఐ, ఎస్సైపై ఏసీబీ విచారణకు ఆదేశించారు. వారు లంచం తీసుకున్నట్టుగా విచారణలో వెల్లడైంది. దాంతో వారిద్దరినీ అరెస్టు చేశామని, విధుల నుంచి తొలగిస్తామని డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు.

ఏపీలో 12 కి.మీ. సాగిన రాహుల్ జోడో యాత్ర

- స్వాగతం పలికిన పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్, ఆ పార్టీ శ్రేణులు
- రాహుల్‌తో పాటు నడిచిన కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య తదితరులు
- పాదయాత్రకు మద్దతుగా నిలిచిన టీడీపీ శ్రేణులు
- నేడు బళ్లారిలో బహిరంగ సభ

రాయదుర్గం: కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ తలపెట్టిన భారత్ జోడో పాదయాత్ర శుక్రవారం కర్ణాటక రాష్ట్రం రాంపురం నుంచి రాయదుర్గం నియోజకవర్గం డీ హీరేహాళ్ మండలం లింగమ్మనహళ్లి వద్ద ఏపీలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్, పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, ఆ పార్టీ అగ్ర నేతలు తులసీరామ్, కనుమూరి బాపిరాజు తదితరులు రాహుల్‌కు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం జాజరకల్లు మీదుగా మడేనహళ్లి వరకూ 5 కి.మీ సాగిన యాత్రకు మధ్యాహ్న భోజన విరామమిచ్చారు. హైవే పక్కన మారెమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక టెంట్‌లో రాహుల్ సేద తీరారు. అక్కడి నుంచి సాయంత్రం 5 గంటలకు కర్ణాటక మాజీ సీఎం సిద్ధరామయ్య, కాంగ్రెస్ అగ్రనేత డీకే శివకుమార్, ఎమ్మెల్యేలు శివన్న, వడ్డే వెంకటరత్నం, మాజీ ఎమ్మెల్సీ హెచ్‌జీ శ్రీనాథ్ తదితరులతో కలిసి రాహుల్ పాదయాత్ర ప్రారంభించారు. సుమారు 12 కి.మీ నడిచి కర్ణాటకలోకి ప్రవేశించారు. దారిపొడవునా ప్రజలకు అభివాదం చేయడం, కనిపించిన వారిని పిలిచి సెల్ఫీ దిగడం కనిపించింది. ఇదిలా ఉండగా ఏపీ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. రాహుల్ గాంధీని కలవడానికి వెళ్లే వారికిచ్చే పాసుల విషయమై పీసీసీ అధ్యక్షుడు సాకే శైలజానాథ్, రాయదుర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వడ్డే చిన్నప్పయ్య బూతులు తిట్టుకోవడంతో కార్యకర్తలు విస్తుపోయారు. కాగా, ఏపీలో రాహుల్ జోడో పాదయాత్రకు టీడీపీ నేతలు మద్దతుగా నిలిచారు. కాంగ్రెస్ నాయకులతో కలసిపోయి పాదయాత్రలో పాల్గొనడం గమనార్హం.

హలకుందిలో బస

సాక్షి, బళ్లారి: రాహుల్ జోడోయాత్ర శుక్రవారం రాత్రికి కర్ణాటకలోని హలకుందిలోకి ప్రవేశించింది. ఈ రాత్రికి హలకుంది మఠంలో రాహుల్ బస చేయనున్నారు. శనివారం ఉదయం పాదయాత్ర బళ్లారి నగరంలోకి ప్రవేశించనుంది. అనంతరం స్థానిక మునిసిపల్ హైస్కూల్ మైదానంలో భారీ బహిరంగ సభలో రాహుల్ ప్రసంగిస్తారు. ఇదే మైదానంలో గతంలో నిర్వహించిన బహిరంగ సభల్లో రాహుల్ నానమ్మ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ, ఆయన తండ్రి, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, తల్లి, ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీలు కూడా ప్రసంగించడం విశేషం.

30 మంది దిగ్గజాలకు ప్రభుత్వ పురస్కారాలు

▶ మొదటి పేజీ తరువాయి

హైపవర్ స్క్రీనింగ్ కమిటీ సభ్యుడు జీవీడీ కృష్ణమోహన్ శుక్రవారం ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను ప్రతిబింబించేలా ప్రజా సేవకు కృషి చేస్తున్న వారిని పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అవార్డులకు ఎంపిక చేశామన్నారు. మన గ్రామం, మన సంస్కృతి, మన సంప్రదాయాలు, మన మాట, భాష వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకున్నామన్నారు. వ్యవసాయానికి పెద్దపీట వేస్తూ రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కూడా అవార్డులు ఇస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే వ్యవసాయానికి 5, సంస్కృతి-సంప్రదాయాలకు 5, మహిళా సాధికారత, రక్షణకు 3, సాహిత్య సేవ రంగానికి 3, విద్యా రంగానికి 4, పత్రికా రంగానికి 4, వైద్య రంగానికి 5, పరిశ్రమ రంగంలో ఒక అవార్డును ఇస్తున్నామన్నారు.

20 మందికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్, 10 మందికి అచీవ్‌మెంట్

వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారాలను 20 మందికి, వైఎస్సార్ అచీవ్‌మెంట్ పురస్కారాలను 10 మందికి ఇవ్వనున్నట్టు కృష్ణమోహన్ తెలిపారు. లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.10 లక్షల నగదు, జ్ఞాపిక.. వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు కింద రూ.5 లక్షల నగదు, జ్ఞాపికలను అందజేస్తామన్నారు. దిశ పోలీసింగ్ విభాగంలో సమాచారం అందుకున్న వెంటనే బాధితులను కాపాడిన ఐదుగురు పోలీసులకు ఉమ్మడిగా అవార్డులను ఇస్తున్నామన్నారు. సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, సంస్థలు, పలువురు వ్యక్తుల భాగస్వామ్యంతో అవార్డులకు ఎంపిక చేశామన్నారు.

వ్యవసాయం (అందరికీ వైఎస్సార్ అచీవ్‌మెంట్)

- ఆదివాసీ క్యాజునట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ (సోడెం ముక్కయ్య, బుట్టాయగూడెం, ఏలూరు జిల్లా)
- కుశలవ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ (ఎ.గోపాలకృష్ణ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా)
- అన్నమయ్య మ్యాంగో వెల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (జయబ్బ నాయుడు, తలుపల గ్రామం, పీలేరు మండలం, అన్నమయ్య జిల్లా)
- అమృతఫల ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ, కేఎల్ఎన్ మౌక్తిక, సబ్బవరం, అనకాపల్లి జిల్లా)
- కట్టమంచి బాలకృష్ణారెడ్డి, కట్టమంచి గ్రామం, చిత్తూరు జిల్లా

కళలు–సంస్కృతి

- కళాతపస్వి కె.విశ్వనాథ్ (వైఎస్సార్ లైఫ్‌టైమ్)
- ఆర్.నారాయణమూర్తి (వైఎస్సార్ లైఫ్‌టైమ్)
- సుప్రసిద్ధ రంగస్థల కళాకారుడు నాయుడు గోపీ (వైఎస్సార్ అచీవ్‌మెంట్)
- పెడన కలంకారీ నేతన్న పిచుక శ్రీనివాస్ (వైఎస్సార్ అచీవ్‌మెంట్)
- దేశవ్యాప్తంగా ప్రసిద్ధి పొందిన ఉదయగిరి ఉడెన్ కట్లరీ షేక్ గౌసియా బేగం (వైఎస్సార్ అచీవ్‌మెంట్)

సాహిత్య సేవ (వైఎస్సార్ లైఫ్‌టైమ్)

- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
- ఎమెస్కో పబ్లిషింగ్ హౌస్ విజయకుమార్
- రాయలసీమ ప్రసిద్ధ రచయిత డాక్టర్ శాంతి నారాయణ

మహిళా సాధికారత–రక్షణ

- ప్రజ్వల ఫౌండేషన్ సునీతా కృష్ణన్ (వైఎస్సార్ లైఫ్‌టైమ్)
- ఉయ్యూరుకు చెందిన శిరీషా రిహాబిలిటేషన్ సెంటర్ (వైఎస్సార్ లైఫ్‌టైమ్)
- దిశ పోలీసింగ్–రవాడ జయంతి, ఎస్వీవీ లక్ష్మీనారాయణ, రాయుడు సుబ్రహ్మణ్యం, హజరత్తయ్య, పి.శ్రీనివాసులు (ఉమ్మడిగా వైఎస్సార్ అచీవ్‌మెంట్ అవార్డు)

జర్నలిజం (అందరికీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్)

- బండారు శ్రీనివాసరావు
- సతీష్‌చందర్
- మంగు రాజగోపాల్
- ఎంఈవీ ప్రసాదరెడ్డి

వైద్య రంగం (అందరికీ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్)

- డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ
- డాక్టర్ వరప్రసాదరెడ్డి, శాంతా బయోటెక్ (హెపటైటిస్–బి వ్యాక్సిన్)
- భారత్ బయోటెక్ డాక్టర్ కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా (కోవ్యాక్సిన్)
- అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ ప్రతాప్ సి రెడ్డి
- గుళ్లపల్లి నాగేశ్వరరావు, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్
- పారిశ్రామిక రంగం (లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్) గ్రంధి మల్లికార్జునరావు, అంతర్జాతీయ పారిశ్రామికవేత్త

విద్యా రంగం

- మదనపల్లి–రిషీ వ్యాలీ విద్యా సంస్థ (వైఎస్సార్ లైఫ్‌టైమ్)
- కావలి–జవహర్ భారతి విద్యాసంస్థ (వైఎస్సార్ లైఫ్‌టైమ్)
- వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరాం (వైఎస్సార్ లైఫ్‌టైమ్)
- బ్యాంకింగ్ రంగంలో వేలాది మందికి దారి చూపిన నంద్యాలకు చెందిన దస్తగిరి రెడ్డి (వైఎస్సార్ అచీవ్‌మెంట్)

ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి అరెస్ట్

- డ్వాక్రా మహిళలపై దాడి ఘటనలో..
- ప్రవీణ్ రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే ఘర్షణ : ఏఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం : డ్వాక్రా మహిళలపై దాడి చేసిన కేసులో వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. టీడీపీ పట్టణాధ్యక్షురాలు బోగాల లక్ష్మీనారాయణమ్మతో కలిసి గురువారం విలేకరుల సమావేశం నిర్వహించిన టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పొదుపు ఖాతాల్లో అవినీతి జరగలేదని, ఆడిట్ జరిగి ఒకవేళ అవినీతి జరిగిందని నిర్ధారణ అయితే ఆ డబ్బు తాను చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో మహిళలు తమ డబ్బు ఇవ్వాలని ప్రవీణ్ ఇంటి వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో వారిపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి శుక్రవారం వేకువజామున ప్రవీణ్‌కుమార్‌రెడ్డితో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. వీరిపై 147, 148, 323, 324, 307, 386, 509 రెడ్‌విత్ 149 సెక్షన్ల కింద కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే వైఎస్సార్‌సీపీకి చెందిన ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు. గురువారం జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఇంటి సమీపంలో పోలీసులు పికెటింగ్ ఏర్పాటు చేశారు.



ప్రొద్దుటూరు పట్టణంలో పోలీస్ పికెటింగ్

ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే ఘర్షణ : ఏఎస్పీ ప్రేర్ణాకుమార్

టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రెచ్చగొట్టేలా వ్యవహరించడం వల్లే గొడవ జరిగిందని ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణాకుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి డీఎస్పీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. అక్టోబర్ 12న లక్ష్మీనారాయణమ్మ అనే మహిళ రూ.40 లక్షల మేర మోసానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ డ్వాక్రా మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న లక్ష్మీనారాయణమ్మ గురువారం ప్రవీణ్ ఇంటి వద్దకు వెళ్లి మీడియా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఏదైనా ఉంటే తన ఇంటి వద్దకు రమ్మని రెచ్చగొట్టే ధోరణిలో ప్రవీణ్ మీడియా సమావేశంలో మాట్లాడారన్నారు. దీంతో డ్వాక్రా మహిళలు ఆయన ఇంటి వద్దకు వెళ్లారని తెలిపారు. 'ధైర్యం ఉంటే లోపలికి రండి..' అంటూ ప్రవీణ్ మరోమారు రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ తలెత్తిందన్నారు.



వెబ్ ఆప్షన్ల నమోదుకు నోటిఫికేషన్

సాక్షి, అమరావతి: వైద్య విద్య పీజీ కోర్సుల్లో రాష్ట్ర కోటా సీట్ల భర్తీకి రెండో, తుది దశ కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్ల నమోదుకు ఆరోగ్య విశ్వవిద్యా లయం శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన ఇన్-సర్వీస్ అభ్యర్థులు శనివారం ఉదయం 11 గంటల నుంచి సోమవారం సాయంత్రం 4 గంటల వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే 7416563063, 7416253073, 9063400829, 9492818477 నంబర్‌లో, నిబంధనలపై వివరాల కోసం 8978780501, 7997710168, 9391805238, 9391805239లో సంప్రదించాలని రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.



23న జీఎస్ఎల్వీ మార్క్3-ఎం2 ప్రయోగం

వన్‌వెబ్ ఇండియా-1 పేరుతో యూకేకు చెందిన 36 ఉపగ్రహాలను పొందికగా అమర్చి షార్‌లోని ఈ బీ బిల్డింగ్ నుంచి వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌కు రాకెట్ ఆఖరు దశను తరలిస్తున్న దృశ్యం

కొనసాగుతున్న తుది విడత సాంకేతిక తనిఖీలు

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్)లోని రెండో ప్రయోగవేదిక నుంచి ఈనెల 23వ తేదీ తెల్లవారుజాము 00.07 గంటలకు అంటే 22వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు దాటిన తర్వాత జీఎస్ఎల్వీమార్క్3-ఎం2 రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు ఇస్రో శుక్రవారం అధికారికంగా వెల్లడించింది. ఈ ప్రయోగంలో వన్‌వెబ్ ఇండియా-1 పేరుతో 5.2 టన్నులు బరువు కలిగిన యూకేకు చెందిన 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను రోదసీలోకి పంపనున్నారు. శుక్రవారం సాయంత్రంతో మూడు దశల రాకెట్ అనుసంధానం పూర్తి చేసి తుది విడత తనిఖీలు నిర్వహిస్తున్నారు. క్లీన్ రూంలో 36 ఉపగ్రహాలకు తుది విడత తనిఖీలు పూర్తి చేసి పొందికగా అమర్చారు. హీట్‌షీల్డ్ క్లోజ్ చేసిన ఆఖరు దశను వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌కు తీసుకెళ్లి రాకెట్ శిఖరభాగాన అమర్చే ప్రక్రియను కూడా పూర్తి చేశారు. దీంతో రాకెట్ మూడు దశల అనుసంధానం పూర్తి చేసి ప్రయోగానికి సిద్ధం చేశారు.

ఆలిండియా సర్వీసు అధికారుల అర్ధసంవత్సర పరీక్షలు వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఆలిండియా సర్వీసు అధికారులకు నిర్వహించాల్సిన అర్ధసంవత్సర పరీక్షలను వాయిదా వేసినట్లు ఏపీపీఎస్సీ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగాల్సి ఉండగా 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామని తెలిపారు.

17న స్కూల్ గేమ్స్ ప్రారంభం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2022-23 విద్యాసంవత్సరానికి సంబంధించి స్కూల్ గేమ్స్‌ను 17వ తేదీ నుంచి ప్రారంభించాలని పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ స్కూల్ గేమ్స్ ఫెడ రేషన్ విధివిధానాలు, నిబంధనలతో కూడిన సర్క్యులర్ జారీ చేసింది. 17-20వ తేదీ వరకు మండల స్థాయి, 21-22 తేదీల్లో నియోజకవర్గ స్థాయి, 26వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తారు.







ఏపీ పీజీసెట్-22 ఫలితాలు విడుదల

85.2 శాతం ఉత్తీర్ణత..బాలికలదే పైచేయి



ఫలితాలు విడుదల చేస్తున్న హేమచంద్రారెడ్డి, సూర్యకళావతి


సాక్షి, అమరావతి/వైవీయూ: ఏపీ ఉన్నత విద్యామండలి, యోగి వేమన వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఏపీ పీజీసెట్-2022 ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ఏపీ పీజీసెట్- 22 చైర్‌పర్సన్, వైవీయూ వీసీ ఆచార్య సూర్యకళావతి ఫలితాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ఏపీ పీజీసెట్-22 ఫలితాలను, ర్యాంకు కార్డులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. ఏపీలోని 17 వర్సిటీల్లో 146 పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలకు సెప్టెంబర్ 3 నుంచి 11వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 44 పరీక్షా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. పరీక్షలో 85.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. వీరిలో బాలురు 10,869 మంది ఉత్తీర్ణులు కాగా..16.846 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

సబ్జెక్టుల్లో స్టేట్ టాపర్స్ వీరే..: ఎస్. షఫీవున్నీసా బేగం (ఇంగ్లిష్), యర్రం చంద్రమౌళి (జనరల్), గుడిపాటి అనిల్ (తెలుగు), యేసుపోగు సలోమి (లిటరేచర్), ఎస్.తసీషాబేగం (హిందీ), ఎ.సందీప్ (హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్), కన్నెబోయిన రేవతి (హిస్టరీ), పరసా జయరామ్ (పొలిటికల్ సైన్స్), సి.దివ్య నిహారిక (ఎకనమిక్స్), జె.సూర్యసాయిచరణ్ (కామర్స్), ఎల్.ఎస్.సౌమ్య ఆచంట (ఎడ్యుకేషన్), వాల్మీకి ప్రియాంక (లైఫ్ సైన్సెస్), దాసరి యామిని (ఎఫ్ఎస్ఎస్), సి.మణికంఠ దీపక్ (బోటనీ), జ్ఞానరసజ్ఞ (సెరీకల్చర్), డి.పావని (జువాలజీ), టి.వంశీ (మ్యాథమ్యాటికల్ సైన్స్), ఎస్.నజీర్ (స్టాటిస్టిక్స్), డి.సత్య ప్రసాద్ (ఫిజికల్ ఎడ్యుకేషన్), సి.సౌమ్యభువనేశ్వరి (ఎలక్ట్రానిక్స్), కె.శివప్రసాద్ (కెమికల్ సైన్సెస్), ఎం.సాయికుమార్ (పాలిమర్ సైన్స్), విష్ణుసౌజన్య (జియాలజీ), శ్రీవిద్య పాటూర్ (సైకాలజీ), బి.యువరాజు (కంప్యూటర్ సైన్స్).

ధార్మిక పరిషత్ సభ్యుడి నియామక కనీస అర్హత వయస్సు 30 ఏళ్లకు కుదింపు

ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన దేవదాయ శాఖ

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖలో అత్యున్నత నిర్ణాయక మండలిగా ఉండే ధార్మిక పరిషత్‌లో సభ్యుల నియామకానికి కనీస అర్హత వయస్సును 30 ఏళ్లకు కుదిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ప్రాథమిక నోటిఫికేషన్‌ను జారీ చేశారు. ఈ విషయమై అభ్యంతరం వ్యక్తం చేసేవారు 30 రోజుల్లో తమ అభ్యంతరాలను తెలియజేయవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దీనిపై వ్యక్తమయ్యే అభ్యంతరాలన్నీ పరిశీలించిన తర్వాత తుది నోటిఫికేషన్‌ను జారీ చేయాల్సి ఉంటుంది.



Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Survey no 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402. and Pulished at Survey No. 125/P, Etcherla Village & Mandal, Srikakulam Dist - 532402.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08942-281444, 499, 466 Fax No. 08942-281666 RNI Regn No. APTEL/2008/23798. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



వ్యంగ్య రచనల రా'రాజు'గోపాల్

సీనియర్ జర్నలిస్టు మంగు రాజగోపాల్‌కు వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వచ్చింది. ఆయనది 45 ఏళ్ల పాత్రికేయ ప్రస్థానం.

- IIలో



సిద్ధార్థకు ఘన స్వాగతం

మందస: సాఫ్ట్‌బాల్ జాతీయ క్రీడాకారుడు సిద్ధార్థ మహరణకు శుక్రవారం రాత్రి స్వగ్రామం మందసలో ఘన స్వాగతం లభించింది. హైస్కూల్ నుంచి బస్టాండ్ వరకు ఊరేగించి సత్కరించారు.

21 నుంచి ఫ్యామిలీ డాక్టర్ విధానం ట్రయల్ రన్

అరసవల్లి: ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్‌ను ఈ నెల 21 నుంచి పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బి.మీనాక్షి తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వైద్యుల నియామకాలకు సంబంధించి పూర్తిగా ప్రక్రియ పూర్తి కాకపోవడంతోనే ఈనెల 15న నిర్వహించాలనుకున్న ట్రయల్ రన్‌ను వాయిదా వేసినట్లుగా ఆమె ప్రకటించారు.

న్యూస్‌రీల్

'మెగా జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోండి'



పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 18న నిర్వహించనున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మంత్రి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్‌తో సంయుక్తంగా మేళా నిర్వహిస్తున్నారని 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్న వారంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి జి శ్రీనివాసరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్, సీడాప్ జేడీఎం రమణమూర్తి, జూనియర్ కళాశాల అధ్యాపకులు హనుమంతు రామ్మోహన దొర, రాపాక శేషగిరి, గొర్లి వేణు పాల్గొన్నారు.

'జగనన్న వసతి, విద్యా దీవెనకు రెన్యువల్ చేసుకోండి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన పథకం కింద 2022–23 విద్యా సంవత్సరానికి ఈ నెల 30లోగా రెన్యువల్ చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ శాఖ అధికారి ఆర్.గడ్డెమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని కళాశాలల యాజమాన్యాల విద్యార్థులు అందించిన సమాచారాన్ని జ్ఞానభూమి లాగిన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. కొత్తగా కళాశాలలో చేరిన విద్యార్థులు కూడా ఈనెల 30 లోపు కళాశాల లాగిన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

'ధాన్యం కొనుగోలుకు చురుగ్గా ఏర్పాట్లు'



సివిల్ సప్లై గోడౌన్‌లో అధికారులతో మాట్లాడుతున్న జేసీ నవీన్

నరసన్నపేట: జిల్లాలో ఈ సీజన్‌కు ధాన్యం కొనుగోలుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ అన్నారు. శుక్రవారం నరసన్నపేట మండలంలో ఆయన పర్యటించారు. స్థానిక సివిల్ సప్లై గోడౌన్‌ను పరిశీలించి నిల్వ చేసిన గన్నీ సంచులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామని వ్యవసాయ, రెవెన్యూ, సివిల్ సప్లై శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం ఆయన కరగాం, కంబకాయల్లో సచివాలయాలను పరిశీలించారు. సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని, సమయ వేళలు విధిగా పాటించాలని ఆదేశించారు. ఎవరెవరు ఏయే పనులు చేపట్టాలనేది సిబ్బంది ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం జాబ్‌చార్ట్ ఇచ్చిందని దీని ప్రకారం అందరూ తమ విధులను నిర్వహించాలన్నారు. సిబ్బంది వారీగా సమీక్షించారు. ఆయన వెంట సివిల్ సప్లై డీఎం జయంతి, తహసీల్దార్ ఎ.సింహాచలం, ఎంపీడీఓ మధుసూదనరావు ఉన్నారు.

డిప్యూటీ స్పీకర్ పదవితో వైశ్యులకు సముచిత స్థానం

- రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు



కోలగట్లను అభినందిస్తున్న వైశ్య సంఘ నాయకులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోలగట్ల వీరభద్రస్వామికి డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వడం ద్వారా వైశ్యులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు హర్షం వ్యక్తం చేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్లకు కేబినెట్ హోదా కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కోలగట్లను విజయనగరంలోని ఆయన నివాసంలో వైశ్య ప్రముఖులు అభినందించారు. రాష్ట్ర కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడు కోణార్క్ శ్రీను, రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ గుడ్ల దామోదర్, ప్రతినిధులు కోరాడ రమేష్, అంధవరపు రమేష్, జామి దామోదర్, నీల్‌కమల్ శ్రీను, కోరాడ కామేష్ తదితరులు పాల్గొన్నారు.

సింహాల్లా గర్జిద్దాం..

సిక్కోలు సత్తా చాటుదాం



దశాబ్దాల వెనుకబాటుతనం.. నేతలు, పాలకుల వాగ్దాన భంగం.. వలస దారుల్లో నిరంతర బతుకు పోరాటం.. ఇదీ ఉత్తరాంధ్ర.. మరీ ముఖ్యంగా శ్రీకాకుళం ప్రజల దీర్ఘకాల వేదన. ఆ వేదన తీరాలంటే.. కావాలి ఒక బలమైన ఆలంబన. విశాఖకు రాజధాని వస్తే ఆ ఆలంబన దొరుకుతుందన్న ఆశ. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారా ఇన్నాళ్లకు అందివచ్చిన ఆ మహదవకాశాన్ని తన్నుకు పోయేందుకు కొందరు.. వారికి వత్తాసు పలుకుతూ మరికొందరు ఉత్తరాంధ్రకు ద్రోహం తలపెడుతున్నారు. ఆ ద్రోహుల భరతం పట్టాలి.. రాజధానిని తన్నుకుపోవాలనుకుంటున్న రాబందులను తరిమికొట్టాలి. దానికి విశాఖ గర్జనే సరైన వేదికగా భావిస్తున్నారు సిక్కోలు వాసులు. దశాబ్దాలుగా మూగబోయిన తమ గళం విప్పి సింహాల్లా గర్జించడానికి సిద్ధమయ్యారు. అంతం కాదిది ఆరంభం అని చాటి చెప్పేందుకు దండులా విశాఖ వైపు కదిలి వెళ్లేందుకు.. ఉద్యమ బావుటా ఎగుర వేసేందుకు ఉత్సాహంతో ఉరకలు వేస్తున్నారు.

సాక్షి ప్రతినిధి,శ్రీకాకుళం:

- విశాఖ రాజధాని జిల్లావాసుల ఆకాంక్ష
- దాంతోనే వెనుకబాటుతనానికి చెక్
- ఉత్తరాంధ్ర ద్రోహుల భరతం పడదాం
- వేలాదిగా విశాఖ వైపు కదులుతున్న సిక్కోలు దండు

విశాఖ రాజధాని ఆకాంక్ష కోసం జిల్లా ప్రజలు ఉద్యమానికి సిద్ధమంటున్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన వికేంద్రీకరణ దోహదపడుతుందని నమ్ముతూ మద్దతు పలుకుతున్నారు. నేడు విశాఖపట్నంలో నాన్ పొలిటికల్ జేఏసీ తలపెట్టిన గర్జనలో గట్టిగా గర్జిస్తామంటున్నారు. మేధావులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, వ్యాపారులు, వివిధ సామాజిక వర్గాలు, ప్రజా సంఘాలు ఇలా అన్ని వర్గాల వారు పెద్ద ఎత్తున హాజరవుతున్నారు.

ఆర్థికంగా వెనుకబడిన జిల్లాలుగా శ్రీకాకుళం, విజయనగరంలను నీతి ఆయోగే గుర్తించింది. అత్యంత తక్కువ తలసరి ఆదాయం గల జిల్లాలుగా ఇవి కొనసాగుతున్నాయి. దీంతో బతుకు తెరువు కోసం వలస వెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. పిల్లాపాపలను వదిలేసి ఇతర రాష్ట్రాలు, ఇతర దేశాలకు వలసపోయిన దాఖలాలు ఉన్నాయి. దేశంలో ఎక్కడే ప్రమాదం జరిగినా అందులో శ్రీకాకుళం, విజయనగరం జిల్లా ప్రజలు కనిపిస్తున్న సందర్భాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో వలసలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. అలాగని సంతృప్తి పడాల్సిన పనిలేదు. ఇంకా తగ్గాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో పాటు పరిసర పరిస్థితులు సహకరించాలి. స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి. ఇన్ని జరగాలంటే విశాఖ రాజధానిగా మారాలి. అప్పుడే పొరుగున ఉన్న విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు అభివృద్ధి చెందుతాయని, తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరికి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని స్థానికులు భావిస్తున్నారు. అందుకే అమరావతి, కర్నూలు, విశాఖలను రాజధానులుగా చేయాలని కోరుతున్నారు. కానీ ప్రజల అభిమతానికి వ్యతిరేకంగా టీడీపీ కుట్రలు పన్నుతోంది. తమ పెట్టుబడులు ఎక్కడ పోతాయో అన్న భయంతో ప్రజా ప్రయోజనాలను దెబ్బతీసేలా నాయకులు వ్యవహరిస్తున్నారు. రియల్ ఎస్టేట్ భూముల కోసం మూడు రాజధానులు వద్దు–అమరావతి ఒక్కటే ముద్దు అంటూ రైతుల ముసుగులో ఉన్న రియల్టర్ల చేత ఏకంగా అరసవల్లికి పాదయాత్ర చేస్తున్నారు. టీడీపీ నాయకులే వీరి వెనక ఉండి యాత్ర చేయిస్తున్నారన్నది అందరికీ తెలిసిన సత్యం. ఈ నేపథ్యంలో మూడు రాజధానులపై తమ వాణి వినిపించేందుకు సిక్కోలు విశాఖకు తరలివెళ్తోంది.





వికేంద్రీకరణతోనే న్యాయం

జిల్లా కేంద్రంలో న్యాయవాదులతో మంత్రి ధర్మాన ప్రసాదరావు సమావేశమయ్యారు. మూడు రాజధానుల కోసం లాయర్లు పోరాడాలని, ఈ నిర్ణయంతో లాభాలేమిటో మేధావి వర్గంగా ప్రజలకు వివరించాలని కోరారు. విశాఖ రాజధాని అయితేనే ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం పోతుందని ఆయన స్పష్టం చేశారు. – శ్రీకాకుళం పాతబస్టాండ్

విశాఖకు అన్ని అర్హతలూ ఉన్నాయి..



విశాఖపట్నం రాజధాని అయితేనే సామాజిక న్యాయం సాధ్యం. రాజధానికి అన్ని అర్హతలు ఉన్న నగరం విశాఖ. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సైతం హైదరాబాద్ తరువాత విశాఖ మంచి నగరం. ఉత్తరాంధ్ర ప్రగతికి ఇది కీలక నిర్ణయం. అభివృద్ధి, పరిపాలన వికేంద్రీకరణ రెండూ అవసరం.

– డాక్టర్ కూన అచ్యుతరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వికేంద్రీకరణతోనే రాష్ట్ర ప్రగతి



రాష్ట్రంలో మూడు రాజధానుల వల్ల అన్ని ప్రాంతాల అభివృద్ధి సాధ్యం. హైదరాబాద్‌ను కోల్పోయాక ఏపీ తీవ్రంగా నష్టపోయింది. భవిష్యత్తులో ఆర్థిక అసమానతలు లేకుండా ఉండాలంటే వికేంద్రీకరణ జరగాలి. రాష్ట్రంలో మూడు రాజధానుల అవసరం ఎంతైనా ఉంది.

– డాక్టర్ ఉమ్మడి శాంతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ముందు చూపుతో నిర్ణయం..



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గొప్ప రాజనీతిజ్ఞుడు. ముందుచూపుతో ఆలోచించి రాష్ట్రంలో మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. విశాఖలో పరిపాలనా రాజధాని ఏర్పాటైతే వెనుకబడ్డ ఉత్తరాంధ్రకు ప్రగతి ఫలాలు అందుతాయి. అభివృద్ధి అంతా ఒకే చోట కేంద్రీకృతమైతే సమాజం ఎంతో నష్టపోతుంది. అమరావతిలో సేకరించిన భూముల్లో సగం రియల్టర్ల చేతుల్లోనే ఉన్నాయి.

–ఇప్పిలి నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం

సమర్థించని వారు ద్రోహులే..



ఉత్తరాంధ్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో కట్టుబడి ఉన్నాం. విశాఖ రాజధానిగా సమర్థించని వారంతా ఉత్తరాంధ్ర ద్రోహులే. వికేంద్రీకరణతో వెనుకబడిన సిక్కోలు ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. ఇది అమరావతిలో వ్యాపారం చేస్తున్న నాయకులకు రుచించడం లేదు. రాజధాని ద్రోహులుగా మిగిలిపోతారు. ప్రాంతీయ తత్వాన్ని రగిల్చి, చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. ప్రజలే వారికి తగిన బుద్ధి చెబుతారు.

– యర్రగుంట్ల కృష్ణమోహన్, అఖిలభారత బ్రాహ్మణ సమాఖ్య కార్యనిర్వాహక సభ్యుడు, మందస

సామాన్యుల ఆశలు నెరవేరుతాయి..



విశాఖపట్నం పరిపాలన రాజధాని అయితే అత్యంత వెనకబడిన ఉత్తరాంధ్ర ప్రజల ఆశలు నెరవేరుతాయి. గతమంతా తెలంగాణలో ఉండి చాలా నష్టపోయాం. విభజన జరిగిన తర్వాత అమరావతిలో మొత్తం డబ్బులు పెట్టి అభివృద్ధి చేయడం వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతానికి తీరని నష్టం జరిగింది. ఇప్పుడైనా వచ్చిన ఈ అవకాశాన్ని చేజారిపోకుండా కాపాడు కోవాలసిన అవసరం ఈ ప్రాంత ప్రజలపైన ఉంది. మూడు రాజధానుల నిర్ణయానికి ప్రతి ఒక్కరూ మద్దతు తెలపాలి.

– కుమార్ నాయక్, ఏపీ జానపద కళాకారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

విశాఖ రాజధాని కావాల్సిందే..



దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర వెనుకబడి పోయింది. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో పరిపాలనా రాజధాని ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేస్తూ వారి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా విశాఖలో కచ్చితంగా రాజధాని ఏర్పాటు చేయాలి.

–బసవల గోపాల్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు, టెక్కలి

గర్జనకు సంపూర్ణ మద్దతు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. విశాఖ రాజధాని కోసం నాన్ పొలిటికల్ జేఏసీ చేపడుతున్న గర్జనకు మా పూర్తి మద్దతు అందిస్తాం. ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం వచ్చిన చక్కని అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లో వదులుకోనేది లేదు. అమరావతి రాజధాని పేరుతో చేపడుతున్న యాత్రను అడ్డుకుంటాం. యాత్రను తిప్పి కొట్టడానికి ఉత్తరాంధ్ర ప్రజలు సిద్ధంగా ఉండాలి. – తమ్మినేని చందనరావు, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

విశాఖ రాజధాని మా హక్కు



విశాఖ రాజధాని మనందరి హక్కు. రాజధాని కోసం అందరం కలిసి పోరాడదాం. వెనుకబడిన మన ఉత్తరాంధ్రను అభివృద్ధి చేసుకుందాం. విద్య, ఉద్యోగ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే విశాఖ రాజధాని కావాల్సిందే. విశాఖను రాజధానిగా ప్రకటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మన మద్దతు తెలపాలి.

– బొడ్డేపల్లి దామోదరరావు, జిల్లా అధ్యక్షుడు, అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్య

కుట్రలు తిప్పికొట్టాలి..



చంద్రబాబు నాయుడు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి. అనుకున్న లక్ష్యాలను సాధించేదిశగా ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి. పరిపాలనా వికేంద్రీకరణ వలన అన్ని ప్రాంతాలు సమాన అభివృద్ధి అజెండాతో ముఖ్యమంత్రి నిర్ణయానికి ప్రజలంతా బాసటగా నిలుస్తున్నారు. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది.

–వాకముల్ల రమణమూర్తి, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్, సరుబుజ్జిలి

వికేంద్రీకరణ అవసరం..



రాజధాని ఏర్పాటు విషయంలో గతంలో జరిగిన తప్పులు మరోసారి పునరావృతం కాకుండా రాష్ట్రంలో పాలనా వికేంద్రీకరణ ఎంతో అవసరం. దీని వలన ప్రాంతీయ విభేదాలు లేకుండా అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయి. ఈ అంశంపై స్వార్థపూరితంగా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయి. రాజకీయ కుట్రలతో ఉత్తరాంధ్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే సహించేది లేదు. – ధవళ రంగబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు, టెక్కలి

మూడు రాజధానులే ముద్దు..



విశాఖను పరిపాలనా రాజధాని చేస్తే వెనుకబడిన శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి చెందుతుంది. వికేంద్రీకరణతో పారిశ్రామికాభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. మూడు రాజధానుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం. – మహదాసు చక్రధరరావు, కార్మికుడు, లావేరు

సమాన అభివృద్ధి సాధ్యం



వికేంద్రీకరణతోనే మూడు ప్రాంతాల్లో సమాన అభివృద్ధి సాధ్యమవుతుంది. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయం సరైనది. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న నాయకుడి వెంట నడుస్తాం. మా ప్రాంత అభివృద్ధి కోసం అహర్నిశలూ పోరాడతాం. – జి.జి.మోహన్‌రావు, రాష్ట్ర సాహిత్య అకాడమి డైరెక్టర్, సిటిజన్‌ఫోరం అధ్యక్షుడు, ఆమదాలవలస

విశాఖ చరిత్రను తిరగరాస్తుంది..



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే విశాఖకు ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ కమిటీ ఏర్పాటు, అభివృద్ధి చేసిన నాటి నాయకుల దార్శనికత ఇప్పటి అందాల నగరంగా విశాఖపట్నం ఈ స్థాయిని అందుకునేందుకు దోహదపడింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఉన్న ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ దేశంలోనే ఓ అద్భుతమైన రాజధాని నగరంగా ఆంధ్రప్రదేశ్ ఖ్యాతిని ఇనుమడింప చేయడంలో విశాఖపట్నం తలమానికంగా నిలిచేస్థాయి ఉన్న నగరం. ఇది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో సాకారం అయ్యే అద్భుత అవకాశం.

–పి. రాజారావు, వుడా ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు, కవిటి

సముచిత నిర్ణయం..



ముఖ్యమంత్రి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల అభివృద్ధి కోసం తీసుకున్న వికేంద్రీకరణ నిర్ణయం సముచితమైనది. ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయానికి అందరి మద్దతు అవసరం. ఆయనకు అన్ని ప్రాంతాల ప్రజల నుంచి పూర్తి మద్దతు లభిస్తుంది.

– బీన ఢిల్లీరావు, పర్యావరణ పరిరక్షణ సంఘం ప్రధాన కార్యదర్శి, సోంపేట

వికేంద్రీకరణతో గిరిజన అభివృద్ధి



వికేంద్రీకరణతో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు హైదరాబాద్ అభివృద్ధిపై అందరూ దృష్టి సారించడంతో గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు లేక ఎన్నో అవస్థలు పడ్డాం. విశాఖ రాజధానిగా ఉంటే శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అనేక గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయి.

–దివ్వల లక్ష్మీనారాయణ, గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు

స్వాగతిస్తున్నాం..



వికేంద్రీకరణతో ఏపీ అభివృద్ధి చెందుతుంది. అన్ని ప్రాంతాలు సమానంగా అభివృద్ధి చెందుతాయి. ఉత్తరాంధ్ర అభివృద్ధిని వ్యతిరేకించే కార్యక్రమాలను, వ్యక్తులను తిప్పికొడతాం. ఉత్తరాంధ్ర వాసిగా విశాఖపట్నం రాజధాని నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా.

– మజ్జి చినబాబు, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రైలు నుంచి జారి పడి.. మతిస్థిమితం కోల్పోయి

- రైల్వే సిబ్బందికి ముచ్చెమటలు పట్టించిన క్షతగాత్రుడు
- రైలు కింద పడిపోతానంటూ.. హైటెన్షన్ వైర్లు తాకుతానంటూ హడావుడి
- రెండు గంటల పాటు రైల్వే స్టేషన్‌లో హైడ్రామా



రాయితో బెదిరిస్తూ..



పట్టాలపైకి చేరి..



స్తంభంపైకి ఎక్కుతూ..



ప్రథమ చికిత్స..

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్ ఆవరణలో శుక్రవారం ఓ వ్యక్తి రైలు నుంచి జారిపడి మతిస్థిమితం కోల్పోయి రైల్వే సిబ్బందిని రెండు గంటల పాటు ముప్పుతిప్పలు పెట్టాడు. శుక్రవారం ఉదయం సోంపేట రైల్వేస్టేషన్ మీదుగా వెళుతున్న గౌహతి ఎక్స్‌ప్రెస్ నుంచి పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రయాణికుడు లోహిత్(40) ట్రైన్ నుంచి జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు. దీంతో 108 అంబులెన్స్‌కు సమాచారం రావడంతో, వారు అక్కడికి వెళ్లి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసేందుకు ప్రయత్నించారు. కానీ అతను విచిత్రంగా ప్రవర్తించాడు. తలకు గాయం కావడంతో మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తించాడు. ప్రథమ చికిత్స చేస్తామంటే ఒప్పుకోలేదు. పైగా తన దగ్గరకు ఎవరు వచ్చినా రాయితో కొడతానని, రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటానని, విద్యుత్ స్తంభం ఎక్కి హై టెన్షన్ వైర్లు పట్టుకొని ఆత్మహత్య చేసుకుంటానంటూ రెండు గంటల పాటు హడావుడి చేశాడు. దీంతో చేసేది లేక రైల్వే సిబ్బంది స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది, స్టేషన్ సిబ్బంది, స్థానికులు కలిసి ఎంతగా చెప్పినా వినలేదు. సుమారు రెండు గంటలపాటు అందర్నీ ముప్పుతిప్పలు పెట్టాడు. చివరికి పరిస్థితి కుదుటపడటంతో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన చికిత్స కోసం సోంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జిల్లాలో బీఎస్‌ఎన్‌ఎల్ ఈయూ గెలుపు

శ్రీకాకుళం అర్బన్: భారత సంచార నిగమ్ లిమిటెడ్ సంస్థలో గుర్తింపు సంఘం కోసం జరిగిన ఎన్నికల్లో బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ గెలుపొందింది. బీఎస్‌ఎన్‌ఎల్‌లో గుర్తింపు సంఘం కోసం ఈనెల 12వ తేదీన పోలింగ్ జరగ్గా 61 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్లను గురువారం లెక్కించారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్‌కు 33 ఓట్లు రాగా, బీఎస్‌ఎన్‌ఎల్ ఎన్‌ఎఫ్‌టీఈకు 20 ఓట్లు వచ్చాయి. ఇక బీటీఈయూకు 8 ఓట్లు వచ్చాయి. దేశవ్యాప్తంగా జరిగిన ఈ ఎన్నికల్లో ఏ యూనియన్‌కు అయితే 50 శాతానికి పైగా ఓట్లు వస్తాయో ఆ సంఘానికి గుర్తింపు యూనియన్ హోదా లభిస్తుంది. అయితే ఈ దఫా జాతీయస్థాయిలో బీఎస్‌ఎన్‌ఎల్‌కు జరిగిన ఎన్నికల్లో ఏ యూనియన్‌కు కూడా 50శాతానికి పైబడి ఓట్లు రాకపోవడంతో బీఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్, బీఎస్‌ఎన్‌ఎల్ ఎన్‌ఎఫ్‌టీఈ రెండు యూనియన్‌లకు గుర్తింపు హోదా ఉంటుంది. జాతీయ స్థాయిలో గుర్తింపు ప్రామాణికంగా జిల్లాలో కూడా రెండు యూనియన్‌లకు గుర్తింపు ఉంటుంది.



క్లుప్తంగా

విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం



వినియోగదారుల సమస్యలను వింటున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ తదితరులు

అరసవల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికే సీజీఆర్ఎఫ్ వేదిక పనిచేస్తుందని, తక్షణమే పరిష్కారానికి చర్యలు చేపడతామని సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ డివిజినల్ ఈఈ కార్యాలయంలో నిర్వహించిన సీజీఆర్ఎఫ్ వేదికలో పలువురి ఫిర్యాదులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఈ ఎల్.దైవప్రసాద్, సీజీఆర్ఎఫ్ కమిటీ సభ్యులు హరిబాబు, పి.శ్రీనివాస్, బాలాజీ ప్రసాద్ పాండే, ఈఈ బయ్యన్నాయుడు, డి–1 ఏఈ కమల్‌హాసన్, డి–2 ఏఈ సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

9వ తరగతిలో ప్రవేశానికి గడువు పెంపు

సరుబుజ్జిలి: వెన్నెలవలస వద్ద గల జవహర్ నవోదయ విద్యాలయంలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 9 వ తరగతిలో ప్రవేశం కోసం ఈ నెల 25 వరకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎమ్.శ్రీనివాసరావు గురువారం ప్రకటించారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం



చక్రధర్ మృతదేహం

సారవకోట: రోడ్డు ప్రమాదంలో యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ సంఘటన మండలం కేంద్రం సారవకోటలో శుక్రవారం తెల్లవారు జామున చోటుచేసుకోగా.. పాతపట్నం మండలం కొరసవాడ గ్రామానికి చెందిన గొంప చక్రధర్ (28) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆమదాలవలస మండలం నమనంపాడులో తెల్లవారు జామున మూడు గంటల సమయంలో బయల్దేరి ద్విచక్ర వాహనంపై కొరసవాడ వెళ్తుండగా సారవకోట మండల పరిషత్ కార్యాలయానికి ఎదురుగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి పడిపోవడంతో చక్రధర్ తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. అతని వెంట ఉన్న కె.విఘ్నేశ్‌కు స్వల్ప గాయాలు కావడంతో 108 వాహనంలో పాతపట్నం సీహెచ్‌సీకి తరలించారు. మృతుడికి భార్య నాగలక్ష్మి, కుమారులు భరత్, దినేష్ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు సారవకోట ఎస్సై లావణ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం తరలించారు.

నేటి నుంచి అసర్ సర్వే



గారలో శాంపిల్ సర్వేలో పాల్గొన్న డైట్ విద్యార్థులు

- కోవిడ్ అనంతరం విద్య ప్రమాణస్థాయిలపై నివేదిక
- వమరవల్లి డైట్ విద్యార్థులచే క్షేత్రస్థాయి పరిశీలన
- 30 గ్రామాల్లో పర్యటించి సమాచారం సేకరణ

గార: కరోనా మహమ్మారి ప్రభావం విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపించింది. రెండేళ్లపాటు విద్యా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విద్య, వాటి ప్రమాణస్థాయిలను తెలుసుకోవడానికి వీలుగా చేపడుతున్న 'అసర్' సర్వే శనివారం నుంచి రెండు రోజుల పాటు జిల్లా అంతటా జరగనుంది. దేశంలోనే విద్యా ప్రమాణాలపై కచ్చితమైన నివేదిక అందిస్తూ, యునిసెఫ్ వంటి ప్రపంచ సంస్థల ప్రశంసలు అందుకున్న స్వచ్ఛంద సంస్థ 'ప్రథమ్' ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ప్రభుత్వ డైట్ విద్యార్థులను సర్వే కోసం వలంటీర్లుగా సంస్థ తీసుకుంది. దీని కోసం ఇప్పటికే వీరికి శిక్షణ కూడా పూర్తిచేశారు. సర్వే సక్రమంగా నిర్వహించే చర్యలో భాగంగా శుక్రవారం గార మండల కేంద్రంలో శాంపిల్ సర్వే చేపట్టారు. కోవిడ్ వైరస్ విద్యా వ్యవస్థపై రెండేళ్లు తీవ్ర ప్రభావం చూపించింది. ఈ సమయంలో విద్యార్థులు టీవీలు, మొబైల్ గేమ్‌లపై చూపించిన ఆసక్తిని చదువుపై పెట్టలేదు. ఈ పరిస్థితుల్లో తాజాగా చేపడుతున్న సర్వే కీలకంగా మారనుంది.

అసర్ అంటే..

అసర్ పేరిట చేపడుతున్న సర్వేను యాన్యువల్ స్టేటస్ ఎడ్యుకేషన్ రిపోర్టు అంటారు. ఏటా ఈ సర్వే ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగంలో కీలక సంస్కరణలకు శ్రీకారం చుడతారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నేష్ పేరుతో విద్యారంగంపై సర్వే చేస్తుండగా, ఆంధ్రలో బాస్ పేరిట సర్వే జరుగుతుంది. దీనికి మించి థర్డ్ పార్టీ కింద వ్యవహరించనున్న ప్రథమ్ సంస్థ నిర్వహిస్తున్న సర్వేపైనే ఎక్కువ నిర్ణయాలను పాలకులు తీసుకుంటున్నారు.

30 గ్రామాల్లో..

జిల్లాలోని 26 మండలాల పరిధిలో ఎంపిక చేసిన 30 గ్రామాల్లో డైట్ విద్యార్థులు శనివారం నుంచి సర్వే చేపట్టనున్నారు. తొలి రోజు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల నుంచి సమాచారం సేకరిస్తారు. ముఖ్యంగా భాష, గణితంపైనే ఎక్కువగా ప్రశ్నలున్న ప్రశ్నాపత్రం నుంచి సమాచారం తీసుకుంటారు. మరుసటి రోజు 30 గ్రామాల్లోని 20 కుటుంబాలను వీధుల వారీగా ర్యాండమ్ ద్వారా వివరాలు సేకరిస్తారు. ఆయా కుటుంబంలోని మూడు నుంచి 16 సంవత్సరాల వయస్సు ఉన్న విద్యార్థులకు ప్రశ్నాపత్రం ఇచ్చి సమాధానాలు రాయిస్తారు. ఆ కుటుంబాల నుంచి నాలుగు విభాగాలుగా శాంపిళ్లు తీసుకొని నమోదు చేశారు. 1, 2, 3 తరగతులు ఒక విభాగంగా, ఎనిమిది, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులను మూడు విభాగాలుగా విభజించి శాంపిళ్లను సేకరిస్తారు.

కీలకమైన సర్వే



విద్యావ్యవస్థలో మార్పులకు అసర్ సర్వే కీలకం కానుంది. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి చదువులపై తీవ్ర ప్రభావం చూపింది. రెండేళ్లల్లో అనేక మార్పులు చోటుచేసుకున్న నేపథ్యంలో విద్యలో ఎటువంటి మార్పులు అవసరమో తెలుసుకోవడానికి తాజాగా చేపడుతున్న సర్వే చాలా అవసరం. త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి పూర్తిస్థాయి నివేదిక అందనుంది. సర్వే కోసం ప్రభుత్వ డైట్ విద్యార్థులను వలంటీర్లుగా తీసుకోవడం గర్వంగా ఉంది.

– డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య, ప్రిన్సిపాల్, వమరవల్లి డైట్

ఆలయంలో దొంగలుపడ్డారు

- గార దుర్గాలయంలో చోరీ
- నాలుగు తులాల బంగారం, 1250 గ్రాముల వెండి ఆభరణాల అపహరణ
- సీసీ ఫుటేజీ, హుండీని సైతం ఎత్తుకెళ్లిన దొంగలు



దుర్గాలయం వద్ద క్లూస్ టీంతో మాట్లాడుతున్న ఏఎస్పీ విఠలేశ్వరరావు

గార: మండల కేంద్రమైన గారలోని దుర్గాలయంలో దొంగలు పడ్డారు. గురువారం అర్ధరాత్రి తరువాత ఆలయంలోనికి చొరబడిన చోరులు నాలుగు తులాల బంగారు ఆభరణాలు, 1250 గ్రాముల వెండి నగలు ఎత్తుకెళ్లారు. ఆలయం ఎదురుగా ఉన్న ఎరువుల దుకాణం యజమాని ఇట్రాజు గోపి శుక్రవారం ఉదయం అమ్మవారికి దండం పెట్టుకోవడానికి వెళ్లేసరికి ఆలయం ఇనుపగేట్లు తెరచి ఉన్నాయి. అనుమానం వచ్చిన ఆయన విషయాన్ని ఆలయ ధర్మకర్త, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావుకు తెలియజేశారు. వారు వచ్చిన పరిశీలించగా చోరీ జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారమివ్వగా క్లూస్ టీం వచ్చి వివరాలు సేకరించింది. అమ్మవారి నవరాత్రుల తర్వాత కొన్ని ఆభరణాలను ఇటీవలే తీసివేయగా మిగిలిన నాలుగు తులాల బంగారు ఆభరణాలు, వెండి నగలను దొంగలు తీసుకుపోయినట్టు గుర్తించారు. అలాగే ఆలయంలోని హుండీ, సీసీ ఫుటేజీ కలిగిన హార్డ్ డిస్కును సైతం తీసుకుపోయారు. అయితే అమ్మవారి మెడలో పువ్వుల దండలు ఉండటంతో చెవులకున్న బంగారు ఆభరణాలు, వడ్డానాన్ని దొంగలు గుర్తించలేక వదిలేశారని భావిస్తున్నారు. ఏఎస్పీ విఠలేశ్వరరావు ఆలయాన్ని పరిశీలించారు. కేసు విచారణ వేగవంతం చేశామని.. త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. సీఐ డీసీహెచ్ ప్రసాద్, ఎస్ఐ ఎం.మధుసూదనరావులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఊరికి దూరంగా ఉన్న ఆలయాలను దొంగలు ఇటీవల కాలంలో టార్గెట్ చేశారు. బంగారం, వెండి ఆభరణాలున్న ఆలయాల వద్ద రెక్కీ నిర్వహించి చోరీలకు పాల్పడుతున్నట్టు పోలీసులు చెబుతున్నారు. ఇటీవల దసరా శరన్నవరాత్రులు ఘనంగా జరిగిన నేపథ్యంలో పూజల పేరుతో అపరిచిత వ్యక్తులు సైతం ఆలయాలకు వచ్చారు. చోరీల్లో అనుభవం ఉన్న సుమారు నలుగురు వ్యక్తులు దొంగతనానికి పాల్పడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకం: వీసీ



మాట్లాడుతున్న వీసీ నిమ్మ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల్లో నైపుణ్యాలు కీలకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో శుక్రవారం పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఇంజినీరింగ్ విద్యార్థులకు దేశ, విదేశాల్లో అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. భారత్‌లో ప్రస్తుతం శాస్త్ర, సాంకేతిక రంగాలు ప్రగతి సాధిస్తున్నాయని తెలిపారు. విద్యార్థులు పరిశ్రమల అవసరాలు గుర్తించి ముందుకు సాగాలని అన్నారు. సాంకేతిక విద్యలో ఇంటర్న్‌షిప్ పక్కాగా అమలు చేయనున్నట్లు వివరించారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో రిలీవ్ విద్యార్థులకు ఉపాధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. రిజిస్ట్రార్, ఇంజినీరింగ్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం మొదటి కౌన్సెలింగ్ పూర్తయ్యిందని, ఈ నెల 17 నుంచి నవంబర్ 5 వరకు రెండో కౌన్సెలింగ్ జరుగుతుందని చెప్పారు. ఈ కౌన్సెలింగ్ తర్వాత క్లాస్‌వర్కు ప్రారంభించనున్నట్లు వివరించారు. 15 రోజుల పాటు అఖిల భారత సాంకేతిక విద్యా మండలి నిబంధనల మేరకు ప్రేరణ, పరిచయ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఉదయ్ భాస్కర్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రోణంకి శ్రీధర్ పాల్గొన్నారు.

వ్యంగ్య రచనల రారాజు గోపాల్

- వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు ఎంపికైన సీనియర్ జర్నలిస్టు మంగు రాజగోపాల్
- 45 ఏళ్ల పాత్రికేయ ప్రస్థానంలో అనేక హోదాల్లో విధులు
- అవార్డు రావడం ఉత్తరాంధ్రకు లభించిన గుర్తింపుగా అభివర్ణించిన పాత్రికేయులు



శ్రీకాకుళం న్యూకాలనీ: ఉత్తరాంధ్రకు చెందిన సీనియర్ జర్నలిస్టు మంగు రాజగోపాల్ డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డునకు ఎంపికయ్యారు. వివిధ రంగాల్లో ప్రతిభావంతులకు ప్రభుత్వం ఈ అవార్డులు ఇచ్చి సత్కరిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా జర్నలిజం విభాగంలో డాక్టర్ వైఎస్సార్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుకు మంగు రాజగోపాల్ ఎంపికచేశారు. ఈయన ఉత్తరాంధ్రకు చెందినవారు.

స్వస్థలం సిక్కోలే..

శ్రీకాకుళంలోనే 1953లో జన్మించిన ఆయన ప్రస్తుతం విశాఖపట్నంలో స్థిరపడ్డారు. శ్రీకాకుళం మున్సిపల్ స్కూలులో ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. విశాఖపట్నంలోని ఏవీఎన్ కళాశాలలో బీకాం చదివారు. తెలుగు భాష, సాహిత్యాలపై ఎనలేని అభిమానం ఉన్న రాజగోపాల్ హైస్కూ లు, డిగ్రీ చదివే రోజుల్లోనే ఎన్నో కథలు రాశారు. పలు పత్రికలు, వార పత్రికల్లో, తరుణి, వసుధ వంటి ఎన్నో మాస పత్రికల్లో ఆయన కథలు ప్రముఖంగా వచ్చాయి.

45 ఏళ్ల పాత్రికేయ ప్రస్థానం..

1976లో హైదరాబాద్‌లో ఓ దినపత్రిలో ట్రైనీ సబ్ఎడిటర్‌గా రాజగోపాల్ పాత్రికేయ ప్రస్థానం ప్రారంభమైంది. పలు పత్రికలు, చానెళ్లలో వివిధ హోదాల్లో పని చేశారు. దాదాపు 45 ఏళ్ల పాత్రికేయ ప్రస్థానంలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్నారు.

వ్యంగ్య రచనలు..

వర్తమాన రాజకీయాలపై పదునైన వ్యంగ్యాస్త్రాలు ఎక్కుపెట్టడంలో రాజగోపాల్‌ది అందెవేసిన చేయి. రాజగోపాల్ రాసిన రాజకీయ 'సరదా'కి వ్యంగ్య రచనలు ఆయనకు ఎనలేని పేరు ప్రఖ్యాతలు తెచ్చిపెట్టాయి. ఈ రచనలు సైతం 'సరదాకి' పేరుతోనే పుస్తకంగా కూడా ముద్రితమయ్యాయి. వ్యంగ్య రచనలో రాజగోపాల్ ప్రతిభకు గుర్తింపుగా హైదరాబాద్ లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆయనకు 'ఉత్తమ హాస్య రచయిత అవార్డు'తో సత్కరించింది. శ్రీకాకుళం జిల్లా అవతరణ స్వర్ణోత్సవాల సందర్భంగా శ్రీకాకుళం జిల్లాకి చెందిన ఉత్తమ జర్నలిస్టుగా స్వర్ణోత్సవాల వేదికపై రాజగోపాల్‌ను సత్కరించారు. వర్కింగ్ జర్నలిస్టుగా రాజగోపాల్ నాలుగు దశాబ్దాల ప్రస్థానానికి గుర్తింపుగా 2017లో తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు రాజగోపాల్‌ని రవీంద్ర భారతిలో జరిగిన ఒక సభలో సత్కరించారు.

ఉత్తరాంధ్ర జర్నలిస్టులకు దక్కిన గుర్తింపు..

డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డుకు ఎంపిక కావడం గర్వంగా, సంతోషంగా ఉంది. ప్రభుత్వానికి ధన్యవాదాలు. ఇది ఉత్తరాంధ్ర జర్నలిస్టులకు ప్రభుత్వ ఇచ్చిన గుర్తింపుగా భావిస్తున్నాను. నా 45 ఏళ్ల జర్నలిజం ప్రస్థానాన్ని ప్రభుత్వం గుర్తించడం ఆనందదాయకం.

– మంగు రాజగోపాల్, సీనియర్ జర్నలిస్టు

నేడు, రేపు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



ట్రిపుల్ ఐటీలో మాక్ విధానంలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో సీటు ఖరారైన విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను శని, ఆదివారాల్లో అధికారులు పరిశీలించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ధ్రువీకరణ పత్రాల్ మాక్ ట్రైల్ నిర్వహించారు. రాష్ట్రంలోని శ్రీకాకుళం, ప్రకాశం, ఇడుపులపాయ, నూజివీడుల్లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానించగా.. విద్యార్థుల ఎంపిక మెరిట్ బట్టి జాబితా తయారు చేశారు. శ్రీకాకుళం ట్రిపుల్ టీలో 1100 సీట్లు ఉండగా 1080 మొదటి విడతో భర్తీ అయ్యాయి. ప్రవేశాలు పొందిన వారిలో 680 మంది బాలురు, 400 మంది బాలికలు ఉన్నారు. వీరి ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం 17వ తేదీ నుంచి క్లాసులకు హాజరు కావల్సి ఉంటుంది. ఇందుకోసం అధికారులు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. అధికారులతో డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి హాజరు కానున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభంకానుంది. అనంతరం ఖాళీ సీట్లు నిర్ధారించి ప్రస్తుతం ఖాళీగా ఉన్న 20తో కలిపి రెండో కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు.

గ్రానైట్ సమస్యల పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్రానైట్ పరిశ్రమల్లో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో భూ గర్భ గనుల శాఖపై జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఎస్‌ఓ నిషా కుమారిలతో కలిసి సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రానైట్ ఇండస్ట్రీస్‌లో సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. రెన్యువల్స్ చేయాల్సిన వాటిని తక్షణమే రెన్యువల్స్ చేయాలని, సంబంధిత కంపెనీ రాకపోతే వారికి కొంత సమయం ఇచ్చి తర్వాత రద్దు చేయాలని భూగర్భ గనుల శాఖ డీడీని ఆదేశించారు. గ్రానైట్ పరిశ్రమలకు మేలు చేసే విధంగా ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు. పెద్ద ప్రాజెక్టులకు ప్రజాభియం ఉండాలన్నారు. అనధికారికంగా గ్రావెల్ తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. గ్రావెల్ అనుమతులు ఉన్న వారికే గ్రావెల్ క్వారీ తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. గ్రావెల్ క్వారీకి అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు పథకానికి కొలత రాళ్ల త్వరగా సరఫరా చేయాలని చెప్పారు.

నాన్ వర్కింగ్ లీజులను లీజులుగా కన్వర్ట్ చేసి రెవెన్యూ పెంచాలని ఆదేశించారు. అందుకు సంబంధించిన అనుమతులు త్వరితగతిన మంజూరు చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవోలు బి.శాంతి, సీతారామమూర్తి, జయరాం, భూగర్భ గనుల శాఖ డీడీ ఫణి భూషణ్ రెడ్డి, ఏడీ బాలాజి నాయక్, ఏపీపీసీబీ ఏఈఈ కరుణశ్రీ, గ్రానైట్ పరిశ్రమల యాజమాన్యాలు, తదితరులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి మండలంలో చైన్‌స్నాచింగ్



బాధితురాలు సరోజనమ్మ

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలం పెద్దపద్మాపురం గ్రామంలో శుక్రవారం పట్టపగలు చైన్‌స్నాచింగ్ జరిగింది. ఈ ఘటనపై బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపద్మాపురం గ్రామానికి చెందిన వార్డు సభ్యురాలు ఉర్లాన సరోజనమ్మ తన భర్త లింగరాజుతో కలిసి వరి పొలానికి ఎరువులు వేసేందుకు వెళ్లింది. కొద్దిసేపటి తరువాత వంట చేసేందుకని సరోజనమ్మ ఒంటరిగా రోడ్డుపై నడుచుకొని ఇంటికి వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి ఆమె మెడలో ఉన్న మూడు తులాల బంగారు పుస్తెలతాడును బలంగా తెంపే ప్రయత్నం చేశారు. దీంతో సరోజనమ్మ కిందపడిపోయింది. అయినా విడిచిపెట్టకుండా కొద్దిదూరం బలవంతంగా లాక్కొనివెళ్లి పుస్తెలతాడును తెంచుకొని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. ఆ సమయంలో అటుగా వచ్చిన లక్ష్మీనారాయణ అనేవ్యక్తి వెంబడించినా ఫలితం లేకుండాపోయింది. దీనిపై బాధితురాలు మెళియాపుట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. మెళియాపుట్టి కూడలిలోని దుకాణాల్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక



మాట్లాడుతున్న ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్: పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీఎస్పీల పరిధిలోని పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరితంగా పూర్తిచేసి బాధితులకు సత్వర న్యాయం చేయాలన్నారు. స్టేషన్ల వారీగా కేసులను సమీక్షించి వాటి దర్యాప్తు, నిందితుల అరెస్టు, చార్జిషీటు దాఖలు, విచారణలో పారదర్శకత, బాధితులతో నడుచుకునే తీరులో జాగ్రత్త వహించడమే కాక నిష్పాక్షపతంగా వ్యవహరించాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సబ్‌డివిజనల్, దిశ మహిళా పోలీస్ స్టేషన్, ఎస్సీ, ఎస్టీ సెల్ వారీగా దర్యాప్తులో పురోగతి కనిపించి, సాక్ష్యాల సేకరణ, డీఎస్పీ స్థాయి దర్యాప్తు సమర్థవంతంగా చేయాలన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఘటనా స్థలికి చేరుకోవాలన్నారు. విచారణ గడువులోగా పూర్తి చేసి నిందితులను అరెస్టు చేసి సంబంధిత కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఎస్పీలు మహేంద్ర మత్తే, ఎం.శివరామరెడ్డి, ఎస్.వాసుదేవ్, బాలరాజు, సీఐ దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు.

బులియన్	
విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	52,200–00
బంగారం(22సి. 10గ్రా.)	47,850–00
వెండి (కిలో)	66,500–00

కోడిగుడ్ల ధరలు	
హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 430.00
విజయనగరం	రూ. 434.00
శ్రీకాకుళం	రూ. 434.00

చికెన్		
బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹150	₹255	₹ 275




విశాఖ రాజధాని కావాలి



ఉత్తరాంధ్ర వెనుకబాటుకి గురైంది. పరిశ్రమలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు పెరగాలంటే విశాఖ రాజధాని కావాలి. ఈ ప్రాంతంలో వెనుకబాటుతనం పోవాలంటే రాజధాని మన ప్రాంతంలో ఉండాలి.

-అరవల్లి భాస్కరరావు, పురోహితులు, శ్రీకాకుళం

గళం విప్పుదాం



విశాఖ గర్జనలో పాల్గొని సిక్కోలు గళాన్ని విప్పుదాం. మద్రాసుకు 70 ఏళ్లు, కర్నూల్‌కు మూడేళ్లు, హైదరాబాద్‌కు 58 ఏళ్లు పరుగులు పెట్టాం. మొత్తంగా 130 ఏళ్లుగా రాజధానికి దూరంగా ఉన్నాం. ఇన్నాళ్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంతో విశాఖ రాజధాని అయ్యే అవకాశం వచ్చింది. రాజధానిగా ప్రకటిస్తే ఉత్తరాంధ్ర ప్రజలకు జీవం పోసినట్లు అవుతోంది.

- అంధవరపు సూరిబాబు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్

విశాఖ రాజధాని కావాలి



వెనుకబడిన ఉత్తరాంధ్రకు న్యాయం జరగాలంటే విశాఖను రాజధానిగా ప్రకటించాలి. విశాఖను పరిపాలనా రాజధాని చేస్తే తరువాత తరాల భవిష్యత్ బంగారుబాట అవుతోంది. రాజధానిగా ప్రకటిస్తే ప్రభుత్వ పెద్దలను తరచూ కలవడమే కాకుండా ప్రతీ సమస్యను పరిష్కరించుకోవడానికి వెసులుబాటు కలుగుతోంది.

పెద్దకోట చిరంజీవులు, బీఆర్‌ఏయూ రిటైర్డు ప్రొఫెసర్

గర్జనకు తరలిరావాలి



మూడు రాజధానులకు మద్దతుగా శనివారం విశాఖలో నిర్వహిస్తున్న గర్జనలో ఉద్యమాల పురిటిగడ్డ సిక్కోలు గళం వినిపించేందుకు నియోజకవర్గం నుంచి భారీగా జనం తరలిరావాలి. నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వివిధ కార్పొరేషన్ డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీలు సభ్యులు హాజరు కావాలి. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఉదయం ఏడు గంటలకు భారీ ర్యాలీగా బయలుదేరి వెళ్తాం.

- గొర్లె కిరణ్‌కుమార్, ఎచ్చెర్ల ఎమ్మెల్యే

క్లుప్తంగా

ప్రిన్సిపాల్‌కు సన్మానం



ఉదయ్‌భాస్కర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్‌ను సహాయ ఆచార్యులు శనివారం సన్మానించి గౌరవించారు. ఈ సందర్భంగా ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. సైన్స్ కళాశాల బతోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ గోవిందరాజులు, రోణంకి శ్రీధర్ పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ పోస్టులకు 21న ఇంటర్వ్యూలు

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూ ఇంజినీరింగ్ కళాశాలలో సబ్జెక్టు కాంట్రాక్టు పద్ధతిలో ఫ్యాకల్టీగా పనిచేసేందుకు ఈ నెల 21న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు రిజస్ట్రార్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. అర్హత గల అభ్యర్థులు బయోడేటా, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో ఆ రోజు ఉదయం 11 గంటలకు హాజరు కావాలన్నారు. ఎంసీఏ, ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ, ఈసీఈ, మెకానికల్, సివిల్, ట్రిపుల్‌ఈ విభాగాల్లో నియామకాలు ఉంటాయన్నారు. ఎంటెక్ ప్రథమ శ్రేణితో ఉత్తీర్ణత ఉండాలని, పీహెచ్‌డీ, నెట్, సెట్, స్లెట్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులు వర్సిటీ వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

సిద్ధార్థపై అభినందనల జల్లు



సిద్ధార్థను అభినందిస్తున్న సాఫ్ట్‌బాల్ సంఘ పెద్దలు, అధికారులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: నేషనల్ గేమ్స్‌లో సత్తా చాటిన సాఫ్ట్‌బాల్ క్రీడాకారుడు సిద్ధార్థ మహరణపై అభినందనల జల్లు కురుస్తోంది. జిల్లాలోని మందసకు చెందిన ఈ కుర్రాడు గుజరాత్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన నేషనల్ గేమ్స్ (ఖేలో ఇండియా) పోటీల్లో పతకంతో సత్తాచాటాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కోడిరామ్మూర్తి స్టేడియం వద్ద సిద్ధార్థను సత్కరించారు. ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర,జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, జిల్లా కార్యదర్శి పి.సుందరరావు, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కలిదిండి నరసింహరాజు, రాష్ట్ర సీఈఓ సి.వెంకటేశులు, జిల్లా సాఫ్ట్‌బాల్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు, జిల్లా కార్యదర్శి సిగిలిపల్లి లక్ష్మీదేవి తదితరులు క్రీడాకారుడిని అభినందించారు. తన గురువు రవికుమార్ మహంతి వల్లే తనకు విజయాలు సాధ్యమయ్యాయని సిద్ధార్థ తెలిపాడు.

విద్యుత్ వినియోగంపై చైతన్యం పెరగాలి

- హైకోర్టు విశ్రాంత జడ్జి శంకరనారాయణ



మాట్లాడుతున్న శంకరనారాయణ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యుత్ వాడకంతో పాటు వినియోగ సమయంలో ఎదురయ్యే సమస్యల పరిష్కార విషయంలో ప్రజల్లో మరింత చైతన్యం పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైకోర్టు విశ్రాంత జడ్జి పి.శంకరనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కణిత శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శంకరనారాయణ మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగం సమయంలో ఏదైనా సమస్య వస్తే దానిని ధైర్యంగా ఎదుర్కొని, పరిష్కరించుకోవాలని సూచించారు. ఎలాంటి లోపాలున్నా వెంటనే ఫిర్యాదు చేయాలన్నారు. సభలో సీజీఆర్ఎఫ్ చైర్మన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సభ్యులు పి.శ్రీనివాస్, హరిబాబు, డాక్టర్ ఆర్.సురేందర్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకరనారాయణ, కృష్ణారావు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు

గార: కొర్లాం గ్రామానికి చెందిన రైతు కొర్లాపు వెంకటరావుకు చెందిన ఆవు ఒకే ఈతలో రెండు మగ దూడలకు జన్మనిచ్చింది. రెండూ ఆరోగ్యంగా ఉండడంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

విద్యార్థికి విద్యుత్‌షాక్‌పై విచారణ

లావేరు: లావేటిపాలెంలో ఈనెల 12వ తేదీన విద్యుత్‌షాక్ తగిలి రెండో తరగతి విద్యార్థి కాకి నాని గాయపడ్డాడు.

ఈ ఘటనపై డిప్యూటీ ఈవో తిరుమలచైతన్య శుక్రవారం గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన స్థలాన్ని పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం కె.రామ్మోహనరావు, విద్యార్థి కుటుంబ సభ్యులను, ప్రజాప్రతినిధులను, గ్రామస్తులతో మాట్లాడి ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, ఎంఐఎస్ మండల కోఆర్డినేటర్ జి.చంద్రశేఖర్ ఉన్నారు.

20న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 20న నిర్వహిస్తున్నన్నట్లు జెడ్పీ ముఖ్యకార్య నిర్వహణాధికారి వెంకట్ రామన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతోందన్నారు.

డైట్ మూడో సెమిస్టర్ హాల్ టిక్కెట్లు సిద్ధం

శ్రీకాకుళం న్యూకాలనీ: డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌కు చెందిన మూడో సెమిస్టర్ (2020–22 బ్యాచ్) విద్యార్థులతోపాటు ఒకసారి పరీక్ష తప్పిన (2019–2021) బ్యాచ్ విద్యార్థుల హాల్‌టిక్కెట్లు వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్‌కు సిద్ధంగా ఉన్నాయని డీఈవో గార పగడాలమ్మ తెలిపారు.

బీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌పోర్టల్‌లో హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 95056 78655 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పరిశ్రమకు అనుకూలమే..
కానీ ఉపాధి కల్పించాలి

- నారువ పరిసర ప్రజల స్పష్టీకరణ
- కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ సమక్షంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ



ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్

రణస్థలం: నారువ రెవెన్యూ పరిధిలో స్థాపించదలచిన నాగార్జున అగ్రికెమ్ మల్టీకమ్ ప్రైవేటు లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం భూగర్భ జలాల వినియోగం, వ్యర్థజలాల తరలింపు, ఉపాధి కల్పనపై స్థానికులకు స్పష్టమైన హామీ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పేర్కొన్నారు. రూ.150 కోట్లతో 57.14 ఎకరాల విస్తీర్ణంలో ఎన్ఏసీఎల్ మల్టీ కమ్ ప్రైవేటు లిమిటెడ్ న్యూ ఆగ్రో కెమికల్స్, ఫ్లోరైస్ ఆధారిత కెమికల్స్ అండ్ సింథటిక్ ఆర్గానిక్స్ కెమికల్ ఉత్పత్తి చేసే యూనిట్ నెలకొల్పేందుకు పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని కాలుష్య నియంత్రణ మండలి అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ లాఠకర్ సమక్షంలో శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఏర్పాటు వలన స్థానికులకు ఎదురయ్యే నష్టాలు, గ్రామాభివృద్ధి, ఉపాధి కల్పన, భూగర్భ జలాల వినియోగం, సముద్రంలోని మత్స్యసంపదకు జరిగే నష్టంపై స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు, పరిసర ప్రాంత ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

జనావాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలి

డబ్బు రాము, గున్న, రామారావు, అప్పలరాముడు, జి.అప్పలనాయుడు తదితరులు మాట్లాడుతూ ఈ పరిశ్రమ ఏర్పాటు చేస్తే గాలి, నీరు, భూమి కలుషితమవుతోందన్నారు. కెమికల్ పరిశ్రమలు జనావాసాలకు దూరంగా నెలకొల్పాలన్నారు. పరిశ్రమలు వస్తే ఆర్థికాభివృద్ధి పెరుగుతోంది. గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తాయి. అయితే పరిశ్రమ యాజమన్యం ఇచ్చిన హామీలు శతశాతం నెరవేర్చాలని కోరారు.

అత్యంత సురక్షితంగా నడుపుతాం

– కె.శేషగిరి ఎన్ఏసీఎల్ పరిశ్రమ యూనిట్ హెడ్

పరిశ్రమను అత్యంత సురక్షితంగా నడుపుతామని ఎన్ఏసీఎల్ పరిశ్రమ యూనిట్ హెడ్ కె.శేషగిరి స్పష్టం చేశారు. సామాజిక బాధ్యతగా గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే వ్యర్థాలను పరవాడ తరలిస్తామన్నారు. దీనికి కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ జోక్యం చేసుకొని.. పైడిభీమవరం పరిసర ప్రాంతాల్లో ఇరవైకు పైగా కంపెనీలు ఉన్నాయని, వ్యర్థజలాలను రీసైక్లింగ్ చేసే యూనిట్‌ను ఇక్కడే ఏర్పాటు చేసేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం భూగర్భ జలాలు వినియోగిస్తామని శేషగిరి చెప్పారు. ప్రభుత్వం త్వరలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలకు సముద్రపు నీరు ప్లాంట్ నుంచి కొనుగోలు చేస్తామన్నారు. అర్హతలను బట్టి 75 శాతం ఉద్యోగాలు స్థానిక యువతకు కల్పిస్తామని హామీ ఇచ్చారు. సరికొత్త టెక్నాలజీతో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ అధికారి శంకర్‌నాయక్, డీఆర్వో ఎం.రాజేశ్వరి, తహసీల్దార్ ఎస్.కిరణ్ కుమార్, నారువ, మెంటాడ, పైడిభీమవరం, కొంతాలపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిశ్రమలు రావడం సంతోషమే

పరిశ్రమలు రావడం సంతోషమే. 25 ఏళ్లుగా సర్పంచ్‌గా పని చేశాను. గతంలో భూములు ఇచ్చాం. ప్రజలు బాగుపడతారని భావిస్తున్నాం. కానీ అనుకున్నాస్థాయిలో పరిశ్రమల వలన ప్రజలకు మేలు జరగడం లేదు. పైడిభీమవరం, నారువ పరిసర ప్రాంతాల్లోని పరిశ్రమ యాజమాన్యాలు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని యువత ఆందోళన వ్యక్తం చేస్తోంది. అర్హులందరికీ ఉద్యోగాలు కల్పించాలి. జిల్లా కలెక్టర్ చెప్పినట్లు భూగర్భజలాలు, వ్యర్థాలు, ఉపాధి సక్రమంగా కల్పిస్తే పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలమే.

- మైనర్ రాజు, మాజీ సర్పంచ్, నారువ

మత్స్యసంపదకు తీవ్ర నష్టం

పైడిభీమవరం, నారువ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యర్థ జలాల కాలుష్యంతో మత్స్య సంపదకు నష్టం వాటిల్లుతోంది. దీంతో మత్స్యకారులు వలస వెళ్లిపోతున్నారు. వ్యర్థ జలాలను సముద్రంలోనికి వదలకుండా చూడాలి.

- పిల్లా తాత, ఎన్‌జీఆర్‌పురం గ్రామస్తుడు

నిబంధనలు పాటించాలి

ఇరవై ఏళ్లుగా మా గ్రామానికి నీళ్ల లేవు. పరిశ్రమలు వ్యర్థ జలాలు వదలడం వలన ఇటీవల 25 మేకలు చనిపోయాయి. కచ్చితంగా నిబంధనలు పాటిస్తే పరిశ్రమ స్థాపనకు అనుకూలమే.

- పుసుపులేటి గోపి, ఎంపీటీసీ సభ్యుడు, కొంతాయపాలెం

ఉద్యోగాలు కల్పించాలి

కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సక్రమంగా పని చేయడం లేదు. ఉద్యోగాలు లేక స్థానిక యువత నష్టపోతోంది. ఉద్యోగాల కల్పనకు యాజమాన్యం కృషి చేయాలి. జిల్లా కలెక్టర్ ఇచ్చిన హామీలు నేరవేరిస్తే పరిశ్రమ ఏర్పాటును ఆహ్వానిస్తాం.

- ఆర్.ఎస్.రెడ్డి, నారువ మాజీ సర్పంచ్

హామీలు నిలబెట్టుకోవాలి

యాజమాన్యాలిచ్చే హామీలను నిలబెట్టుకోవాలి. పర్యావరణానికి విఘాతం లేకుండా చూస్తే ప్రజలు పరిశ్రమలను ఆహ్వానిస్తారు.

- చెన్నకేశవరెడ్డి, సామాజిక కార్యకర్త

ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న మోహనరావు

జి.సిగడాం: జగనన్న లేఅవుట్లలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను డిసెంబర్ మొదటి వారంలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని గృహ నిర్మాణ శాఖ ఈఈ పి.జి.జె.మోహనరావు చెప్పారు. జి.సిగడాం, జగన్నాథవలస, జాడ గ్రామాల్లోని జగనన్న లే అవుట్లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. సిమెంట్ కొరత లేకుండా సరఫరా చేస్తున్నట్టు వివరించారు. జిల్లా కలెక్టర్, హౌసింగ్ పీడీ ఆదేశాల మేరకు ప్రతి వారం గృహ నిర్మాణాల పురోగతిని పర్యవేక్షిస్తున్నామన్నారు. అలాగే రోజూ పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి నివేదిక పంపాలని సిబ్బంది సూచించారు. రికార్డులు నమోదు చేసిన మూడు రోజుల్లోనే సంబంధిత లబ్ధిదారుల ఖాతాలో బిల్లులు జమ చేస్తామన్నారు. శ్రీకాకుళం డివిజన్ పరిధిలోని 15 మండలాల్లో 44,634 గృహలు మంజూరవ్వగా.. ఇందులో 38,923 ఆన్‌లైన్ చేసినట్టు పేర్కొన్నారు. వీటిలో 7,718 నిర్మాణాలు పూర్తయినట్టు పేర్కొన్నారు. మిగతావి వివిధ దశలో ఉన్నాయన్నారు. ఏఈఈ మహదాస్యం రమేష్, బొల్లంగి యువరాజు, శ్రీనివాసరావు, వెలది సురేంద్ర, ఉన్నారు.

ఇంటింటా సంక్షేమ వెలుగులు



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న ప్రజలు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

రణస్థలం: అర్హత కలిగిన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరువ కావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. జె.ఆర్.పురం–2 గ్రామ సచివాలయ పరిధిలోని గరికిపాలెం వీధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. 205 ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సంక్షేమ పథకాలను వివరించారు. కాలువలు నిర్మించాలని, సీసీ రోడ్లు వేయాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామారావును పిలిచి కాలువలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేసి.. దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మండల బూత్ కన్వీనర్ చిల్లా వెంకటరెడ్డి, సర్పంచ్ బవిరి రమణ, మండల నాయకులు పెదరామినాయుడు, మైలపల్లి కామరాజు, గొర్లె అప్పలనర్సునాయుడు, గ్రామ నాయకులు పచ్చిగుళ్ల సాయిరాం, దన్నాన సీతారాం, పిన్నింటి సత్యంనాయుడు, ఇ తిరుపతిరాజు, టేకి బ్రహ్మాజీ, మిండ్రాన రామారావు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

- యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు



కరపత్రాలు అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. గూడేం గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు దుండు శార్వాణి, కోరాడ లక్ష్మి అధ్యక్షతన 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందిస్తూ మూడేళ్లలో జరిగిన ప్రభుత్వ పరిపాలన, సంక్షేమ పథకాల తీరుతెన్నులు, అభివృద్ధిని అడ్డుకోవడానికి టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలు గురించి ప్రజలకు వివరించారు. గూడెం గ్రామంలో నెలకొన్న మంచినీరు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల సమస్యలను తన తండ్రి ధర్మాన ప్రసాదరావు దృష్టిలో పెట్టి వాటిని పరిష్కరించే చర్యలు చేపడతామని స్థానికులకు హామి ఇచ్చారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ గేదేల శంగల్వరావు, ఎంపీప అంబటి నిర్మల, వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, మండల పార్టీ అధ్యక్షులు చిట్టి జనార్దన్‌రావు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొండు క్రిష్ణ, అల్లు లక్ష్మీనారాయణ, ఎచ్చెర్ల శ్రీధర్, చిట్టి రవికుమార్, బొబ్బాది చంద్రమౌళి, బొగ్గ అప్పారావు, యజ్జల గురుమూర్తి, బొచ్చిన రాజేష్, అప్పలరాజు, గోవిందరాజు పాల్గొన్నారు.

పట్టభద్రులందరూ ఓటురుగా చేరాలి



జేఆర్‌పురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

రణస్థలం: 2019 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులందరూ కొత్తగా ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. జె.ఆర్.పురం, అర్జునవలస, వెల్పురాయి గ్రామ సచివాలయ పరిధిలో పట్టభద్రుల ఓటు నమోదుపై శుక్రవారం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. పార్టీ అదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను బలపర్చడం జరిగిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, పార్టీ నాయకులు మైలపల్లి కామరాజు, మహంతి పెదరామినాయుడు, సర్పంచ్ బవిరి రమణ, ఉప సర్పంచ్ దన్నాన సీతారాం, పి.సాయిరాం, ఇ.తిరుపతిరాజు, మీసాల రామునాయుడు, కెల్ల రామకృష్ణ, మీసాల శ్రీనివాసరావు, గురాన ప్రసాద్, రామిశెట్టి మహేష్ ఉన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటర్లుగా మారాలి

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర పట్టభద్రులు నియోజకవర్గానికి అర్హులందరూ ఓటర్లుగా చేరాలని బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జి, రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం అన్నారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వరా గ్రూప్ ఆఫ్ కాలేజీలో శుక్రవారం ఓట్లు చేర్పుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బోధకులు, పీజీ విద్యార్థులు ఓటర్లుగా చేరాలని కోరారు. నాయకుడు ఎన్.ఈశ్వరరావు, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోతయ్యవలసలో ఉచిత వైద్య శిబిరం

లావేరు: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పోతయ్యవలస సర్పంచ్ కొంపెల్ల అప్పన్న అన్నారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. రోగులకు పెదలింగాలవలస వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణ వైద్య తనిఖీలు నిర్వహించి మందులు అందజేశారు.

వర్సిటీపై విష ప్రచారాన్ని తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న అడ్డయ్య

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్‌ఏయూపై జరుగుతున్న విష ప్రచారాన్ని సమిష్టిగా తిప్పికొట్టాలని ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య అన్నారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలో వర్సిటీ అధికారులు, ఫ్యాకల్టీ సభ్యులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అధికారులు, వర్సిటీ గౌరవ ప్రతిష్ఠలను తెబ్బతీసేలా కొందరు ప్రచారం చేయడం తగదన్నారు. వర్సిటీ పాలనలో క్రమశిక్షణ చర్యలు తీసుకోవటం ఒకభాగమన్నారు. అన్ని కోణాల్లో పరిశీలించి, కమిటీ పూర్తిస్థాయి అధ్యాయనం చేసిన తరువాతే న్యాయ విభాగం ఒప్పంద సహాయ ఆచార్యుడు కాయల కృష్ణమూర్తిని తొలగించామని స్పష్టం చేశారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఆయన ప్రొఫెసర్‌నంటూ ప్రచారం చేసుకున్నారన్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శులను కూడా యూట్యూబ్ చానల్‌లో దూషించారన్నారు. అలాగే కోర్సు కోఆర్డినేటర్ ఆదేశాలను పక్కన పెట్టి విద్యార్థుల హాజరు పట్టీలో నచ్చినట్లు దిద్దుబాట్లు చేశారని, విద్యార్థి రంగరాజుల గోపీనాథ్‌ను అనేక ఇబ్బందులు పెట్టారని వివరించారు. దీంతో అయన్ని విధుల నుంచి తొలగించడంతో ఈ విషయాన్ని రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ప్రిన్సిపాళ్లు రమణమూర్తి, గోవిందరాజులు, న్యాయ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాజేంద్రప్రసాద్, జయలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

నేడు రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో శనివారం 2023 రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ తెలిపారు. ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టర్‌తో పాటు బీఆర్‌ఏయూ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ జరుగుతోందన్నారు. బీఆర్‌ఏయూ పరిధిలో ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళా వలంటీర్లను ఎంపిక చేస్తామన్నారు. విద్యార్థులు కళాశాల గుర్తింపు కార్డు, ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో హాజరు కావాలని సూచించారు.

సంక్షిప్తంగా..

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎస్సై

గార: శిమ్మపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని విజిలెన్సు అధికారులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విజిలెన్సు ఎస్సై బి.రామారావు, సిబ్బంది హాజరుపట్టీ, కేంద్రంలో ఉన్న విద్యార్థులు, భోజన నాణ్యత, రికార్డుల నిర్వహణ, సరుకుల్లో తేడా, గర్భిణులకు అందించే ఆహారం రుచి చూడటం వంటివి చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు శిమ్మ సావిత్రి, శిమ్మ కుమారిలు ఉన్నారు.

ఇంటర్ లింకింగ్ విద్యుత్ లైన్ ఏర్పాటు



పనులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

లావేరు: కేశవరాయునిపాలెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ఎచ్చెర్ల మండలం కొయ్యాం సబ్‌స్టేషన్‌కు ఇంటర్ లింకింగ్ లైన్ ఏర్పాటు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పనులను విద్యుత్‌శాఖ మండల ఏఈ పి వెంకట రమణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేశవరాయునిపాలెం, కొయ్యాం గ్రామాల్లోని 33–11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఎప్పుడైన సాంకేతిక సమస్యలు తలెత్తి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా ఉండటం కోసం రెండు సబ్‌స్టేషన్లను కలుపుతూ ఇంటర్ లింకింగ్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

జి.సిగడాం: స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిణి పొన్నాడ హరితశ్రీ గర్భిణులు, బాలింతలకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, సుగర్ ఉన్న వారికి మందులను అందజేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

లావేరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం డ్రై ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం



ప్రమాణం చేస్తున్న సభ్యులు

శ్రీకాకుళం రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శ్రీకాకుళం మండల మహిళా సమాఖ్య సమావేశం ఏపీఎం వి.సుజాత అధ్యక్షతన శుక్రవారం జరిగింది.నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మూల కృష్ణవేణి, కోశాధికారిగా కల్లేపల్లి సరోజిని, ఉపాధ్యక్షులుగా రావాడ రాధ, కార్యదర్శిగా ఇప్పిలి పార్వతి నియమితులయ్యారు. వీరితో అధికారులు ప్రమాణం చేయించారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

శ్రీకాకుళం రూరల్: ఈక్రాప్ నమోదు తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయాధికారిణి ఉషాకుమారి అన్నారు. గూడెంలో రైతులతో శుక్రవారం అగ్రి అడ్వయిజరీ బోర్డు సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి రైతు పండించిన పంటకే ఈ క్రాప్ నమోదు చేయించాలన్నారు. ఇంతవరకూ మండల వ్యాప్తంగా 71 శాతం ఈక్రాప్ పూర్తయ్యిందన్నారు. ఎంపీడీవో రఘు, ఎంపీపీ అంబటి నిర్మల, మండల పార్టీ అధ్యక్షులు చిట్టి జనార్దన్‌రావు, గేదేల శంగల్వరావు పాల్గొన్నారు.

పశువులకు లంపీ స్కిన్ నివారణ టీకాలు

లావేరు: పశువులకు లంపీ స్కిన్ వ్యాధి రాకుండా ముందస్తుగా నివారణా టీకాలు వేయించాలని పశు వైద్యులు డాక్టర్ జి.లావణ్య, డాక్టర్ బి.గాయత్రిలు పాడి రైతులక సూచించారు.

లావేరు, లింగాలవలస, వెంకటాపురం, తాళ్లవలస గ్రామాల్లో లంపీ స్కిన్ నివారణా టీకాలు వేసే కార్యక్రమాన్ని సచివాలయాల వెటర్నరీ అసిస్టెంట్‌లు చేపట్టగా వైద్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పశువులకు లంపీ స్కిన్ వ్యాధి వ్యాపిస్తున్న నేపథ్యంలో ముందస్తుగా ఉచితంగా నివారణా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

సాక్షి బిజినెస్
శనివారం
15-10-2022

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		విదేశీ సూచీలు (శుక్రవారం రాత్రి 11.30 ముగింపు)			బులియన్ రూ.లలో ముంబై	
సెన్సెక్స్ ▲ 685 57,918	నిఫ్టీ ▲ 171 17,186	నాస్డాక్	10,410	▽ 238	బంగారం (99.9 స్వచ్ఛత)	50,438 ▽ 431
		డోజోన్స్	29,757	▽ 281	బంగారం (99.5 స్వచ్ఛత)	50,236 ▽ 429
		ఎఫ్టీఎస్ఈ 100	6,859	▲ 9	వెండి (కేజీ)	56,042 ▲ 1,044
		డాక్స్	12,438	▲ 82		
		షాంఘై	3,072	▲ 56		
		నికాయ్	27,091	▲ 853		

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బీపీసీఎల్.. ఈవీ రూట్

బెంగళూరు: ఇంధన రంగంలో ఉన్న ప్రభుత్వ సంస్థ భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) ఈవీ బాట పట్టింది. దేశవ్యాప్తంగా 7,000 రిటైల్ ఔట్‌లెట్లలో ఎలక్ట్రిక్ వాహనాలకు అవసరమైన చార్జింగ్ సదుపాయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.



బెంగళూరు–చెన్నై, బెంగళూరు–మైసూరు–కూర్గ్ హైవే మార్గాల్లో ఈవీ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లను తాజాగా ప్రారంభించింది. వ్యూహాత్మక ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేసినట్టు సంస్థ ప్రకటించింది. దేశంలోని ప్రధాన నగరాలు, ఆర్థిక కేంద్రాలను కలుపుతూ అన్ని ముఖ్య జాతీయ రహదారులపై నిర్దేశిత దూరంలో రిటైల్ కేంద్రాల వద్ద ఈవీ చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పాలన్నది బీపీసీఎల్ ఆలోచన.

తగ్గిన శ్రీ సిమెంట్ లాభం

న్యూఢిల్లీ: సిమెంట్ తయారీలో ఉన్న శ్రీ సిమెంట్ సెప్టెంబర్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంతక్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 67.5% తగ్గి రూ.183.24 కోట్లు నమోదు చేసింది. 2021–22 సెప్టెంబర్ త్రైమాసికంలో రూ.564 కోట్ల లాభం ఆర్జించింది. ఆదాయం రూ.4,220 కోట్ల నుంచి రూ.5,082 కోట్లకు ఎగసింది.



వృద్ధాప్యం కారణంగా సంస్థ చైర్మన్ వేణు గోపాల్ బంగూర్ తన పదవి నుంచి తప్పుకున్నారు. ఎండీ హరి మోహన్ బంగూర్ చైర్మన్‌గా అక్టోబర్ 15 నుంచి కొత్త పదవిని అలంకరించనున్నారు. జేఎండీ ప్రశాంత్ బంగూర్‌ను వైస్ చైర్మన్‌గా నియమించారు. నీరజ్ అఖౌరీకి ఎండీగా కంపెనీ బాధ్యతలను అప్పగించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-10-2022	
విశాఖ	440–00
చిత్తూరు	453–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	438–00
విజయవాడ	438–00
రిటైల్ ధర (డజను)	66.00
14-10-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	417–00
వరంగల్	419–00
రిటైల్ ధర	4.75

బజాజ్ ఆటో లాభం 16% డౌన్

క్యూ2లో రూ. 1,719 కోట్లు

న్యూఢిల్లీ: వాహనాల దిగ్గజం బజాజ్ ఆటో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ. 1,719 కోట్ల నికర లాభం (కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన) ప్రకటించింది. గత క్యూ2లో నమోదైన రూ. 2,040 కోట్లతో పోలిస్తే లాభం 16 శాతం తగ్గింది. విదేశాలకు ఎగుమతులు 25 శాతం క్షీణించడమే ఇందుకు కారణమని సంస్థ తెలిపింది. మరోవైపు మొత్తం ఆదాయం రూ. 8,762 కోట్ల నుంచి రూ. 10,203 కోట్లకు చేరింది. స్టాండెలోన్ ప్రాతిపదికన మాత్రం లాభం రూ. 1,275 కోట్ల నుంచి రూ. 1,530 కోట్లకు పెరిగింది. రెండో త్రైమాసికంలో మొత్తం వాహన విక్రయాలు 11,44,407 యూనిట్ల నుంచి నామమాత్రంగా 1 శాతం వృద్ధితో 11,51,012 యూనిట్లకు పెరిగాయి. దేశీయంగా ద్విచక్ర, త్రిచక్ర వాహనాల విక్రయాలు 5,32,216 యూనిట్ల నుంచి 30 శాతం వృద్ధి చెంది 6,94,375 యూనిట్లకు చేరాయి. అయితే ఎగుమతులు మాత్రం 6,12,191 యూనిట్ల నుంచి 4,56,637 యూనిట్లకు తగ్గాయి. విదేశీ మార్కెట్లలో స్థూలఆర్థిక పరిస్థితులపరమైన సవాళ్లు ఇందుకు కారణమని బజాజ్ ఆటో పేర్కొంది. ఆగ్నేయాసియా దేశాల్లో మాత్రం విక్రయాలు పుంజుకున్నాయని వివరించింది.



శుక్రవారం బీఎస్ఈలో బజాజ్ ఆటో షేర్లు 1% క్షీణించి రూ. 3,569 వద్ద క్లోజయ్యాయి.

హైదరాబాద్ నుంచి సింగపూర్‌కి ఏ350 ఫ్లయిట్ సర్వీసులు

ప్రారంభిస్తున్న సింగపూర్ ఎయిర్‌లైన్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సింగపూర్ ఎయిర్‌లైన్స్ (ఎస్ఐఏ) అక్టోబర్ 30 నుంచి హైదరాబాద్–సింగపూర్ రూట్లో విశాలమైన ఏ350–900 విమానాలతో సర్వీసులు ప్రారంభించనుంది. ఇవి ప్రతి గురు, శుక్ర, శని, ఆది వారాల్లో నడుస్తాయని సంస్థ భారత విభాగ జనరల్ మేనేజర్ సయ్ యెన్ చెన్ తెలిపారు. మిగతా రోజుల్లో ప్రస్తుతం ఉన్న చిన్న విమానాలను (బీ737–8) నడుపుతామని చెప్పారు. కార్గో సేవలను కూడా పెంచుకునేందుకు విశాలమైన వైడ్ బాడీ ఎయిర్‌క్రాఫ్ట్‌లు ఉపయోగకరంగా ఉంటాయని చెన్ వివరించారు.



ఫెడరల్ బ్యాంక్ లాభం 52% అప్

క్యూ2లో రూ. 704 కోట్లు



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్ నికర లాభం 52 శాతం (స్టాండెలోన్ ప్రాతిపదికన) పెరిగింది. వడ్డీ రాబడి, ఇతర ఆదాయాలు మెరుగుపడటంతో రూ.704 కోట్లకు చేరింది. గత క్యూ2లో ఇది రూ. 460 కోట్లు. మరోవైపు, ఆదాయం రూ. 3,871 కోట్ల నుంచి రూ. 4,630 కోట్లకు చేరింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన లాభం 50 శాతం పెరిగి రూ. 733 కోట్లకు చేరింది. లాభాలపరంగా చూస్తే బ్యాంకు చరిత్రలోనే ఇది అత్యుత్తమ త్రైమాసికమని సంస్థ ఎండీ శ్యామ్ శ్రీనివాసన్ తెలిపారు. ప్రొవిజన్ కవరేజీ నిష్పత్తి (పీసీఆర్)కి సంబంధించి కేటాయింపులు భారీగా పెంచినప్పటికీ మెరుగైన ఫలితాలు సాధించగలిగామని ఆయన పేర్కొన్నారు. సమీక్షా కాలంలో మొత్తం కేటాయింపులు 12.6 శాతం పెరిగి రూ. 506 కోట్లకు చేరాయి. నికర వడ్డీ ఆదాయం 19.1 శాతం పెరిగి రూ. 1,762 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ (నిమ్) 0.10 శాతం పెరిగి 3.30 శాతానికి చేరింది. ఈ ఆర్థిక సంవత్సరంలో నిమ్ 3.27–3.35 శాతంగా ఉండొచ్చని అంచనా వేస్తున్నట్లు శ్రీనివాసన్ తెలిపారు. రుణ వృద్ధిని బట్టి 2023లో అదనపు మూలధనాన్ని సమీకరించుకునే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఇక ఇతర ఆదాయం రూ. 492 కోట్ల నుంచి రూ. 610 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 3.24 శాతం నుంచి 2.46 శాతానికి దిగి వచ్చింది.

అంతర్జాతీయ మార్కెట్ల అండ

- సెన్సెక్స్ 685 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ లాభం 171 పాయింట్లు
- బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ షేర్ల ర్యాలీ
- మెటల్, ఇంధన, ఆటో షేర్లలో లాభాల స్వీకరణ



ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో దేశీయ స్టాక్ సూచీలు శుక్రవారం ఒకశాతానికి పైగా లాభపడింది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఐటీ రంగాలకు చెందిన లార్జ్ క్యాప్ షేర్లకు డిమాండ్ లభించింది. సెన్సెక్స్ 685 పాయింట్లు పెరిగి 57,918 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 171 పాయింట్లు బలపడి 17,186 వద్ద నిలిచింది. ఆటో, మీడియా, మెటల్, రియల్టీ, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. టోకు ధరల సూచీ వరుసగా నాలుగో నెలా దిగిరావడం ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చింది. నలభై ఏళ్ల గరిష్టానికి ఎగబాకిన ద్రవ్యోల్బణాన్ని విస్మరిస్తూ.., షార్ట్ కవరింగ్ కొనుగోళ్లతో గురువారం అమెరికా మార్కెట్లు రెండుశాతానికి పైగా లాభపడ్డాయి. ఆసియా(+2%), యూరప్(+1.50%)తో సహా భారత మార్కెట్లు ఇక్కడి నుంచి సానుకూల సంకేతాలు అందుకున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,011 కోట్ల షేర్లను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,624 కోట్ల విలువైన షేర్లను కొన్నారు. డాలర్ మారకంలో రూపాయి విలువ ఎనిమిది పైసలు క్షీణించి 82.32 వద్ద స్థిరపడింది. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 271 పాయింట్లు, నిఫ్టీ 129 పాయింట్లు నష్టపోయాయి.

"జాతీయ, అంతర్జాతీయ మిశ్రమ సంకేతాలతో గత రెండు వారాలుగా మార్కెట్లు దిద్దుబాటుకు లోనయ్యాయి. త్వరలో ఈ దశ ముగిసే అవకాశం ఉంది. ప్రస్తుత ఒడిదుడుకుల పరిస్థితుల్లో స్థిరమైన ప్రదర్శన కనబరిచిన రంగాలు, షేర్లపై దృష్టి సారిస్తూ నాణ్యమైన షేర్లను ఎంపిక చేసుకోవాలి. క్యూ2 ఆర్థిక ఫలితాలు, పండుగ సీజన్ డిమాండ్, అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూలతల దృష్ట్యా రానున్న రోజుల్లో మార్కెట్ ముందుకెళ్లే అవకాశం ఉంది'' అని రెలిగేర్ బ్రోకింగ్ వైస్ ప్రెసిడెంట్ అజిత్ మిశ్రా తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- సెప్టెంబర్ త్రైమాసిక ఫలితాల్లో అంచనాలకు మించి రాణించడంతో పాటు షేర్ల బైబ్యాక్ ప్రకటనతో ఇన్ఫోసిస్ షేరుకు డిమాండ్ నెలకొంది. బీఎస్ఈలో నాలుగు శాతం లాభపడి రూ.1,474 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో ఐదుశాతానికి పైగా ర్యాలీ చేసి రూ.1,494 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. ఎక్స్ఛేంజీలో 5.20 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.22,879 కోట్లు పెరిగి రూ.6.20 లక్షల కోట్లకు చేరింది.
- ఈ క్యూ2లో రికార్డు స్థాయి నికర లాభాన్ని నమోదు చేయడంతో ప్రైవేట్ రంగ ఫెడరల్ బ్యాంక్ షేరు నాలుగు శాతానికి పైగా ర్యాలీ చేసి రూ.130 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 5% ఎగసి రూ. 132 వద్ద ఏడాది గరిష్టాన్ని తాకింది.

లాభాల స్వీకరణతో ...

సెన్సెక్స్ ఉదయం 928 పాయింట్లు పెరిగి 58,163 వద్ద, నిఫ్టీ 308 పాయింట్లు బలపడి 17,322 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. తొలి కొనుగోళ్ల పర్వం కొనసాగడంతో ఒక దశలో సెన్సెక్స్ 1200 పాయింట్లు దూసుకెళ్లి 58,435 వద్ద, నిఫ్టీ 335 పాయింట్లు బలపడి 17,349 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదుచేశాయి. సూచీల అనూహ్య ర్యాలీ నేపథ్యంలో ఇన్వెస్టర్లు మిడ్‌సెషన్ నుంచి మెటల్, ఆటో, ఇంధన షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. దీంతో సూచీలు దాదాపు సగం ఆరంభ లాభాలను కోల్పోయి ట్రేడింగ్‌ను ముగించాయి.

సెప్టెంబర్‌లో టోకు ద్రవ్యోల్బణం కూల్

- 10.7 శాతంగా నమోదు
- 18 నెలల కనిష్టం
- గత 4 నెలలుగా తగ్గుతున్నా, 18 నెలలుగా రెండంకెల పైనే...

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 18 నెలల కనిష్ట స్థాయికి దిగివచ్చింది. 10.7 శాతంగా నమోదయ్యింది. అంటే 2021 ఇదే నెలతో పోల్చితే టోకు బాస్కెట్‌లోకి వస్తువుల ధర 10.7 శాతం పెరిగిందన్నమాట. గడచిన నాలుగు నెలలుగా టోకు ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తున్నప్పటికీ, 18 నెలల నుంచి రెండంకెల పైన కొనసాగుతోంది. సమీక్షా నెల్లో తయారీ, ఆహారం, ఇంధన ధరలు కొంత దిగివచ్చాయి. డబ్ల్యూపీఐ నెలవారీ తగ్గుదలకు ప్రధానంగా కమోడిటీ ధరలలో నియంత్రణ అని నిపుణులు పేర్కొంటున్నారు. కమోడిటీ ధరలు తగ్గుతాయన్న ధోరణి కూడా వ్యవస్థలో ఉందని వారు అభిప్రాయపడుతున్నారు. దీనికితోడు రికవరీ ఊపందుకోవడం కూడా సానుకూల అంశమని వారు విశ్లేషిస్తున్నారు. గణాంకాల్లో కీలక విభాగాలు ఇలా...

- ఆహార ఉత్పత్తుల బాస్కెట్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్లో 11.03 శాతంగా ఉంది. ఆగస్టులో ఇది 12.37 శాతం. అయితే కూరగాయల ధరలు మాత్రం 39.66 శాతం పెరిగాయి. ఆగస్టులో ఈ స్పీడ్ 22.29 శాతం. ఆయిల్ సీడ్స్ ద్రవ్యోల్బణం 16.55% తగ్గింది.
- ఇంధనం, విద్యుత్ బాస్కెట్ ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 32.61 శాతం ఉంటే, ఆగస్టులో ఈ రేటు 33.67 శాతంగా ఉంది.
- ఇక సూచీలో మెజారిటీ వెయిటేజ్ ఉన్న తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం 6.34 శాతంగా ఉంది.

టోకు ద్రవ్యోల్బణం ఇలా

నెల	శాతం
2022 జనవరి	12.96
ఫిబ్రవరి	13.11
మార్చి	14.55
ఏప్రిల్	15.08
మే	15.88
జూన్	15.18
జూలై	13.93
ఆగస్టు	12.41
సెప్టెంబర్	10.70



సెమీస్‌లో రుత్విక శివాని

ఇండియా ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి గద్దె రుత్విక శివాని సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బెంగళూరులో శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ రుత్విక 21-19, 21-9తో టాప్ సీడ్ ఐరా శర్మను ఓడించింది. నేడు జరిగే సెమీఫైనల్లో భారత్‌కే చెందిన మాన్సి సింగ్‌తో రుత్విక ఆడుతుంది. క్వార్టర్ ఫైనల్లో మాన్సి 21-13, 21-15తో హైదరాబాద్ ప్లేయర్ మేఘన రెడ్డిపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్; షేక్ గౌస్–మనీషా జోడీలు సెమీఫైనల్‌కు చేరాయి. క్వార్టర్ ఫైనల్స్‌లో సిక్కి–రోహన్ ద్వయం 21-13, 21-17తో నితిన్–పూర్విషా రామ్ జోడీపై... షేక్ గౌస్–మనీషా జంట 21-7, 21-17తో నజీర్ ఖాన్–నీలా వలువన్ జోడీపై విజయం సాధించాయి.



లీగ్ దశలోనే భారత్ అవుట్



భువనేశ్వర్: ప్రపంచ అండర్–17 మహిళల ఫుట్‌బాల్ టోర్నీలో ఆతిథ్య భారత జట్టు మరో మ్యాచ్ మిగిలి ఉండగానే లీగ్ దశలోనే నిష్క్రమించింది. గ్రూప్ 'ఎ' తొలి మ్యాచ్‌లో అమెరికా చేతిలో 0–8తో ఓడిన భారత్... శుక్రవారం జరిగిన రెండో మ్యాచ్‌లో 0–3తో మొరాకో చేతిలో పరాజయం పాలైంది. మొరాకో తరఫున దోహా ఎల్ మదానీ (51వ ని.లో), యాస్మీన్ జౌహర్ (62వ ని.లో), జెనా షరీఫ్ (90+1వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడిన భారత్ ఈనెల 17న జరిగే నామమాత్రపు చివరి లీగ్ మ్యాచ్‌లో బ్రెజిల్‌తో ఆడుతుంది. బ్రెజిల్, అమెరికా జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1–1తో 'డ్రా'గా ముగిసింది. ప్రస్తుతం బ్రెజిల్, అమెరికా నాలుగు పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో... మూడు పాయింట్లతో మొరాకో రెండో స్థానంలో ఉంది.

రాణించిన తిలక్ వర్మ

- గోవాపై హైదరాబాద్ విజయం
- అర్జున్ టెండూల్కర్‌కు 4 వికెట్లు



జైపూర్: ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ రెండో విజయం నమోదు చేసింది. గోవా జట్టుతో శుక్రవారం జరిగిన గ్రూప్ 'బి' లీగ్ మ్యాచ్‌లో హైదరాబాద్ 37 పరుగుల తేడాతో గెలిచింది. ముందుగా హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 177 పరుగులు చేసింది. తిలక్ వర్మ (46 బంతుల్లో 62; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) వరుసగా మూడో అర్ధ సెంచరీ సాధించాడు. కెప్టెన్ తన్మయ్ అగర్వాల్ (41 బంతుల్లో 55; 6 ఫోర్లు, 1 సిక్స్) కూడా రాణించాడు. గోవా తరఫున ఆడుతున్న క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ 4 ఓవర్లలో కేవలం 10 పరుగులిచ్చి 4 వికెట్లు తీయడం విశేషం. అనంతరం గోవా 18.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. హైదరాబాద్ బౌలర్లు టి.రవితేజ 20 పరుగులిచ్చి 4 వికెట్లు.. అనికేత్ రెడ్డి 19 పరుగులిచ్చి 2 వికెట్లు తీసి గోవా జట్టును దెబ్బ తీశారు.

18 ఏళ్లకే ప్రపంచ చాంపియన్

- 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో విశ్వవిజేతగా రుద్రాంక్ష్ పాటిల్
- అభినవ్ బింద్రా తర్వాత ఈ ఘనత సాధించిన భారత షూటర్‌గా గుర్తింపు
- 2024 పారిస్ ఒలింపిక్స్‌కూ అర్హత



6

ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గిన ఆరో భారతీయ షూటర్ రుద్రాంక్ష్. గతంలో అభినవ్ బింద్రా (2006: 10 మీటర్ల ఎయిర్ రైఫిల్), మానవ్‌జిత్ సంధూ (2006: ట్రాప్), తేజస్విని సావంత్ (2010: 50 మీటర్ల రైఫిల్ ప్రోన్), అంకుర్ మిట్టల్ (2018: డబుల్ ట్రాప్), ఓంప్రకాశ్ (2018: 50 మీటర్ల పిస్టల్) ఈ ఘనత సాధించారు.

కైరో: విశ్వ వేదికగా మరోసారి భారత షూటర్ గురి అదిరింది. ప్రపంచ సీనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ 'పసిడి' ఖాతా తెరిచింది. శుక్రవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో మహారాష్ట్రకు చెందిన 18 ఏళ్ల రుద్రాంక్ష్ బాలాసాహెబ్ పాటిల్ స్వర్ణ పతకంతో మెరిశాడు. ఈ ప్రదర్శనతో రుద్రాంక్ష్ 2024 పారిస్ ఒలింపిక్స్‌కు కూడా అర్హత సాధించాడు. థానేకు చెందిన రుద్రాంక్ష్ ఫైనల్లో 17–13 పాయింట్ల తేడాతో డానిలో డెనిస్ సొలాజో (ఇటలీ)పై గెలుపొందాడు. తొలిసారి ప్రపంచ సీనియర్ చాంపియన్‌షిప్‌లో ఆడుతున్న రుద్రాంక్ష్ ఫైనల్లో ఒకదశలో 4–10తో వెనుకంజలో ఉన్నాడు. అయినా ఒత్తిడికి లోనుకాకుండా లక్ష్యంపై గురి పెట్టిన ఈ టీనేజ్ షూటర్ చివరకు నాలుగు పాయింట్ల తేడాతో విజయాన్ని అందుకున్నాడు. అంతకుముందు 114 మంది షూటర్లు పాల్గొన్న క్వాలిఫయింగ్‌లో రుద్రాంక్ష్ 633.9 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచాడు. భారత్‌కే చెందిన అంకుశ్ కిరణ్ జాదవ్ 630.6 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచాడు. టాప్–8లో నిలిచిన షూటర్లు ర్యాంకింగ్ మ్యాచ్‌కు అర్హత సాధించారు. ర్యాంకింగ్ మ్యాచ్‌లో సొలాజో 262.7 పాయింట్లతో, రుద్రాంక్ష్ 261.9 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో నిలిచిన స్వర్ణ పతక పోరుకు అర్హత పొందారు. అంకుశ్ 154.2 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ర్యాంకింగ్ మ్యాచ్‌లో 261.8 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచిన చైనా షూటర్ లిహావో షెంగ్ కాంస్య పతకం దక్కించుకున్నాడు. అభినవ్ బింద్రా తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 10 మీటర్ల ఎయిర్ రైఫిల్‌లో స్వర్ణ పతకం నెగ్గిన రెండో భారతీయ షూటర్‌గా రుద్రాంక్ష్ గుర్తింపు పొందాడు. అంతేకాకుండా ఈ మెగా ఈవెంట్ చరిత్రలో భారత్ తరఫున పసిడి పతకం గెలిచిన పిన్న వయస్కుడిగా రుద్రాంక్ష్ రికార్డు నెలకొల్పాడు. గత ఏడాది పెరూలో జరిగిన జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రుద్రాంక్ష్ రజతం నెగ్గగా.. ఈ ఏడాది జర్మనీలో జరిగిన జూనియర్ ప్రపంచకప్‌లో స్వర్ణం సాధించాడు. ఈ సంవత్సరమే సీనియర్ జట్టులోకి వచ్చిన రుద్రాంక్ష్ రెండు ప్రపంచకప్‌లలో పాల్గొన్నా పతకం సాధించలేకపోయాడు. అయితే ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మెరిసి స్వర్ణంతోపాటు ఒలింపిక్స్‌కు అర్హత పొంది ఔరా అనిపించాడు.

విజేత పాకిస్తాన్



క్రైస్ట్‌చర్చ్: ముక్కోణపు టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టుతో శుక్రవారం జరిగిన ఫైనల్లో పాకిస్తాన్ ఐదు వికెట్ల తేడాతో గెలిచి విజేతగా నిలిచింది. ముందుగా న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 163 పరుగులు చేసింది. కెప్టెన్ విలియమ్సన్ (38 బంతుల్లో 59; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్. పాక్ బౌలర్లలో హారిస్ రవూఫ్, నసీమ్ షా రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం పాకిస్తాన్ 19.3 ఓవర్లలో ఐదు వికెట్లకు 168 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' నవాజ్ (22 బంతుల్లో 38 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), హైదర్ అలీ (15 బంతుల్లో 31; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఇఫ్తికార్ అహ్మద్ (14 బంతుల్లో 25 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) ధాటిగా ఆడి పాక్ విజయంలో కీలకపాత్ర పోషించారు.

ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మ్యాచ్ రద్దు

కాన్‌బెర్రా: వర్షం కారణంగా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ జట్ల మధ్య చివరిదైన మూడో టి20 మ్యాచ్ రద్దయింది. 12 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఇంగ్లండ్ రెండు వికెట్లకు 112 పరుగులు సాధించింది. కెప్టెన్ జోస్ బట్లర్ (41 బంతుల్లో 65 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేశాడు. అనంతరం ఆస్ట్రేలియా 3.5 ఓవర్లలో 3 వికెట్లకు 30 పరుగులు సాధించింది. ఈ దశలో వర్షం రావడంతో ఆట సాధ్యపడలేదు. తొలి రెండు టి20ల్లో నెగ్గిన ఇంగ్లండ్ సిరీస్‌ను సొంతం చేసుకుంది.

పాకిస్తాన్‌లో భారత్ ఆట!

న్యూఢిల్లీ: సుమారు 15 ఏళ్ల తర్వాత భారత క్రికెట్ జట్టు పాకిస్తాన్ గడ్డపై ఆడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వచ్చే ఏడాది పాక్ వేదికగా ఆసియా కప్ వన్డే టోర్నీ జరగనుంది. బీసీసీఐ తమ భవిష్యత్ పర్యటనలో ఈ టోర్నీని కూడా చేర్చింది. వేదిక విషయంలో కూడా ఎలాంటి మార్పులు సూచించకపోవడం చూస్తే పాక్‌లో పర్యటించేందుకు ఇబ్బంది ఉండకపోవచ్చని తెలుస్తోంది. దౌత్యపరమైన ఇబ్బందుల కారణంగా సహజంగానే దీనికి కేంద్ర ప్రభుత్వ అనుమతి కావాల్సి ఉంటుంది. కొన్నాళ్లుగా ఐసీసీ టోర్నీలలో పాక్‌తో ఆడే విషయంలో భారత ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయడం లేదు కాబట్టి దీనికి కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వవచ్చని బోర్డు ఉన్నతాధికారులు ఆశిస్తున్నారు. బోర్డు కార్యదర్శి జై షా పాత్ర ఈ విషయంలో కీలకం కానుంది. భారత్ చివరిసారిగా 2008 ఆసియా కప్‌లో పాకిస్తాన్ గడ్డపై ఆడింది.

మొహమ్మద్ షమీకే ఓటు

టి20 ప్రపంచకప్ భారత జట్టులోకి సీనియర్ పేస్ బౌలర్



న్యూఢిల్లీ: టి20 ప్రపంచకప్‌లో పాల్గొనే భారత జట్టు 15వ ఆటగాడి స్థానం భర్తీ అయింది. గాయపడిన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానంలో మరో సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీని ఎంపిక చేస్తున్నట్లు బీసీసీఐ ప్రకటించింది. బుమ్రా స్థానాన్ని భర్తీ చేసేందుకు హైదరాబాద్ పేసర్ సిరాజ్ కూడా పోటీ పడినా... బోర్డు సెలక్టర్లు షమీ అనుభవానికే ఓటు వేశారు. అయితే సిరాజ్‌తో పాటు ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్‌లను 'బ్యాకప్'లుగా ఎంపిక చేసినట్లు బీసీసీఐ వెల్లడించింది. స్వదేశంలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలతో జరిగిన టి20 సిరీస్‌లకు ఎంపికైనా... కరోనా బారిన పడటంతో షమీ ఆ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు. ఇప్పుడు కోలుకొని ఫిట్‌నెస్ పరీక్ష పాస్ కావడంతో అతనికి అవకాశం దక్కింది.

అనుభవం కారణంగానే...

అంతర్జాతీయ టి20ల్లో షమీ రికార్డు గొప్పగా ఏమీ లేదు. ఏడేళ్ల కెరీర్‌లో 17 మ్యాచ్‌లు మాత్రమే ఆడిన అతను 18 వికెట్లు పడగొట్టాడు. దాదాపు ఏడాది క్రితం టి20 ప్రపంచకప్‌లోనే అతను తన చివరి మ్యాచ్ ఆడాడు. ఈ టోర్నీలో 5 మ్యాచ్‌లలో 8.84 ఎకానమీతో 6 వికెట్లే తీసిన తర్వాత షమీ అంతర్జాతీయ కెరీర్ దాదాపు ముగిసినట్లే అనిపించింది. భవిష్యత్తు టి20 ప్రణాళికల్లో సెలక్టర్లు షమీ పేరును అసలు పరిగణలోకే తీసుకోలేదు. అయితే ఇప్పుడు అనూహ్యంగా తెర పైకి వచ్చిన అతను నేరుగా వరల్డ్‌కప్‌కే ఎంపికయ్యాడు. ఆసీస్ గడ్డపై ఆడిన అనుభవంతో పాటు బౌన్సీ పిచ్‌లపై అతని బౌలింగ్ శైలి అదనపు ప్రయోజనాన్ని చేకూర్చే అవకాశం ఉండటంతోనే షమీని జట్టులోకి తీసుకున్నారు. ఈ ఏడాది ఐపీఎల్‌లో 20 వికెట్లు తీసి గుజరాత్ విజయంలో కీలక పాత్ర పోషించడం కూడా షమీకి కలిసొచ్చింది.

ఏడో టైటిల్ వేటలో భారత్

- నేడు ఆసియా కప్ టి20 టోర్నీ ఫైనల్లో శ్రీలంకతో 'ఢీ'
- మధ్యాహ్నం 1:00 నుంచి స్టార్ స్పోర్ట్స్–2లో ప్రత్యక్ష ప్రసారం



సిల్హెట్: ఆసియా కప్ మహిళల టి20 టోర్నీ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన భారత జట్టు ఆ హోదాను నిలబెట్టుకుంటూ ఫైనల్ చేరింది. ఇప్పటికే ఆరు సార్లు టైటిల్ గెలుచుకున్న భారత్ మరోసారి ట్రోఫీని అందుకోవడంపై దృష్టి పెట్టింది. జట్టు తాజా ఫామ్, ఆటగాళ్ల వ్యక్తిగత ప్రదర్శనను బట్టి చూస్తే అది అసాధ్యమేమీ కాదు. ఈ క్రమంలో నేడు జరిగే ఫైనల్ మ్యాచ్‌లో శ్రీలంక మహిళల జట్టుతో హర్మన్ సేన తలపడనుంది. తొలి లీగ్ మ్యాచ్‌లో లంకను సునాయాసంగానే భారత్ ఓడించినా... ఆ జట్టు సెమీస్ తరహాలో సంచలనం సృష్టించే అవకాశాలను తక్కువ చేయలేం. ఇలాంటి నేపథ్యంలో నేడు తుది పోరు ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది.

సమష్టి ప్రదర్శనతో...

లీగ్ దశలో పాకిస్తాన్ చేతిలో అనూహ్యంగా ఓడిపోవడం మినహా ఓవరాల్‌గా టోర్నీలో భారత్ మెరుగైన ప్రదర్శన కనబర్చింది. అన్ని మ్యాచ్‌లు (7) ఆడిన ముగ్గురు ప్లేయర్లలో జెమీమా రోడ్రిగ్స్ అత్యధిక పరుగులు (215) సాధించగా, దీప్తి శర్మ అత్యధిక వికెట్లు (13) తీసి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించారు. షఫాలీ వర్మ కూడా ఫామ్‌లోకి రావడం భారత జట్టుకు సానుకూలాంశం. స్టార్ ప్లేయర్ స్మృతి మంధాన (4 ఇన్నింగ్స్‌లలో కలిపి 83 పరుగులు) మాత్రం ఆశించిన రీతిలో ఆడలేకపోయినా, ఫైనల్లోనైనా చెలరేగాలని జట్టు కోరుకుంటోంది. దీప్తి శర్మతో పాటు స్నేహ్ రాణా, రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్‌ల స్పిన్ ఎలాంటి బ్యాటర్లనైనా ఇబ్బంది పెట్టగలదు. దీప్తి సూపర్ ఫామ్‌లో ఉండటంతో ప్రత్యర్థికి ఇబ్బందులు తప్పవు. భారత్‌తో పోలిస్తే చమరి అటపట్టు కెప్టెన్సీలోని శ్రీలంక జట్టు బలహీనమనేది వాస్తవం. అయితే పాక్‌తో సెమీఫైనల్లో ఆ జట్టు చివరి బంతి వరకు కనబర్చిన స్ఫూర్తిదాయక ప్రదర్శన చూస్తే తేలిగ్గా ఓటమిని అంగీకరించే తరహా టీమ్ మాత్రం కాదని తెలుస్తోంది. తుది పోరులో ఆ జట్టు పోరాటం ఎంత వరకు సఫలం అవుతుందనేది చెప్పలేం.